
'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 151

బుధవారం 21-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**ఒకే ఓవర్లో 39 పరుగులు**

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒకే ఓవర్లో అత్యధిక రన్స్ చేసిన సమోవా జట్టు - 14లో



**ఫ్రిజ్.. ఏసీ.. మైక్రోవేవ్.. దీర్ఘాయుష్మాన్‌భవ!** - 15లో



**'లాటరల్ ఎంట్రీ'పై పీచేముడ్**

వివాదాస్పద లాటరల్ ఎంట్రీ విధానంపై కేంద్రం వెనక్కి తగ్గింది. ఇటీవల విడుదల చేసిన ప్రకటనను యూపీఎస్సీ రద్దు చేసింది.

వివరాలు 6లో ▸



**బద్లాపూర్ భగభగ!**

మహారాష్ట్రలోని థానె జిల్లా బద్లాపూర్‌లో ఇద్దరు చిన్నారులను అటెండర్ లైంగికంగా వేధించిన ఘటన ఉద్రిక్తతలకు కారణమైంది.


వివరాలు 6లో ▸



**వ్యూహాత్మక భాగస్వామ్యం**

భారత్, మలేసియా మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యమే లక్ష్యంగా ఇరు దేశాల ప్రధానులు చర్చలు నిర్వహించారు.

వివరాలు 6లో ▸



**ట్రంప్ ఓ లూజర్: బైడెన్**

ఓ వైపు అధ్యక్ష అభ్యర్థిగా పోటీచేస్తూ... మరోవైపు అమెరికాను విఫల దేశంగా అభివర్ణిస్తున్న ట్రంప్‌పై బైడెన్ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸

# విగ్రహానికి నిగ్రహం బలి

సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు వివాదం మంటలు రేపింది. నేతలు నిగ్రహాలు కోల్పోయేలా చేసింది. మాటల తూటాల్ని పేల్చింది. అధికారంలోకి రాగానే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామన్న కేటీఆర్ వ్యాఖ్యలకు ప్రతిగా 'రాజీవ్ విగ్రహంపై చెయ్యి పడితే చెప్పు తెగుద్ది' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో 'నా మాటలు గుర్తు పెట్టుకో ''చీఫ్ మినిస్టర్'' అధికారంలోకి వచ్చిన తొలిరోజే సచివాలయం పరిసరాల్లో ఉన్న చెత్తనంతా ఊడ్చి పారేస్తాం' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్ ఇవ్వడం అధికార, ప్రతిపక్ష పార్టీల్లో వేడి రాజేసింది.

## చెయ్యి వేస్తే చెప్పుతెగుడే!

**కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం తీవ్ర వ్యాఖ్యలు**

సాక్షి, హైదరాబాద్: 'దేశ సమగ్రతను కాపాడేందుకు రాజీవ్‌గాంధీ తన ప్రాణాలను సైతం త్యాగం చేశారు. ఆయన సతీమణి సోనియాగాంధీతోనే 60 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర కల సాకారమయింది. రాజీవ్ విగ్రహాన్ని సచివాలయం ముందు పెడతామని మేం చెపితే ఒక సన్నాసి అధికారంలోకి రాగానే తొలగిస్తాం అంటున్నాడు. నీ అయ్య విగ్రహం కోసం దేశం కోసం ప్రాణమిచ్చిన రాజీవ్‌గాంధీ విగ్రహం తీసేస్తావా? నీకు మళ్లీ అధికారమనేది కలలో మాట. రాజీవ్‌గాంధీ విగ్రహం తీస్తా అని మాట్లాడుతావా? చింతమడకకు పోతవు బిడ్డా.. రాజీవ్ విగ్రహం దగ్గరకు పోతే వీపు చింతపండు అయితది. రాజీవ్‌గాంధీ విగ్రహం తీయడానికి నువ్వు ఎప్పుడొస్తవో తారీఖు చెప్పు. మా జగ్గన్నకు చెప్తా.. ఆయన వచ్చి అక్కడ ఉంటడు. అప్పుడు తెలుస్తది బిడ్డా నీకు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముట్టుకుంటే

మిగతా 3వ పేజీలో ▶



- చేతనైతే రాజీవ్ విగ్రహం మీద చెయ్యి పెట్టండి.. చెప్పు తెగకపోతే చూస్తా
- నీకు ఇప్పుడు తెలంగాణ తల్లి గుర్తుకొచ్చిందా? ఇన్నిరోజులు గాడిదలేమైనా కాసినవా?
- త్వరలోనే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం
- డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టే బాధ్యత తీసుకుంటాం: సీఎం



- సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్
- అధికారంలోకి వచ్చిన తొలిరోజే సచివాలయం పరిసరాల్లో చెత్త తొలగిస్తాం
- నీ లాంటి ఢిల్లీ గులామ్‌లు ఆత్మగౌరవాన్ని అర్థం చేసుకోలేరు
- ముఖ్యమంత్రి నైజం, వ్యక్తిత్వం ఆయన పెంపకాన్ని సూచిస్తుంది

## తొలిరోజే చెత్తను ఎత్తేస్తాం

**నా మాటలు గుర్తు పెట్టుకో 'చీఫ్ మినిస్టర్'**

సాక్షి, హైదరాబాద్: 'నా మాటలు గుర్తు పెట్టుకో 'చీఫ్ మినిస్టర్'.. అధికారంలోకి వచ్చిన తొలిరోజే బీఆర్ అంబేడ్కర్ సచివాలయం పరిసరాల్లో చెత్తను తొలగిస్తాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు విషయమై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. 'నీలాంటి ఢిల్లీ గులామ్‌లు తెలంగాణ ఆత్మగౌరవాన్ని అర్థం చేసుకోలేరు. చిన్న పిల్లల ముందు చెత్త మాటలు మాట్లాడిన సీఎం నైజం, వ్యక్తిత్వం ఆయన పెంపకాన్ని సూచిస్తుంది. ఆయన మానసిక రుగ్మత నుంచి త్వరగా కోలుకోవాలని

మిగతా 3వ పేజీలో ▶



మహిళలు సురక్షితంగా పని ప్రదేశాలకు వెళ్లలేకపోవడమంటే వారికి సమానత్వ హక్కును కాలరాయడమే. మరో రేప్, హత్య జరిగేదాకా వేచి చూడలేం. వైద్యులు, వైద్య సిబ్బంది భద్రతకు దేశవ్యాప్త ప్రోటోకాల్ కావాల్సిందే. దాని విధివిధానాల రూపకల్పనకు వైస్ అడ్మిరల్ ఆర్తీ సరిన్ సారథ్యంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. మాపై నమ్మకం ఉంచి విధుల్లో పాల్గొనాల్సిందిగా దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న వైద్య సిబ్బందిని కోరుతున్నాం.

- సుప్రీంకోర్టు ధర్మాసనం

## మరో రేప్, హత్య జరగనిదే.. మేలుకోమా?

**కోల్‌కతా వైద్యురాలి హత్యాచారంపై సుప్రీంకోర్టు**

**ఆత్మహత్యగా చిత్రించారంటూ ప్రిన్సిపాల్‌పై ధ్వజం**

- అతనికి మరో పోస్టింగా, ఎఫ్ఐఆర్ అంత లేటా?..
- మమత సర్కారును తూర్పారబట్టిన ధర్మాసనం
- నిరసనకారులపై ప్రతాపం చూపొద్దని ఆదేశం.. హతురాలి పేరు, ఫొటోలు, వీడియోలపై ఆగ్రహం
- కోల్‌కతా పోలీసుల తీరుపై తీవ్రంగా మండిపాటు.. వ్యవస్థలో లోపాలు మరోసారి తెరపైకి: సీజేఐ

- వివరాలు 6లో

వైద్యుల భద్రతపై టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు

కమిటీలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



## న్యూస్‌రీల్

### అప్రమత్తంగా ఉండండి



రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

- వివరాలు 3లో

### 'ట్రిపుల్ ఆర్' సూపర్ గేమ్‌చేంజర్



ఔటర్‌రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) హైదరాబాద్‌కు ఎలాగైతే గేమ్ చేంజర్‌గా మారిందో, రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) కూడా తెలంగాణకు సూపర్ గేమ్‌చేంజర్‌గా మారుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

- వివరాలు 12లో

### టెక్నికల్ క్లియరెన్స్‌కు 'సీతారామ'



సీతారామ ఎత్తిపోతల పథకం–సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు డీపీఆర్‌ను టెక్నికల్ అప్రైజల్ క్లియరెన్స్ కోసం పంపించేలా కేంద్ర జలసంఘానికి సిఫారసు చేస్తున్నామని గోదావరి బోర్డు తెలిపింది.

- వివరాలు 5లో

### తూనీగలా తిరుగుతూ నిఘా పెడుతుంది!



తూనీగలా తిరుగుతూ నిఘా పెడుతుంది.. సీతాకోక చిలుకలా వెళుతూ అక్కడి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. ఇలా బయో ఇన్‌స్పైర్డ్ ఫ్లాపర్ డ్రోన్ సాంకేతికతను ఐఐటీ హైదరాబాద్ అభివృద్ధి చేస్తోంది.

- వివరాలు 3లో




## చందాదారులెవరు?

### మార్గదర్శిలో వారి వివరాలు తెలుసుకోండి

- పత్రికల్లో విస్తృత ప్రచారం కల్పించండి
- రిజిస్ట్రీకి తెలంగాణ హైకోర్టు ఆదేశం
- వివరాలు కోరుతూ అఫిడవిట్ వేయాలని మాజీ ఎంపీ ఉండవల్లికి సూచన.... ఆ మేరకు ఆర్బీఐ, మార్గదర్శికి ఆదేశాలు జారీ చేస్తామన్న ధర్మాసనం
- 2 వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు నిర్దేశం... విచారణ సెప్టెంబర్ 11కు వాయిదా వేసిన జస్టిస్ సుజోయ్‌పాల్ ధర్మాసనం
- మార్గదర్శి అక్రమాలను ఆర్బీఐ తేల్చేసిందన్న అరుణ్‌కుమార్
- దాని ఆధారంగా చర్యలు చేపట్టవచ్చని కోర్టుకు నివేదన

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి ఫైనాన్షియర్స్ యాజమాన్యం చందాదారులందరికీ డిపాజిట్ల తాలూకు నగదును తిరిగి చెల్లించిందా? లేక ఎవరికైనా ఎగవేసిందా..? అనే వివరాలు తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ హైకోర్టు తాజాగా రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు తెలుగు, హిందీ, ఆంగ్ల పత్రికల్లో విస్తృత ప్రచారం జరిగేలా నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేసింది. అలాగే చందాదారుల వివరాలు కోరుతూ ఓ అఫిడవిట్ దాఖలు చేయాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు సూచించింది. అఫిడవిట్ ఆధారంగా తాము మార్గదర్శికి ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంది. దీనిపై రెండు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మం



గళవారం ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను సెప్టెంబర్ 11వతేదీకి వాయిదా వేసింది.

**డిపాజిట్ల నిగ్గు తేలాలన్న 'సుప్రీం'**

ఆర్బీఐ చట్ట నిబంధనలను ఉల్లంఘించినందుకు మార్గదర్శి, దాని కర్త రామోజీరావు (ఇటీవల మృతి చెందారు)పై డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కేసులో అధీకృత నాంపల్లి కోర్టులో

మిగతా 12వ పేజీలో ▶

## అనుమతి లేకుండానే ఫోన్ ట్యాపింగ్

**అంతా కలిసి నేరపూరిత కుట్రకు పాల్పడ్డారు**

- విదేశాల్లో ఉన్న నిందితులను రప్పించేందుకు చర్యలు చేపడుతున్నాం... దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగుతోంది.. బాధ్యులెవర్నీ వదిలిపెట్టం
- హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్
- ఇందులో మాకెలాంటి సంబంధం లేదు: కేంద్రం



సాక్షి, హైదరాబాద్: 'అనుమతి లేకుండానే రాజ్యాంగ పదవుల్లో ఉన్న అత్యున్నత స్థాయి అధికారులు, నేతల ఫోన్లు ట్యాపింగ్ చేశారు. ఇందుకు సంబంధించి విదేశాల్లో ఉన్న నిందితుల్ని కూడా రప్పించేందుకు చర్యలు చేపడుతున్నాం..' అని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అధీకృత అథారిటీ ద్వారా ఈ వివరాలు న్యాయస్థానం దృష్టికి తీసుకొస్తున్నామని పేర్కొంది. ఫోన్‌ట్యాపింగ్ కేసుకు సంబంధించి మంగళవారం కౌంటర్ దాఖలు చేసింది. మరోవైపు..ఫోన్ ట్యాపింగ్‌కు తాము కూడా ఎలాంటి అనుమతి ఇవ్వలేదని కేంద్రం తన కౌంటర్‌లో పేర్కొంది. గత ప్రభుత్వ హయాంలో హైకోర్టు న్యాయమూర్తి ఫోన్ ట్యాప్ అయిందని, జడ్జీల ఫోన్లను ట్యాప్ చేసినట్టు ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు తన నేరాంగీకార వాంగ్మూలంలో పేర్కొన్నారంటూ పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర

మిగతా 2వ పేజీలో ▶

### ఎస్‌హెచ్‌జీలకు రూ. లక్ష కోట్ల రుణాలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- రుణమాఫీ కింద బ్యాంకులకు రూ.18 వేల కోట్లు ఇచ్చాం..
- కొత్త రుణాలు రూ. 7,500 కోట్లే ఇచ్చారంటూ అసహనం
- రుణాల మంజూరుకు బ్యాంకర్లు చొరవ చూపాలని విజ్ఞప్తి

2లో

## మాకెందుకు రుణమాఫీ కాలేదు?



తోటపల్లి ఇండియన్ బ్యాంకు వద్ద రైతుల ఆందోళన

**తోటపల్లిలో ఇండియన్ బ్యాంక్‌ను ముట్టడించిన రైతులు**

- మెదక్‌లో తెల్లవారుజామునే క్యూలైన్లు
- పురుగుల మందు తాగేందుకు యత్నించిన రైతు
- మల్లాపూర్‌లో ఆమరణ దీక్షకు దిగిన మరో రైతు
- మహారాష్ట్ర బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

2లో

## ఇదండీ జగత్




# రోజంతా ముంచెత్తిన వాన

## గ్రేటర్ హైదరాబాద్, జిల్లాల్లో మంగళవారం భారీ వర్షం

- గంటల వ్యవధిలోనే రోడ్లు జలమయం.. వరద నీటిలో కొట్టుకుపోయి ఒకరు మృతి
- హైదరాబాద్ జిల్లాలో సగటున 7.31 సెంటీమీటర్ల వర్షపాతం,
- గద్వాల జిల్లాలో 6.88 సెం.మీ., మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 5.98 సెం.మీ.,
- రానున్న రెండు రోజులు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. అయితే తెల్లవారుజామునుంచే గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమై చెరువులను తలపించాయి. ఫలితంగా ఆయా రహదారుల్లో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలు కురుస్తాయనే ముందస్తు సమాచారంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాల్లోని కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ముందస్తుగా సెలవు ప్రకటించాయి. హైదరాబాద్ సమీప జిల్లాలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల అతి భారీ వర్షాలు సైతం నమోదయ్యాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు లోటు వర్షపాతంలో ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు సమీప జిల్లాలకు ఈ వర్షంతో భారీ ఊరట దక్కింది.

**రాష్ట్రంలో 2.2 సెంటీమీటర్ల సగటు వర్షపాతం...**

ఉత్తర ప్రాంత జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవగా, దక్షిణ ప్రాంత జిల్లాల్లో ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం ఒక్కరోజే రాష్ట్రంలో 2.2 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 7.31 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 50.6 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, మంగళవారం నాటికి 58.27 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 15శాతం అధికంగా వానలు కురిసినట్టు ప్రణాళిక శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

**ఈ జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం**

రానున్న రెండు రోజులు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే

మిగతా 5వ పేజీలో ▶



హైదరాబాద్ బల్కంపేట రైల్వే అండర్ బ్రిడ్జిని ముంచెత్తిన వరదలో వాహనాల రాకపోకలు. (ఇన్‌సెట్)లో నీట మునిగిన కారు

**మంగళవారం పలు జిల్లాల్లో నమోదైన సగటు వర్షపాతం**

| జిల్లా | వర్షపాతం(సెం.మీ.లలో) | జిల్లా | వర్షపాతం(సెం.మీ.లలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 7.31 | యాదాద్రి భువనగిరి | 4.60 |
| జోగుళాంబ గద్వాల | 6.88 | సిద్దిపేట | 3.59 |
| వనపర్తి | 5.38 | జనగామ | 3.21 |
| మేడ్చల్–మల్కాజిగిరి | 5.90 | రంగారెడ్డి | 3.21 |
| నారాయణపేట | 5.56 | నాగర్‌కర్నూల్ | 3.00 |

## క్లుప్తంగా...

### అలయ్ బలయ్‌కు రండి!

**సీఎం రేవంత్‌ను కలిసి ఆహ్వానించిన హరియాణా గవర్నర్ దత్తాత్రేయ**



సీఎం రేవంత్‌కు ఆహ్వానపత్రికను అందిస్తున్న దత్తాత్రేయ, విజయలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: గత కొన్నేళ్లుగా దసరా మరుసటి రోజు తాను నిర్వహిస్తున్న 'అలయ్ – బలయ్' కార్యక్రమానికి హాజరు కావలసిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కోరారు. ఈ మేరకు మంగళవారం సీఎంను ఆయన నివాసంలో కలసి ఆహ్వానపత్రికను అందజేశారు. అక్టోబర్ 13న నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ కార్యక్రమం జరుగనుంది.

**అలయ్ బలయ్ అంటే గుర్తొచ్చే పేరు దత్తన్న: రేవంత్‌రెడ్డి**

అలయ్–బలయ్ కార్యక్రమానికి సీఎంను ఆహ్వానించిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా దత్తాత్రేయ నిబద్ధతపై ప్రశంసలు కురిపించారు. 'ప్రతి ఏటా దత్తన్న ఆధ్వర్యంలో నిర్వహించే 'అలయ్–బలయ్' తెలంగాణ సమా జంలో ఆత్మీయత, అనుబంధాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన దత్తన్నకు ధన్యవాదాలు'అని పోస్ట్ చేశారు.

**సీఎంతో కోదండరాం, అలీ ఖాన్ భేటీ**

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులైన కోదండరాం, ఆమెర్ అలీ ఖాన్‌లు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. సచివాలయంలో మంగళవారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ఈ ఇద్దరు ఎమ్మెల్సీలు.. కాసేపు రాజకీయ అంశాలపై చర్చించారు. భేటీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మందుల శామేలు, భూపతి రెడ్డిలు తదితరులు కూడా పాల్గొన్నారు.

### జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జిలుగా రాం మాధవ్, కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్‌కు బీజేపీ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. రాబోయే జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ ఎన్నికల వ్యవహారాల ఇన్‌చార్జిలుగా రాం మాధవ్‌తో పాటు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### ప్రతిపక్షంగా ఇంకా పని మొదలు పెట్టలేదు

**రుణమాఫీపై కాంగ్రెస్ పగటి దొంగలా దొరికింది: జగదీశ్‌రెడ్డి**



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ అంశంలో కాంగ్రెస్ పగటి దొంగలా దొరికిందని ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఇంకా పని మొదలు పెట్టలేదని, భవిష్యత్తులో తమ పార్టీ తడాఖా చూపిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి జి.జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. 17.13లక్షలమందికి రుణమాఫీ జరగలేదని స్వయంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని ఆయన నిలదీశారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గ్యాదరి కిశోర్‌కుమార్, పార్టీ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలసి మంగళవారం తెలంగాణ భవన్‌లో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ పూర్తయిందంటూ సీఎం డ్యాన్సులు చేస్తుంటే మంత్రులు మరోలా మాట్లాడుతున్నారన్నారు. రుణమాఫీ విష యంలో అబద్ధాలు చెప్పిన రేవంత్‌రెడ్డి ముఖ్య మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీని అడుగుతున్న రైతులను అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్‌లోని ఓ ప్రాథమిక వ్యవసా య సహకార సొసైటీలో 1,200 మంది రైతులకు ఒక్కరికీ రుణమాఫీ జరగలేదన్నారు.

### కాంగ్రెస్ హయాంలో కుర్చీలాట నడుస్తోంది

**బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శ**



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ హయాంలో కుర్చీలాట నడుస్తోందని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పరిపాలనపై కంటే కూడా 'కిస్సా కుర్సీకా'పైనే వ్యవహారమంతా నడుస్తోందని ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ...అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల్లో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చిన వేల కోట్ల పెట్టుబడులు ఎప్పుడు వస్తాయని ప్రశ్నించారు. సీఎం విదేశీ పర్యటనతో ఎంతమందికి ఉద్యోగాలు వస్తాయి ప్రభుత్వం తరఫున మౌలిక వసతుల కల్పనకు ఎంత ఖర్చు అవుతుందని నిలదీశారు. మంత్రిగా ఉన్న వ్యక్తి కంపెనీకి ప్రభుత్వ కాంట్రాక్టు రావడం చరిత్రలోనే లేదన్నారు. ఓ మంత్రికి చెందిన కంపెనీకి కొడంగల్ అభివృద్ధి కాంట్రాక్టు దక్కిందని, ఓ మంత్రి ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని మీడియాలో వార్తలొచ్చా యని తెలిపారు. దీనిపై నిజనిర్ధారణ చేసుకోవాల్సిన బాధ్యత ఆ మంత్రి పైనే ఉందన్నారు.

## 'ఫీవర్'లో మంకీపాక్స్ వార్డులు



నల్లకుంట: మంకీపాక్స్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తత ప్రకటించిన నేపథ్యంలో నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో ముందస్తుగా ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం కోవిడ్–19 సమయంలో ఇక్కడ 45 పడకలతో కూడిన ఐసోలేషన్ వార్డును, 40 పడకల సామర్థ్యంతో ఐసీయూ వార్డును సిద్ధం చేశారు. ప్రతి పడకకు ప్రత్యేకంగా ఆక్సిజన్ పైపులు అమర్చారు. సరిపడా ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ రెండింటినీ ప్రస్తుతం 'మంకీపాక్స్' వార్డులుగా మార్చి వినియోగించి, చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆసుపత్రి అధికారులు తెలిపారు.

### ఎంపాక్స్‌పై భయం వీడండి

**భారత్‌లో ఒక్క కేసూ నమోదు కాలేదు**

ఆఫ్రికాలో ప్రారంభం.. గల్ఫ్, యూరప్ దేశాలకు విస్తరణ

చికెన్ పాక్స్ తరహాలోనే ఎంపాక్స్‌తో శరీరంపై పొక్కులు

అంతర్జాతీయ ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి



వివరాలకు కోడ్‌ను స్కాన్ చేయండి

# ఎస్‌హెచ్‌జీలకు రూ.లక్ష కోట్ల రుణాలు

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి**

- రుణమాఫీ కింద బ్యాంకులకు రూ.18 వేల కోట్లు ఇచ్చాం..
- కొత్త రుణాలు రూ.7,500 కోట్లే ఇచ్చారంటూ అసహనం
- రుణాల మంజూరుకు బ్యాంకర్లు చొరవ చూపాలని విజ్ఞప్తి
- ప్రజాభవన్‌లో ఎస్ఎల్‌బీసీ భేటీ



ప్రజాభవన్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీలు) రూ.లక్ష కోట్లు వడ్డీ లేని రుణాల రూపంలో ఇస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను వేగంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి కలుగుతుందని, వారికి విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని బ్యాంకర్లను కోరారు. రైతు రుణమాఫీ కింద బ్యాంకులకు ప్రభుత్వం రూ.18 వేల కోట్లు జమ చేస్తే, బ్యాంకులు ఇచ్చిన కొత్త రుణాలు రూ.7,500 కోట్లు మాత్రమేనంటూ అసహనం వ్యక్తం చేశారు. రుణాల మంజూరుకు బ్యాంకర్లు మానవీయ కోణంలో చొరవ చూపాలని కోరారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు.

**రాష్ట్రానికి వెన్నెముకగా వ్యవసాయ రంగం**

రూ.2 లక్షల రుణమాఫీ ద్వారా రైతులను రుణ విముక్తులను చేస్తున్నామని భట్టి చెప్పారు. ఇది వ్యవసాయ అనుబంధ రంగాలను బలోపేతం చేస్తుందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని రాష్ట్రానికి వెన్నెముకగా భావిస్తున్నామని తెలిపారు. రుణమాఫీ, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందజేస్తున్నామని, భారీ మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా పరిగణిస్తోందని చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు అమెరికా, కొరియా దేశాల్లో పర్యటించి రూ.36 వేల కోట్ల విలువైన ఎంవోయూలు కుదుర్చుకున్నారని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ప్రాధాన్యతా రంగాల అడ్వాన్సుల విషయంలో వివిధ విభాగాల్లో బ్యాంకులు సానుకూల పనితీరును కనబరచడం హర్షణీయమన్నారు.

**రూ.2,005 కోట్లు పెరిగిన డిపాజిట్లు**

ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.2,005 కోట్ల మేరకు డిపాజిట్లు పెరిగాయని ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రకాశ్ చంద్రబరార్ తెలిపారు. ఖరీఫ్‌లో ఇప్పటివరకు రూ.17,383 కోట్ల పంట రుణాలు మంజూరు చేశామన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.23,848 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. రూ.220.49 కోట్ల మేర విద్యారుణాలు ఇచ్చినట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.57.079 కోట్లు మంజూరు చేశామని వివరించారు. ప్రాధాన్యతా సెక్టార్‌లకు మొత్తం రూ.1,00,731 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ కమల్‌ప్రసాద్ పట్నాయక్, నాబార్డు సీజీఎం సుశీలా చింతల తదితరులు పాల్గొన్నారు.

**సంపూర్ణ రుణమాఫీకి బ్యాంకర్లు సహకరించాలి: తుమ్మల**

కేవలం అంకెలు చదువుకునేందుకు మూడు నెలలకోసారి మీటింగ్‌లు పెట్టడం, బ్యాంకర్ల సదస్సు నిర్వహించడంలో అర్థం లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. కష్టకాలంలో కూడా ఇప్పటికే ప్రభుత్వం రూ.18 వేల కోట్లు రుణమాఫీ కింద విడుదల చేసిందని చెప్పారు. రుణ ఖాతాల్లో తప్పులు సరిదిద్దేటట్లు బ్రాంచ్ మేనేజర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి రుణమాఫీ కార్యక్రమాన్ని సంపూర్ణంగా పూర్తి చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మాకెందుకు రుణమాఫీ కాలేదు

**తోటపల్లిలో ఇండియన్ బ్యాంక్‌ను ముట్టడించిన రైతులు**

- మెదక్‌లో తెల్లవారుజామునే క్యూలైన్లు
- పురుగుల మందు తాగేందుకు యత్నించిన రైతు
- మల్లాపూర్‌లో ఆమరణ దీక్షకు దిగిన మరో రైతు
- మహారాష్ట్ర బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాక్షి, నెట్‌వర్క్: రుణమాఫీ జరగలేదంటూ రైతులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. పలుచోట్ల బ్యాంకుల వద్ద బారులుదీరి మాకెందుకు రుణమాఫీ కాలేదంటూ బ్యాంకు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

→ సిద్దిపేట జిల్లా తోటపల్లిలో రైతులు ఇండియన్ బ్యాంక్ సిబ్బందిని బయటకు పంపి బ్యాంకును మూసివేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బ్యాంక్ పరిధిలో 1,300 మంది రైతులుంటే కేవలం 400 మందికి మాత్రమే మాఫీ అయ్యిందని మండిపడ్డారు. నాలుగు గంటల పాటు ఆందోళన కొనసాగగా, లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

→ మెదక్ మండల పరిధిలో అత్యధికంగా రైతులు ఆటోనగర్‌లోని ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు వచ్చే రైతుల రద్దీ పెరగ్గా, బ్యాంకు అధికారులు రోజూ కొందరికి టోకెన్లు ఇచ్చి వివరాలు చెబుతున్నారు. ఆదివారం సెలవు, సోమవారం రాఖీపౌర్ణమి కావడంతో బ్యాంకుకు రైతులు పెద్దగా రాలేదు. మంగళవారం పెద్ద ఎత్తున తరలివచ్చిన రైతులు రోడ్డువెంట బారులు తీరారు. ఈ క్రమంలో చిన్నపాటి వర్షం పడుతున్నా, లెక్క చేయకుండా వరుసలోనే నిలబడ్డారు.

→ ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతువేదికల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద, బ్యాంకుల వద్ద రైతులు బారులు దీరుతున్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ యూనియన్ బ్యాంకుకు మంగళవారం రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 'సారూ.. జర మా ఖాతా చూడండి. ఎందుకు మాఫీ కాలేదో చెప్పండి' అంటూ వేడుకున్నారు. మరోవైపు వరంగల్ జిల్లా సంగెం మండలంలోని గవిచర్ల వద్ద, మహబూబాబాద్ జిల్లా బయ్యారం, నర్సింహులపేటలలో, జనగామ కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహించారు. జనగామ జిల్లా దేవరుప్పులలో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు.

→ జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రంలో అన్నదాతలు మంగళవారం పెద్ద ఎత్తున ధర్నా చేశారు. భూషణరావుపేట గ్రామానికి చెందిన రైతు ముస్కు సాగర్‌రెడ్డి పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ రైతు చేతిలో నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. పంటల సాగుకు చేసిన అప్పు పెరిగిపోయిందని, రుణమాఫీ కాలేదని సాగర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మల్లాపూర్ మండలంలోని రాఘవపేటకు చెందిన రైతు సోమ శ్రీనివాస్ తన ఇంట్లోనే ఆమరణ నిరాహార దీక్షకు దిగాడు. రైతు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన భార్య సోమలత పేరిట ముత్యంపేట ఇండియన్ బ్యాంక్‌లో రూ.1.21 లక్షల రుణం ఉందని, మాఫీకి అన్ని అర్హతలూ ఉన్నా, కాలేదన్నారు.

→ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మహారాష్ట్ర బ్యాంకు ఎదుట బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో రైతులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై బీజేపీ శ్రేణులు రాస్తారోకో చేశారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు.



కథలాపూర్‌లో ధర్నా వద్ద పురుగుల మందు తాగేందుకు ప్రయత్నిస్తున్న రైతు సాగర్‌రెడ్డి




మెదక్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందు బారులుదీరిన రైతులు



ఆదిలాబాద్‌లో మహారాష్ట్ర బ్యాంకు ఎదుట రైతుల నిరసన

# అనుమతి లేకుండానే ఫోన్ ట్యాపింగ్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం (రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా (కాంపిటెంట్ అథారిటీ)) తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేశారు.

**మా అనుమతి కోరలేదు: కేంద్రం**

'బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌తో మాకు ఎలాంటి సంబంధం లేదు. మా అనుమతి కోరలేదు. ఫోన్ ట్యాపింగ్‌కు రాష్ట్ర హోంశాఖ కూడా అనుమతి ఇవ్వొచ్చు. రాష్ట్రానికి కూడా ఆ అధికారం ఉంది. గరిష్టంగా 60 రోజుల వరకు అనుమతించాలి. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వ ప్రస్తావన, ప్రమేయం లేదు..' అని కేంద్రం పేర్కొంది.

**చిరునామాలూ సేకరించారు: రాష్ట్ర ప్రభుత్వం**

'ప్రణీత్‌కుమార్ తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని పలువురితో కుమ్మక్కై పదేళ్లుగా సేకరించిన అనధికారిక సమాచారమంతా తన వ్యక్తిగత పెన్‌డ్రైవ్‌ల్లో, హార్డ్ డిస్క్‌ల్లో నిక్షిప్తం చేశారు. ఆ తర్వాత ఆధారాలు లేకుండా చేయడం కోసం సీసీ కెమెరాలు ఆఫ్ చేసి ఆఫీస్‌లోని కంప్యూటర్లతో పాటు హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను గుర్తించారు. ప్రభాకర్‌రావు(ఏ–1), శ్రవణ్‌కుమార్ (ఏ–6) పరారీలో ఉన్నారు. విదేశాల్లో ఉన్న ప్రభాకర్‌రావును రెడ్ కార్నర్ నోటీసులపై రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రణీత్‌కుమార్ (ఏ–2), భుజంగరావు (ఏ–3), తిరుపతన్న (ఏ–4), రాధాకిషన్‌రావు (ఏ–5)లతో కలసి వీరంతా నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని విచారణలో వెల్లడైంది. ప్రణీత్‌కుమార్ నేతృత్వంలో స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ)ను ఏర్పాటు చేసి కాల్ డేటా రికార్డు (సీడీఆర్), ఇంటర్నెట్ ప్రొటోకాల్ డేటా రికార్డ్ (ఐపీడీఆర్), లొకేషన్ సర్వీసెస్ ద్వారా అన్ని వర్గాల ప్రజల టెలిఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడమే కాకుండా వారి అడ్రస్‌లను కూడా సేకరించారు. అప్పటి అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసేందుకు ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా నేరాలకు పాల్పడ్డారు. అత్యవసర పరిస్థితుల్లో ఇంటెలిజెన్స్ ఏడీజీపీ, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ఐజీపీ, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ ఐజీపీలు ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతించవచ్చు. అయితే కాంపిటెంట్ అథారిటీకి 3 రోజుల్లో వివరాలు తెలియజేయాలి. ఆయన 7 రోజుల్లో దాన్ని ధ్రువీకరించాలి. కానీ ఇక్కడ అలాంటిదేమీ జరగలేదు..' అని రాష్ట్ర ప్రభుత్వ అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

**నిబంధనలు ఉల్లంఘించారు**

'ప్రభాకర్‌రావు పదవీ విరమణ పొందిన తర్వాత ఎస్ఐబీ చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్(ఇంటెలిజెన్స్)గా కీలక పోస్టు కట్టబెట్టారు. మూడేళ్ల వరకు ఆయన్ను ఆ పదవిలో కొనసాగనిచ్చారు. టెలికమ్ సంస్థలకు లేఖ రాసిన ప్రభుత్వం.. ప్రభాకర్‌రావు అడిగిన ఏ సమాచారమైనా ఇవ్వాలని చెప్పింది. ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిబంధనలు ఇమిడి ఉన్నందున, అప్పటి హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నాకు అధికారం ఉండటంతో నిందితులు రికార్డులను ఎలా తయారు చేశారు? కొందరిని ఎలా తప్పుదోవ పట్టించారు? అనే విషయాలను కోర్టు దృష్టికి తీసుకొస్తున్నా. 2019 అక్టోబర్ నుంచి 2022 డిసెంబర్ వరకు నేను హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేశా. హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (కాంపిటెంట్ అథారిటీ) అనుమతి లేకుండా ఫోన్ ట్యాపింగ్ చేయడం చట్టవిరుద్ధం. హోం శాఖ చట్టాలు, నిబంధనలు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లపై నాకు పూర్తి అవగాహన ఉంది. ఇండియన్ టెలిగ్రాఫ్ రూల్స్ 419ఏ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలోని రూల్స్‌ను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థనే ప్రభావితం చేసే తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారు. ఈ కేసులో దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగుతోంది. దీని వెనుక ఎవరున్నా వదిలిపెట్టం..' అని రవి గుప్తా తన కౌంటర్‌లో స్పష్టం చేశారు. కాగా ఈ కేసుపై తదుపరి విచారణను ధర్మాసనం మూడు వారాలకు వాయిదా వేసింది.

## మాకు రుణమాఫీ కాలేదు

**'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు రైతుల ఫిర్యాదు**

- రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్నవారు బ్యాంకులు సందర్శించే షెడ్యూల్ ప్రకటిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తమకు రుణమాఫీ కాలేదని, మాఫీలో అనేక సమస్యలు ఉన్నాయని రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని 566 రైతు వేదికల రైతులతో మంగళవారం నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం ద్వారా అధికారులకు ఈ ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఖమ్మం, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, జనగామ, కొత్తగూడెం, సంగారెడ్డి, కామారెడ్డి, వరంగల్‌తోపాటు పలు రైతు వేదికలకు చెందిన రైతులు పంట రుణ మాఫీలో సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకులు గోపి పంట రుణాల మాఫీ పథకానికి సంబంధించిన వివిధ ఫిర్యాదులపై స్పష్టత ఇచ్చారు. రఘునందన్‌రావు మాట్లాడుతూ, కుటుంబ సమూహానికి సంబంధించిన సమస్యలకు ప్రభుత్వం విధివిధానాలను జారీ చేస్తుందని తెలిపారు. కుటుంబ రుణ మొత్తాలు రూ. 2 లక్షల కంటే ఎక్కువగా ఉన్న సందర్భాల్లో రైతులు బ్యాంకులను సందర్శించేందుకు ప్రభుత్వం ప్రత్యేక షెడ్యూల్‌ను ప్రకటిస్తుందని తెలిపారు. ఇంకా రుణమాఫీ పొందని రైతులు ఆధార్ కార్డులకు సంబంధించిన సమాచారం, బ్యాంక్ డేటాలో తప్పులు, పట్టాపాస్ పుస్తకాల సమస్యలు, పేరు సరిగ్గా లేకపోవడం మొదలైన ఫిర్యాదులను మండల స్థాయిలో సమర్పించవచ్చని సూచించారు. పంట రుణమాఫీ పథకానికి సంబంధించిన ఫిర్యాదులు పరిష్కారమయ్యే వరకు అన్ని పని దినాల్లో మండల స్థాయిలో నియమించబడిన నోడల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హులైన ప్రతి రైతులు రుణమాఫీ ప్రయోజనం పొందుతారని తెలిపారు. ఫిర్యా దుల స్వీకరణకు నిర్దిష్ట కటాఫ్ తేదీ లేనందున రుణాల మాఫీ పథకానికి సంబంధించిన ఫిర్యాదులు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు రైతులు ఎప్పుడైనా తమ ఫిర్యాదులను సమర్పించవచ్చన్నారు. మండల స్థాయిలో నోడల్ అధికారు లను నియమించాలని, రైతుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని వ్యవసాయ సంచాలకులు గోపి కిందిస్థాయి అధికారులను కోరారు. అన్ని పని దినాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పంట రుణాల మాఫీ ఫిర్యాదులకు హాజరు కావాలని అధికారులను ఆదేశించారు.

## రైతు రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్**



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రుణమాఫీపై కాంగ్రెస్ నాయకులు తలాతోక లేకుండా రోజుకో తీరున మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రూ.31వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేసిన ప్రకటనపై మండిపడ్డారు. రుణమాఫీ పూర్తయినట్టు సీఎం డబ్బా కొడితే మంత్రులు, ఎమ్మెల్యేలు రుణమాఫీ పూర్తి కాలేదని చెప్పడాన్ని ప్రశ్నించారు. రుణమాఫీ కాక రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నారని, సీఎం, మంత్రులు మాత్రం నోటికొచ్చినట్టు మాట్లాడుతూ గందరగోళం సృష్టిస్తున్నారని, ఇప్పటికైనా సీఎం వాస్తవాన్ని ఒప్పుకుని రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు.

**కాంగ్రెస్ పాలనలో 'పంచాయతీలు' అస్తవ్యస్తం**

కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలు అస్తవ్యస్తంగా మారాయని, నిధులు విడుదల చేయకపోవడంతో కార్యదర్శులు విధులు నిర్వర్తించడం కూడా కష్టతరంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నా రు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలానికి చెందిన 16 మంది పంచాయతీ కార్యదర్శులు సామూహికంగా సెలవులు పెట్టే దుస్థితి రావడం దురదృష్టకరమని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో పంచాయతీల్లో పారిశుద్ధ్యం కుంటుపడిందన్నారు. పంచాయతీలు మురికి కూపాలుగా మారడంతో మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీ వ్యవస్థను తిరిగి గాడిన పెట్టేందుకు, పంచాయతీ కార్యద ర్శులపై ఒత్తిడి తగ్గించేందుకు నిధులు విడుదల చేయాలని కోరినా, ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని, మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## లూజ్ లీడర్లకు కరెక్ట్ మొగుడు రేవంతే

**రాజీవ్ విగ్రహం తీసేస్తామంటే చూస్తూ ఊరుకుంటామా?: జగ్గారెడ్డి**



సాక్షి, హైదరాబాద్: సమకాలీన రాజకీయాల్లో క్రైమ్, లూజ్ లీడర్లకు కరెక్టు మొగుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డేనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. రాజీవ్‌గాంధీ తీసుకొచ్చిన టెక్నాలజీ పుణ్యాన అమెరికాలో ఉద్యోగం సంపాదించుకున్న కేటీఆర్, ఆయన విగ్రహాన్ని తీసేస్తాననడమేంటని ప్రశ్నించారు. ఇలాంటి లూజ్ టాక్స్ చేసేవారికి సమాధానం రేవంత్ మాత్రమే చెబుతారని అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేటీఆర్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు సచివాలయం ఎదురుగా పెట్టే రాజీవ్‌గాంధీ విగ్రహం తీసేస్తాననేందుకు కేటీఆర్ ఎవరని ప్రశ్నించిన జగ్గారెడ్డి ఆయన కూల్చేస్తుంటే మేం చూస్తూ ఊరుకుంటామా అని వ్యాఖ్యానించారు. అయినా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే విగ్రహం కూల్చేస్తాం అంటున్నారని, అసలు బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కదా అని ఎద్దేవా చేశారు.

## హద్దులు దాటుతున్న ముఖ్యమంత్రి చలోక్తులు

**ప్రైవేట్ టీచర్లపై ఆయన వ్యాఖ్యలు ఖండిస్తున్నాం ఈటల రాజేందర్, ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్**




అభివాదం చేస్తున్న ఈటల రాజేందర్, ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు

పంజగుట్ట (హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి, మాటతీరు, సోయి లేకుండా వేస్తున్న చలోక్తులు కొంతమందిని గాయపరుస్తున్నాయని, ఆయన మాటలు వింటున్న ప్రజలు వీరేనా మా ముఖ్యమంత్రి అని బాధపడుతున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. డిగ్రీ ఫెయిలైనవాళ్లే ప్రైవేట్ టీచర్లుగా చెలామణి అవుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో 'విద్యాభివృద్ధి– ప్రైవేట్ ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ, ప్రధాన కార్యదర్శి నిరుపమ సంజయ్‌ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ..పీజీ, పీహెచ్‌డీలు చేసిన వారు ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రైవేట్ స్కూల్స్‌లో పనిచేస్తున్న టీచర్లకు 12 నెలల జీతాలు ఇప్పించాలని ఈటల డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ..ప్రైవేట్ విద్యాసంస్థల్లో టీచర్లు, అధ్యాపకులకు ఉద్యోగ భద్రత, బీమాతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో 25% వెయిటేజి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# తూనీగలా తిరుగుతూ నిఘా!



కీటకాలు, పక్షుల ఆకారంలో బయో ఇన్‌స్పైర్డ్ డ్రోన్‌లు.. హైదరాబాద్ ఐఐటీలో కొనసాగుతున్న పరిశోధనలు

నిఘా, భద్రత అవసరాలకు ఉపయోగమంటున్న పరిశోధకులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: తూనీగలా తిరుగుతూ నిఘా పెడుతుంది.. సీతాకోక చిలుకలా కదులుతూ పరిస్థితులను కళ్లకు కడుతుంది... గద్దలా ఎగురుతూ ఎప్పటికప్పుడు ఫొటోలు, వీడియోలు పంపుతుంది.. ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు అభివృద్ధి చేస్తున్న బయో ఇన్‌స్పైర్డ్ ఫ్లాపర్ డ్రోన్ సాంకేతికత ప్రత్యేకత ఇది. పక్షులు, కీటకాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రత్యేక తరహా డ్రోన్లపై ఐఐటీహెచ్ పరిశోధనలు చేస్తోంది. ఆయా ప్రాంతాల్లోని భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా వాటిని డిజైన్ చేస్తోంది. అటవీ ప్రాంతాలు, కొండలు, చెరువులు, సరస్సులు, దూర ప్రాంతాల్లో సైతం తిరిగేందుకు అనువుగా వాటిని రూపొందిస్తోంది. డ్రోన్లు ఎగిరినట్లు బయో ఇన్‌స్పైర్డ్ డ్రోన్లు దేశ సరిహద్దుల్లో సైతం నిఘా పెట్టడానికి ఉపయోగించుకోవచ్చని, భద్రతా అవసరాలకు వాడుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

### డ్రోన్లకు కాస్త భిన్నంగా..

→ డ్రోన్ టెక్నాలజీకి కాస్త భిన్నంగా ఈ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నారు. డ్రోన్లు బ్యాటరీల సాయంతో పనిచేస్తుంటాయి. అయితే ఒకసారి వాటి చార్జింగ్ అయిపోతే తిరిగి చార్జ్ చేస్తేనే తిరిగి పనిచేస్తాయి. కానీ తూనీగ మాదిరిగా ఉండే బయో ఇన్‌స్పైర్డ్ డ్రోన్‌లో రెక్కలు కొట్టుకోవడం ద్వారా వచ్చే శక్తితో దానంతట అదే చార్జ్ అయ్యేలా డిజైన్ చేస్తున్నారు. అలాగే గద్ద ఆకారంలో తయారు చేసిన ఫ్లాపర్ దూరప్రాంతాలకు సైతం ఎగురుకుంటూ వెళ్లి ఆధునిక కెమెరాల ద్వారా అక్కడి పరిసరాలను వీడియో రికార్డు చేస్తుంది. కంట్రోల్ యూనిట్ ద్వారా దీని గమ్యాన్ని మార్చొచ్చు. తక్కువ ఎత్తు నుంచి ఈ డ్రోన్లను ఎగరేయడం వీలవుతుందని.. దీనివల్ల ఇతర దేశాల రాడార్ల నిఘాకు అవి చిక్కవని పరిశోధకులు చెబుతున్నారు.

### నాలుగేళ్లుగా పరిశోధనలు..

→ దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఐఐటీ హెచ్‌లో టీఐహెచ్ఏఎన్ (టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నేవిగేషన్) అనే పరిశోధన విభాగం ఉంది. ఇందులో యూఏవీ (అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్), ఆర్‌ఓవీ (రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్) రకాల అటానమస్ వాహనాలను అభివృద్ధి చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా వాటిపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఏరోస్పేస్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ వంటి బ్రాంచీలకు చెందిన ఎంటెక్, పీహెచ్‌డీ విద్యార్థులు ఈ పరిశోధన విభాగంలో పనిచేస్తున్నారు.



### నిఘా, భద్రత అవసరాలకు ఉపయోగపడేలా

→ బయో ఇన్‌స్పైర్డ్ డ్రోన్‌లపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇవి ప్రొటోటైప్ (నమూన దశ) స్టేజీలో ఉన్నాయి. కొన్ని డ్రోన్‌ల పరిశోధనలు చివరి దశకు చేసుకుంటున్నాయి. పక్షులు, తూనీగ వంటి వాటిని స్ఫూర్తిగా తీసుకొని బయో ఇన్‌స్పైర్డ్ డ్రోన్లను తయారు చేస్తున్నాం. దేశ నిఘా, భద్రతా అవసరాలకు ఎంతగానో ఉపయోగపడేలా వాటిని అభివృద్ధి చేస్తున్నాం.

- సంతోష్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్, టీఐహెచ్ఏఎన్

## క్లుప్తంగా...

### ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ తేదీల్లో మార్పులు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీఎడ్‌సెట్ తొలి విడత కౌన్సెలింగ్‌లో మార్పులు చేశారు. మార్పు చేసిన తేదీలను సెట్ కన్వీనర్ పి.రమేశ్ బాబు తెలిపారు. ఆగస్టు 8 నుంచి మొదలైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల 23 వరకూ కొనసాగిస్తారు. ఈ నెల 24 నుంచి 26 వరకూ వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చు. 27వ తేదీన వెబ్ ఆప్షన్లు సవరించుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 30వ తేదీన సీట్ల కేటాయింపు ప్రకటిస్తారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 4వ తేదీలోగా తమకు సీటు వచ్చిన కళాశాలలో విద్యార్థులు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

### ఈ నెల 22, 23 తేదీల్లో దోస్త్ ఇంట్రా స్లైడింగ్

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల సౌకర్యార్థం రెండో విడత అంతర్గత కాలేజీ స్లైడింగ్‌కు అధికారులు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కమిషన్ దేవసేన మంగళవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. విద్యార్థులు ఈ నెల 22, 23 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చని, ఈ నెల 24న సీట్లను కేటాయిస్తామన్నారు.

### 24న వ్యవసాయ డిప్లొమా కోర్సులకు కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివిధ డిప్లొమా కోర్సులలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 24న వాక్ ఇన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ పి.రఘురామిరెడ్డి తెలిపారు. ఈ కోర్సులకు పాలీసెట్ -2024లో ర్యాంకులు పొందిన వారికి మొదటి ప్రాధాన్యత, ఎస్ఎస్‌సీలో పాసై ( పాలీసెట్‌లో ర్యాంకు రానివారికి) రెండో ప్రాధాన్యత ఉంటుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

### 24 వరకూ లాసెట్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్లు

సాక్షి, హైదరాబాద్: లాసెట్ ప్రవేశ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్లకు ఈ నెల 24వ తేదీ వరకూ వెసులుబాటు కల్పించారు. 27, 28 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చు. 29వ తేదీన వెబ్ ఆప్షన్లను సవరించుకోవచ్చు. ఈ నెల 31న సీట్లు కేటాయిస్తారు. సెప్టెంబర్ 2 నుంచి 6వ తేదీలోగా సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలల్లో చేరాలి. సవరించిన లాసెట్ షెడ్యూల్‌ను సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి.రమేశ్ బాబు మంగళవారం విడుదల చేశారు.

### 31 వరకు ఇంటర్ ప్రవేశాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల గడువును ఇంటర్‌బోర్డు మరోసారి పొడిగించింది. 2024 -25 విద్యా సంవత్సరానికి రెండో విడత ప్రవేశాల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఇంటర్‌బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. తాజా గడువు ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పొడిగించబోమని స్పష్టం చేశారు. ఇంటర్ బోర్డ్ గుర్తింపు పొందిన కళాశాలల వివరాలను acadtgbie.cgg.gov.in, tgbie.cgg.gov.in వెబ్‌సైట్లలో పొందుపరిచామని, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆయా కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు పొందాలని సూచించారు.

### 23 నుంచి డీఎడ్ టీచింగ్ ప్రాక్టికల్స్

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ రెండో సంవత్సరం ఆఖరి లెస్సన్ టీచింగ్ ప్రాక్టికల్స్‌ను ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 10 వరకు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను bse.telangana.gov.inవెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు పేర్కొన్నారు.

### 27 నుంచి హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్ నుంచి కటక్‌కు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.ఈ మేరకు హైదరాబాద్-కటక్ (07165/07166) ప్రత్యేక రైలు ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 19 వరకు రాకపోకలు సాగించనుంది.

# చెయ్యి వేస్తే చెప్పుతెగుడే!

▶ మొదటి పేజీ తరువాయి

ఏమయితదో? ఎవడైనా చేతనైతే రాజీవ్‌గాంధీ విగ్రహం మీద చెయ్యి పెట్టండి బిడ్డా.. చెప్పు తెగకపోతే చూస్తా నేను..' అని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఉద్యమం ముసుగులో తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుని, వేల కోట్ల రూపాయలు సంపాదించుకుని, ఫామ్ హౌస్‌లు కట్టుకున్న సన్నాసుల విగ్రహం ఒకవేళ సచివాలయం ముందు పెడితే ఇప్పటి పిల్లలకు ఎవరిని ఆదర్శంగా చూపిస్తారని ప్రశ్నించారు. పొద్దున్నుంచి రాత్రి వరకు తాగి ఫామ్‌హౌస్‌లో పొర్లాడే కేసీఆర్ విగ్రహం సచివాలయం ముందు ఉండాలా? దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహం ఉండాలా? అనేది తెలంగాణ సమాజం ఆలోచించాలని అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా సోమాజిగూడలోని ఆయన విగ్రహానికి రేవంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీ వి.హనుమంతరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.



సచివాలయ ఆవరణలో తెలంగాణతల్లి విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

### వాళ్లయ్య పొయ్యేదెప్పుడు? వీడు పెట్టేదెప్పుడు?

'దేశానికి స్వాతంత్య్రం తెచ్చి, దేశం కోసం ప్రాణాలిచ్చి, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కుటుంబానికి చెందిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయం ముందు అమరవీరుల స్తూపం పక్కన ఏర్పాటు చేయడమే సముచితం. పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయని సన్నాసులకు తెలంగాణ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు. వారి బలుపు అణగదీసే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకుంటారు. రాజీవ్‌గాంధీ విగ్రహం తీసేస్తానన్న సన్నాసి బాధ ఏంటో కనుక్కుంటే.. అక్కడ వాళ్ల అయ్య విగ్రహం పెడదామని అనుకున్నాడని తెలిసింది. వాళ్లయ్య పొయ్యేదెప్పుడు? వీడు పెట్టేదెప్పుడు?..' అంటూ సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్‌గాంధీ

'నీకు ఇప్పుడు తెలంగాణ తల్లి గుర్తుకొచ్చిందా? ఇన్ని రోజులు గాడిదలేమైనా కాసినవా? సచివాలయం బయట కాదు.. 2024 డిసెంబర్ 9 నాడు సచివాలయం లోపలే కచ్చితంగా తెలంగాణ తల్లి విగ్రహం పెట్టే బాధ్యత మేం తీసుకుంటాం. అధికారం కోల్పోయి విచక్షణా రహితంగా, అసహనంతో అర్థం పర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ నుంచి సామాజిక బహిష్కరణ చేయాల్సి వస్తుంది. రాష్ట్రాన్ని దోచుకున్న దొంగ విగ్రహం పెడితే తెలంగాణ వాళ్లందరూ దొంగలుగా తయారవుతారు. సచివాలయం ముందు దొంగలు, తాగుబోతులకు స్థానం లేదు. త్వరలోనే పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో రాజీవ్ విగ్రహాన్ని సచివాలయం ముందు ఏర్పాటు చేస్తాం..' అని రేవంత్ చెప్పారు.

### సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం: సీఎం

→ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిలతో కలిసి.. సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. భవన ప్రధాన ద్వారం ముందు విగ్రహం ఏర్పాటు, స్థలం, డిజైన్ ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సచివాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబర్ 9న ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించామని తెలిపారు. ఇందులో భాగంగానే సచివాలయ ఆవరణను పరిశీలించామన్నారు.

### మాజీ ఐటీ మంత్రికి ఆ మాత్రం తెలియదా?: భట్టి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఐటీ రంగానికి పునాది వేసింది రాజీవ్‌గాంధీయేనని అన్నారు. హైదరాబాద్‌లో ఐటీ విస్తరణకు ఎవరు కృషి చేశారో.. విదేశాల్లో చదువుకున్నామని చెప్పుకునే వారికి, ఐటీ మినిస్టర్‌గా పని చేశానని చెప్పుకునే వ్యక్తికి తెలియదా? అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్, ఎంపీలు అనిల్‌కుమార్, చామల కిరణ్, ఎమ్మెల్యేలు దానం, శ్రీగణేష్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రపతితో గవర్నర్ భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. సోమవారం రాత్రి ఢిల్లీకి వచ్చిన ఆయన మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ముర్మును కలుసుకున్నారు. భేటీలో రాష్ట్రానికి సంబంధించిన తాజా పరిస్థితులతోపాటు.. పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రపతితో జిష్ణుదేవ్ వర్మ భేటీ కావడం ఇది రెండోసారి. రాష్ట్రపతి భవన్‌లో ఆగస్టు 2, 3 తేదీల్లో జరిగిన తొలి గవర్నర్ల సదస్సులో ఆయన ముర్మును కలుసుకున్నారు.

# మీకు కేసీఆర్ కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమా?

### కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులకు తెలంగాణ జేఏసీ ప్రశ్నలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మేధావులుగా చెప్పుకుంటున్న వారికి రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, ప్రయోజనాలు ముఖ్యమో... కేసీఆర్, ఆయన కుటుంబ ప్రయోజనాలు ముఖ్యమో తెలియాల్సి ఉందని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ తరఫున పలువురు ప్రొఫెసర్లు, రచయితలు, వివిధ వర్గాల ప్రముఖులు పేర్కొన్నారు. ఈ మేరకు 'కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు, బుద్ధిజీవులకు బహిరంగ ప్రశ్నలు' పేరుతో జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంరావు, తెలంగాణ భూరక్షణ సమితి అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, మేడి పాపయ్య, శ్రీరాం శివకుమార్, కొర్ర శరత్ నాయక్, వరంగల్ రవి, జంపాల రాజేశ్ తదితరులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే చారిత్రక న్యాయం అంటూ కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు, తెలంగాణ బుద్ధిజీవుల పేరిట కొందరు రాహుల్‌గాంధీకి రాసిన లేఖకు కౌంటర్‌గా ఈ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని పోరాట నేపథ్యాన్ని ప్రశ్నించే గొంతులను పదేళ్ల పాటు కాలరాస్తే మేధావులు ఎందుకు నోరుమెదపలేదని ప్రశ్నించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రభుత్వ పక్షాన హైదరాబాద్‌లో పెట్టకుంటే ఎందుకు నోరు మెదపలేదని నిలదీశారు. తెలంగాణ సచివాలయం లోపల, బయట, అసెంబ్లీలో, ప్రగతి భవన్ లోపల విగ్రహం పెట్టాలని కేసీఆర్‌ను ఈ మేధావులు ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించారు. గద్దర్‌ను ప్రగతి భవన్ ముందు నిలబెట్టినప్పుడు, కోదండరాంను అరెస్టు చేసినప్పుడు, ప్రొఫెసర్ జయశంకర్‌కు గౌరవం ఇవ్వనప్పుడు ఎందుకు మాట్లాడలేదని అన్నారు. కేసీఆర్‌కు అధికారం పోతే మీకెందుకు బాధ కలుగుతోందని వారు ప్రశ్నించారు.

# తొలిరోజే చెత్తను ఎత్తేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

కోరుకుంటున్నా' అని కేటీఆర్ పేర్కొన్నారు.

### చిరువ్యాపారులపై వేధింపులా?

'నిజామాబాద్‌లో పోలీసుల వేధింపులు భరించలేక ఓ స్వీట్ షాపు యజమాని తన దుకాణం ముందు బ్యానర్ ఏర్పాటు చేశాడు. ఓ వైపు నిజామాబాద్‌లో పోలీసులు చిరు వ్యాపారులను వేధిస్తుంటే మరోవైపు వరంగల్‌లో ఓ ఏసీపీ రద్దీగా ఉండే రోడ్డుపై మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నాడు. కేట్ కట్ చేసి బాణసంచా పేల్చడంతో గాయపడిన నలుగురు అమాయక పౌరులను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు..' అని కేటీఆర్ తెలిపారు. 'మహబూబాబాద్‌లో ఓ 17 ఏళ్ల బాలిక స్థానిక గూండా వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఆసుపత్రిలో మూడురోజుల పాటు కొన ఊపిరితో కొట్లాడిన ఆ బాలిక తన సోదరులకు రాఖీ కట్టి కన్నుమూసింది. ఘటన జరిగి నాలుగు రోజులు కావస్తున్నా ఎలాంటి చర్యలు లేవు..' అని కేటీఆర్ మండిపడ్డారు.

### సంపూర్ణ రుణమాఫీ కోసం రేపు బీఆర్ఎస్ ధర్నా

ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ సంపూర్ణ రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 22న రాష్ట్రవ్యాప్త ధర్నాకు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గాల్లో జరిగే ధర్నాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'రుణమాఫీ జరగకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ జరిగిందని సీఎం రేవంత్ చెప్తుండగా, మంత్రులు మాత్రం రుణమాఫీ పూర్తికాలేదనిం, ఇంకా కార్యక్రమం కొనసాగుతోందని చెప్తున్నారు. సీఎం, మంత్రుల భిన్న ప్రకటనలతో రైతులు అయోమయం, ఆవేదనకు గురవుతున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ అందరికీ వర్తింపజేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ స్పష్టమైన హామీ ఇచ్చింది. కానీ కనీసం 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ లబ్ధి చేకూరలేదు. దీంతో లక్షలాది మంది రైతులు రోజూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించింది. దీనిపై ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు రుణమాఫీ చేసేవరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు..' అని కేటీఆర్ స్పష్టం చేశారు.



పంజగుట్ట ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### ముఖ్యమంత్రిపై బీఆర్ఎస్ ఫిర్యాదు

పంజగుట్ట: మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ ఉద్యమనేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం రాత్రి పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు గెల్లు శ్రీనివాస్‌లు పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. రేవంత్‌రెడ్డి అభ్యంతరకరమైన భాష, దూషించే పదజాలం, హింసను ప్రేరేపించేలా చేసిన వ్యాఖ్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలు, న్యాయనిపుణుల సలహా ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

# పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవు!

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం పంచాయతీ కార్యదర్శుల నిర్ణయం

నేటి నుంచి ఈ నెల 24వరకు..

నిధులు రాక విధులు నిర్వహణ కష్టంగా మారిందని ఆవేదన

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు మూకుమ్మడిగా సామూహిక సెలవు పెట్టారు. ఈ మేరకు ఎంపీవో స్వప్నశీలకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ మండలంలో 23 గ్రామ పంచాయతీలకుగాను 19మంది కార్యదర్శులు పని చేస్తున్నారు. ఇటీవల నార్నూర్ పంచాయతీ కార్యదర్శి దినేశ్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని కలెక్టర్ రాజర్షిషా సస్పెన్షన్ వేటు వేశారు. ఈ నేపథ్యంలో వీరు సామూహిక సెలవుపై వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, అధికారులకు ఇచ్చిన వినతిపత్రంలో బ్లీచింగ్ పౌడర్ కొనేందుకు కూడా అప్పులు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### కష్టపడుతున్నా మాటలు పడాల్సి వస్తోంది

విధుల నిర్వహణలో వంద శాతం కష్టపడుతున్నా గుర్తింపు దక్కడం లేదు. అధికారులతో మాటలు పడాల్సి వస్తోంది. తీవ్ర మానసిక వేదనకు లోనవుతున్నాం. దీనికి తోడు ఆర్థికంగా కుంగుబాటుకు గురవుతున్నాం. అందుకే సామూహిక సెలవుల్లో వెళ్తున్నాం.

- ఎస్.రాజు, పంచాయతీ కార్యదర్శి, గుండాల

# వ్యవసాయ బదిలీల్లో అక్రమాలు

### అమ్మేసుకున్నారంటున్న అగ్రి డాక్టర్స్ అసోసియేషన్

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయశాఖ బదిలీల్లో అక్రమాలు జరిగాయని అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుపతి నాయక్ వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపికి వినతిపత్రం అందజేశారు. సాధారణ బదిలీల్లో ఏడీఏ పోస్టులు బ్లాక్ చేశారని, వాటిని ఖాళీలలో చూపలేదని ఆయన విమర్శించారు. మొత్తం 83 ఏడీఏ పోస్టులకు బదిలీలు చేపట్టాలని నిర్ణయించగా, అందులో 29 పోస్టులను బ్లాక్ చేశారని ఆయన పేర్కొన్నారు. మల్టీ జోన్-1లో 10 పోస్టులు, మల్టీ జోన్-2లో ఆరు పోస్టులు, హైదరాబాద్‌లోని సమైతి సహా కొన్నిచోట్ల 13 పోస్టులను బ్లాక్ చేశారన్నారు. తాము రివైజ్డ్ సీనియారిటీ జాబితాకు సంబంధించి ఫిర్యాదులు అందజేశామని, కానీ వాటిని పరిగణనలోకి తీసుకోలేదని ఆయన ఆరోపించారు. వ్యవసాయశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించిన తుది సీనియారిటీ జాబితా ప్రకారం బదిలీలు జరగలేదని, బదిలీ కోసం తీసుకున్న సీనియారిటీ జాబితాలో చాలా మంది అధికారుల పేర్లు లేవన్నారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని, లేకపోతే ఈ పోస్టులను అమ్ముకున్నారని భావించాల్సి వస్తుందని ఆయన ఆరోపించారు. రాజకీయంగా ప్రభావితం చేయలేనివారికి అన్యాయం జరిగిందన్నారు. కాగా, రుణమాఫీ కారణంగా వ్యవసాయశాఖలో సాధారణ బదిలీలకు ప్రత్యేక అనుమతి పొందిన గడువు మంగళవారంతో ముగిసింది.

# అప్రమత్తంగా ఉండండి

- విద్యాసంస్థలకు సెలవులపై నిర్ణయం కలెక్టర్లదే
- 23, 24 తేదీల్లో ఆర్వోఆర్ ముసాయిదా చట్టంపై జిల్లాల్లో వర్క్‌షాప్‌లు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్/ ఖమ్మంసహకారనగర్: రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మరో ఐదురోజులు ఈ వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఆయన భారీ వర్షాలు, నూతన ఆర్వోఆర్ ముసాయిదా చట్టం, ఎల్ఆర్ఎస్, ధరణి దరఖాస్తుల పరిష్కారంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఖమ్మం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల్లో వర్ష పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, రానున్న ఐదు రోజుల వర్షాలను దృష్టిలో ఉంచుకొని స్థానిక పరిస్థితులను బట్టి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే అధికారం కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. ప్రతి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.



ఖమ్మం కలెక్టరేట్ నుంచి మాట్లాడుతున్న పొంగులేటి. చిత్రంలో ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

### పది రోజుల్లో ధరణి దరఖాస్తులు పరిష్కరించండి

→ ధరణి పోర్టల్ కింద పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పది రోజుల్లో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఈ ప్రక్రియలో భాగంగా తిరస్కరించిన దరఖాస్తులకు సరైన కారణాలను తెలియజేయాల్సిందేనని స్పష్టం చేశారు. రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ధరణి దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, ఈ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్‌ను ఆదేశించారు. క్షేత్రస్థాయి తనిఖీల కోసం స్పెషల్ టీమ్‌లతోపాటు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసుకోవాలని, ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌ను పర్యవేక్షణ అధికారిగా నియమించాలని సీఎస్ శాంతికుమారికి సూచించారు.

### సామాన్యుల నుంచి మేధావుల వరకు

రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తేవాలని భావిస్తోన్న రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్)-2024 చట్టంపై విస్తృతస్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లకు సూచించారు. అందులో భాగంగా ఈనెల 23, 24 తేదీల్లో ఆర్వోఆర్ ముసాయిదా చట్టంపై జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహించాలన్నారు. సామాన్యుల నుంచి మేధావుల వరకు అందరికీ అర్థమయ్యేలా చట్టం రూపొందించే క్రమంలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు.

నిజానికి మనం ద్వేషించే వాటికి కూడా మనం బానిసలమౌతాం. వాటిపట్ల వ్యతిరేకత ఉత్పన్నమవుతున్నంత కాలం, వాటివల్ల ఏ విధంగానూ చలించని స్థితి పొందేవరకు, మనం వాటికి బానిసలమే!
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)



సాక్షి
బుధవారం, 21 ఆగస్టు 2024

# బయటపడ్డ బహిరంగ రహస్యం

ప్రపంచమంతా మలయాళ సినిమాలను పొగుడుతూ, తాజా జాతీయ అవార్డుల్లోనూ దేశమంతటిలోకీ ఉత్తమ సినిమాగా మలయాళ చిత్రమే నిలిచిన పరిస్థితుల్లో... ఆ పరిశ్రమలో పైకి కనిపిస్తున్న మంచితో పాటు కనిపించని దుర్లక్షణాలూ అనేకం ఉన్నాయని బహిర్గతమైంది. మలయాళ సినీ పరిశ్రమలో మహిళల స్థితిగతులపై కేరళ ప్రభుత్వం 2017 జూలైలో వేసిన హేమ కమిటీ నివేదిక బయటకు రావడంతో తేనెతుట్టె కదిలింది. నాలుగేళ్ళ పైచిలుకుగా కేరళ ప్రభుత్వం గుట్టుగానే అట్టిపెట్టిన ఈ నివేదిక న్యాయస్థానంలో, రాష్ట్ర సమాచార కమిషన్‌లో అనేక పోరాటాల అనంతరం సోమవారం బాహ్యప్రపంచానికి అందుబాటులోకి వచ్చింది. సున్నిత సమాచారం, వ్యక్తుల వివరాల పేజీలను మినహాయించి బయటకొచ్చిన మిగతా నివేదిక అంశాలపై దేశవ్యాప్త చర్చ రేగుతోంది.

ఏడెనిమిదేళ్ళ క్రితమే అంతర్జాతీయంగా 'మీ టూ' ఉద్యమం, ఆపైన భారత సినీరంగంలోనూ 'క్యాస్టింగ్ కౌచ్' వివాదాలు, ఆడవాళ్ళు పని కావాలంటే లైంగిక లబ్ధి కలిగించేలా 'కమిట్‌మెంట్' ఇచ్చి, 'కాంప్రమైజ్' కావాల్సి వస్తోందనే ఆరోపణలు చూశాం. అయినా సరే... మలయాళ నటులు, పరిశ్రమ నిపుణుల్ని పలువురిని ఇంటర్వ్యూ చేసి హేమ కమిటీ వెల్లడించిన అంశాలు నివ్వెరపరుస్తున్నాయి. సెట్‌లో స్త్రీలపై లైంగిక వేధింపులు, తాగివచ్చి వారు బస చేసిన గది తలుపులు కొట్టడాలు, 10–15 మంది శక్తిమంతమైన లాబీ గుప్పెట్లో మలయాళ చిత్రసీమ లాంటి సంగతులను కమిటీ కుండబద్దలు కొట్టింది. కోల్‌కతాలో విధినిర్వహణలో డాక్టర్‌పై హత్యాచార ఘటనతో అట్టుడుకుతున్న దేశంలో సినీరంగ స్త్రీల పరిస్థితీ ఏమంత భిన్నంగా లేదని తేలిపోయింది.

అత్యంత సంచలన అంశాలేమీ బయటపెట్టకుండా కమిటీ పెద్దమనిషి తరహాలో నివేదికను ఇచ్చిందనే అధిక్షేపణలూ లేకపోలేదు. ఆ మాటెలా ఉన్నా పరిశ్రమలోని అవాంఛనీయ ధోరణుల్ని బయటపెట్టి, ప్రజాక్షేత్రంలో వాటిపై చర్చ లేవనెత్తడంలో విజయం సాధించింది. స్టెనోగ్రాఫర్ కానీ, కనీస ఇతర సౌకర్యాలు కానీ లేకున్నా సరే, అనేక అవరోధాలను అధిగమించి మరీ ఈ కమిటీ 233 పేజీల నివేదిక సిద్ధం చేసింది. నివేదికలో బలాబలాలు ఏమైనప్పటికీ, సినీసీమలోని చీకటి కోణంపై దర్యాప్తు జరిపి ఇలాంటి నివేదిక ఒకటి వెలువడడం దేశంలో ఇదే తొలిసారి. నిజానికి, అనివార్య పరిస్థితుల్లోనే ప్రభుత్వం ఈ సంఘాన్ని వేయాల్సి వచ్చింది. ఓ ప్రముఖ నటిని కిడ్నాప్ చేసి, హీరో దిలీప్ కదులుతున్న కారులో జరిపిన లైంగిక అత్యాచారంతో 2017 ఫిబ్రవరిలో మలయాళ చిత్రసీమ అట్టుడికింది. రాష్ట్రమంతా నిరసనలు, 'ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్' బృందం డిమాండ్ల మేరకు కేరళ సర్కార్ రిటైర్డ్ హైకోర్ట్ జడ్జి కె. హేమ సారథ్యంలో త్రిసభ్య సంఘం వేయక తప్పలేదు. తెలుగు టి శారద కూడా అందులో మెంబరే! ఆ కమిటీ 2019 డిసెంబర్ 31కే తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఉద్యమకారులు పదే పదే అభ్యర్థించినా, సినిమావాళ్ళ ప్రైవసీకి భంగమంటూ సర్కార్ ఇన్నేళ్ళుగా ఆ నివేదికను తొక్కిపెట్టింది. అదేమంటే, అది న్యాయవిచారణ సంఘం కాదు గనక నివేదిక బయటపెట్టాల్సిన బాధ్యత లేదు పొమ్మంది. నివేదిక విడుదలను ఆపాలన్న ఓ నటి అభ్యర్థనను సైతం హైకోర్ట్ తాజాగా తోసిపుచ్చడంతో... చివరకు నివేదిక బహిర్గతమైంది.

తళుకుబెళుకుల సినీరంగానికి అంచున... సహజంగానే అనేక బలహీనతల నీలి నీడలు పరుచుకొని ఉంటాయని ప్రపంచానికి తెలుసు. అది ఒక్క మలయాళ సినీసీమకే పరిమితం కాదు. అందం, ఆనందం, ఆర్థిక ప్రయోజనం, పదుగురిలో పాపులారిటీ, పలుకుబడి పోగుబడినందున అన్ని భాషల సినీ రంగాల్లోనూ ఉన్నదే! కాకపోతే, తొందరపడి ఎవరూ బాహాటంగా ప్రస్తావించని చేదు నిజమది. లైంగిక వేధింపులు సహా ఆవేదన కలిగించే అనుభవాలు అనేకమున్నా, ఆడవాళ్ళు ఆ మాట బయటకు చెప్పరు. చెబితే పరిశ్రమలో అప్రకటిత నిషేధం సహా ఇంకా అనేక ఇతర వేధింపులు తప్పని దుఃస్థితి. ఆది నుంచి ఈ రుగ్మతలు ఉన్నవే. 'సినీరంగంలో స్త్రీలు నిత్యం ఎదుర్కొంటున్న భూతం లైంగిక వేధింపులు' అని కమిటీ తెగేసి చెప్పడంతో మేడిపండు పగిలింది.

మన యావత్ భారతీయ సినీ రంగానికి ఇది ఒక మేలుకొలుపు. అన్ని భాషల్లోనూ కలల వ్యాపారంలో కొనసాగుతున్న పితృస్వామ్య భావజాలం, లైంగిక దుర్విచక్షణ, వేతన వ్యత్యాసాలు సహా అనేక అవలక్షణాలపై మనకు చెంపపెట్టు. చిత్రం ఏమిటంటే, ప్రైవేట్ పరిశ్రమల్లో పని పరిస్థితులకు సైతం ప్రభుత్వ షరతులు, చట్టాలు వర్తిస్తాయి. ఎప్పుడో సినీరంగాన్ని ఒక పరిశ్రమగా గుర్తించినట్టు కేంద్ర సర్కార్ ప్రకటించినా దాని వల్ల ఒనగూడిన ప్రయోజనాలేవో అర్థం కాదు. కళ, వ్యాపారపు కల కలగలిసిన సృజనశీల పరిశ్రమకు చట్టాలు చేయడం అంత సులభం కాకపోవచ్చు. కానీ, మగవారితో సమానంగా ఆడవారికి వేతనం మాట దేవుడెరుగు... మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకొనే మరుగు స్థలాల లాంటి కనీస వసతులైనా కల్పించలేమా? సమ్మతితో పని లేకుండా ఆడవారితో ఎలాగైనా ప్రవర్తించవచ్చని భావిస్తున్న పని ప్రదేశంలో తగినంత బాధ్యత, భద్రత పెంపొందించేలా చేయలేమా? సమాజంగా మనం, సర్కారుగా పాలకులు సినీ పరిశ్రమపై ఆలోచించాల్సిన ఇలాంటి అంశాలు అనేకం. ఎప్పటి నుంచో ప్రత్యేక సినిమా విధానం తెస్తామని ఊరిస్తున్న కేరళ సర్కార్ సినీసీమలో వేతన ఒప్పందాలు, భద్రత అమలుకు సంబంధించి హేమ కమిటీ సిఫార్సులపై ఇకనైనా దృష్టి పెట్టాలి. పనిచేయడానికి ఒకమ్మాయి ఇంటి గడప దాటి వచ్చిందంటే సర్వం సమర్పించడానికి సిద్ధమైనట్టేనని చూసే పురుషాహంకార దృష్టి ఇకనైనా మారాలి. అన్ని పనిప్రదేశాల లానే సినీ రంగంలోనూ స్త్రీలకు సురక్షితమైన, భద్రమైన వాతావరణం కల్పించడం అంతర్జాతీయ స్థాయికి ఎదిగామని భుజాలు ఎగరేస్తున్న మన సినీ పరిశ్రమ కనీస బాధ్యత.

### గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, [illegible] మాసం, [illegible]

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

# మరో 'డిజిటల్' వ్యూహం

విశ్లేషణ

డా॥ దొంతి నరసింహా రెడ్డి

**ఒక్కో పదం వెనుక ఒక వ్యూహం ఉంటుంది. ఆలోచన ఉంటుంది. ప్రకృతి వ్యవసాయం ప్రకృతితో కూడిన వ్యవసాయం. సేంద్రియ వ్యవసాయం రసాయన రహిత వ్యవసాయం. జీరో బడ్జెట్ వ్యవసాయం పెట్టుబడి ఖర్చు లేని వ్యవసాయం. హరిత విప్లవ వ్యవసాయం రసాయనాలతో, హైబ్రిడ్ విత్తనాలతో కూడిన వ్యవసాయం. పారిశ్రామిక వ్యవసాయం పరిశ్రమ స్థాయిలో ఉత్పాదకత మీద దృష్టి పెట్టే వ్యవసాయం. మరి, డిజిటల్ వ్యవసాయం అంటే ఏమిటి? సమాచారంతో కూడిన వ్యవసాయం. జ్ఞానం, విజ్ఞానం, నైపుణ్యం కాకుండా సమాచారం సేకరించి ఇచ్చే ప్రక్రియలతో కూడిన వ్యవసాయం. రైతు జ్ఞానాన్ని, నైపుణ్యాలను కాలరాసే పెట్టుబడిదారుల వ్యూహంలో డిజిటల్ వ్యవసాయం ఒక సాధనం.**

హరిత విప్లవం ఒక ప్యాకేజీ. హైబ్రిడ్ విత్తనాలు వేస్తే రసాయన ఎరువులు వాడాలి. రసాయన ఎరువులు వాడితే చీడపీడ, పురుగు పుట్రకు రసాయనాలు పిచికారీ చెయ్యాలి. ఇవన్నీ చేయాలంటే డబ్బు ఉండాలి. అంటే బ్యాంకుల దగ్గర అప్పులు తీసుకోవాలి. డిజిటల్ వ్యవసాయం కూడా అలాంటి ఒక ప్యాకేజీ. బడా కంపెనీలు గుత్తాధిపత్యం సాధించడమే లక్ష్యం. రైతుల స్వావలంబనను దెబ్బ కొట్టడమే ఎజెండా.

ఆహార ఉత్పత్తి పెరిగి మిగులు ఏర్పడింది అంటున్నారు. ఒకవైపు అందరికి ఆహారం దొరకని పరిస్థితులలో ఆహారం మిగిలింది అని చెప్పడంలోనే డొల్లతనం బయటపడింది. ఆహార ఉత్పత్తి ఖర్చులు పెరిగి ధర రాని పరిస్థితులలో ఒకవైపు రైతు ఉంటే, అధిక ధరలకు కొనలేని స్థితిలో సగం దేశ జనాభా ఉన్నది. రైతుల ఆదాయం పెరగాలంటే పంటలకు, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కావాలి. ప్రభుత్వం కూడా అంగీకరిస్తున్నది. గిట్టుబాటు ధర కొరకు కనీస మద్దతు ధర పెంచమంటే మాత్రం ఒప్పుకోవడం లేదు. మార్కెట్లను ప్రైవేటు పరం చేసి, పెద్ద కొనుగోలు కంపెనీలు వస్తేనే గిట్టుబాటు ధర వస్తుంది అని ప్రభుత్వం నమ్మబలుకుతున్నది. అదే నిజమైతే అమెరికాలో, ఐరోపా దేశాలలో ఆ వ్యవస్థ ఉన్నది. అయినా అక్కడి రైతులు గిట్టుబాటు ధర కోసం పోరాడుతున్నారు.

ఆధునిక వ్యవసాయం ద్వారా భారతదేశం అద్భుతమైన విజయాలు సాధించింది. దురదృష్టవశాత్తూ చిన్న, సన్నకారు రైతులు అట్టడుగున ఉన్నారు. గడిచిన దశాబ్దంలో వ్యవసాయ కుటుంబాల సగటు అప్పు ఐదు రెట్లు పెరిగింది. 1995 నుండి దాదాపు 3,00,000 కంటే ఎక్కువ మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. భారత వ్యవసాయంలో ఉన్న సంక్లిష్టత దృష్ట్యా, ఏ ఒక్క విధాన మార్పు లేదా సాంకేతిక మార్పుతో చిన్న రైతుల ఆదాయాన్ని పెంచడం, భారత వ్యవసాయంలో పోటీని బలోపేతం చేయడం వంటి ద్వంద్వ లక్ష్యాలు సాధ్యం కావు. కానీ డిజిటల్ వ్యవసాయమే అన్నింటికీ పరిష్కారంగా ప్రభుత్వం భావిస్తున్నది.

చిన్న రైతులకు ఆదాయం పరమార్థం కనుక ఉత్పత్తి–కేంద్రీకృత మౌలిక వసతుల కల్పన నుండి మార్కెట్–కేంద్రీకృత మౌలిక సదుపాయాలకు మారడం, డిజిటల్ వ్యవసాయం ప్రధాన లక్ష్యం. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల మాదిరిగానే భారతదేశంలో కూడా మొబైల్ ఫోన్ గ్రామీణ కుటుంబాల జీవితాలను మార్చింది. బిహార్లో గొర్రెలు అమ్ముకునే మహిళ ఫోను ఉపయోగించి వాటిని డిజిటల్ వేదికల ద్వారా అమ్ముకుంటున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలలో, తయారు చేస్తున్న విధానాలలో, పని తీరులో డేటా డిజిటల్ పద్ధతులు పాటిస్తున్నాయి. ఇదివరకు, సమాచార సేకరణలో ఏ సమాచారం అనే ప్రశ్న వచ్చేది. ఇప్పుడు సమాచారం దేనికి అనే ప్రశ్న వస్తున్నది.



కేంద్ర ప్రభుత్వం, బడా పారిశ్రామిక సంస్థలు, అంతర్జాతీయ కంపెనీలు, విదేశీ పెట్టుబడిదారులు, దేశీయ టెక్ కంపెనీలు అన్నీ కలిసి డిజిటల్ టెక్నాలజీల ద్వారా తమ వ్యాపారం పెంచుకోవడం కోసం సమాచారాన్ని ఒక వ్యాపార వస్తువుగా మలిచే ప్రక్రియను డిజిటల్ వ్యవసాయంగా ప్యాకేజీ చేసి ఊదరగొడుతున్నారు. ఒకవైపు మార్కెట్లో చిన్న రైతులకు డిజిటల్ టెక్నాలజీ ప్రయోజనాలు అంటూ, ఇంకొక వైపు ఉత్పత్తి దశలలో రైతుల మీద ఆధిపత్యం సాధించే ప్రయత్నం చేస్తున్నారు. 'ఇక్రిశాట్' సహకారంతో బహుళ జాతి సంస్థ మైక్రోసాఫ్ట్ 'ఏఐ' విత్తే యాప్‌ను అభివృద్ధి చేసింది. దీని ద్వారా రైతులకు నాట్లకు సరైన తేదీలు, నేల సారం బట్టి ఎరువుల ఉపయోగం, వాడాల్సిన విత్తనాల సలహాలను పంపింది. నిత్యం వ్యవసాయం చేసే రైతులకు ఎప్పుడు ఏమి విత్తాలి వంటి సలహాలు ఇస్తుంది. రైతులకు తెలవదా? సలహాలు ఇవ్వాలంటే ఈ యాప్‌కు ప్రాథమిక సమాచారం కావాలి. ఆ సమాచారం ఒక ఒప్పందం ద్వార ప్రభుత్వం నుంచి ఎప్పుడో తీసుకున్నారు. ఇక ఇందులో రైతు పాత్ర ఉండదు. వాళ్ళు చెప్పింది చేయడమే!

ఈ యాప్ కొనసాగాలంటే ఆ సలహాలు కొనేవాడు కావాలి. చిన్న రైతు కొంటే అదనపు పెట్టుబడి ఖర్చు. చిన్న రైతు కొనలేడు, కొనడు కాబట్టి ప్రభుత్వ నిధులు వాడి తమ వ్యాపారం పెంచుకుంటారు. వీళ్ళకు ఎరువులు, విత్తనాలు, క్రిమికీటక నాశక రసాయనాల కంపెనీలతో మార్కెట్ ఒప్పందాలు ఉండే అవకాశం ఉంది. ఒక విధంగా వ్యవసాయ ఇన్‌పుట్ మార్కెట్లో ఇంకొక మధ్య దళారీ వ్యవస్థను పెంపొందిస్తున్నారు.

రైతులు తమ ఉత్పత్తులను నేరుగా కొనుగోలుదారులకు విక్రయించడానికి, మధ్యవర్తులను తగ్గించడానికి, వ్యాపారంలో పారదర్శకతను పెంచడానికి ఒక ఆన్‌లైన్ డిజిటల్ వేదిక (ఈ–నామ్) రూపొందించడానికి భారత ప్రభుత్వం 2016 నుంచి కృషి చేస్తోంది. వ్యవసాయ మార్కెట్లో రైతులకు, వ్యాపారులకు, కొనుగోలుదారులకు మధ్య ఆన్‌లైన్ ట్రేడింగ్‌ను సులభతరం చేయడానికి ఈ వేదికను తయారు చేస్తున్నారు. రైతు తన పంటకు మెరుగైన ధరను కనుగొనడంలో ఇది సహాయపడుతుంది. అయితే, ఇది గిట్టుబాటు ధర కాదు. స్థానిక రసాయనాల దుకాణాల నుంచి అప్పు తీసుకుని పంట అమ్మే పరిస్థితి నుంచి రైతులను విముక్తులను చేసి, ఉత్తమ ధరకు పంటలను విక్రయించేందుకు ఇవి ఉపయోగపడతాయని అంటున్నారు. పబ్లిక్ రంగానికి చెందిన బ్యాంకులు అప్పులు సరళంగా ఇచ్చే వ్యవస్థను ప్రక్షాళన చేయకుండా, ప్రైవేటు రుణ వ్యవస్థకు ఊతం ఇస్తున్నారు. ప్రైవేటు అప్పులు సులభంగా అందుకోవడానికి మాత్రమే ఈ వేదికలు ఉపయోగపడతాయి. ఏ రాయి అయితే ఏమి పండ్లు ఊడగొట్టుకోవడానికి అన్న చందంగా స్థానిక వడ్డీ వ్యాపారి నుంచి డిజిటల్ వడ్డీ వ్యాపారి చేతిలో రైతులు పడతారు.

డ్రోన్ ద్వారా పంట పొలాలలో చేసే విన్యాసాలు కూడా డిజిటల్ వ్యవసాయ ప్రతిపాదనలలో భాగమే. ఎరువులు చల్లవచ్చు, విత్తనాలు చల్లవచ్చు, నాటవచ్చు, క్రిమినాశక రసాయనాలు పిచికారీ చేయవచ్చు. పైనుంచి క్రిమికీటకాలు, కలుపు ఫోటోలు తీసి యాప్‌లో పెడితే, ఏ రసాయనం పిచికారీ చెయ్యాలి అని సలహా వస్తుంది. ఆ సలహా మేరకు ఎక్కడ పురుగు ఉందో అక్కడ దాని మీదనే రసాయనం పిచికారీ చేయవచ్చు, ఇత్యాది పనులు డ్రోన్ల ద్వారా చేసి, అధిక దిగుబడులు, అధిక ఆదాయం చిన్న, సన్నకారు రైతులు పొందుతారని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే, ఒక్కొక్క డ్రోన్ కొరకు రూ.7 నుంచి 8 లక్షల వరకు ఆయా డ్రోన్ కంపెనీలకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. ఈ పథకం పేరు డ్రోన్ దీదీ (డ్రోన్ అక్క). రైతు రోజుకు కేవలం రూ.27 సంపాదిస్తున్నాడని వాపోతున్న ప్రభుత్వం నేరుగా రైతుకు ఇచ్చేది కేవలం రూ.2 వేలు మాత్రమే. డ్రోన్ కంపెనీలకు లక్షల సబ్సిడీ ఇవ్వడానికి మాత్రం సంకోచించడం లేదు.

భారత వ్యవసాయంలో రైతు సంక్షోభంలో ఉన్నాడని ఒప్పుకొంటున్న ప్రభుత్వం మార్పుకు ప్రతిపాదిస్తున్న, నిధులు ఇస్తున్న పథకాలు రైతు మీద ఉత్పత్తి ఖర్చు ఇంకా పెంచే విధంగా ఉంటున్నాయి. ఖర్చుకూ, ఆదాయానికీ మధ్య వ్యత్యాసం తగ్గించే ప్రయత్నం కాకుండా రైతును వ్యవసాయం నుంచి దూరం చేసే ప్రతిపాదనలు డిజిటల్ వ్యవసాయం దార్శనిక విధానాలలో ఉన్నాయి. డిజిటల్ వ్యవసాయంలో రైతు దగ్గర సమాచారం తీసుకుని, రైతుకే సలహాలు ఇచ్చే ప్రక్రియలు అనేకం ఉన్నాయి. పాత తప్పిదాల నుంచి తప్పించుకుని, రైతులకు చూపే కొత్త ఆశలకు ప్రతి రూపం డిజిటల్ వ్యవసాయం. రసాయన ఎరువులు, జన్యుమార్పిడి విత్తనాలు, ప్రమాదకర కీటకనాశక రసాయనాల వ్యాపారం పెంపొందించుకోవడానికి ఉపయోగిస్తున్న వాహనం డిజిటల్ వ్యవసాయం.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

### గౌరవనీయ ప్రధాని

మూడు దశాబ్దాల క్రితం, ఒక భారతీయుల ప్రతినిధికి గౌరవ సూచకంగా అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ స్వయంగా గొడుగు పట్టారు. అలాంటి 'భారతరత్న' రాజీవ్ గాంధీని ఈ రోజు (ఆగస్ట్ 20న జయంతి), ఎల్లప్పుడూ తలుచుకుంటాను.

– స్వాతీ దీక్షిత్, సెంట్రిస్ట్

### ఉన్న సమయంలో...

దురదృష్టవశాత్తూ క్యాన్సర్ వ్యాపించింది. నా ఆంకాలజిస్టులు ఎంత మాత్రమూ సంవత్సరాలు, దశాబ్దాలు అని మాట్లాడటం లేదు. వాళ్లు చెబుతున్నదంతా నెలల్లోనే! నాకున్న ఈ సమయంలో నేను ప్రార్థిస్తాను, సిద్ధమవుతాను.

– గ్రెగ్ హిల్లిస్, రచయిత

### సంపన్న న్యాయం

నిన్న ఒక సంపన్న పారిశ్రామికవేత్త భార్య కరాచీలో తన ఖరీదైన కారును జనం మీదికి పోనిచ్చి, ఒక తండ్రీ కూతురు చనిపోవడానికీ, చాలామంది గాయపడటానికీ కారణమయ్యారు. నిమిషం పాటు జనం ఆగ్రహిస్తారు, తర్వాత ఏమీ జరగనట్టుగా ఆమె స్వేచ్ఛగా వెళ్లిపోతారు. ఒక దేశం, రెండు న్యాయాలు!

– నిదా కిర్మానీ, పాకిస్తాన్ స్త్రీవాది

### ఆచరణలో అసాధ్యం

జనం నుండి రక్షించుకోవడానికి డాక్టర్లకు బలమైన చట్టాలు కావాలంటే... దేశంలో వ్యవస్థీకృతంగా అత్యంత అవినీతిమయ వృత్తిలో భాగం అవుతున్న డాక్టర్ల నుంచి కాపాడుకోవడానికి జనానికి కూడా అంతే బలమైన చట్టాలు కావాలి. డాక్టర్ల దుర్మార్గాల మీద అభియోగం మోపడం ఆచరణలో అసాధ్యం.

– సుదీప్తో మండల్, కాలమిస్ట్

### ఘోరం!

నిజానికి ఆసుపత్రుల్లోని టాయ్‌లెట్లు అత్యంత శుభ్రంగా, చాలా సౌకర్యంగా వాడుకునేలా డిజైన్ అయివుండాలి. ఇండియాలోని ఎన్నో హాస్పిటల్స్ కంటే షాపింగ్ మాల్స్‌లోని టాయ్‌లెట్లు బాగుంటాయి. డాక్టర్లు ఈ విషయాన్ని ఎన్నో ఏళ్లుగా ఎత్తుతున్నారు. కానీ దేశం దీన్నో సమస్యగా పరిగణించలేదు. అనుభవించేవాళ్లకే అది ఎంత ఘోరమైన సమస్యో తెలుస్తుంది.

– దీప్‌శిఖా ఘోష్, వైద్యురాలు

### తానొకటి తలిస్తే...

భయంతో షేక్ హసీనా అన్ని ప్రతిపక్షాలనూ నిర్వీర్యం చేశారు. తద్వారా ఇస్లామిస్టులు ఎదగడానికి కారణమయ్యారు. ఆమె కచ్చితంగా ప్రధాన ప్రతిపక్షం బీఎన్‌పీ అంటే భయపడ్డారు. కానీ ఆమె బలవంతంగా రాజీనామా చేశాక, బీఎన్‌పీ అధికారం చేపట్టలేదు; బదులుగా ఇస్లామిస్టులు ఆటలు ఆడుతున్నారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

### నడిపే పాఠాలు

ఇండియాలో డ్రైవింగ్ అనేది దుర్భరం అవుతోంది. ఆఖరికి నివాస ప్రాంతాల్లోని రోడ్లు కూడా జనం ఇష్టారీతిన నడపడం వల్ల భయం పుట్టిస్తున్నాయి. గట్టిగా వీళ్ల మీద చర్యలు తీసుకోవాలని కొందరంటారు. ప్రతి నగరం, పట్టణం, గ్రామంలో ఉన్న 23.60 కోట్ల చెడ్డ డ్రైవర్లను ఏమీ చేయలేం. బాధ్యతాయుత, మర్యాదపూర్వక డ్రైవర్లను తీర్చిదిద్దాలంటే డ్రైవర్ ఎడ్యుకేషన్ ఒక్కటే దారి. ఇప్పుడు మొదలుపెడితే కొన్నేళ్లలోనైనా ఫలితం ఉంటుంది.

– నరేశ్ రాఘవన్, డ్రైవింగ్ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

### మానవీయ విలువలు వికసించాలి

ఈనాడు సమాజంలో ఎటుచూసినా అమానవీయం, అరాచకం, అమానుషం రాజ్యమేలుతున్నాయి. మంచి, మర్యాద, మానవీయత మచ్చుకైనా కానరావడం లేదు. మనిషి మానవత్వాన్ని మరిచి మృగంగా ప్రవర్తిస్తున్న సంఘటనలు చూస్తున్నాం. తమ పాత్రలో నీళ్ళు తాగాడని, పెళ్ళిలో గుర్రంపై ఊరేగాడని, తమ చెప్పుచేతల్లో ఉండకుండా తమతో సమానంగా ఉండడానికి ప్రయత్నిస్తున్నారని బడుగులు, బలహీన వర్గాలపై దాడులు చేయడం, హింసించడం, చంపడం లాంటి దుర్మార్గాలు జరుగుతున్నాయి. ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు కూడా ఇలాంటి సంఘటనలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు పలకడం మానవ విలువల హననానికి పరాకాష్ఠ. ఆ స్థాయి వ్యక్తుల్లోనే విలువలు లుప్తం కావడం వల్ల సమాజంలో అసహనం, విద్వేష భావజాలం, కుల, మత రాజకీయాలు పెరిగిపోతున్నాయి.

అయినప్పటికీ పెద్ద స్థాయిలో మానవీయ పరిమళ వికాసాన్నీ మనం చూశాం. కోవిడ్ సమయంలో ఇలాంటి అనేక దృశ్యాలు మన కంటబడ్డాయి. వలస కూలీల దుఃస్థితికి చలించి మానవతను చాటుకున్న అనేకమందిని మనం దర్శించాం. అనేకమంది మానవతావాదులు దేశ సరిహద్దుల్లో, అననుకూల పరిస్థితుల్లో సైనికుల రూపంలో అసాధారణ సేవలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకోవడం, ప్రకృతి విపత్తులు విరుచుకు పడినప్పుడు ఆపదల్లో చిక్కుకున్న ప్రజలను ఎంతో సాహసోపేతంగా సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అన్నిరకాల సహాయక చర్యల్లో పాల్గొనడం మనకు తెలిసిందే. ఇదే మానవత్వం!

ఇవ్వాళ ఉగ్రవాదం రూపంలో, ప్రభుత్వాల నిరంకుశ విధానాల రూపంలో, మతం, కులం, జాతి, ప్రాంతీయ విభేదాల రూపంలో అనేక దేశాల్లో మానవత్వానికి తీరని హాని కలుగుతోంది. అడుగంటుతున్న మానవతా విలువలను పరిరక్షించి, మానవ హృదయాల్లో వాటిని మరలా పునః ప్రతిష్ఠించవలసిన అవసరం ఉంది. ఇందుకోసం అన్ని దేశాలూ నడుం బిగించాలి.

– ఎమ్‌డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్

# పాఠం నేర్చుకోకపోతే... ఇక ఇంతే!

అభిప్రాయం

ఎన్. కుటుంబరావు

ఈ ఏడాది జూలై 30, మంగళవారం కేరళ, వయనాడ్‌లోని వెల్లారి మలలో భారీ కొండచరియలు విరిగిపడటంతో వైతిరి తాలూకాలోని మెప్పాడి గ్రామ పంచాయితీలోని ముండక్కై, చూరల్‌మల గ్రామాలు చాలా వరకు కొట్టుకుపోయాయి. అపార ప్రాణ నష్టం సంభవించింది. బురద, బండరాళ్లు, నేల కూలిన చెట్లతో కూడిన ప్రవాహం భారీ వినాశనానికి కారణమయింది.

భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు రావడంతో కొండచరియలు చల్యార్ నది ఉపనదులలో ఒకటైన ఇరువజింజి పూజ (మలయాళంలో పూజ అంటే నది అని అర్థం)లోకి జారిపడి, బురద వేగంగా ప్రవహించి దిగువ ప్రాంతాలకు భారీ నష్టాన్ని కలిగించింది.

'సెంటర్ ఫర్ ఎకలాజికల్ స్టడీస్'కు చెందిన పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ వయనాడ్ విపత్తు క్వారీ కార్యకలాపాల వల్లనే సంభవించిందని అన్నారు. 2011లో ఆయన నేతృత్వంలోని పశ్చిమ కనుమల ఎకాలజీ నిపుణుల బృందం వర్గీకరించిన మూడు సున్నితమైన పర్యావరణ జోన్‌లలో ప్రస్తుతం ప్రభావితమైన వైత్తిరి తాలూకా అత్యంత బలహీనమైన, సున్నితమైన జోన్. 2019లో, ముండక్కై కొండ దిగువలో జరిగిన, పుత్తుమల కొండచరియ విరిగిపడిన ఘటన తర్వాత, జియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సర్వేచేసి మరి కొన్ని తెలికపాటి కొండ చరియలు విరిగిపడిన స్థలాలను గుర్తించి, వయనాడ్‌లోని వేలారిమల ప్రాంతాన్ని, అత్యంత బలహీనమైన జోన్‌గా వర్గీకరించింది.

పశ్చిమ కనుమలలోని ఈ ప్రాంతం భౌగోళికంగా ఒక పీఠభూమి. అనేక చిన్న చిన్న నదులతో కూడిన ఒక నదీ పరీవాహక ప్రాంతం (బేసిన్). ఇవి చెల్లయ్యార్ నదికి ఉపనది అయిన ఇరువజింజి పుళలో కలుస్తాయి. ఈ చిన్న చిన్న నదుల వాలులపై ఏర్పడిన మంద పాటి



మట్టి పొరలు చాలా తొందరగా కిందికి కదిలి ఉండవచ్చు. వయనాడ్‌కు అంతకు ముందూ కొండచరియలు విరిగిపడిన చరిత్ర ఉంది. 1984, 2020ల్లో తక్కువ తీవ్రతతో విరిగిన కొండ చరియలు ప్రస్తుత పరిస్థితికి మరింత దోహదపడి ఉండవచ్చు.

కొండ ప్రాంతాలలో భూమి కొరత వలన కొండ వాలులు, నదీ తలాలపై ఇళ్లు నిర్మించుకుంటూ ఉంటారు. ఈ చర్యను నివారించాలి. ముండక్కై, చూరల్మల గ్రామాల్లో కొన్ని ఇళ్ళు ఈ తరహా లోనే ఉన్నట్లుగా గూగుల్ ఇమేజ్‌లో చూస్తే అర్థమవుతుంది. 2013లో ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు సంభవించినప్పుడు, జరిగిన విధ్వంసానికి ముఖ్య కారణం, మందాకిని నదీ తలాల్లో నిర్మించిన అడ్డదిడ్డమైన కట్టడాలే అని నిపుణులు స్పష్టం చేశారు. వయనాడ్ సంఘటనలో కూడా చాలావరకు ఇళ్ళు, నీటి మట్టం పెరిగి, నదీ ప్రవాహంలో కొట్టుకుపోయాయి.

వయనాడ్‌లో ముందు జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఎన్నో ప్రాణాలు పోయేవి కావు. ప్రకృతి వైపరీత్యాల అనుభవాల నుండి మనం ఎంతో నేర్చుకోవాలి. సహజ విపత్తులను ఎటూ నివారించలేం. అయితే జాగ్రత్తగా వ్యవహరించడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు. వివిధ కారణాల వల్ల నిపుణుల సూచనలను విధాన రూపకర్తలు పట్టించుకోరు. వయనాడ్ విలయం వంటి వాటిని నివారించడానికి... నది తలాలను ఆక్రమణకు గురి చేయకపోవడం, బలహీనమైన వాలుల నుండి నివాసాలను ఖాళీ చేయించడం, ఘాట్ రోడ్ల వెంబడి బలహీనమైన చోట్ల గోడలను నిర్మించడం లాంటివి తరచుగా నిపుణులు ఇచ్చే సూచనలు. వీటిని పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానం ఉంది. అయితే మన జీవన విధానం ప్రకృతికి అనుకూలంగా క్రమబద్ధం చేసుకోకపోవడమే వచ్చిన చిక్కల్లా!

వ్యాసకర్త డైరెక్టర్ జనరల్ (రిటైర్డ్), జియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా
మొబైల్: 94404 98590

# శోక జీవితం నిరాశామయం!

కష్టాలలో పడి బాధలను అనుభవిస్తున్న మనిషికి తన చుట్టూ చోటుచేసుకుంటున్న సుఖ సంతోషాలను గురించిన స్పందన, కాలం గడిచే కొద్దీ తగ్గిపోయి, చివరకు దాదాపుగా నశించిపోతుంది. బతుకంతా కష్టంతోనే కూడుకున్నట్లుగా కనబడి అంతులేని నిరాశకు, అయోమయానికి గురిచేస్తుంది. ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏమీ లేదు. జీవితంలో ఏదో ఒక సమయంలో ఈ విపరీత మానసిక స్థితిని ఎదుర్కోనని మనిషి దాదాపుగా ఉండడు అంటే అది అతిశయోక్తి కాదు. ఈ విపరీత మానసిక స్థితిని ఒక సరసమైన సన్నివేశంలో చెప్పాడు కనుపర్తి అబ్బయామాత్యుడు 'కవిరాజ మనోరంజనము' కావ్యం ద్వితీయాశ్వాసంలో.

జ్యోతిర్మయం

మానవలోకంలో చంద్రవంశానికి చెందిన ప్రభువైన పురూరవుడిని ప్రేమించింది దేవేంద్రుడి సభలో నర్తకియైన ఊర్వశి. అయితే, లోకాలు వేరైన కారణంగా, పురూరవుడితో సాంగత్యాన్ని ఎలా పొందాలో తెలియని అవస్థలో పడింది. అలా పురూరవుడి ధ్యాసలో పూర్తిగా మునిగిపోయిన ఊర్వశి సర్వమూ మరిచి దుఃఖిస్తూ ఉన్న స్థితిని ఇలా వర్ణించాడు అబ్బయామాత్యుడు.

**ఉ. పువ్వులు మాని దావి మెయిపూతలు మాని సఖీజనంబుతో
నవ్వులు మాని గీరవచన ప్రతిభాషలు మాని మాని దా
నెవ్వియు నింపుగాక సుఖహేతువు లెల్ల మనోజబాధ నా
జవ్వని 'దుఃఖితే మనసి సర్వమసహ్యమ' నంగ లేదొకో.**

పూవులు పెట్టుకోవడం మానేసింది; సుగంధ పరిమళాలు వెదజల్లే లేపనాలను శరీరంపై రాసుకోవడం మానేసింది; తోటివారితో నవ్వులు మానివేసింది; సరసమైన సంభాషణలతో సమాధానాలను మానివేసింది; ఈ శోకం కారణంగా, ఒకప్పుడు ఆహ్లాదంగా అనిపించినవి అన్నీ ఇప్పుడు సుఖం ఇచ్చేవిగా కనుపడడం లేదు ఊర్వశికి. భరింపరాని దుఃఖంలో మునిగిపోయిన మనిషికి లోకంలో అంతా దుఃఖమయంగానూ, సహింపరానిదిగానూ కనపడడంలో ఆశ్చర్యపోవాల్సింది ఏమీ లేదు కదా!– అని పై పద్యం భావం. శోకంలో మునిగివున్న మనిషికి సర్వమూ సహింపరానిదిగా కనబడుతుందన్నది స్వతహాగా అనుభవించకపోయినప్పటికీ అందరూ గ్రహించగలిగే సంగతే! కష్టమే అయినప్పటికీ ప్రయత్నం చేసి శోకం లోంచి ఎంత త్వరగా బయటపడితే అంతగా మేలు జరుగుతుందన్నది అందరూ సారాంశంగా గ్రహించవలసిన విషయం.

– భట్టు వెంకటరావు

## డెంగీతో ఇద్దరి మృతి

- మృతుల్లో నాలుగేళ్ల చిన్నారి..
- చికిత్సకు నిరాకరించిన 'ప్రైవేటు' వైద్యులు.. ఎంజీఎంలో మృతి


అద్విత (ఫైల్)

తొర్రూరు/ కోహెడ రూరల్ (హుస్నాబాద్): డెంగీతో మంగళవారం ఇద్దరు మృతిచెందారు. మృతుల్లో ఒకరు నాలుగేళ్ల చిన్నారి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన గూబ అమల, అశోక్ దంపతుల కుమార్తె అద్విత (4) నాలుగు రోజుల క్రితం జ్వరం బారినపడింది. 17న చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా.. డెంగీ బారినపడ్డట్లు తేలింది. 18న పరిస్థితి విషమించడంతో ప్రైవేటు వైద్యులు చికిత్సకు నిరాకరించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. తొర్రూరు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి జ్వలిత చిన్నారి ఇంటికి వెళ్లి పరిసరాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. కాగా, సిద్దిపేట జిల్లా కోహెడ రూరల్ మండలం బస్వాపూర్‌లోని జ్యోతిరామ్ తండాకు చెందిన బానోతు కిషన్ (47) కొన్ని రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతున్నాడు. సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు.

## కోర్టుకు నకిలీ ముద్దాయిలు

### న్యాయవాది సహా ఎనిమిది మంది నిర్వాకం... అందరికీ ఏడాది జైలు



కొత్తగూడెంటౌన్: ఒక కేసు విషయంలో అసలు ముద్దాయికి బదులు నకిలీ వ్యక్తిని ప్రవేశపెట్టిన ఘటనలో న్యాయవాది సహా ఎనిమిది మందికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ కొత్తగూడెం మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.శివనాయక్ మంగళవారం తీర్పు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2009లో జరిగిన ఒక ఘర్షణ కేసుకు సంబంధించిన పది మందిపై కేసు నమోదైంది. ఇది 2013లో కోర్టులో ఫైనల్‌కు వచ్చింది. అయితే తీర్పు చెప్పే సమయానికి అసలు ముద్దాయికి బదులు నకిలీ వ్యక్తి కోర్టుకు హాజరవుతున్నట్లు పోలీసులు గుర్తించి ఇదే విషయాన్ని నాటి సీఐ కోర్టుకు లేఖ ద్వారా తెలియజేశారు. కాగా, కోర్టుకు హాజరైన ముద్దాయిలను అప్పటి మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.కిరణ్మయి రెండుసార్లు ప్రశ్నించినా వారు సరైన సమాధానం చెప్పలేదు. దీంతో పూర్తి వివరాలతో పాటు ఆధార్ కార్డులను కూడా సమర్పించాలని ఆదేశించారు. కాగా, అసలు నిందితుడు గోనుమల్లె నాగరాజు విదేశాలకు వెళ్లడంతో ఆయనకు బదులు చిత్తారి సూర్యనారాయణను కోర్టులో హాజరు పర్చినట్లు తేలింది. ఈ ఘటనలో సూర్యనారాయణతో పాటు ముక్కెర శ్రీనివాస్, మూలమూరి శ్రీనివాస్, మహ్మద్ రజాక్, జోగా విశ్వేశ్వర్రావు, అల్లకొండ కోటి, దుర్గారాశి వెంకన్నతో పాటు న్యాయవాది దుర్గారావుకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. కాగా, గోనెమండే రాంచందర్ అనే మరో వ్యక్తి కేసు నడుస్తుండగానే మరణించాడు.

## ఆ భవనాలను ఎలా కూలుస్తారు?

### ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సర్కార్ హయాంలో ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం తదితర అంశాలు పక్కకు తొలగగా, ఇప్పుడు హైడ్రా పేరిట హడావుడి సాగుతోందని బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. హైడ్రా ఆలోచన బాగున్నా ఆచరణలో మాత్రం సరైన పద్ధతుల్లో జరగడం లేదన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, హైడ్రా పేరుతో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అనుమతులు పొందిన భవనాలను ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. చెరువులను కాపాడటం, అక్రమ కట్టడాలను కూల్చడం సరైందేకానీ అనుమతులు ఇచ్చిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో ముందు చెప్పాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. హైడ్రాతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చెరువుల్లో కట్టడాలకు అనుమతి ఇచ్చిన వారికి బేడీలు వేసి జైల్లో వేస్తేనే మిగతావారిలో భయం వస్తుందన్నారు. హైడ్రాకు చైర్మన్‌గా ఉన్న ముఖ్యమంత్రి, కమిషనర్‌గా ఉన్న ఏవీ రంగనాథ్ ఈ విషయంలో ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చెప్పాలని కాటిపల్లి డిమాండ్ చేశారు.

## 10న డాక్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల పదో తేదీన తపాలాశాఖ వర్చువల్ పద్ధతిలో డాక్ అదాలత్ నిర్వహిస్తోంది.తపాలా కార్యాలయాల ప్రజా సంబంధిత అంశాలను.. ఎం.లక్ష్మీ మాధవి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ (సీఎస్), చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్–500001 చిరునామాకు ఈనెల 31లోపు అందేలా పంపాలని సూచించారు.



భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి వద్ద నల్లటి మురుగు నీటితో ప్రవహిస్తున్న మూసీ

### చెత్తా చెదారంతో దుర్గంధం • భారీ వర్షానికి మూసీ పరవళ్లు


భూదాన్‌పోచంపల్లి: మూసీ కాలుష్య కాసారంగా మారింది. హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి వరద దిగువకు వచ్చి మూసీలో చేరుతోంది. దీంతో మంగళవారం మూసీ నది పరవళ్లు తొక్కింది. అయితే జంటనగరాల్లోని మురుగు, కాలుష్యం, చెత్తాచెదారం, గుర్రపుడెక్క ఆకు అంతా మూసీలోకి వచ్చి చేరడంతో.. దుర్గంధం వెదజల్లుతూ ప్రవాహం సాగుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి, జూలూరు. పెద్దరావులపల్లి వద్ద నల్లటి మూసీ నది నీరు దుర్వాసన వెదజల్లుతూ చెత్తాచెదారంతో ప్రవహించింది. కాగా జూలూరు వద్ద లోలెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ ప్రవహించడంతో.. ఈ మార్గంలో బీబీనగర్, భువనగిరికి రాకపోకలు నిలిచిపోయాయి. మూసీ ప్రవహిస్తున్న విషయం తెలియక.. ఇబ్రహీంపట్నం నుంచి పోచంపల్లి మీదుగా భువనగిరికి వెళ్లే ఆర్టీసీ బస్సు మూసీనది వరకు వచ్చి తిరిగి వెనక్కి వెళ్లి పెద్దరావులపల్లి మీదుగా భువనగిరికి చేరింది. అయితే మూసీ ఉధృతి కొనసాగుతుండటంతో ఈ మార్గంలో వాహనాలు వెళ్లకుండా అధికారులు మూసీకి ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశారు.

# రోజంతా ముంచెత్తిన వాన

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుంలాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు, ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ సూచించింది. భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది.

- భారీ వర్షాలతో హైదరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఇళ్లలోకి వరద నీరు చేరింది. ముషీరాబాద్ పార్శిగుట్టకు చెందిన విజయ్‌కుమార్(43) వరద నీటిలో కొట్టుకుపోయి మృతి చెందారు. కారులు, బైకులు కూడా కొట్టుకొని పోయాయి. ఒక అపార్ట్‌మెంట్‌పై పిడుగు పడి కొద్దిమేర ధ్వంసమై బీటలు వారింది.పలు ప్రాంతాల్లో గోడలు కూలి వాహనాలు ధ్వంసమయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి మూసీకి వరద పోటెత్తుతోంది. దీంతో మూసారాంబాగ్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. దీంతో దిగువకు నీటిని విడుదల చేశారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. జంటజలాశయాల్లో సైతం భారీ వరద నీరు వచ్చి చేరింది.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని వంద పడకల ఆస్పత్రి భవన ప్రాంగణం జలమయమైంది. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద రెండు అడుగుల వరద నీరు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గద్వాల జిల్లా అయిజ మండలంలో ఓ అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది.
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో వాగులు, వంకలు ఉరకలెత్తాయి. లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయమయ్యాయి. కడ్తాల్ మండలం మేడికుంట చెరువుకు గండి పడి, నీరంతా వృథాగా పోయింది.


బంజారాహిల్స్‌లో భారీగా ట్రాఫిక్‌జాం


కడ్తాల్ మండలంలో మేడికుంట చెరువుకు పడిన గండి

## ఆర్టీసీలో రికార్డుల 'రాఖీ'

- ఒకేరోజు 62.86 లక్షల మంది ప్రయాణం..
- రూ.31.96 కోట్ల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ సరికొత్త రికార్డులు సృష్టించింది. సోమవారం ఆర్టీసీ బస్సుల్లో ఏకంగా 62.85 లక్షల మంది ప్రయాణించారు. వీరి ద్వారా రికార్డు స్థాయిలో రూ.31.96 కోట్ల ఆదాయం నమోదైంది. గతేడాది రాఖీ పండుగ రోజు రూ.22.65 కోట్ల ఆదాయం సమకూరింది. మహిళలకు ఉచిత ప్రయాణ వసతి అందుబాటులోకి రావటంతో, ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్న విషయం తెలిసిందే. సోమవారం ఆర్టీసీ బస్సుల్లో ఏకంగా ఉచిత ప్రయాణ పథకాన్ని 41.74 లక్షల మంది మహిళలు వినియోగించుకున్నారు. వీరికి జారీ చేసిన జీరో టికెట్ల విలువ రూ.16.99 కోట్లుగా నమోదైంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేయాల్సి ఉంటుంది. ఇక టికెట్ కొని ప్రయాణించినవారి సంఖ్య (మహాలక్ష్మి పరిధిలోకి రాని మహిళలు సహా) 21.12 లక్షలుగా నమోదైంది. వీరి ద్వారా రూ.14.98 కోట్ల ఆదాయం నమోదైంది. సంఖ్య, టికెట్ ఆదాయం పరంగా మహిళలదే పెద్ద సంఖ్య కావటం విశేషం. ఆర్టీసీ బస్సులు నిత్యం సగటున 33 లక్షల కిలోమీటర్ల మేర తిరుగుతుంటాయి, రాఖీపౌర్ణమి రోజున అదనంగా మరో 5 లక్షల కి.మీ. తిరిగాయి. సిబ్బంది సెలవులు, వీక్లీఆఫ్‌లు రద్దు చేసుకొని మరీ విధులకు హాజరు కావటం విశేషం. రద్దీకనుగుణంగా అప్పటికప్పుడు బస్సులను అందుబాటులోకి తెచ్చారు. దీంతో 'మహాలక్ష్మి' రద్దీతోపాటు పురుష ప్రయాణికుల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. ఇదే భారీ ఆదాయానికి కారణమైంది. 97 డిపోలకుగాను 92 డిపోల పరిధిలో ఆక్యుపెన్సీ రేషియో 100 శాతాన్ని దాటింది. సోదరులకు రాఖీ కట్టేందుకు లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించటం ఆనందంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశ ప్రజారవాణా వ్యవస్థలో టీజీఎస్ ఆర్టీసీ రాఖీ పౌర్ణమి రికార్డులు ఓ మైలు రాయిగా ఉండిపోతాయని ఎండీ సజ్జనార్ చెప్పారు. రాఖీ నాడు రోజువారీ సర్వీసులకు అదనంగా 2587 ప్రత్యేక బస్సులను నడిపామని చెప్పారు.

# శభాష్ పోలీస్..

### గుంతలో పడిన వ్యక్తిని కాపాడిన సీఐ


గుంతలో నుంచి వ్యక్తిని బయటకు తీస్తున్న పోలీసులు

రామన్నపేట: నీటిగుంతలో పడి రెండు రోజులుగా చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు కాపాడారు. వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరంగల్ రైల్వేట్రాక్ పక్కన గుంతలో రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి పడిపోయాడు. మంగళవారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న కానిస్టేబుల్.. ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపికి సమాచారం అందించారు. దీంతో సీఐ స్వయంగా ఆ గుంతలోకి తాడు ద్వారా దిగి ఆ వ్యక్తిని కాపాడాడు. రెండు రోజుల క్రితం గుంతలో పడిన ఆ వ్యక్తి గుర్రపు డెక్కలో ఇరుక్కుపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని, అతి కష్టంమీద అతన్ని బయటకు తీశామని సీఐ చెప్పారు. సదరు వ్యక్తి మహబూబ్‌నగర్‌కు చెందిన కామారపు నరేశ్‌గా గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం నరేశ్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, వ్యక్తిని కాపాడిన ఫొటోలను డీజీపీ జితేందర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపితోపాటు పోలీస్ సిబ్బందిని అభినందించారు.

## 'స్వచ్ఛ్ బయో' ఒప్పందంపై విచారణ చేపట్టండి

### ఈడీకి బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్వచ్ఛ్ బయో సంస్థతో చేసుకున్న రూ.1000 కోట్ల ఒప్పందంపై సమగ్ర విచారణ జరిపించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఫిర్యాదు చేశారు. మంగళవారం ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో అధికారులను కలసి సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేవలం 15 రోజుల ముందే ఈ సంస్థ హైదరాబాద్ జూబ్లీహిల్స్ చిరునామాతో రిజిస్టర్ అయిందని తెలిపారు. ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేని ఓ షెల్ కంపెనీతో ఒప్పందం వెనుక ప్రయోజనం ఏంటో విచారించాలని కోరారు. ఈ సంస్థలో సీఎం సోదరుడు ఒక డైరెక్టర్‌గా ఉన్నారని అందుకే ఈ ఒప్పందం వెనుక క్విడ్ ప్రో కో ఉందని అనుమానం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో రిజిస్టర్ అయిన సంస్థను అమెరికాలో ప్రకటించడం వెనుక ప్రయోజనాలపైనా దృష్టి సారించాలని కోరారు. విదేశీ నిధుల ప్రమేయం, మనీలాండరింగ్ వంటి అంశాలపై సమగ్ర విచారణ చేయాలని తన ఫిర్యాదులో క్రిశాంక్ కోరారు.











## వ్యవసాయ సలహాదారుగా 'పోచారం'

### డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా అమిత్‌రెడ్డి




అమిత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (వ్యవసాయం)గా పరిగె (పోచారం) శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన్ను కేబినెట్ హోదాలో ఈ పదవిలో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన పోచారం.. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక, లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డిని తెలంగాణ డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ చైర్మన్‌గా నియమించారు. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**విలీన గ్రామాల సబ్ కమిటీలో దామోదర రాజనర్సింహ**


దామోదర

ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామ పంచాయతీలు, పురపాలికల విలీనంపై ఏర్పాటైన సబ్ కమిటీలో సభ్యునిగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

# కాంగ్రెస్ X బీఆర్ఎస్

### సిద్దిపేటలో ఉద్రిక్తత • భారీగా పోలీసుల మోహరింపు


సిద్దిపేట బీజేఆర్ చౌరస్తాలో పోలీసుల బందోబస్తు

సాక్షి, సిద్దిపేట: కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల పోటాపోటీ కార్యక్రమాల నిర్వహణతో సిద్దిపేటలో మంగళవారం ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ చేపట్టింది. మరోవైపు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంపూర్ణ రైతు రుణమాఫీ సాధనకు సమావేశం నిర్వహించారు. దీంతో హైటెన్షన్ వాతావరణం నెలకొనగా, 500 మంది పోలీసులను మోహరింపజేశారు.

**కాంగ్రెస్ భారీ ర్యాలీ**

ముందుగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హైదరాబాద్ నుంచి కార్ల ర్యాలీతో సిద్దిపేటకు చేరుకున్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా పొన్నాల జంక్షన్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ పాత బస్టాండ్ వరకు సాగింది. హరీశ్‌రావుకు వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. పొన్నాల వై జంక్షన్ నుంచి పాత బస్టాండ్ వరకు పోలీసులు ర్యాలీకి అనుమతినిచ్చారు. బీఆర్ఎస్ సమావేశ నేపథ్యంలో హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయం ఎదుట నుంచి కాకుండా బైపాస్ (సుడా రోడ్) నుంచి ఎన్సాన్‌పల్లి జంక్షన్ మీదుగా విక్టరీ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీని పంపించారు. ఎమ్మెల్యే రోహిత్ కారు క్యాంప్ ఆఫీస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా వెంటనే మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు వచ్చి సుడా రోడ్డుకు మళ్లించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు అడ్డుకోగా స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ రైతు రుణమాఫీ 200 శాతం చేశామని, హరీశ్ రాజీనామా చేయాల్సిందేనన్నారు.

**బీఆర్ఎస్ సమావేశం**

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంలో సంపూర్ణ రైతు రుణమాఫీ సాధన కార్యాచరణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్‌లు దేవిప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లతోపాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశపతి మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పంచాయితీ కాదని, రైతులకు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న పంచాయితీ అని అన్నారు.

# టెక్నికల్ క్లియరెన్స్‌కు 'సీతారామ'

- కేంద్ర జలసంఘాన్ని కోరాలని గోదావరిబోర్డు సమావేశంలో నిర్ణయం
- తీవ్రంగా వ్యతిరేకించిన ఏపీ
- సందేహాలను ఇప్పటికే సీడబ్ల్యూసీ నివృత్తి చేసిందన్న బోర్డు చైర్మన్
- ఏపీ అభ్యంతరాలు అసమంజసమని స్పష్టం చేసిన తెలంగాణ
- వాడీవేడిగా సాగిన గోదావరి బోర్డు 16వ సమావేశం

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకం–సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు డీపీఆర్‌ను టెక్నికల్ అప్రైజల్ క్లియరెన్స్ కోసం పంపించేలా కేంద్ర జలసంఘానికి సిఫారసు చేస్తున్నామని గోదావరినది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) చైర్మన్ ముఖేష్‌కుమార్ సిన్హా తెలిపారు. ప్రాజెక్టుపై ఏపీ లేవనెత్తిన అభ్యంతరాలు, అనుమానాలను సైతం రికార్డు చేసి సీడబ్ల్యూసీకి పంపిస్తామన్నారు. ఏపీ లేవనెత్తిన సందేహాల్లో చాలావాటిని ఇప్పటికే సీడబ్ల్యూసీ నివృత్తి చేసిందని చెప్పారు. ఇంకా ఏమైనా అనుమానాలుంటే సీడబ్ల్యూసీని నేరుగా సంప్రదించవచ్చని ఏపీని సూచించారు. గోదావరిబోర్డు 16వ సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు అనుమతులపై ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య వాడీవేడిగా చర్చ జరిగింది. గోదావరిబోర్డు ముందు సీతారామ ప్రాజెక్టు డీపీఆర్ రాగా, దానికి టెక్నికల్ అప్రైజల్ క్లియరెన్స్ కోసం బోర్డు సిఫారసు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రాజెక్టుకు అనుమతులు తుది అంకానికి చేరాయి. తదుపరి దశలో సీడబ్ల్యూసీలోని టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ) డీపీఆర్‌ను పరీక్షించి క్లియరెన్స్ ఇవ్వనుంది. టీఏసీ క్లియరెన్స్ లభిస్తే ప్రాజెక్టుకు అనుమతులు లభించినట్టే భావిస్తారు. ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ సమావేశమై ఈ ప్రాజెక్టుల డీపీఆర్‌లను ఆమోదిస్తే అన్ని రకాల అనుమతులు లభించినట్టే. గోదావరి బోర్డు సమావేశంలో తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ(జనరల్) జి.అనిల్ కుమార్, అంతర్రాష్ట్ర విభాగం సీఈ మోహన్‌కుమార్, గోదావరి బేసిన్ డీడీ సుబ్రహ్మణ్య ప్రసాద్, ఏపీ తరఫున ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావు, అంతర్రాష్ట్ర విభాగం సీఈ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**ఏ ప్రాతిపదికన తెలంగాణ ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు?**

రెండు రాష్ట్రాల మధ్య గోదావరి నీటి పంపకాలే జరగలేదని, ఎలాంటి అవగాహన ఒప్పందం లేదని, ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ ఎలా క్లియరెన్సులు జారీ చేస్తుందని ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ వెంకటేశ్వరరావుఅభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులతో ఏపీలోని పోలవరం, గోదావరి డెల్టా సిస్టమ్‌కు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వ్యతిరేకిస్తున్నామని, దీనికి అనుమతులను తిరస్కరించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో 33 టీఎంసీలను తరలించడానికి చేపట్టిన ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టులకు బదులుగా 70 టీఎంసీలను తరలించడానికి చేపట్టిన ఈ ప్రాజెక్టు రాష్ట్ర విభజన చట్టానికి విరుద్ధమన్నారు.

**ఏపీ అభ్యంతరాలు గోదావరి బోర్డు పరిధిలోకి రావు**

ఉమ్మడి రాష్ట్రంలో 1,486 టీఎంసీల గోదావరి జలాల వినియోగం కోసం ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళికలు రచించగా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పుతో పాటు ఆయా ప్రాజెక్టుల లొకేషన్లు, జలాలపై ఉన్న హక్కులను పరిగణనలోకి తీసుకుంటే తెలంగాణకు 968 టీఎంసీలు, ఏపీకి 518 టీఎంసీల జలాలపై హక్కులు ఏర్పడుతాయని తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా స్పష్టం చేశారు. ఏపీ సమర్పించిన ప్రాజెక్టుల వివరాల ప్రకారం ఆ రాష్ట్రానికి 531 టీఎంసీల జలాలపై హక్కులున్నట్టు సీడబ్ల్యూసీ తేల్చిందని, ఆ జలాలకు రక్షణ కల్పిస్తూనే తెలంగాణలోని ప్రాజెక్టులను అనుమతులు ఇస్తోందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టుపై ఏపీ లేవనెత్తిన అభ్యంతరాలు, అనుమానాలు గోదావరి బోర్డు పరిధిలో రావని తెలిపారు. అవి సీడబ్ల్యూసీ పరిధిలో వస్తాయని, అక్కడే నివృత్తి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రాజెక్టులకు క్లియరెన్స్‌ల విషయంలో సీడబ్ల్యూసీ ఏపీని సంప్రదించలేదని ఆ రాష్ట్రం చెప్పడం పూర్తిగా అవాస్తవమన్నారు. తెలంగాణకు సంబంధించిన అన్ని ప్రాజెక్టుల డీపీఆర్‌లను, నీటి అవసరాలను, ఆయకట్టు వివరాలను, డాక్యుమెంట్లను సీడబ్ల్యూసీకి సమర్పించినట్టు తెలిపారు. వీటిని పరిగణ నలోకి తీసుకొని ఎగువ, దిగువ పరీవాహకంలోని రాష్ట్రాల అవసరాలన్నింటినీ పరిరక్షిస్తూ సీడబ్ల్యూసీ క్లియరెన్స్‌లు ఇస్తోందన్నారు. ఈ విషయంలో ఏపీ అభ్యంతరాలు సమంజసం కాదన్నారు. సీడబ్ల్యూసీ మార్గదర్శకాలు, గోదావరి ట్రిబ్యునల్ అవార్డు, ఉమ్మడి రాష్ట్రంలో చేసిన ప్రాజెక్టుల నిర్మాణ ప్రణాళికలకు అనుగుణంగానే ముందుకు పోతున్నామని స్పష్టం చేశారు.

# మరో రేప్, హత్య జరగనిదే... మేలుకోమా?

## కోల్‌కతా వైద్యురాలి హత్యాచారంపై సుప్రీంకోర్టు


మంగళవారం వైద్యురాలి హత్యాచారం కేసును విచారిస్తున్న సీజేఐ ధర్మాసనం

**న్యూఢిల్లీ:** కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని అత్యంత పాశవిక ఘటనగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. ఈ ఉదంతంలో మమత సర్కారు ఆద్యంతం తీవ్ర బాధ్యతారాహిత్యంతో వ్యవహరించిందంటూ తీవ్రంగా తలంటింది. ఎఫ్ఐఆర్ దాఖలులో ఆలస్యం మొదలుకుని ఈ దారుణాన్ని ఆత్మహత్యగా చిత్రించజూసిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌కు మరో పోస్టింగ్, ఆస్పత్రిపై మూక దాడిని నిలువరించడంలో వైఫల్యం దాకా ఒక్కో అంశాన్నీ ఎత్తి చూపుతూ నలుగు పెట్టింది. దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది ఏమాత్రం రక్షణ లేని పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయమై మన వ్యవస్థలోని దారుణ లోపాలను కోల్‌కతా ఉదంతం మరోసారి తెరపైకి తెచ్చిందని అభిప్రాయపడింది. మహిళలు సురక్షితంగా పని ప్రదేశాలకు వెళ్లలేకపోవడమంటే వారి సమానత్వపు హక్కును కాలరాయడమేనని స్పష్టం చేసింది. ''మరో రేప్, హత్య జరిగేదాకా వేచి చూడలేం. వైద్యులు, వైద్య సిబ్బంది భద్రతకు దేశవ్యాప్త ప్రొటోకాల్ కావాల్సిందే'' అని స్పష్టం చేసింది. దాని విధివిధానాల రూపకల్పనకు వైస్ అడ్మిరల్ ఆర్తీ సరిన్ సారథ్యంలో వైద్య ప్రముఖులతో కూడిన టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మూడు వారాల్లోగా ప్రాథమిక నివేదిక, రెండు నెలల్లో పూర్తి నివేదిక అందించాల్సిందిగా టాస్క్‌ఫోర్స్‌కు సూచించింది. హత్యాచార ఘటనపై ఏమేం చర్యలు తీసుకున్నారో నివేదించాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని, దర్యాప్తు పురోగతిపై గురువారానికల్లా నివేదిక ఇవ్వాల్సిందిగా సీబీఐని ఆదేశించింది. హత్యాచారానికి, మూక దాడికి వేదికైన కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ వైద్య కాలేజీ, ఆస్పత్రికి సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఆదేశించింది. తమపై నమ్మకముంచి విధుల్లో పాల్గొనాల్సిందిగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న వైద్య సిబ్బందిని కోరింది. టాస్క్‌ఫోర్స్ నియామకాన్ని వైద్య సంఘాలు స్వాగతించినా విధుల బహిష్కరణను కొనసాగిస్తామని ప్రకటించాయి.

**చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం**

ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో ఆగస్టు 9న ట్రెయినీ వైద్యురాలు దారుణ అత్యాచారానికి, హత్యకు గురవడం, దాన్ని నిరసిస్తూ వైద్యులు, వైద్య సిబ్బంది దేశవ్యాప్తంగా ఆందోళనలకు దిగడం, ఈ ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించడం తెలిసిందే. జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్డీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం దీనిపై మంగళవారం విచారణ జరిపింది. ఈ ఉదంతంలో బెంగాల్ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందంటూ విమర్శించింది. ''ఎఫ్ఐఆర్ దాఖలుకు ఎందుకంత ఆలస్యమైంది? ఇంతటి దారుణం జరిగినా ఆస్పత్రిలో భద్రతను కట్టుదిట్టం చేయలేదెందుకు? వేలాదిగా అల్లరి మూకలు ఆస్పత్రిపై దాడికి దిగి నేరానికి సంబంధించిన కీలకమైన ఆధారాలన్నింటినీ చెరిపేస్తుంటే కోల్‌కతా పోలీసులు చేష్టలుడిగారేం? క్రైం సీన్‌కు వేదికైన ఆస్పత్రికి పక్కాగా కాపలా ఉండాల్సింది పోయి దాడి మొదలవగానే పారిపోవడమా! రాష్ట్ర ప్రభుత్వ తీరు విస్తుగొలుపుతోంది'' అంటూ సీజేఐ దుయ్యబట్టారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న వైద్య సిబ్బందిపై బలప్రయోగానికి దిగకుండా సున్నితంగా వ్యవహరించాలని ఆదేశించారు. హతురాలి పేరు, మృతదేహం ఫొటోలు, వీడియోలు బయటికి రావడంపై ఆందోళన వెలిబుచ్చారు. అన్నిరకాల మీడియా నుంచీ వాటిని తక్షణం తొలగించాల్సిందిగా ఆదేశించారు.


కేసు విచారణను చండీగఢ్‌లో మొబైల్‌లో వీక్షిస్తున్న ఓ వైద్యురాలు

**వైఫల్యం లేదు: సిబల్**

వైద్యురాలిపై జరిగిన దారుణాన్ని ఆత్మహత్యగా చిత్రించేందుకు వైద్య కాలేజీ, ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ ప్రయత్నించారంటూ ధర్మాసనం మండిపడింది. ''తల్లిదండ్రులను చాలాసేపటిదాకా మృతదేహాన్ని చూసేందుకు కూడా అనుమతించలేదు. ఈ ఉదంతంపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేయలేదు. ఇలాంటి వ్యక్తికి మరో వైద్య కాలేజీలో పోస్టింగ్ ఎలా ఇస్తారు?'' అని మమత సర్కారును ప్రశ్నించింది. ఇందులో ప్రభుత్వ వైఫల్యమేమీ లేదని సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ వాదించారు. కోల్‌కతా పోలీసులు సత్వరం స్పందించి అవసరమైన చర్యలు తీసుకున్నారని చెప్పారు. పోలీసులు నేర స్థలానికి చేరుకోకముందే హతురాలి ఫొటోలు, వీడియోలు బయటికొచ్చాయన్నారు. ఈ వాదనతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విభేదించారు. పోలీసులకు సమాచారం లేకుండా వేలాది మంది ఆస్పత్రిపైకి వచ్చిపడటం అసాధ్యమన్నారు.

### టాస్క్‌ఫోర్స్ బృందం ఇదే...

**వైద్యుల భద్రత తదితరాలపై సిఫార్సుల కోసం సుప్రీంకోర్టు నియమించిన నేషనల్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు...**

**చైర్‌పర్సన్:** వైస్ అడ్మిరల్ ఆర్తీ సరిన్ (మెడికల్ సర్వీసెస్ డీజీ)

**సభ్యులు:** డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి (ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ అండ్ ఎండీ), డాక్టర్ ఎం.శ్రీనివాస్ (ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్), డాక్టర్ ప్రతిమా మూర్తి (ఎన్ఐఎంహెచ్ఈ డైరెక్టర్), డాక్టర్ గోవర్ధన్ దత్ పురీ (జోధ్‌పూర్ ఎయిమ్స్ ఈడీ), డాక్టర్ సౌమిత్రా రావత్ (ఐఎస్‌జీ చైర్‌పర్సన్), అనితా సక్సేనా (బీడీ శర్మ మెడికల్ వర్సిటీ వీసీ), పల్లవీ సప్లే (జేజే గ్రూప్ ఆస్పత్రుల డీన్), డాక్టర్ పద్మా శ్రీవాత్సవ (ఢిల్లీ ఎయిమ్స్ మాజీ ప్రొఫెసర్) వీరితో పాటు టాస్క్‌ఫోర్స్‌లో ఎక్స్ అఫీషియో సభ్యులుగా కేంద్ర కేబినెట్ కార్యదర్శితో పాటు హోం, ఆరోగ్య శాఖల కార్యదర్శులు తదితరులు వ్యవహరిస్తారు

### ఏమిటీ అరుణా షాన్‌బాగ్ కేసు?



కోల్‌కతా వైద్యురాలి కేసు విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రస్తావించిన అరుణా షాన్‌బాగ్ ఉదంతం 1973 నాటిది. ఆమె మహారాష్ట్రలోని కింగ్ ఎడ్వర్డ్ ఆస్పత్రిలో నర్సుగా చేసేది. వైద్య ప్రయోగాలకు వాడే కుక్కల ఆహారాన్ని వార్డు బాయ్ కాజేస్తుండటంతో పై అధికారులకు చెబుతానని బెదిరించింది. ఆ కక్షతో ఆమెపై పాశవికంగా లైంగిక దాడికి పాల్పడటమే గాక కుక్కల గొలుసుతో కట్టేశాడు. మెదడుకు గాయమై అరుణ కోమాలోకి వెళ్లింది. అప్పటికామెకు పాతికేళ్లు. అరుణకు కారుణ్య మరణం ప్రసాదించాలన్న విజ్ఞప్తులను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దాంతో 40 ఏళ్లపాటు మంచానికే పరిమితమై 2015లో కన్నుమూసింది. నిందితునిపై లైంగిక అభియోగాలు మోపకపోవడంతో కేవలం ఏడేళ్ల శిక్ష అనుభవించి 1980లో బయటికొచ్చాడు.

### బాత్రూములకూ దిక్కులేదు!

అందరికీ ఆరోగ్యం అందించే వైద్య సిబ్బందికే పని ప్రదేశాల్లో ఏ మాత్రం భద్రత లేని దుస్థితి దేశవ్యాప్తంగా నెలకొని ఉందని సుప్రీం ధర్మాసనం ఆవేదన వెలిబుచ్చింది. ''ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందికి రక్షణ కల్పించడంలో పూర్తిస్థాయి వైఫల్యముంది. వారికి డ్యూటీ రూములేవు. మహిళా, పురుష వైద్యులకు, నర్సులకు విడిగా బాత్రూములేవు. ప్రభుత్వాసుపత్రుల్లో ఎవరు పడితే వారు ఏ విభాగంలోకైనా నిర్నిరోధంగా ప్రవేశిస్తున్నారు. దాంతో విధి నిర్వహణలోని వైద్యులు, వైద్య సిబ్బంది పలు రూపాల్లో హింసకు లక్ష్యంగా మారుతున్నారు. రోగులకు జరగరానిది జరిగితే వైద్యపరమైన నిర్లక్ష్యమే కారణమంటూ సంబంధీకులు వైద్య సిబ్బందిపై హింసకు దిగుతున్నారు. పురుషాధిక్య భావజాలం కారణంగా మహిళా వైద్యులు, సిబ్బంది లైంగిక, లైంగికేతర హింసకు ఎక్కువగా బలవుతున్నారు. సహోద్యోగులు, సీనియర్లు, బాసుల నుంచి కూడా లైంగిక హింసను ఎదుర్కొంటున్నారు. అరుణా షాన్‌బాగ్ వంటి ఉదంతాలే ఇందుకు నిదర్శనం. వైద్య డిగ్రీలను, కెరీర్‌లో ఎదుగుదలను ప్రభావితం చేయగల అధికారం ఈ బాసుల చేతుల్లోనే ఉంటోంది. ఇలాంటి హింసను నిరోధించే సమర్థమైన భద్రతా ఏర్పాట్లు ఆస్పత్రులు, వైద్య సంస్థల్లో లేకపోవడం ఆందోళనకరం. డాక్టర్లకు భద్రత కల్పించడం జాతి ప్రయోజనాలకు సంబంధించిన అంశం. పలు రంగాల్లో మహిళల ప్రవేశం నానాటికీ పెరుగుతున్నందున పని ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతపై తక్షణం దృష్టి పెట్టాల్సిన అవసరముంది'' అని ధర్మాసనం పేర్కొంది.

# బద్లాపూర్ భగభగ!

## స్కూల్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులు

- స్కూల్‌ను ధ్వంసం చేసిన స్థానికులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన రైల్ రోకో
- ప్రిన్సిపాల్ సహా ముగ్గురి సస్పెన్షన్.. ముగ్గురు పోలీసులపైనా వేటు
- ఫాస్ట్ ట్రాక్ కోర్టులో కేసు విచారణ: డిప్యూటీ సీఎం ఫడ్నవీస్

**థానె/ముంబై:** మహారాష్ట్రలోని థానె జిల్లా బద్లాపూర్‌లో అభంశుభం తెలియని ఇద్దరు చిన్నారులను లైంగికంగా వేధించిన ఘటన తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైంది. స్థానిక కిండర్‌గార్టెన్ స్కూల్‌లో రెండేళ్ల, నాలుగేళ్ల చిన్నారులపై అటెండర్ లైంగిక వేధింపులకు పాల్పడటం కలకలం రేపింది. ఘటనపై పోలీసులు సకాలంలో స్పందించలేదంటూ మంగళవారం ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు వందలాదిగా స్థానిక రైల్వే స్టేషన్ వద్ద పట్టాలపై బైఠాయించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో, ఆ మార్గంలో 8 గంటలపాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. బద్లాపూర్ పోలీస్ స్టేషన్ అధికారులు బాధితుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు తీసుకునేందుకు 11 గంటలపాటు జాప్యం చేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వేధింపుల ఘటన చోటుచేసుకున్న స్కూల్ ప్రిన్సిపాల్‌తోపాటు ఇద్దరు సిబ్బందిని అధికారులు సస్పెండ్ చేశారు. బాధిత చిన్నారుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, ఈ నెల 17న అటెండర్‌ను అరెస్ట్ చేశారు. ఘటనకు బాధ్యులుగా చేస్తూ సోమవారం రాత్రి పాఠశాల యాజమాన్యం స్కూల్ ప్రిన్సిపల్, క్లాస్ టీచర్, మహిళా అటెండర్‌ను సస్పెండ్ చేసింది. వేధింపుల ఘటనపై పాఠశాల యాజమాన్యం క్షమాపణ చెప్పింది. బాధితుల తల్లిదండ్రుల ఫిర్యాదుపై స్పందించలేదంటూ స్థానిక పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జిని ప్రభుత్వం బదిలీ చేసింది. సీనియర్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు అసిస్టెంట్ ఎస్సై, హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ ప్రకటించారు. దర్యాప్తునకు ఐజీ స్థాయి అధికారి సారథ్యంలో సిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కేసుపై సత్వర విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు.


బద్లాపూర్‌లో రైలు పట్టాలపై బైఠాయించిన నిరసనకారులు

**ఆ ఆరోపణలు అవాస్తవం**

కేసు నమోదు చేసేందుకు పోలీసులు 12 గంటల పాటు ఆలస్యం చేశారంటూ వచ్చిన ఆరోపణలను డీసీపీ సుధాకర్ పఠారే చెప్పారు. కేసు నమోదు ప్రక్రియ రాత్రి 11.30 గంటలకు మొదలుకాగా, నిందితుడిని మూడున్నర గంటల్లోపే 3.30 గంటలకు అరెస్ట్ చేశామన్నారు. అభంశుభం తెలియని బాధిత చిన్నారుల నుంచి సమాచారం రాబట్టడం క్లిష్టమైన, సున్నితమైన వ్యవహారమని, ఈ ప్రక్రియ వల్లే కేసు నమోదు ఆలస్యమైందని వివరించారు. ఒక మహిళా అధికారి సహా మొత్తం ముగ్గురు అధికారులు దర్యాప్తు ప్రక్రియలో పాలుపంచుకుంటున్నారన్నారు.

**మంత్రి చెప్పినా ససేమిరా..**

వేధింపుల ఘటనకు నిరసనగా కొన్ని సంస్థలు మంగళవారం బద్లాపూర్ బంద్‌నకు పిలుపునిచ్చాయి. ఉదయం భారీ సంఖ్యలో కిండర్‌గార్టెన్ విద్యార్థుల తల్లిదండ్రులు, ముఖ్యంగా మహిళలు తరలివచ్చి పాఠశాల గేట్లు విరగ్గొట్టారు. ఫర్నిచర్, తలుపులు, కిటికీలు ధ్వంసం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ స్థానిక రైల్వే స్టేషన్‌పైకి రాళ్లు రువ్వారు. బ్యానర్లు, ప్లకార్డులు చేతబూని పట్టాలపై బైఠాయించారు. రాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ అక్కడికి చేరుకుని నచ్చజెప్పినా వారు ససేమిరా అన్నారు. బాధిత బాలికలకు న్యాయం చేయాలని, దోషులకు ఉరివేయాలని పట్టుబట్టారు. చివరికి సాయంత్రం పోలీసులు రంగప్రవేశం చేసి లాఠీచార్జితో ఆందోళనకారులను చెదరగొట్టారు. రాత్రి 6 గంటల సమయానికి రైళ్ల రాకపోకలకు లైన్ క్లియర్ చేశారు. ఉదయం 8.30 గంటల నుంచి పట్టాలపైనే తిష్ట వేయడంతో సబర్బన్ సహా పలు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. బద్లాపూర్‌లో రైల్ రోకో కారణంగా అంబర్‌నాథ్–కర్జత్ మార్గంలో 30 వరకు సబర్బన్ రైళ్లను రైల్వే శాఖ పాక్షికంగా రద్దు చేసింది. మరో 12దూరప్రాంత రైళ్లను దారి మళ్లించింది. మార్గమధ్యంలో చిక్కుకుపోయిన ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు 55 బస్సులను ఏర్పాటు చేసింది.


అన్వర్ ఇబ్రహీంకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్న ప్రధాని మోదీ

# భారత్, మలేషియా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

- ఇరు దేశాల ప్రధానులు మోదీ, అన్వర్ ఇబ్రహీం నిర్ణయం
- మలేషియా వర్సిటీల్లో ఆయుర్వేద, తిరువళ్లువర్ విభాగాలు
- ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు

**న్యూఢిల్లీ:** భారత్, మలేషియా మధ్య సంబంధాలను మరింత మెరుగుపర్చుకొనే దిశగా మరో ముందడుగు పడింది. ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం మంగళవారం ఢిల్లీలో విస్తృత స్థాయి చర్చలు నిర్వహించారు. వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ తదితర కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు చేశారు. డిజిటల్ టెక్నాలజీతో సహకారంతోపాటు స్టార్టప్ వ్యవస్థ అనుసంధానానికి డిజిటల్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. మలేషియాలోని 'యూనివర్సిటీ ఆఫ్ టుంకూ అబ్దుల్ రెహ్మాన్'లో ఆయుర్వేద విభాగాన్ని, యూనివర్సిటీ ఆఫ్ మలయాలో తిరువళ్లువర్ విభాగాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇబ్రహీం మూడు రోజుల భారత పర్యటన నిమిత్తం సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. ప్రధానిగా ఆయన తొలి భారత పర్యటన ఇదే కావడం విశేషం.

**త్వరలో యూపీఐ, పేనెట్ అనుసంధానం:** భేటీ అనంతరం మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్, మలేషియా మధ్య సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని నిర్ణయించామని తెలిపారు. సెమీకండక్టర్, ఫిన్‌టెక్, రక్షణ పరిశ్రమ, ఏఐ తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకుంటే ఇరు దేశాలకు మేలని మోదీ అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని అరికట్టడానికి ఉమ్మడిగా పోరాటం చేయాలని ఏకాభిప్రాయానికి వచ్చామన్నారు.

# ట్రంప్ ఓ లూజర్

## వీడ్కోలు ప్రసంగంలో బైడెన్

**అతడి బారినుంచి దేశాన్ని కాపాడుకుందాం**

**డెమొక్రాట్లకు, అమెరికన్లకు అధ్యక్షుని పిలుపు**

**అట్టహాసంగా మొదలైన డెమొక్రాట్ల కన్వెన్షన్**

**బైడెన్‌కు 4 నిమిషాలు స్టాండింగ్ ఒవేషన్**

**తొలి రోజు ఆద్యంతం భావోద్వేగాలు**



డెమొక్రటిక్ పార్టీ జాతీయ కన్వెన్షన్‌లో అధ్యక్ష అభ్యర్థి కమలతో కలిసి బైడెన్ అభివాదం

**షికాగో:** డొనాల్డ్ ట్రంప్‌పై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ''ఓవైపు అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేస్తూ మరోవైపు అమెరికాను విఫల దేశంగా అభివర్ణిస్తున్నారు. అదీ ట్రంప్ స్థాయి! అన్ని విషయాల్లోనూ ట్రంప్ ఇప్పటికే ఓడిపోయారు. అయనో లూజర్'' అంటూ తూర్పారబట్టారు. ఈ ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిచి అమెరికాను మరోసారి గెలిపిస్తారని విశ్వాసం వెలిబుచ్చారు. పార్టీ అధ్యక్ష అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. సోమవారం షికాగోలో డెమొక్రటిక్ పార్టీ జాతీయ కన్వెన్షన్ (డీఎన్సీ)ను ఉద్దేశించి బైడెన్ వీడ్కోలు ప్రసంగం చేశారు. రాజకీయ నాయకునిగా ఆయన తన 52 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌ను ముగిస్తున్న సందర్భంగా తొలి రోజు భేటీ ఆద్యంతం అత్యంత ఉద్వేగపూరితంగా సాగింది. హారిస్ కోసం అధ్యక్ష బరి నుంచి తప్పుకుని డెమొక్రాట్ల విజయావకాశాలను అమాంతంగా పెంచేసిన 81 ఏళ్ల బైడెన్‌ను నేతలు, ప్రతినిధులు ముక్త కంఠంతో ప్రశంసించారు. సమావేశానికి ఆయనకు అపూర్వరీతిలో స్వాగతం పలికారు. ఆయన తన స్థానం నుంచి లేచింది మొదలు వేదికనెక్కేదాకా ఆద్యంతం కరతాళ ధ్వనులతో హోరెత్తించారు. బైడెన్ మాట్లాడటం ప్రారంభించగానే సభలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. 'వుయ్ లవ్ జో!', 'థాంక్యూ జో' అంటూ ప్రతినిధులంతా ప్లకార్డులు ప్రదర్శించారు. నాలుగు నిమిషాలకు పైగా స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. దాంతో భావోద్వేగానికి లోనైన బైడెన్ కాసేపు ప్రసంగాన్ని ఆపేశారు. కృతజ్ఞతాపూర్వకంగా పదేపదే 'థాంక్యూ...' అంటూ నిలబడిపోయారు. 'కమలకు కూడా కృతజ్ఞతలు. ఆమె అమెరికాకు 47వ ప్రెసిడెంట్ కావడం తథ్యం' అన్నారు. 59 ఏళ్ల హారిస్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని గురువారం లాంఛనంగా అంగీకరించనున్నారు. నవంబర్ 5న జరిగే ఎన్నికలో 78 ఏళ్ల ట్రంప్‌తో ఆమె తలపడతారు.

**సర్వస్వం దేశానికే ధార పోశా:** తాను, హారిస్ ఈ నాలుగేళ్లలో అపూర్వ విజయాలు సాధించామని బైడెన్ చెప్పుకొచ్చారు. అధ్యక్షునిగా కొన్ని తప్పులు చేసినా దేశం కోసం సర్వస్వం ధారపోశానంటూ ఆత్మవిమర్శ చేసుకున్నారు. ''2020లో కుమారుని మృతితో నా ఆత్మలో ఓ భాగాన్ని శాశ్వతంగా కోల్పోయా. అయినా ట్రంప్ వంటి విచ్ఛిన్న శక్తిని నిలువరించేందుకు అంతటి బాధనూ పక్కన పెట్టి మరీ అధ్యక్ష బరిలో దిగా. అలా 2020లో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకున్నాం. 2024లో మరోసారి కాపాడుకోవాలి'' అంటూ డెమొక్రాట్లకు, అమెరికన్లకు పిలుపునిచ్చారు. అనంతరం మాట్లాడిన డెమొక్రాట్ నేతలంతా అధ్యక్షునిగా బైడెన్ అందించిన సేవలు చిరస్మరణీయమంటూ ప్రస్తుతించారు.

### వేదిక బయట 'గాజా' నిరసనలు

గాజా యుద్ధంలో ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతును వ్యతిరేకిస్తూ వేలాదిగా పోటెత్తిన నిరసనకారులతో షికాగో వీధులు నిండిపోయాయి. కన్వెన్షన్ సమీపంలో వారు ఆందోళనకు దిగారు. సమూహాలుగా విడిపోయి భద్రతా వలయాలను బద్దలు కొట్టేందుకు విఫలయత్నం చేశారు. వారి ఆందోళనల్లో న్యాయముందని బైడెన్ తన ప్రసంగంలో అన్నారు. ఇరువైపులా అమాయకులను చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### హారిస్... చరిత్రాత్మక ప్రెసిడెంట్ అవుతారు: బైడెన్



డెమొక్రాట్ నేతలు, ప్రతినిధుల అభిమానపు జల్లుల్లో తడిసి ముద్దైన బైడెన్.. 'అమెరికా, ఐ లవ్ యూ' అంటూ 50 నిమిషాల పాటు సుదీర్ఘంగా మాట్లాడారు. పార్టీ బాధ్యతలను లాంఛనంగా హారిస్‌కు అప్పగించారు. అమెరికాలో ప్రజాస్వామ్యాన్ని కాపాడగలిగిన మేటి నేత హారిసేనన్నారు. ఆమె చరిత్రాత్మక ప్రెసిడెంట్‌గా నిలుస్తారంటూ జోస్యం చెప్పారు. ''హారిస్‌ను ఉపాధ్యక్షురాలిగా ఎంచుకోవడం, ఇప్పుడు నాకు బదులుగా అధ్యక్ష అభ్యర్థిగా నిలపడం నా అత్యుత్తమ నిర్ణయాలు'' అని చెప్పుకొచ్చారు. హారిస్‌కు, ఆమె రన్నింగ్ మేట్ వాల్జ్‌కు ఓ ఉత్తమ కార్యకర్తగా అన్నివిధాలా సహకరిస్తానన్నారు. 'స్వేచ్ఛ కోసం ఓటేసేందుకు, హారిస్‌ను ప్రెసిడెంట్‌గా ఎన్నుకునేందుకు మీరంతా సిద్ధమేనా?' అంటూ బైడెన్ ప్రశ్నించడంతో వేలాది మంది ప్రతినిధులు సిద్ధమేనంటూ పిడికిళ్లు బిగించి నినదించారు.

### బైడెన్ కంటతడి




బైడెన్ వేదికపైకి రాగానే ఆయన గురించి కూతురు యాష్లీ పరిచయ వాక్యాలు చెప్పారు. తన తండ్రి మహిళల పక్షపాతి అని చెప్పుకొచ్చారు. వారిని ఆయన ఎంతగా గౌరవిస్తారో స్వయంగా చూశానన్నారు. దాంతో బైడెన్ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. పక్కకు తిరిగి కళ్లు తుడుచుకుని కూతుర్ని ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్నారు. అధ్యక్ష రేసు నుంచి వైదొలగడం బైడెన్ రాజకీయ జీవితంలోనే అత్యంత ముఖ్యమైన, క్లిష్టమైన నిర్ణయమని ఆయన భార్య జిల్ బైడెన్ ఈ సందర్భంగా అన్నారు.

**నాడు మరీ కుర్రాణ్ని.. నేడు మరీ ముసలాణ్ని**

ఈ సందర్భంగా తన వయసు గురించి బైడెన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''తొలిసారి సెనేటర్‌గా ఎన్నికైనప్పుడు మరీ కుర్రాడిని. 30 ఏళ్లు కూడా నిండలేదు. ఇప్పుడేమో అమెరికా అధ్యక్షునిగా కొనసాగేందుకు మరీ ముసలివాడినైపోయాను'' అంటూ చమత్కరించారు.

### గాజుతెరను బద్దలు కొడుతుంది

**హారిస్‌పై హిల్లరీ ప్రశంసలు**



హారిస్‌పై మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ ప్రశంసల వర్షం కురిపించారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కావాల్సిన విజన్, అనుభవం, వ్యక్తిత్వం ఆమెలో పుష్కలంగా ఉన్నాయన్నారు. 76 ఏళ్ల హిల్లరీ వేదికపైకి రాగానే సభికులంతా పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. ''హారిస్ అమెరికాకు తొలి అధ్యక్షురాలవడం, తద్వారా దేశ చరిత్రలోనే అత్యంత కఠినమైన, అతి పెద్దదైన గాజుతెరను బద్దలు కొట్టడం ఖాయం. మనమంతా కలిసికట్టుగా కొట్టిన దెబ్బలకు ఆ తెర ఇప్పటికే బీటలువారింది. దాన్ని పూర్తిగా బద్దలు కొట్టే సత్తా హారిస్‌కుంది'' అని ఆమె జోస్యం చెప్పారు.

### రుణపడి ఉంటాం: హారిస్



బైడెన్ ప్రసంగానికి ముందు హారిస్ మాట్లాడారు. ఆమె ప్రసంగం షెడ్యూల్‌లో లేకపోయినా బైడెన్‌ను కృతజ్ఞతలు తెలిపేందుకు వేదికపైకొచ్చారు. ఆయన నాయకత్వాన్ని, సేవలను కొనియాడారు. 'జో, మీకెప్పటికీ రుణపడి ఉంటాం. మీ వారసత్వాన్ని కొనసాగిస్తాం'' అన్నారు. హారిస్ మాట్లాడుతున్నంతసేపూ సభికులు హర్షధ్వానాలతో హోరెత్తించారు.

### నిన్ను చూసి గర్విస్తున్నా: ఒబామా

మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా బైడెన్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. 'జో, మీ హుందాతనాన్ని, లక్ష్యసాధన పట్ల మీరు చూపే అచంచలమైన విశ్వాసాన్ని ఆరాధిస్తా. నాలుగేళ్లుగా మీరు అమెరికాకు ఇచ్చిన అత్యంత అమూల్యమైన విలువలు ఇవే. మిమ్మల్ని ప్రెసిడెంట్ అని పిలవడం నాకెప్పుడూ గర్వకారణమే. మీరు నా స్నేహితునివని చెప్పుకునే అవకాశమిచ్చినందుకు కృతజ్ఞుడిని'' అన్నారు.

# 'లాటరల్ ఎంట్రీ'పై పీచేముడ్

**ఉద్యోగ ప్రకటన రద్దు చేసిన యూపీఎస్సీ • కేంద్రం వినతి మేరకు ఈ నిర్ణయమని వెల్లడి**

**న్యూఢిల్లీ:** వివాదాస్పద లాటరల్ ఎంట్రీ విధానంపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. వివిధ విభాగాల్లో 'లాటరల్ ఎంట్రీ'ద్వారా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ నెల 17న విడుదల చేసిన ప్రకటనను రద్దు చేస్తున్నట్లు మంగళవారం యూపీఎస్సీ తెలిపింది. కేంద్రం నుంచి అందిన వినతి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రిజర్వేషన్లను రద్దు చేసి, ఆర్ఎస్ఎస్ వ్యక్తులను వివిధ శాఖల్లో నియమించుకునేందుకే ప్రభుత్వం ఈ విధానం తీసుకువచ్చిందంటూ ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలకు దిగడంతో కేంద్రం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అంతకుముందు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ యూపీఎస్సీ చైర్మన్ ప్రీతీ సూదన్‌కు ఒక లేఖ రాశారు. ప్రభుత్వ విభాగాల్లో అణగారిన వర్గాల వారికి సరైన ప్రాతినిధ్యం దక్కాలంటే ఆగస్ట్ 17నాటి ఉద్యోగ ప్రకటన రద్దు చేయాలని అందులో కోరారు. గతంలో, 2005లో వీరప్ప మొయిలీ సారథ్యంలో ఏర్పాటైన పరిపాలనా సంస్కరణల కమిషన్‌తోపాటు, 2013లో ఆరో వేతన సంఘం కూడా లాటరల్ విధానం అమలు చేయాలని సిఫారసు చేసిందని మంత్రి తన లేఖలో గుర్తు చేశారు. అంతకుముందు, ఆ తర్వాత కూడా లాటరల్ ఎంట్రీ విధానంలో ఉన్నతోద్యోగాల భర్తీ జరిగిందని చెప్పారు.మంత్రి వినతి మేరకు, 45 మంది సంయుక్త కార్యదర్శులు, డైరెక్టర్లు, డిప్యూటీ కార్యదర్శుల పోస్టుల్లోకి లాటరల్ ఎంట్రీ విధానం ద్వారా ప్రైవేట్ వ్యక్తులను కూడా ఎంపిక చేస్తామంటూ ఎంప్లాయ్‌మెంట్ న్యూస్, వార్తా పత్రికలతోపాటు తమ వెబ్‌సైట్‌లో ఇచ్చిన ప్రకటనను రద్దు చేస్తున్నట్లు యూపీఎస్సీ అనంతరం తన వెబ్‌సైట్‌లో తెలిపింది.

**పీఎంవో కార్యాలయం నిర్ణయం**

ఇలా ఉండగా, లాటరల్ ఎంట్రీ ఉద్యోగ ప్రకటనను రద్దు చేయాలనే నిర్ణయాన్ని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) తీసుకుందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం ఇప్పుడు లాటరల్ ఎంట్రీ రిక్రూట్‌మెంట్ విధానాన్ని, అందులోని రిజర్వేషన్ నిబంధనలపై సమీక్ష చేపడుతుందని వెల్లడించాయి. ప్రస్తుతం, ఈ స్పెషలైజ్డ్ లేదా సింగిల్ కేడర్ పోస్టులకు రిజర్వేషన్ కోసం ఎలాంటి విధానం, నిబంధనలు లేవని తెలిపాయి. ఈ విధానంలో నియామకాలకు రిజర్వేషన్ల వర్తింపులో అన్ని అభిప్రాయాలు, అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని భావిస్తున్నారు.

### నియంతృత్వ పోకడలకు ఓటమి: ఖర్గే

లాటరల్ ఎంట్రీ విధానంలో ఉద్యోగాల భర్తీ ప్రకటనను వెనక్కి తీసుకుంటూ యూపీఎస్సీ తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమి పార్టీల నేతలు స్పందించారు. 'రాజ్యాంగం శక్తి మాత్రమే నియంతృత్వ పాలకుల దురహంకారాన్ని అణచివేయగలదని రుజువైంది. రాజ్యాంగం వర్ధిల్లాలి. దళితులు, వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలను రిజర్వేషన్లను లాగేసుకునేందుకు బీజేపీ చేసిన కుట్రను కాంగ్రెస్ పార్టీ భగ్నం చేసింది'అని ఖర్గే పేర్కొన్నారు. కాంగ్రెస్ మాత్రమే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ల విధానాన్ని పరిరక్షిస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీ కుట్రలను అడ్డుకుని తీరుతుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# సాక్షి హైదరాబాద్

బుధవారం । 21 । ఆగస్టు । 2024



బంజారాహిల్స్‌లో భారీగా ట్రాఫిక్..

## వర్షాల వేళ అప్రమత్తంగా ఉండండి

**ప్రజలు, క్షేత్రస్థాయి అధికారులకు మేయర్, కమిషనర్ సూచన**

**సాక్షి, సిటీబ్యూరో:** వర్షాల కారణంగా ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి ప్రజలకు సూచించారు. సంబంధిత అధికారులు అప్రమత్త ఉంటూ ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలన్నారు. మంగళవారం ఉదయం కమిషనర్ ఆమ్రపాలి అడిషనల్, జోనల్ కమిషనర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. భారీ వర్షాలతో నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రధాన రహదారుల్లోని ప్రాజెక్ట్ పనుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై మరమ్మతులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతా చర్యల్లో భాగంగా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులతో పాటు రాత్రుళ్లు లైటింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బహుళ అంతస్తుల నిర్మాణాలు, నాలాలు, నీటి వనరుల వద్ద కూడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు కమిషనర్ మెహిదీపట్నం, హఫీజ్ నగర్, అత్తాపూర్, గుడి మల్కాపూర్, విజయ నగర్ కాలనీ, మాసబ్ ట్యాంక్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలించారు. అలాగే.. హుస్సేన్ సాగర్ తూముల ద్వారా నీటి విడుదలను డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పరిశీలించారు.


మాసాబ్‌ట్యాంక్ వద్ద..


బేగంపేటలో..

## పిడుగుపాటుతో కారు షెడ్డు ధ్వంసం

**భయకంపితులైన అపార్ట్‌మెంటు వాసులు**



**పంజగుట్ట:** పిడుగుపాటుతో పంజగుట్ట కాలనీ ప్రజలు భయకంపితులయ్యారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 5:45 గంటలకు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడింది. ఏదో పెను ప్రమాదం జరిగిందనుకుని సుఖ్ నివాస్ అపార్ట్‌మెంట్ వాసులు నిద్ర నుంచి మేల్కొని బయటకు వచ్చి చూశారు. అప్పటికే అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తులోని రేయిలింగ్, దాని ముందున్న బ్లూషీట్స్ విరిగి కింద ఉన్న షెడ్డుపై పడటంతో అందులోని కారు ధ్వంసమైంది. అపార్ట్‌మెంట్ భవనం ప్రహరీ కొంతమేరకు, షెడ్డు గేటు పడిపోయాయి. ముందున్న చెట్టు కొమ్మలు విరిగి కిందపడ్డాయి. రోడ్డుపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. ఇలాంటి ఘటన ఇప్పటివరకు చూడలేదని, ఒక్కసారిగా అంత పెద్ద శబ్దం రావడంతో ప్రాణం పోయేంత పని అయ్యిందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. తెగిపోయిన వైర్లను విద్యుత్ సిబ్బంది పునరుద్ధరించారు.

## కూలిన ఎల్బీ స్టేడియం ప్రహరీ


గోడ కూలి ధ్వంసమైన వాహనాలు

**గన్‌ఫౌండ్రీ:** రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం ఎల్బీ స్టేడియం ప్రహరీ నేలకూలింది. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ పాత కార్యాలయానికి ఆనుకొని ఉన్న స్కేటింగ్ కోర్ట్ ప్రహరీ గోడ ఒక్కసారిగా కూలిపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గోడకు ఆనుకుని ఉన్న ఓ భారీ వృక్షం సైతం గోడతో సహా ఒరిగి అక్కడే పార్క్ చేసి ఉన్న పోలీస్ వాహనాలపై పడింది. ఈ ఘటనలో ఓ వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసం కాగా మరో మూడు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. శిథిలాలను జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం తొలగించింది.

## వరద నీటిలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి


విజయ్ కుమార్ మృతదేహం

**ముషీరాబాద్:** ముషీరాబాద్ డివిజన్‌లో ఓ వ్యక్తి వరద నీటిలా కొట్టుకుపోయి మృతి చెందాడు. పార్శీగుట్ట ప్రేయర్‌పవర్ చర్చి వీధికి చెందిన విజయ్‌కుమార్ (43) ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. అతని ఇళ్లు నిర్మాణంలో ఉంది. దీంతో స్థానికంగా తన ఇంటి ముందు ఉన్న మెట్లపై ప్రతిరోజు రాత్రి నిద్రిస్తుంటాడు. అతని ఆరోగ్యం సరిగా లేక నడవడానికి సైతం ఇబ్బంది పడేవాడు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వరద నీటి ప్రవాహం పెద్ద ఎత్తున ప్రవహించడంతో ప్రమాదవశాత్తు విజయ్‌కుమార్ వరద నీటిలో పడి మరో వీధి వరకు కొట్టుకుపోయి మృతి చెందాడు. స్థానికంగా పార్కు చేసి ఉన్న కారు టైర్‌కు అతని మృతదేహం తగిలి ఆగిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. నాలాలో డీసిల్టింగ్‌ను తీయకపోవడం వల్లే వరద నీటి ఉధృతిలో వ్యక్తి కొట్టుకుపోయి మృతి చెందినట్లు జీహెచ్ఎంసీ అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. పార్శీగుట్ట చౌరస్తా నుంచి రాంనగర్ వైపు వెళ్తున్న ఉబెర్ కారు వరద నీటిలో కొట్టుకుపోయింది. డ్రైవర్, ప్రయాణికులను స్థానికులు గమనించి కారులోంచి వారిని దించివేశారు. వరద నీటిలో కారు కొట్టుకుపోకుండా తాళ్లతో కట్టేశారు. మరోకారు సైతం వరద నీటిలో కొట్టుకుపోయింది.

# చినుకొచ్చే.. ముంచెత్తే!

**ఉదయం 12.5.., సాయంత్రం 6 సెం.మీ వర్షపాతం**

- ఈ సీజన్‌లో ఇదే అత్యధికం
- చెరువులను తలపించిన రోడ్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి చేరిన వరద నీరు
- వరద నీటిలో కొట్టుకుపోయిన కార్లు, బైకులు
- నేలకొరిగిన వృక్షాలు.. తెగిపడిన విద్యుత్ తీగలు
- 5 రోజుల పాటు సిటీలో ఎల్లో అలర్ట్

**కుండపోత.. నగరం గుండెకోత • రికార్డు స్థాయిలో దంచికొట్టిన వాన**

సాక్షి, సిటీబ్యూరో:

ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టు.. వామ్మో ఇదేం వాన.. కుంభవృష్టితో వరుణుడు వణికించాడు. నగర పౌరులను భయభ్రాంతులకు గురిచేశాడు. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు ఏకధాటిగా తన ప్రతాపం చూపించి సిటీని అతలాకుతలం చేశాడు. కుండపోత వానతో నాలాలు పొంగిపొర్లాయి. రహదారులు ఏరులై పారాయి. మళ్లీ సాయంత్రం వరుణుడు విరుచుకుపడటంతో నగర జన జీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు, కాలనీలు, రహదారులు నీటమునిగాయి. ఇళ్లలో వరద నీరు చేరి సామగ్రి తడిసి ముద్దయింది. వరద నీటిలో కొట్టుకుపోయి ఓ వ్యక్తి మృతి చెందాడు. మరోవైపు కారులు, బైకులు కొట్టుకుపోయాయి. అపార్ట్‌మెంట్‌పై పిడుగుపడింది. పలు ప్రాంతాల్లో ప్రహరీలు కూలిపోయి వాహనాలు ధ్వంసమయ్యాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. భారీ వర్షానికి విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఉదయం ఎనిమిదిన్నర గంటల వరకు సెలవు సమాచారం లేకపోవడంతో స్కూళ్లు, కాలేజీలకు వెళ్లేందుకు రోడ్లపైకి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటల దాకా సూరీడు వచ్చినా.. ఆకాశం మళ్లీ కారు మబ్బులతో కమ్ముకొంది. నగరంలో రికార్డు స్థాయిలో వేకువజామున సుమారు 12.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఇదే ఈ సీజన్‌లో అత్యధిక వర్షపాతం. సాయంత్రం 5 గంటల తర్వాత రాత్రి వరకు 6 సెంటిమీటర్ల మేర వర్షం కురిసి మళ్లీ జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు నరకయాతన అనుభవించారు.

**పిడుగుపాటుతో పాక్షికంగా ధ్వంసం**

నిజాంపేట్ కార్పొరేషన్ 26వ డివిజన్ మధురా నగర్‌లో మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటలకు శ్రీ ఉన్నతి హైట్స్, సాయి బాలాజీ రెసిడెన్సిలపై పిడుగు పడింది. దీంతో అపార్ట్‌మెంట్‌కు కొద్దిమేర బీటలువారింది. భారీ వర్షంతో నాలాలు పోటెత్తాయి. మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. ఎగువ ప్రాంతాల నుంచి మూసీకి వరద పోటెత్తడంతో మూసారాంబాగ్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. అధికారులు మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.



**నిండుకుండలా హుస్సేన్‌సాగర్**

భారీ వర్షాలకు హుస్సేన్ సాగర్ నిండుకుండను తలపిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద భారీగా పోటెత్తుతుండటంతో గరిష్ఠ నీటి మట్టానికి చేరుకుంది. సుమారు 20 గేట్లు ఎత్తి దిగువన మూసీలోకి నీటిని విడుదల చేశారు. హుస్సేన్ సాగర్ ఇన్ ఫ్లో 1850 క్యూసెక్కులు కాగా... ఔట్ ఫ్లో 1600 క్యూసెక్కులుగా ఉంది. జంట జలాశయాల్లో సైతం భారీగా వరద నీరు వచ్చి చేరింది.

**5 రోజులు ఎల్లో అలర్ట్**

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వరుసగా 5 రోజుల పాటు హైదరాబాద్ వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

**అప్రమత్తమైన జలమండలి**

అతి భారీ వర్షాలతో జలమండలి అప్రమత్తమైంది. ఎండీ అశోక్ రెడ్డి, జీఎం, డీజీఎం, మేనేజర్‌లతో జూమ్ మీటింగ్ నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించాలని, వాటర్ లాగింగ్ పాయింట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సహాయక చర్యల కోసం ఈఆర్టీ, ఎస్పీటీ టీమ్‌లను రంగంలోకి దింపారు. పని ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని, సీవరేజి ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్‌హోళ్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

**మంగళవారం తెల్లవారుజామున నమోదైన వర్షపాతం (సెం.మీ.లలో)**

| యూసుఫ్‌గూడ | ఉప్పల్ | రాజేంద్రనగర్ | సరూర్‌నగర్ | వెస్ట్ మారేడుపల్లి | ఎల్బీనగర్ | జూపార్క్ | లంగర్‌హౌస్ | నాగోల్ |
|---|---|---|---|---|---|---|---|---|
| 12.5 | 12.1 | 11.9 | 11.5 | 11.1 | 10.9 | 10.8 | 10.6 | 10.4 |

| కంటోన్మెంట్ | నాంపల్లి | మల్లాపూర్ | ముషీరాబాద్ | డబీర్‌పురా | కిషన్‌బాగ్ | బేగంబజార్ | బాలానగర్ |
|---|---|---|---|---|---|---|---|
| 10.3 | 10.2 | 10.0 | 9.8 | 9.7 | 9.6 | 9.5 | 9.5 |


శేరిలింగంపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద..


బల్కంపేట రైల్వే బ్రిడ్జి వద్ద వరదలో చిక్కుకున్న కారు..


ఉప్పల్ భగాయత్‌లో రోడ్డుపై వరద


టోలిచౌకీలో మ్యాన్‌హోల్ మూతను పరిశీలిస్తున్న కానిస్టేబుల్


కుత్బుల్లాపూర్ వెంకటేశ్వరనగర్‌లోని ఓ రోడ్డులో వర్షపు నీరు


నీట మునిగిన ఖైరతాబాద్ ఎక్స్ రోడ్డు


ఎంఎన్ రెడ్డి నగర్‌లో ఉప్పొంగుతున్న నాలా

# సిటీ జామ్!

**నగరవాసులపై భారీ వర్షం ప్రభావం**



- ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు
- అనేక జంక్షన్లలో ఆగిపోయిన సిగ్నల్స్
- గంటల పాటు నరకం చూపిన రోడ్లు

**సాక్షి, సిటీబ్యూరో:** రాజధాని మొత్తం మంగళవారం సాయంత్రం స్తంభించిపోయింది. పీక్ అవర్‌లో మరోసారి ముంచెత్తిన వానతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షం ప్రభావంతో పాటు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులతో అనేక జంక్షన్లలో సిగ్నల్స్ కూడా పని చేయలేదు. దీంతో రాత్రి 10 గంటల వరకు వాహనచోదకులు నరకం చవిచూడాల్సి వచ్చింది. ట్రాఫిక్ పోలీసులు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు తీవ్రంగా శ్రమించినా ఆశించిన ఫలితం దక్కలేదు. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, పంజగుట్ట, బంజారాహిల్స్, ఖైరతాబాద్ సహా మరికొన్ని ప్రాంతాల్లో కిలోమీటరు దూరం దాటడానికి కనీసం అరగంటకు పైగా పట్టింది. ఇంకొన్ని చోట్ల గంటల తరబడి వాహనాలు ముందుకు కదలనే లేదు. వర్షం నేపథ్యంలో ద్విచక్ర వాహనచోదకులు మెట్రోరైల్ స్టేషన్ల కింద ఆగిపోవడంతో ఆ ప్రాంతాల్లో మరిన్ని ఇబ్బందులు వచ్చాయి. రాజధానిలోని అనేక ప్రాంతాల్లో రాత్రి పది గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. ట్రాఫిక్ పోలీసులు సైతం రహదారులపై నీళ్లు తొలగించడానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చింది. సాధారణంగా పీక్ అవర్స్‌గా పరిగణించే ఉదయం, సాయంత్రం వేళ నగరంలో ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతుంటాయి. దీనికి తోడు మంగళవారం సాయంత్రం వర్షం కురవడంతో రోడ్డంతా నీళ్లు నిండి, అధ్వానంగా మారిపోయి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. నగర వ్యాప్తంగా దాదాపు 67 ప్రాంతాల్లో ఉన్న వాటర్ లాగింగ్ ఏరియాల కారణంగా రోడ్లన్నీ చెరువులుగా మారి ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్స్ ఏర్పడ్డాయి. కీలక మార్గాల్లోనూ వాహనాలు అత్యంత నెమ్మదిగా ముందుకు సాగాయి. నాగోలు–మెట్టుగూడ, సికింద్రాబాద్–బేగంపేట్, ఎల్బీనగర్–చాదర్‌ఘాట్, ఎంజే మార్కెట్–నాంపల్లి, పంజగుట్ట–కూకట్‌పల్లి, ఐకియా–మాదాపూర్, గచ్చిబౌలి–శిల్పారామం ప్రాంతాల్లో వాహనాలు భారీ సంఖ్యలో ఆగిపోయాయి. రోడ్డుపై ఆగిన నీటిని తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు, డీఆర్ఎఫ్ విభాగాల సిబ్బంది ఓవక్క ప్రయత్నిస్తూనే ఉన్నప్పటికీ ట్రాఫిక్ జామ్‌లు వాహనచోదకులకు నరకాన్ని చవి చూపాయి. వర్షం, నీటితో నిండిన రోడ్లు, పొంగిపొర్లిన డ్రైనేజీలు, మ్యాన్‌హోళ్ల కారణంగా ట్రాఫిక్ ఆగిపోవడంతో పాటు అత్యంత నెమ్మదిగా సాగింది. వాహన చోదకులు తమ గమ్యం చేరుకోవడానికి కాలనీల్లోని అంతర్గత రోడ్లను ఆశ్రయించారు. ఆయా ప్రాంతాల్లో ఇరుకు రోడ్లు, వాటికి ఇరువైపులా పార్క్ చేసి ఉన్న వాహనాలకు తోడు ఊహించని ట్రాఫిక్ కారణంగా ఆ రహదారులూ జామ్ అయ్యాయి.


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని లైబ్రరీలోకి చేరిన వరద


అమీర్‌పేటలో..


హుస్సేన్‌సాగర్ నిండిపోయి బయటకు వస్తున్న వరద


పంజగుట్టలో షెడ్డు కూలి..


ఆర్టీసీ కల్యాణ మండపం సెల్లార్‌లోకి చేరిన నీరు

# ఇక బల్దియాపైనే ఆమ్రపాలి దృష్టి

**ఇతర విభాగాల బాధ్యతల నుంచి రిలీవ్**

**సాక్షి, సిటీబ్యూరో:** జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఇకనుంచి జీహెచ్ఎంసీపై పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరించనున్నారు. ఇప్పటి వరకు ఆమెకు జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీగా, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగానూ అదనపు బాధ్యతలున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో జీహెచ్ఎంసీపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారనే అభిప్రాయాలున్నాయి. తాజాగా ఆమెను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమిస్తూ ఎంఆర్‌డీసీఎల్ ఎండీ, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగా బాధ్యతల నుంచి రిలీవ్ చేయడంతో రెగ్యులర్ కమిషనర్‌గా ఇక బల్దియాపై పట్టు సాధించనున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి దాకా పలు అంశాల్లో కొందరు అధికారులు ఆమ్రపాలిని తప్పుదారి పట్టించారనే ఆరోపణలు వెలువెత్తాయి. ఇటీవల కొన్ని విభాగాల్లో బదిలీలు, శేరిలింగంపల్లి జోన్‌లో ఇంజినీర్ల కొట్లాటలో ఒక్కరిపైనే చర్యలు, తదితరమైనవి అందుకు ఊతమిచ్చాయి. ఏళ్ల తరబడిగా సీట్లకు అంటుకుపోయిన వారు కదలకపోవడం.. పేరుకు బదిలీ తప్ప కొందరు అదే ప్రాంతంలో కొనసాగుతుండటం వంటివి అందుకు దృష్టాంతాలు. ఇతర విభాగాల బాధ్యతలున్నందున జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల, అన్ని స్థాయిల అధికారులకు తగినంత సమయమిచ్చేందుకు వీలు కాలేదని చెబుతున్నారు.

## ఇంట్లోకి చొరబడిన కొండచిలువ



కొండ చిలువను పట్టుకున్న అమర్‌సింగ్

**మణికొండ:** ఓ ఇంట్లోకి 12 అడుగుల కొండ చిలువ చొరబడటంతో స్థానికులు భయాందోళనకు గురైన ఘటన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలిజాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గణేష్‌సింగ్ అనే వ్యక్తి ఇంట్లోకి మంగళవారం ఉదయం కొండ చిలువ వచ్చింది. అది అప్పటికే మూడు కుక్క పిల్లలను మింగటంతో కదలలేక ఇంట్లోనే ఉండిపోయింది. కొండ చిలువను చూ సిన గణేష్‌సింగ్ విషయం చుట్టు పక్కల వారికి చెప్పాడు. దీంతో స్థానికంగానే ఉన్న అమర్‌సింగ్ అనే వ్యక్తి దాన్ని పట్టుకుని బయటకు తెచ్చి అలిజాపూర్ పక్కనే ఉన్న గుట్టల్లో దాన్ని వదలిపెట్టాడు. గతంలో పలు మార్లు పాములు వచ్చాయని, కానీ ఇప్పుడు ఏకంగా 12 అడుగుల కొండ చిలువ వచ్చిందని అక్కడి స్థానికులు తెలుపుతున్నారు.

# 'ఆపరేషన్' ధూల్‌పేట!

**గంజాయి దందాతో మరోసారి వార్తల్లోకి.. • సీఎం ఆదేశాలతో తాజాగా కేసులు.. అరెస్టులు**

- ధూల్‌పేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు ఎన్నో ప్రత్యేకతలు
- ఇక్కడ ఒక్కచోటే ఎస్‌హెచ్‌ఓగా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్
- 2003లో స్టేషన్ ఏర్పాటు, 2016లో గుడుంబా ఫ్రీ ఆపరేషన్
- ఒకప్పుడు గుడుంబా, ఇప్పుడు గంజాయికి అడ్డాగా




**సాక్షి, సిటీబ్యూరో:** ధూల్‌పేట..ఈ పేరు చెప్పగానే కేవలం అక్కడ తయారయ్యే గణేష్ విగ్రహాలు, రాఖీలు, పతంగులే కాదు.. ఒకప్పుడు గుడుంబా, ఇప్పుడు గంజాయి గుర్తుకువస్తాయి. కొన్నాళ్ల క్రితం 'ధూల్‌పేట ప్రాంతం ఔట్ ఆఫ్ హ్యాండ్స్ అయిపోతోంది' అంటూ అధికారులతో సాక్షాత్తు ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నగరం నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతంలో ఉన్న ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు ఓ ప్రత్యేకత ఉంది. రాష్ట్రంలోని ఇతర ఎక్సైజ్ ఠాణాలకు లేని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) దీనికి ఉన్నారు. 'ఆపరేషన్ ధూల్‌పేట'తో మరోసారి వార్తల్లోకి ఎక్కిన ధూల్‌పేట పూర్వాపరాలు ఇవి...

**యుద్ధం చేయడానికి వచ్చి యోధులుగా..**

ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారిలో అత్యధికులు మూడు సామాజిక వర్గాలకు చెందిన వాళ్లే. వీరంతా 1687లో మధ్యప్రదేశ్ నుంచి ఔరంగజేబు సైన్యంగా గోల్కొండ కోటపై 'దండెత్తి' వచ్చారు. అప్పట్లో చివరి కులీకుతుబ్‌షాహి వంశీయుడైన అబుల్ అసన్ తానీషాతో యుద్ధం చేయడానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అలా ఇక్కడ స్థిరపడిన వీళ్లు నిజాం సంబంధీకుడైన అసబ్ జాహీకి అనుకూలంగా మారారు. అప్పటి నుంచి ధూల్‌పేటలో స్థిరపడిన వాళ్లు గుర్రాల ఆలనాపాలన చూడటం, వాటికి శిక్షణ ఇవ్వడం, ఆల్కహాల్ సంబంధిత ఉత్పత్తులు తయారు చేయడం వృత్తిగా మార్చుకున్నారు. వీరిలో కొందరు కళాకారులుగా, మల్లయోధులుగానూ మారారు. కాలక్రమంలో ధూల్‌పేటలో నివసించే వారిలో అత్యధికులు గుడుంబా వ్యాపారుల అవతారం ఎత్తారు. నగరంతో పాటు రాష్ట్రం మొత్తం ఇక్కడి నుంచి గుడుంబా సరఫరా అయ్యేది.

**2003లో ప్రత్యేక ఠాణా కేటాయింపు..**

కొన్నేళ్ల క్రితం వరకు ధూల్‌పేటలోని కొంత భాగం నారాయణగూడ, మిగిలింది గోల్కొండ ఎక్సైజ్ ఠాణాల పరిధిలో ఉండేది. అయితే అక్కడి పరిస్థితులు గమనించిన ఎక్సైజ్ అధికారులు 2003లో ప్రత్యేకంగా ఎక్సైజ్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేశారు. మంగళ్‌హాట్, షాహినాయత్‌గంజ్, టప్పాచబుత్ర, కుల్సుంపుర, బేగంబజార్, బహదూర్‌పుర ప్రాంతాలు దీని పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 139 ఎక్సైజ్ ఠాణాలు ఉన్నాయి. ప్రతి పోలీసుస్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారే ఎస్‌హెచ్‌ఓగా ఉంటారు. అయితే కేవలం ధూల్‌పేట ఎక్సైజ్ ఠాణాకు మాత్రమే అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్థాయి అధికారిని ఎస్‌హెచ్‌ఓగా కేటాయించారు. మిగిలిన పోలీసుస్టేషన్లలో ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైల కేటాయింపు మాత్రమే ఉండగా..ఇక్కడ మాత్రం నాలుగు ఇన్‌స్పెక్టర్, 12 ఎస్సై పోస్టులు కేటాయించారు.

**'ఆపరేషన్ ధూల్‌పేట'లో నిందితులుగా కస్టమర్లు..**

కొన్ని నెలల క్రితం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి 'ఆపరేషన్ ధూల్‌పేట'కు శ్రీకారం చుట్టారు. స్థానిక పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో పాటు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. గత నెల్లో మొదలైన ఈ ఆపరేషన్‌లో ఇప్పటి వరకు 32 కేసులు నమోదు చేసిన అధికారులు 72 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి 100 కేజీల గంజాయి, 16 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పాత నేరస్తులైన 28 మందిని బైండోవర్ చేసి, పరారీలో ఉన్న 56 మంది కీలక గంజాయి వ్యాపారుల కోసం గాలిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులు గతంలో వినియోగదారులపై కేసులు నమోదు చేసే వాళ్లు కాదు. అయితే వీరినీ కట్టడి చేయాలనే ఉద్దేశంతో 'ఆపరేషన్ ధూల్‌పేట' నుంచి వారినీ కేసుల్లో నిందితులుగా చేరుస్తున్నారు. గంజాయి వినియోగదారులనే ఆధారాలు దొరికిన 50 మంది విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఆయా కేసుల్లో నిందితులుగా మారారు. మరికొన్ని రోజులు ఈ ఆపరేషన్ కొనసాగనుంది. ఆ తర్వాత కూడా ధూల్‌పేటపై నిఘా కొనసాగించాలని ఎక్సైజ్, పోలీసు అధికారులు నిర్ణయించారు.

**గతంలో రెండుసార్లు కీలక ఆపరేషన్లు..**

ఇప్పటి వరకు ధూల్‌పేటలో మూడు కీలక ఆపరేషన్లు జరిగాయి. ఈ ప్రాంతం నుంచి గుడుంబాను తరిమేయడానికి 2016లో 'గుడుంబా ఫ్రీ ధూల్‌పేట' పేరుతో ఆపరేషన్ చేపట్టారు. దాదాపు ఆరు నెలల శ్రమించి, పునరావాస కార్యక్రమాలు నిర్వహించిన ఎక్సైజ్–పోలీసు అధికారులు దీన్ని సాధించారు. అప్పట్లో జరిగిన కొన్ని లోపాల వల్ల గుడుంబా స్థాయిలో గంజాయి పుట్టుకువచ్చింది. 15 మంది వ్యాపారులతో మొదలైన ఈ దందా 2021 నాటికి 100 మందికి చేరింది. రోజూ కనీసం క్వింటాల్ విక్రయించే వాళ్లు. దీంతో అప్పట్లో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కలిసి గాంజా ముక్త్ ధూల్‌పేట చేపట్టారు. 2022 తర్వాత మళ్లీ పరిస్థితులు మారిపోవడంతో...ఈ దందా 250 మంది వ్యాపారులు, రోజులకు 300 కేజీల విక్రయం వరకు వెళ్లింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత, విద్యార్థులు ఇక్కడి గంజాయికి బానిసలుగా మారిపోయారు.



# కార్పొరేటర్.. చలో టూర్..



**అధ్యయన యాత్రల పేరిట మళ్లీ రెడీ**

- ఢిల్లీ, ఆగ్రా, జైపూర్, ఇండోర్, లక్నో..
- అసోం, గౌహతిలకు మూడు బృందాలుగా..
- సెప్టెంబర్‌లో మూడు విడతలుగా జర్నీ
- రూ. 1.25 కోట్ల ప్రజాధనం వ్యయం

**సాక్షి, సిటీబ్యూరో:** జీహెచ్ఎంసీ ఖజానాలో నిధుల్లేక నెల నెలా సిబ్బంది జీతాల చెల్లింపులకే కనాకష్టంగా మారింది. చేసిన పనులకు బిల్లులు చెల్లించక కాంట్రాక్టర్లు తరచూ ధర్నాలు చేస్తున్నారు. కొత్త పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. పలు ప్రాంతాల్లో సదుపాయాల లేమితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధ్వానపు పారిశుద్ధ్యం, దోమలు, కుక్కల కాట్లతో, ట్రాఫిక్‌జామ్‌లతో అల్లాడుతున్నారు. ఇంజినీరింగ్ ప్రాజెక్టులు, నిర్వహణ పనులు జరగడం లేదు. వానొస్తే రోడ్లపై మోకాలి లోతు నీటితో, కాలనీల్లోకి వరదతో ప్రజలు తిప్పలు పడుతున్నారు. అయినా.. 'డోంట్ కేర్' అన్నట్లుగా అధ్యయన యాత్రల పేరిట విహార యాత్రలకు జీహెచ్ఎంసీ పాలకమండలి కార్పొరేటర్లు సిద్ధమయ్యారు. మొత్తం 150 మంది ఒకేసారి కాకుండా ట్రిప్పులో 50 మంది చొప్పున మూడు విడతలుగా మూడు ప్యాకేజీల్లో ఆయా నగరాలను చుట్టి వచ్చేందుకు సిద్ధమయ్యారు. దాదాపు రూ. 1.25 కోట్ల ప్రజాధనం ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. గురువారం జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం పొందనున్నారు.

**టూర్లు ఇలా..**

ఫేజ్ 1: ఢిల్లీ, ఆగ్రా, జైపూర్
ఫేజ్ 2: ఇండోర్, లక్నో
ఫేజ్ 3: అసోం గౌహతి

- సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీలోగా ఒక్కో ఫేజ్‌లోని నగరాలకు 50 మంది వంతున కార్పొరేటర్లు వెళ్లనున్నారు. ఒక్కో బృందం వెంట కో ఆర్డినేటర్‌గా అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ స్థాయి అధికారి వెళ్లనున్నారు.
- జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు స్టడీటూర్ల పేరిట విహార యాత్రలు చేయడం కొత్తేమీ కాదు. గతంలోనూ కొన్ని పర్యాయాలు ఆయా నగరాలు, విదేశాలు చుట్టి వచ్చారు. కేవలం కార్పొరేటర్లే కాదు.. తోడుగా భర్త/భార్య వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. అంతేకాదు.. టూర్ల పేరిట ఒక్కో కార్పొరేటర్‌కయ్యే వ్యయాన్ని వెళ్లకుండానే సంబంధిత టూర్ ఆపరేటర్‌ను మేనేజ్ చేసుకొని సొంత జేబులో వేసుకున్న ఘనులు కూడా ఉన్నారు. గత పాలకమండలిలో స్టాండింగ్ కమిటీ సభ్యులు తమ గడువు ముగియనుండగా చివరి వారంలో టూర్లు చేసి వచ్చారు. పేరుకు మాత్రం ఆయా నగరాల్లో పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ రోడ్ పనులు, ఇతరత్రా అంశాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసేందుకని చెబుతున్నప్పటికీ, వారు చేసి వచ్చింది విహారయాత్రలు తప్ప అధ్యయన యాత్రలు కాదని వెల్లడైంది. అధ్యయన యాత్రలే అయితే అక్కడ పరిశీలించిన ఉత్తమ విధానాలేమిటో.. తమ దృష్టికి వచ్చిన మంచి అంశాలేమిటో పేర్కొంటూ వాటిని జీహెచ్ఎంసీలోనూ అమలు చేసేందుకు అవకాశాలను ప్రస్తావిస్తూ నివేదికలు అందజేయాలి. కానీ, అలాంటి నివేదికలేవీ అందజేసిన దాఖలాల్లేవు. గతంలోనూ ఢిల్లీ, ఇండోర్ వంటి నగరాలను చుట్టివచ్చారు. కానీ అక్కడ అమలవుతున్న వేవీ ఇక్కడ చేపట్టలేదు.

**లోకాయుక్త ఆదేశాల నేపథ్యంలో..**

గతంలోనూ స్టడీ టూర్లపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 2013లో లోకాయుక్తా సుమోటోగానే కేసు నమోదు చేసి కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అప్పట్లో 150 మంది కార్పొరేటర్లతో పాటు అయిదుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు, ఇద్దరు అధికారులు వెంట వెళ్లేందుకు అనుమతిస్తూ ఒక్కొక్కరికి రూ.80వేల వ్యయం మించరాదని ఆదేశించింది. అంతేకాదు.. అధ్యయన యాత్రల నివేదికను సమర్పించే కండిషన్ మీదే అనుమతించింది. అయితే.. ఆ తర్వాత టూర్లకు వెళ్లివచ్చిన వారు నివేదికలు అందజేసిన దాఖలాల్లేవు.

**మళ్లీ ఇప్పుడు రెడీ..**

ఈ నేపథ్యంలో మళ్లీ ఇప్పుడు స్టడీ టూర్లంటూ రెడీ అవుతున్నారు. ఇప్పటికే దేశంలోని పలు నగరాల నుంచి మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు జీహెచ్ఎంసీలోని బెస్ట్‌ప్రాక్టీసెస్‌ను అధ్యయనం చేయడానికి వస్తుండగా.. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు ఇతర నగరాలకు వెళ్లడం నిధుల దుబారా తప్ప మరొకటి కాదని జీహెచ్ఎంసీ వర్గాలే అంటున్నాయి. ఓవైపు ప్రభుత్వం ఖర్చు తగ్గించుకోవాలని చెబుతుంటే.. జీహెచ్ఎంసీ పాలకమండలి మాత్రం ప్రజాధనాన్ని ఇలా తమ యాత్రల కోసం ఖర్చు చేస్తోంది.

## బయోగ్యాస్ టెక్నాలజీపై సదస్సు



**సాక్షి, సిటీబ్యూరో:** ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, సహజ వనరుల కొరత, స్వచ్ఛమైన ఎనర్జీ కోసం డిమాండ్ పెరుగుతుండటం వంటి సమస్యలకు బయోగ్యాస్ చక్కటి పరిష్కారం అని చెప్పొచ్చు. వ్యర్థ పదార్థాల నిర్వహణ వ్యవస్థలో బయో గ్యాస్ సాంకేతిక కీలక పాత్ర పోషిస్తుందని పలు రంగాలకు చెందిన నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇటీవల హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో బయో గ్యాస్ టెక్నాలజీపై రెండు రోజుల పాటు రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బయోగ్యాస్ పరిశ్రమ, పాలసీ రూపకర్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరయ్యారు. రెజిలియెన్స్ టువార్డ్స్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ ఎనర్జీ సెక్యూరిటీ అనే అంశంపై నిపుణులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐఆర్–ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, వీవీఎస్ కిశోర్, వీణా జోషి, ఎస్ఎన్ శ్రీనివాస్, రాజేశ్వరి, పి.రమణ్, రమణారెడ్డి, గంగాగ్ని రావు తదితరులు ఈ చర్చలో పాల్గొన్నారు.

## ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ చోరీపై జీరో ఎఫ్ఐఆర్

**కాచిగూడ:** ల్యాప్‌టాప్, ట్యాబ్, సెల్‌ఫోన్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం..అనకాపల్లికి చెందిన అశోక్‌వర్ధన్, తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడికి చెందిన రత్నావళి సోమవారం విశాఖపట్నం నుంచి కాచిగూడకు విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నారు. రైలు వరంగల్ స్టేషన్‌కు చేరుకున్న సమయంలో చూసుకోగా..అశోక్‌వర్ధన్ ల్యాప్‌టాప్, రత్నావళి ట్యాబ్, సెల్‌ఫోన్ ఉంచిన బ్యాగు కనబడలేదు. మంగళవారం బాధితులు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం వరంగల్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

**మంగళసూత్రం లాక్కెళ్లిన కేసులో..**

మహిళ మెడలో నుంచి బంగారు మంగళ సూత్రాన్ని గుర్తుతెలియని దొంగ లాక్కెళ్లిన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం .. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన వెంకట విజయలక్ష్మి, భర్త శ్రీనివాసులు వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో సోమవారం నగరానికి వస్తున్నారు. రైలు డోన్ రైల్వే స్టేషన్ వద్ద ఉండగా ఓ వ్యక్తి కిటికీ నుంచి వెంకట విజయలక్ష్మి మెడలోని 35 గ్రాముల మంగళ సూత్రాన్ని లాక్కుని పారిపోయాడు. మంగళవారం బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కర్నూలు రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

## మంచి నీటి కనెక్షన్ ఇచ్చేందుకు లంచం డిమాండ్

- జలమండలి మేనేజర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అరెస్టు
- వలపన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు



ఏసీబీ అధికారులకు చిక్కిన జలమండలి మేనేజర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

**మణికొండ:** మంచినీటి కనెక్షన్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసి వసూలు చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగితో పాటు జలమండలి మేనేజర్‌ను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు అరెస్టు చేశారు. మణికొండ జలమండలి డివిజన్–18లో మేనేజర్‌గా పనిచేస్తున్న స్ఫూర్తి రెడ్డితో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌గౌడ్‌ను వలపన్ని పట్టుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉపేంద్రనాథ్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం దాడులు చేసి వారిని అరెస్టు చేశారు. తన అపార్ట్‌మెంట్‌కు రెండు నీటి కనెక్షన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవటంతో ఉపేంద్రనాథ్ రెడ్డి జలమండలి కార్యాలయానికి వచ్చి మేనేజర్ స్ఫూర్తిరెడ్డిని కలిశాడు. ఆమె సమాధానం చెప్పకుండా ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌గౌడ్‌ను కలవాలని సూచించింది. అతన్ని కలవగా ఒక్కో కనెక్షన్‌కు రూ.15 వేల చొప్పున రూ.30 వేలు ఇస్తే మీ పని అయిపోతుందని సలహా ఇచ్చారు. దాంతో అతను ఏసీబీని ఆశ్రయించి మంగళవారం వారి సూచన మేరకు మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లో ఉన్న జలమండలి కార్యాలయం వద్ద నవీన్‌గౌడ్‌కు డబ్బులు ఇవ్వగానే ఏసీబీ అధికారులు అతన్ని అరెస్టు చేశారు. విచారణలో మేనేజర్ ఆదేశం మేరకే డబ్బు తీసుకున్నానని పేర్కొనటంతో ఆమెను కూడా అరెస్టు చేశారు. వసూలు చేసిన మొత్తంలో మేనేజర్‌తో పాటు డీజీఎం, జీఎంలకు వాటా ఇవ్వాల్సి ఉందని ఏసీబీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో నవీన్‌గౌడ్ అంగీకరించాడు. దాంతో ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. దాడులలో ఏసీబీ సీఐలు ఆజాద్, జగన్‌మోహన్‌రెడ్డి, నవీన్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## కారు ఢీకొని విద్యార్థి దుర్మరణం



నిఖిల్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

**చిక్కడపల్లి:** వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.సీతయ్య తెల్పిన కథనం ప్రకారం...బిహార్ రాష్ట్రానికి చెందిన నిఖిల్ కుమార్(22) రాంనగర్‌లోని పయనీర్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం రాంనగర్ చౌరస్తానుంచి వీఎస్టీ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నిఖిల్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లైక్‌ల కోసం విన్యాసాలు.. ఆకతాయిల రిమాండ్

**సంతోష్‌నగర్:** సోషల్ మీడియాలో లైక్‌ల కోసం బుర్ఖా ధరించి ద్విచక్ర వాహనంపై విన్యాసాలు చేస్తున్న ఆకతాయిలను ఐఎస్‌సదన్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రెయిన్‌బజార్ చమాన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అహ్మద్ అలియాస్ దానిష్ (18), మహ్మద్ అబ్దుల్ వాసిఫ్ అలియాస్ సైఫ్ (18), తలాబ్‌కట్టా అమన్‌నగర్–బి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ అమన్ హుస్సేన్ (23) ప్రజలను ఆట పట్టించేందుకు, సోషల్ మీడియాలో లైక్‌లు వచ్చేందుకు ఈ నెల 15వ తేదీన బుర్ఖా ధరించి..బైకుపై స్టంట్లు చేశారు. వీటిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై ఐ.ఎస్.సదన్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసుకొని దానిష్, అబ్దుల్ వాసిఫ్‌లను అరెస్ట్ చేశారు.

## జలమండలి ఈడీగా మయాంక్ మిట్టల్



**సాక్షి, సిటీబ్యూరో:** జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా మయాంక్ మిట్టల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం నారాయణపేట అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న 2020 బ్యాచ్ ఐఏఎస్ అధికారి మయాంక్ మిట్టల్‌ను జలమండలికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జలమండలిలో సుదీర్ఘకాలంగా ఈడీగా కొనసాగిన సత్యనారాయణ ఇటీవల మూసీ రివర్ ఫ్రంట్ శాఖకు బదిలీ అయిన విషయం విదితమే.

## ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేయాలి



మిథులానగర్‌లో వరదనీరు చేరకుండా మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

**మీర్‌పేట:** ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకుడు మాదరి రమేశ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కురిసిన వర్షానికి ముంపునకు గురైన మీర్‌పేటలోని మిథులానగర్‌లో ఇంచార్జి కమిషనర్, డీఈ వెంకన్నతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షం వచ్చిన ప్రతిసారి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవ తీసుకుని గతంలో ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేయించారని గుర్తుచేశారు. దీంతో మిథులానగర్‌లో ప్రత్యేక లైన్ వేసేందుకు నిధులను కేటాయించినట్లు చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే ఆ నిధులను ఆపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.



బసవతారకం నగర్ బస్తీలో ఇంట్లోకి చేరిన వరద నీటిని బయటికి తోడుతున్న మహిళ



శ్రీనగర్ కాలనీ ప్రధాన రోడ్డులో





కృష్ణానగర్‌లో....

# గంటన్నర వర్షం.. అతలాకుతలం

జలమయమైన రహదారులు | ఫిలింనగర్ బస్తీల్లో నివాసాల్లోకి చేరిన వరద నీరు | బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీలో కొట్టుకుపోయిన రోడ్డు | బస్తీ, కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు | భారీ వానతో పలు పాఠశాలలకు సెలవు



నీటమునిగిన ఎల్లారెడ్డిగూడ బస్తీ రోడ్డు

బంజారాహిల్స్: వరుస వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు బస్తీ, కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి 6.30 గంటల పాటు గంటన్నర పాటు ఏకధాటిగా కురిసిన వానకు ఖైరతాబాద్, బంజారాహిల్స్, పంజగుట్ట, సోమాజిగూడ, ఫిలింనగర్, శ్రీనగర్ కాలనీ, అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడ, శ్రీకృష్ణానగర్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. ముఖ్యంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీలో భయానక పరిస్థితి నెలకొంది. ఇక్కడ వేసిన తాత్కాలిక రోడ్డు పూర్తిగా వరదకు కొట్టుకుపోవడంతో స్థానికులు నడిచేందుకు కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు వరద ధాటికి ఇళ్లల్లోకి నీళ్లు రావడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. శ్రీకృష్ణానగర్‌లో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదతో వీధులన్నీ వరదతో నదులను తలపించాయి. ఒక్కసారిగా కురిసిన కుండపోత వర్షానికి నియోజకవర్గంలోని చాలా వరకు పాఠశాలలకు అప్పటికప్పుడు సెలవును ప్రకటించారు.



కృష్ణానగర్‌లో ప్రవహిస్తున్న వరదనీరు



వరద నీటి కాల్వ క్యాచ్‌పిట్‌లను ఓపెన్ చేస్తున్న సిబ్బంది



ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ వద్ద నిల్చిపోయిన వరద



ఖైరతాబాద్ రైల్వే గేట్ రోడ్డులో



సోమాజిగూడ ప్రధాన రహదారిలో

## పదోన్నతులు కల్పించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఆర్టిజన్ కార్మికులు

బంజారాహిల్స్: ఎంతో కష్టపడి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులకు కూడా పదోన్నతులు కల్పించాలంటూ మింట్ కాంపౌండ్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. సంవత్సరం క్రితమే ఆర్టిజన్ కార్మికులకు ప్రమోషన్లు రావాల్సి ఉండగా యాజమాన్యం వాటిని పక్కనబెట్టి తమను పూర్తిగా విస్మరించిందని కార్మికులు ఆరోపించారు. ఇది ఆర్టిజన్లను అవమానించడమేనన్నారు. ఇప్పటికైనా తమకు ప్రమోషన్ల విషయంలో యాజమాన్యం స్పందించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## 'డి సన్స్ పటోలా ఆర్ట్' వస్త్ర ప్రదర్శన ప్రారంభం



ఆర్ట్ వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న బినామెహతా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1లోని లేబుల్స్ పాప్–అప్ స్పేస్‌లో కొలువుదీరిన డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శనను సామాజికవేత్త బినామెహతా మంగళవారం ప్రారంభించారు. విభిన్నమైన హ్యాండ్‌లూమ్ చీరలతో పాటు పటోలా ఆర్ట్ చీరలు, డిజైనర్‌వేర్ వస్త్ర ఉత్పత్తులను ఒక వేదికపై ప్రదర్శించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆమె అన్నారు. నేరుగా వీవర్ నుంచి వినియోగదారునికి అందించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. డి సన్స్ పటోలా ఆర్ట్ ఎక్స్‌పో నిర్వాహకుడు భవిన్ మక్వానా మాట్లాడుతూ నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు అండగా నిలబడడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్‌కోట, పటోలా, దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, సింగిల్ పటోలా దుప్పట, పటాన్ పటోలా చీరలు, సిల్క్ టిష్యూ పటోలా వంటి రెండు వేల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

## వైస్ చాన్సలర్లను నియమించాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల్లో వైస్ చాన్సలర్ లేక విద్యావ్యవస్థ కుంటుపడిందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి అన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం మరింత కృషి చేయాలని కోరారు. మంగళవారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు పది యూనివర్సిటీలకు ఇప్పటి వరకు ప్రభుత్వం వైస్ చాన్సలర్లు నియమించలేదని వెను వెంటనే వైస్ చాన్సలర్‌లను నియమించాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఈ నియామకాల్లో 50 శాతం బీసీలకు కేటాయించాలని ఆయన కోరారు.

## పోటీకి అనుగుణంగా తీర్చిదిద్దుతాం

కేఎల్ డీమ్డ్ టు బి వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ



కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రాంలో అతిథులు

బంజారాహిల్స్: మారుతున్న సమాజ పరిస్థితులు, పోటీకి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తామని కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ (కేఎల్‌హెచ్ జీబీఎస్)లో బుధవారం ఓరియంటేషన్ పోగ్రాం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ హోమ్ లోన్స్ రిటైల్ అసెట్స్, బిజినెస్ హెడ్ భరద్వాజ్ కొర్సి, మైండ్స్ అండ్ డాట్స్ కన్సల్టింగ్ వ్యవస్థాపక డైరెక్టర్ రామ్ జలదుర్గం తదితర ప్రముఖులు హాజరై ఎంబీఏ, బీబీఏ 2024–25 బ్యాచ్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఎంబీఏ, బీబీఏ విద్యార్థులకు ఉన్నత అవకాశాలు ఉన్నాయని, ప్రతిభ ఉంటే అవకాశాలు వాటంతట అవే వస్తాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పార్థసారథివర్మ మాట్లాడుతూ విద్య, వృత్తిపరమైన రంగాల్లో విద్యార్థులు మేటిగా ఎదిగేలా వారికి తగిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, కేఎల్‌హెచ్ బిజినెస్ అకడమిక్స్ డైరెక్టర్ డాక్టర్ గాజులపల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న 'ఆకృతి' ప్రదర్శన



లక్డీకాపూల్ : బంజారాహిల్స్‌లోని తాజ్ డక్కన్ హోటల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఆకృతి వస్త్ర ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ఆకృతి ఎగ్జిబిషన్ డైరెక్టర్ శశినాథ్ ప్రారంభించిన ఈ ప్రదర్శనలో సంప్రదాయ వస్త్రాలతో పాటు ప్రస్తుత ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణమైన వైవిధ్య భరితమైన డిజైన్లతో కూడిన వస్త్రాలు నగర వస్త్ర ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

బంజారాహిల్స్: ప్రేమ విఫలం కావడంతో ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో నివసించే కడం వినయ్ (18) ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. 19న సెలవు కావడంతో ఇంట్లోనే ఉన్నాడు. తల్లి శరణమ్మ, అన్న ప్రవీణ్‌లు ఇద్దరూ డ్యూటీలకు వెళ్లిపోయారు. సాయంత్రం డ్యూటీలు ముగించుకుని వచ్చే క్రమంలో అమ్మను తీసుకురావాలంటూ తన అన్న శివకు వినయ్ చెప్పాడు. శివ వెళ్లి తల్లిని తీసుకుని ఇంటికి వచ్చేసరికి వినయ్ ఉరివేసుకొని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రేమ విఫలం కావడంతోనే తన సోదరుడు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని శివ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వర్షానికి నేలకొరిగిన భారీ వృక్షం

పంజగుట్ట: ఎర్రమంజిల్ లోని శాంతిసౌదా అపార్ట్‌మెంట్‌లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ఒక భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో అపార్ట్‌మెంట్ ప్రహరీగోడ ధ్వంసమైంది. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో కొద్దిసేపు రోడ్డుకు అంతరాయం ఏర్పడింది. కాగా ఏ వాహనం కాని ఎవ్వరికీ ఏమీ కాలేదని స్థానికులు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు వెంటనే అక్కడకు చేరుకున్న రెస్క్యూ టీం చెట్టును కట్ చేసి అక్కడ నుంచి తొలగించారు.



వర్షానికి పడిపోయిన భారీ వృక్షం

## నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి

లిబర్టీ: ఉన్నత చదువులు చదివిన ఉపాధిలేక కొట్టుమిట్టాడుతున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి ఇండియన్ ప్రజా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షులు నాగిళ్ల నవీన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సమీపంలో నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలో నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించపాలని కోరారు. 33 జిల్లాల్లో నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు సాధ్యం కానిపక్షంలో తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల్లో నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

## యువతి పట్ల ర్యాపిడో డ్రైవర్ అసభ్య ప్రవర్తన

బంజారాహిల్స్: ఓ యువతి పట్ల ర్యాపిడో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్–11లోని ఉదయ్‌నగర్‌లో నివసించే ఓ యువతి (23) ఎర్రమంజిల్ పీవీఆర్ సినిమాస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంది. విధులు ముగించుకున్న తరువాత ఇంటికి వెళ్లే క్రమంలో ర్యాపిడో బుక్ చేసుకుంది. ర్యాపిడో డ్రైవర్ రాకేష్ ఆమెను తీసుకుని వెళ్లే క్రమంలో ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా అశ్లీల వీడియోలు చూపించే ప్రయత్నం చేశాడు. దీంతో ఇంటికి చేరగానే ఆమె చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసింది. వారందరూ వచ్చేలోగా నిందితుడు రాకేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ముఖ్యం



సైఫాబాద్ సైన్స్ కాలేజీలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రయాణ సమయాల్లో చిన్నచిన్న తప్పులకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని సైఫాబాద్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బేగంపేటలోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆధ్వర్యంలో సైఫాబాద్ సైన్స్ కాలేజీలో మంగళవారం ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు సేఫ్టీపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రోడ్డు సేఫ్టీపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడంతో పాటు ఇతరులకు కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. టీటీఐ ప్రతినిధులు హరీశ్, లక్ష్మీనారాయణ, అనిల్‌కుమార్‌లు మాట్లాడుతూ రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. డ్రంకన్ డ్రైవ్ వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా యువత వీటి బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నవనీత, ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 ప్రోగ్రామ్ ఆఫీసర్లు అరవింద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గురుబ్రహ్మనగర్ బస్తీ నుంచి తరలించే కుట్ర

చౌరస్తాలో స్థానికులతో బైఠాయించి నిరసన తెలిపిన కార్పొరేటర్



గురుబ్రహ్మనగర్‌లో బాధితులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని నందగిరిహిల్స్ పక్కన ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీలో మూడు దశాబ్దాలుగా నివసిస్తున్న తమను బలవంతంగా ఇక్కడి నుంచి పంపించే కుట్రలు జరుగుతున్నాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బస్తీవాసులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. మంగళవారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో బాధితులంతా ప్లకార్డులు ప్రదర్శిస్తూ చౌరస్తాలో బైఠాయించి నిరసన తెలిపారు. దానం నాగేందర్ బడాబాబుల పక్షమా.. లేక బడుగుల పక్షమా..? అంటూ బస్తీవాసులు నిలదీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మాట్లాడుతూ తమను ఎమ్మెల్యే దానం నాగేందర్ బెదిరించారని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వలస కూలీలు ఇక్కడ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, 2009లో అప్పటి ప్రభుత్వం వీరికి పట్టాలు కూడా మంజూరు చేసిందని అన్నారు. ప్రభుత్వ స్థలంలో నివసిస్తున్న వీరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీనిచ్చిన ఎమ్మెల్యే దానం నాగేందర్ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. అత్యధిక కాలం ఎమ్మెల్యేగా పనిచేశానని చెప్పుకునే నాగేందర్ తన నియోజకవర్గంలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఎందుకు కట్టించలేకపోతున్నారని నిలదీశారు. ఇటీవల బస్తీలో పర్యటించిన నాగేందర్ త్వరలో మీ ఇళ్లు కూల్చేస్తారు..నా దగ్గరకు వచ్చినా ప్రయోజనం ఉండదంటూ భయపెట్టాడని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కు చెందిన ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలని బాధితులు వెంకటస్వామి, కృష్ణవేణి తదితరులు కోరారు. తమను బలవంతంగా తరలించే ప్రయత్నం చేస్తే ఆత్మహత్యలకైనా వెనుకాడబోమని హెచ్చరించారు.

# రాజీవ్ గాంధీకి ఘన నివాళి

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో టెక్నాలజీని రాజీవ్‌గాంధీనే పరిచయం చేశారని, ఇంకా ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వారు కొనియాడారు. ఆయన సేవలు ఎన్నటికీ మరిచిపోలేమని అన్నారు. – బంజారాహిల్స్



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి



బోరబండ బస్ స్టాప్ వద్ద నివాళులు అర్పిస్తున్న బాబా ఫసియుద్దీన్



నివాళులర్పిస్తున్న డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి



రహమత్‌నగర్‌లో



జూబ్లీహిల్స్ ఇందిరానగర్‌లో



నివాళులు అర్పిస్తున్న వెన్న సదానందు

## కుళాయి నీటిలో క్లోరిన్ మాత్రలు వేసి వాడుకోవాలి

ప్రతీ ఇంటికి 20 మాత్రలు పంపిణీ

వెంకటేశ్వరకాలనీ: వర్షాకాలంలో కుళాయి ద్వారా వచ్చే నీటిలో క్లోరిన్ మాత్రలు వేసుకొని వాడుకోవాలని జలమండలి తట్టిఖానా సెక్షన్ మేనేజర్ రాంబాబు సూచించారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్ బస్తీ, బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గురుబ్రహ్మనగర్ బస్తీలో నీటి సరఫరా వేళల్లో క్లోరిన్ మాత్రలను పంపిణీ చేశారు. రంగు మారిన నీళ్ళు వస్తే కంగారు పడవద్దని వర్షాకాలంలో రంగుమారిన నీళ్లు రావడం సహజమేనని ఈ సందర్భంగా నివాసితులకు అవగాహన కల్పించారు. 20 లీటర్ల నీళ్ళలో ఒక మాత్రను పొడిగా చేసి తాగాలని ఎటువంటి ప్రమాదం ఉండదని తెలిపారు. క్లోరిన్ మాత్రలు వేసిన నీటిని తాగడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని ఇది ఎంతో మంచిందని తెలిపారు. మూడుసార్లు ఫిల్టర్ చేసిన తర్వాతనే నీటిని ఇంటింటికీ సరఫరా చేస్తామని క్లోరిన్ మాత్రల వల్ల నీరు మరింత శుద్ధి అవుతుందని తెలిపారు.

## కల్లు కాంపౌండ్‌లో గొడవ...

యువకుడికి గాయాలు

వెంగళరావునగర్: డబ్బుల విషయంలో మహిళతో జరిగిన గొడవలో యువకుడికి గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెంకటగిరికి చెందిన ఆంథోనీ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ప్రతిరోజూ కల్లు తాగడానికి యూసుఫ్‌గూడకు వస్తుంటాడు. ఇదే క్రమంలో సోమవారం రాత్రి కూడా కల్లు కాంపౌండ్‌కు వచ్చి కల్లు సేవిస్తుండగా అక్కడే కల్లు సేవిస్తున్న ఒక మహిళతో డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో ఆమె తన కుమారునికి విషయం చెప్పడంతో ఆమె కొడుకు, అతని స్నేహితులు వచ్చి ఆంథోనీపై దాడి చేశారు. ఈ దాడిలో ఆంథోని తల, కన్ను, చేతులపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి బుధవారం ।21। ఆగస్టు। 2024

## 23 నుంచి తాజ్‌కృష్ణాలో జ్యువెలరీ ఎగ్జిబిషన్

**సాక్షి, సిటీబ్యూరో:** నగరంలోని హోటల్ తాజ్‌కృష్ణా వేదికగా ప్రతిష్టాత్మక జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కొనసాగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో ఇర్స్యా ఫైన్ జ్యువెల్స్, నవదుర్గ జ్యువెల్స్, దేవీపవిత్ర జ్యువెల్స్ ఆధ్వర్యంలో వివాహాలు, వధువులకు అనువైన ఆభరణాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అంతేకాకుండా పండుగలు, శుభకార్యాల నేపథ్యంలో నగరంలోని ఆభరణాల ప్రేమికులకు దీనిని మంచి వేదికగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

## ఏఐ, డేటాసైన్స్ కోర్సుల్లో శిక్షణ

**కాచిగూడ:** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటాసైన్స్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి గల యువతీ, యువకులు, విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి అడప ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు స్వర్ణభారత్ జాతీయస్థాయి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఫీజులో 80 శాతం తగ్గింపు ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ ఆమోదిత సర్టిఫికెట్స్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్: 95058 00047లో సంప్రదించాలని సూచించారు.

## ఏడో రోజూ జూడాల ఆందోళన



గాంధీ ఆస్పత్రిలో ప్లకార్డులతో బైఠాయించిన జూడాలు

**గాంధీఆస్పత్రి:** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో జూడాల ఆందోళన ఏడో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ వైద్యవిద్యార్థినిపై హత్యాచారం ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో వైద్యులు, వైద్య విద్యార్థులకు మరింత భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఓపీ, ఎలక్టివ్ విధులను జూడాలు బహిష్కరించారు. ఆస్పత్రి ప్రధాన భవనం ఎదుట బైఠాయించిన జూడాలు ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు. వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాతోపాటు పలువురు వైద్య శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించామని, వారంతా సానుకూలంగా స్పందించారని జూడాల సంఘం గాంధీ యూనిట్ అధ్యక్షుడు వంశీకృష్ణ తెలిపారు.

## హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలి

– ముదిరాజ్ మహాసంఘం విజ్ఞప్తి

**పంజగుట్ట:** చెరువులు, కుంటలు కబ్జాచేసిన వారిపై ఉక్కుపాదం మోపుతూ, అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న హైడ్రా లాంటి సంస్థలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటలు కాపాడేందుకు హైడ్రా అనే సంస్థను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతున్న కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 40 వేలకుపైగా ఉన్న చెరువులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 50 లక్షలమంది మత్స్యకారులు ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తారని తెలియచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికారప్రతినిధి గొడుగు శ్రీనివాస్, ఉప్పరవేని రంజిత్, మహేష్, పి.రాజు, చెరుకు సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

## లోతైన అర్థం ఉంటేనే గొప్ప ఛాయాచిత్రం

– మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య



**కాచిగూడ:** వాస్తవికత, లోతైన అర్థం ఉంటేనే గొప్ప ఛాయాచిత్రం అవుతుందని మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంగళవారం ఆయన వీక్షించారు. అనంతరం లక్ష్మయ్య మాట్లాడుతూ శక్తివంతమైన వార్తాచిత్రాన్ని రూపొందించడంలో న్యూస్ ఫొటోగ్రాఫర్ పాత్ర కీలకమని అన్నారు. రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ప్రతిఏటా నిర్వహించే న్యూస్ ఫొటో పోటీలు, ఉత్తమ ఫొటో జర్నలిస్టుల పురస్కారాల అందజేత నిర్వహణ బాధ్యతను పొన్నాల ఫౌండేషన్ తీసుకుంటుందని, అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి వర్కల యాదగిరి, రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేఎస్ హరి, అనిల్ కుమార్ కర్ణకోటి, నక్క శ్రీనివాస్, పి.మోహన్‌చారి, ఎస్.శ్రీధర్, వెంకటేష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ప్రొ.సునీల్



**గాంధీఆస్పత్రి:** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా జనరల్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ కె.సునీల్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వైద్య శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి 1993లో ఎంఎస్ పూర్తి చేశారు. అనంతరం నిజామాబాద్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. గాంధీఆస్పత్రి, భువనగిరి, నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వివిధ హోదాల్లో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా నిజామాబాద్ నుంచి గాంధీ ఆస్పత్రికి వచ్చారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, నిరుపేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని సునీల్‌కుమార్ తెలిపారు. గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ వినయ్‌శేఖర్(జనరల్ మెడిసిన్) ప్రొఫెసర్ శ్రీహరి (రేడియాలజీ)లు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లడంలో వారి స్థానాల్లో సునీల్‌కుమార్, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ ప్రొఫెసర్ సుబోధ్ కుమార్‌ను నియమిస్తూ వైద్య శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## డీజిల్ ట్యాంకర్ బోల్తా

**ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ హెచ్‌పీసీఎల్ వద్ద మంగళవారం రాత్రి ఓ డీజిల్ ట్యాంకర్ బోల్తా పడింది. డీజిల్ నింపుకుని హైదరాబాద్ వెళుతుండగా సర్వీస్ రోడ్డులో ట్యాంకర్ పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. తక్షణమే స్పందించిన హెచ్‌పీసీఎల్ అధికారులు డీజిల్ బయటికి రాకుండా చర్యలు చేపట్టారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. క్రేన్‌ల సాయంతో ట్యాంకర్‌ను అక్కడినుంచి తొలగించారు.




ఉప్పల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన అతిపెద్ద దోమ బెలూన్

# బెలూన్ దోమ.. చూద్దామా!

ఉప్పల్ చౌరస్తాలో మలేరియా మహమ్మారిపై అవగాహన

**ఉప్పల్:** దోమల వల్ల మనుషులకు మలేరియా వ్యాధి సోకుతుందని కనిపెట్టిన సర్ రోనాల్డ్ రాస్‌ను ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా గుర్తుచేస్తూ ఉప్పల్ చౌరస్తా వద్ద మంగళవారం అతిపెద్ద బెలూన్ దోమ ఏర్పాటు చేశారు. ఈ బెలూన్‌ను ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులుతో కలిసి ఆవిష్కరించారు. హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ దోమలను తరిమికొట్టడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. వారానికి ఒక్కసారైనా నీటినిల్వల ప్రాంతాలను శుభ్రం చేసి దోమ లార్వాను అరికట్టాలన్నారు. ఈ బెలూన్ జనాలకు ఎంతో నేర్పుతుందని, దోమకాటు నష్టం, మలేరియా, డెంగీ వ్యాధులపట్ల అవగాహన కల్పిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ డిపార్టుమెంట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




దోమ బెలూన్ ఆవిష్కరిస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్, ఆంజనేయులు

# అదనపు విల్లాల కూల్చివేత

- హెచ్‌ఎండీఏ నుంచి 225 విల్లాలకే 'చిత్రపురి' అనుమతి
- నిబంధనలు అతిక్రమించి అదనంగా ఆరు నిర్మాణం
- కొరడా ఝుళిపించిన మణికొండ మున్సిపల్ అధికారులు



నేలమట్టం అవుతున్న విల్లా

**మణికొండ:** చిత్రపురి హౌసింగ్ సొసైటీలో ఉన్న అదనపు విల్లాలపై మణికొండ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. చిత్రపురి హౌసింగ్ సొసైటీలో ఈడబ్ల్యూఎస్, ఎంఐజీ, హెచ్ఐజీ, విల్లాల నిర్మాణాలకుగాను 2009లో హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు తీసుకున్నారు. 225 విల్లాల నిర్మాణాలకు అధికారులు అనుమతులు ఇవ్వగా, అప్పటి సొసైటీ కమిటీ మరో ఆరు విల్లాలను అదనంగా నిర్మించింది. విల్లాలను 1,530 చదరపు అడుగులతో నిర్మిస్తామంటూ అనుమతులు పొంది, ఏకంగా 2,250 చదరపు అడుగుల విస్తీర్ణంలో పనులు చేపట్టారు. 2022లో వాటిని రివైజ్ చేసి అనుమతించాలని హెచ్‌ఎండీఏకు మరోమారు దరఖాస్తు చేశారు. అది ఇప్పటివరకు పెండింగ్‌లోనే ఉంది. ఈ క్రమంలో అదనపు విల్లాలను తొలగించాలని కొందరు కోర్టును ఆశ్రయించారు. దాంతో అప్పట్లో మణికొండ మున్సిపాలిటీ అధికారులు కొన్ని విల్లాలను కూల్చివేశారు. అయినా తిరిగి వాటిని నిర్మిస్తుండటంతో మంగళవారం మణికొండ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ నేతృత్వంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు.

**అక్రమ నిర్మాణాలను సహించం...**

మున్సిపాలిటీ పరిధిలో తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అదనంగా నిర్మాణాలు చేపట్టవద్దని టీపీఓ సంతోష్‌సింగ్ అన్నారు. చిత్రపురిలో ఆరు విల్లాలను ఎక్కువగా నిర్మించటం, వాటిపై తరచూ ఫిర్యాదులు వస్తుండటంతో నేలమట్టం చేసే పనులు చేపట్టామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనుమతులను అతిక్రమించి అదనంగా చేపట్టే నిర్మాణాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. ఇటీవల 8 అపార్ట్‌మెంట్లలో వచ్చిన అదనపు అంతస్తులను కూల్చివేశామని, వారు తిరిగి నిర్మాణం చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అదనంగా నిర్మించేవాటికి రిజిస్ట్రేషన్‌లు చేయవద్దని, విద్యుత్ మీటర్లు, నీటి కనెక్షన్‌లు ఇవ్వవద్దని ఇప్పటికే ఆయా శాఖలకు లేఖలు రాశామని చెప్పారు.



చిత్రపురి కాలనీలో అదనపు విల్లాలను కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

# ఏనుగు ఎల్లీ సందడి

'గ్లెండేల్' విద్యార్థులతో ముచ్చట్లు

**బండ్లగూడ:** బొమ్మ ఏనుగు భావోద్వేగాన్ని కలిగించింది. విద్యార్థులతో ముచ్చటించి మురిపించింది. ఉల్లాసం నింపింది. పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్మెంట్ ఆఫ్ యానిమల్స్(పెటా) ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గ్లెండేల్ అకాడమీలో మెకానికల్ ఏనుగు ఎల్లీ.. విద్యార్థులను మంగళవారం పలకరించింది. ప్రముఖ నటి దియామీర్జా గొంతుతో సంభాషించింది. లైఫ్‌సైజ్ మెకానికల్ ఏనుగు ఎల్లీ అచ్చం నిజమైన ఏనుగులాగే కనురెప్పలు కొట్టడం, చెవులు విసరడం వంటివి చేయడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. చిన్నతనంలో తన తల్లి నుంచి విడిపోవడం, సర్కస్‌లో వేధింపులు, చివరకు తనను రక్షించిన తరువాత అభయారణ్యంలో సంతోషకరమైన జీవితం గడపడం గురించిన కథను ఏనుగు విద్యార్థులకు చెప్పడం విశేషం. ఈ సందర్భంగా స్కూల్స్ డైరెక్టర్ మిను సలూజ మాట్లాడుతూ జంతువులను నిర్బంధించడం, కొట్టడం వంటివి చేయవద్దని, పిల్లలు అర్థం చేసుకోవడానికి మెకానికల్ ఏనుగు ఎల్లీ కథ దోహదపడిందన్నారు. ఏనుగులు అడవిలో స్వేచ్ఛగా జీవించాలనే విషయం కూడా వారికి తెలిసివచ్చిందన్నారు. పెటా ఇండియా సీనియర్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ మీనాక్షి నారంగ్ మాట్లాడుతూ ఇతర జీవులు మనలాగే బాధ, భయం, ఆనందం, ప్రేమను అనుభవిస్తాయని, జంతువుపట్ల సానుభూతి అవసరమని మెకానికల్ ఏనుగు ఎల్లీ పిల్లలకు తెలిసే విధంగా వివరించిందన్నారు.

గ్లెండేల్ అకాడమీ విద్యార్థులతో ఏనుగు ఎల్లీ




# చిన్న తప్పిదాలకు ఇంత పెద్ద శిక్షా?

- ఆర్టీసీలో సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగుల ఆవేదన
- రోడ్డున పడ్డ 600 మందిని ఆదుకోవాలని 'ప్రజావాణి'లో వేడుకోలు

**లక్డీకాపూల్:** చిన్న, చిన్న తప్పిదాలకు కూడా ఇంత పెద్ద శిక్ష విధించాలా.. అంటూ ఆర్టీసీలో సస్పెన్షన్, తొలగింపునకు గురైన పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో చెదురుమదురు ప్రమాదాలు సహజమని, జరిగిన తప్పిదాలకు పనిష్మెంట్ వేయాలే కానీ, విధుల నుంచి తొలగించి తమ బతుకుల మీద దెబ్బకొట్టడం అన్యాయమని వాపోయారు. గత ఎనిమిదేళ్లలో 600 మంది ఉద్యోగులు సస్పెన్షన్, రిమూవల్‌కు గురై రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వారు నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డికి మొర పెట్టుకున్నారు. దీందీంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బాధితులకు ఆయన భరోసా ఇచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొ న్నారు.

**ప్రజావాణిలో 390 దరఖాస్తులు**

ప్రజావాణిలో మొత్తం 390 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 38 అర్జీలు వచ్చాయి. మైనారిటీ వెల్ఫేర్ 105, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి 37, విద్యుత్ 76, పౌరసరఫరాలు 36, ఇతర శాఖలకు సంబంధించి 97 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## దేశ సాంకేతిక వృద్ధికి మహిళలు దోహదం



నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వక్తలు

టీ హబ్ సమావేశంలో అభిప్రాయపడిన వక్తలు

**రాయదుర్గం:** దేశ సాంకేతిక, ఆర్థికవృద్ధికి దోహదపడేలా మహిళలను సన్నద్ధం చేసే లక్ష్యంతో సౌత్ ఏషియన్ విమెన్ ఇన్ టెక్ సంస్థ పనిచేస్తోందని వక్తలు అభిప్రాయపడ్డారు. తన లక్ష్యాన్ని హైదరాబాద్‌లో మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో హైదరాబాద్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా) సహకారంతో ఎస్‌ఏడబ్ల్యూఐటీ ఆధ్వర్యంలో ఒకరోజు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు, సీఐఐడబ్ల్యూఎన్ తెలంగాణ చైర్‌పర్సన్ విద్యారెడ్డి, ఫిక్కీ ఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ ప్రియా గజ్దర్, యూఎస్ హైదరాబాద్ కాన్సులేట్ పబ్లిక్ అఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారన్, వీహబ్ సీఈఓ సీత పల్లచోళ్ళ, హైసియా మేనేజింగ్ కమిటీ డైవర్సిటీ ఫోరమ్ లీడర్ జితాపుచా ప్రసంగించారు. నగరంలో కోటి మంది మహిళల కెరియర్ అడ్వాన్స్‌మెంట్ కోసం జనరేటివ్ ఏఐ స్కిల్స్‌తో హైదరాబాద్ ఔట్ రీచ్‌ను విస్తరించాలని ఎస్‌ఏడబ్ల్యూఐటీ నిర్ణయించిందని పేర్కొన్నారు. భారతదేశంలోని డిజిటల్ టాలెంట్ పూల్‌పై నాస్కామ్ నివేదిక ప్రకారం హైదరాబాద్ నగరానికి నాల్గవ స్థానం లభించింది. ఈ అంశాన్ని టీహబ్ సమావేశంలో గుర్తుచేశారు. దేశంలోని డిజిటల్ ప్రతిభలో 13–14 శాతం సాధించిందని వక్తలు పేర్కొన్నారు.

**సెప్టెంబర్ 21న ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్**

సౌత్ ఏషియన్ విమెన్ ఇన్ టెక్(ఎస్‌ఏడబ్ల్యూఐటీ), జీయూవీఐ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21న ఎస్‌ఏడబ్ల్యూఐటీ, ఏఐ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహించాలని, ఈ కార్యక్రమాన్ని మూడు విధాలుగా చేపట్టాలని నిర్ణయించారు. అందులో ఎస్‌ఏడబ్ల్యూఐటీ.ఏఐ లెర్నథాన్, ఎస్‌ఏడబ్ల్యూఐటీ.ఏఐ హ్యాకథాన్, ఎస్‌ఏడబ్ల్యూఐటీ.ఏఐ ఫెస్టివల్ వంటి పేర్లతో మూడింటిని నిర్వహించ తలపెట్టినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎల్ టెక్ చైర్‌పర్సన్ రోష్నినాడర్ మల్హోత్రా, విమెన్స్ ఎంపవర్‌మెంట్ అడ్వకేట్, నటి సమంతా రుత్‌ప్రభు, టీసీఎస్ సీనియర్ లీడర్ ఫర్హానాహక్ అడ్వైజరీ కౌన్సిల్ పర్యవేక్షణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## నగరంలో నేడు

- లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్ ట్రైనింగ్ వర్క్‌షాప్ ఉదయం 9.00 గంటల నుంచి హస్తినాపురంలోని శ్రీ భవిష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగుతుంది.
- అపోలో కేన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో రోబోటిక్ సహాయంతో బ్రెస్ట్ సర్జరీపై జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం జరుగుతుంది.
- కోల్‌కతా ఘటనకు నిరసనగా నిమ్స్‌లోని వైద్యులు, హెల్త్ కేర్ సిబ్బంది ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటలకు చీకట్లో వెలుగుతున్న క్యాండిల్ ఉన్న చిత్రాన్ని ఫోన్లలో డీపీగా వినియోగించనున్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



శాంతికుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

**గన్‌ఫౌండ్రీ:** ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కె.రఘోత్తంరెడ్డి, పీఆర్‌జీటీపీ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి పట్ల సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. టైం టేబుల్‌ను రివైజ్ చేయాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు శ్రీనివాసరెడ్డి, వేముల స్వప్న, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణగురు మార్గంలోనే మత సామరస్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యవరప్రసాద్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ప్రముఖ రచయిత సత్యభాయి శివదాస్ రచించిన 'సామాజిక తత్వవేత్త నారాయణగురు'పుస్తకాన్ని మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కుల, మతసామరస్యం రావాలంటే నారాయణగురు ఆలోచనలను ముందుకు తీసుకుపోవాలన్నారు. ఇతర మతాల గురించి తెలుసుకుంటేనే మతసామరస్యం వస్తుందన్నారు. ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడు ఉండాలని చెప్పిన గొప్పవ్యక్తి నారాయణ గురు అని అన్నారు. అందుకే ఆయనను కేరళ రాష్ట్రంలో దేవుడుగా భావిస్తారని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టు, కవి విల్సన్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్, ఆర్‌పీఐ జాతీయ ప్రధానకార్యదర్శి పేరం శివనాగేశ్వర్‌రావు, వీసీకే పార్టీ మహిళా అధ్యక్షురాలు కె.జయసుధ, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రతినిధి గీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రజకులపై సాంఘిక బహిష్కరణ దుర్మార్గం

- రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆశయ్య

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో రజకులను పెత్తందారులు సాంఘికంగా బహిష్కరించడం దుర్మార్గమని, వెంటనే దానిని ఎత్తివేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.ఆశయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పెత్తందారుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆశయ్య మాట్లాడుతూ రజకులకు చెందిన భూమి కబ్జాకు గ్రామాభివృద్ధి కమిటీ చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకున్నందుకు ఎనిమిది నెలల నుంచి పెత్తందారులు రజకులను సాంఘిక బహిష్కరణ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులకు కులవృత్తి పనులు కల్పించకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కూలీ పనులకు కూడా రానివ్వడం లేదని పాలు, రేషన్, కిరాణా సరుకులు కూడా ఇవ్వకుండా చేస్తున్నారని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని సాంఘిక బహిష్కరణ ఎత్తివేయించడంతోపాటు పెత్తందారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడిరాజు నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.వెంకటస్వామి, మారియాల గోపాల్, జ్యోతి, ఉపేందర్, మల్లేష్, పెద్దాపురం భాస్కర్, సైదులు, పి.వెంకన్న, ఆర్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రజక నాయకులు

## 'ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్' అవార్డుల ప్రదానం



ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ అవార్డుల పత్రాన్ని అందిస్తున్న టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు

**రాయదుర్గం:** ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ ఎస్‌డీజీ(సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) లీడర్‌షిప్ అవార్డుల ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ వేదికగా ఈ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి సస్టెయినబుల్ గోల్స్‌ను ముందుకు తీసుకెళ్లడంతోపాటు హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను గుర్తించి అవార్డులతో గౌరవించారు. ఈ సందర్భంగా వేవ్ మీడియా ఆధ్వర్యంలో లాభాపేక్ష లేని 'గుర్తింపు ఫౌండేషన్'ను కూడా ప్రారంభించారు. అయిదుగురు దివ్యాంగులు స్టార్టప్‌లను విజయవంతంగా ప్రారంభించేందుకు అవకాశం కల్పించారు. అవార్డులు పొందినవారిని టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో వేవ్ మీడియా ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ చైర్మన్, సీఈఓ కొప్పుల వసుంధర, వీహబ్ సీఈఓ సీతా పల్లచోళ్ళ, సీబీఎస్ వ్యవస్థాపకుడు ఐనెక్స్ అమర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, సిస్టర్ పరిమళ, నిహారిక్‌రెడ్డి, టీహబ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తాలూకా, టీవర్క్స్ సీఈఓ జోగిందర్ పాల్గొన్నారు.

**ర్యాపిడో–డీఈహబ్ ఇంక్యుబేటర్‌తో ఎంఓయూ**

ప్రముఖ క్యాబ్ సర్వీస్ కంపెనీ ర్యాపిడో–డీఈహబ్ ఇంక్యుబేటర్‌తో సంయుక్త భాగస్వామ్యాన్ని (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంతో దివ్యాంగులు, మహిళలు, లింగమార్పిడి వ్యక్తులకు ఎలక్ట్రిక్ ఆటోలు, మూడు చక్రాల స్కూటర్లను అందిస్తూ, విలువైన ఉపాధి అవకాశాలను సృష్టించనుంది. దేశంలో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన మొట్టమొదటి డిజిటల్ చానెల్ అయిన జవాబు టీవీని ప్రారంభించారు.

## మహిళల రక్షణ దిశగా 'బోర్డు' ప్రతిజ్ఞ



**కంటోన్మెంట్:** మహిళల రక్షణ, గౌరవం, భద్రత దిశగా కంటోన్మెంట్ అధికారులు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ జాయింట్ సీఈఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పల్లవి విజయ్‌వన్షీ ఆధ్వర్యంలో మంగళవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో సిబ్బందితో ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అకృత్యాల నేపథ్యంలో రక్షాబంధన్‌ను పురస్కరించుకుని సిబ్బందిలో సోదరభావాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కంటోన్మెంట్ ఉద్యోగులతో ''మేము, కంటోన్మెంట్ అధికారులు/ సిబ్బంది మహిళల గౌరవం, భద్రతకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేస్తున్నాం... ''అంటూ ప్రతిజ్ఞ చేయించారు. మహిళల గౌరవం, రక్షణ, సాధికారిత, సమానత్వం దిశగా చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బోర్డు అధికారులు దేవేందర్, ఉమాశంకర్, నర్సింగ్ రావు, యానీ, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 21, ఆగస్టు, 2024

# రెడీ.. సెట్.. GO!

మరో 4 రోజుల్లో హైదరాబాద్ మారథాన్

ఘనంగా టీషర్ట్, మెడల్ లాంచ్ ఈవెంట్

ముఖ్య అతిథిగా ప్రముఖ బాక్సర్ నిఖత్ జరీన్


నిఖత్ జరీన్

సాక్షి, సిటీబ్యూరో: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మోస్ట్ అవెయిటెడ్ ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ ఈవెంట్ మరో నాలుగు రోజుల్లో జరగనుంది. ప్రతి సంవత్సరం కంటే ఈసారి సరికొత్తగా మన ముందుకు రానుంది. నగరంలోని ఓ హోటల్‌లో మారథాన్‌కు సంబంధించి టీషర్ట్, మెడల్స్ లాంచ్ ఈవెంట్ మంగళవారం జరిగింది. ఇందులో ఎన్ఎండీసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అమితవ ముఖర్జీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు హెడ్ బ్రాంచ్ బ్యాంకింగ్ సౌత్ నిరీశ్ లలన్, ప్రముఖ బాక్సర్ నిఖత్ జరీన్ పాల్గొన్నారు. 13వ ఎడిషన్ మారథాన్‌కు వరల్డ్ అథ్లెటిక్స్ గుర్తింపు రావడంతో మరింత ప్రత్యేకత సంతరించుకుందని రేస్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చా పేర్కొన్నారు. 30 రాష్ట్రాల నుంచి దాదాపు ఈ ఏడాది 25,500 మంది మారథాన్‌లో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఈ మారథాన్‌కు ప్రపంచస్థాయి ఏర్పాట్లు చేశామని వివరించారు. మారథాన్‌లో పాల్గొనే రన్నర్ల సంఖ్య పరంగా చూసుకుంటే.. భారత్‌లోనే అతిపెద్ద రెండో పరుగు ఇదని పేర్కొన్నారు.

ఈ మారథాన్‌లో 42 కిలోమీటర్ల దూరం రన్నర్లు పరుగెత్తనున్నారు. ఫుల్ మారథాన్‌తో పాటు హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు కూడా ఉంటుంది. ఇటీవలే ఈ మారథాన్ డ్రైరన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మారథాన్‌లో మొత్తం రూ.48 లక్షల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. మారథాన్ మొదటి రోజైన 24వ తేదీన ఉదయం 7 గంటలకు ఫన్ రన్ పేరుతో 5కే రన్ ఉంటుంది. ఇది అసలు మారథాన్‌కు కర్టెన్‌రైజర్ లాంటిది. ప్రతిఒక్కరూ రన్నింగ్‌ను సెలబ్రేట్ చేసుకునేందుకు ఈ ఫన్ రన్ ఏర్పాటు చేశారు. ఇది హైటెక్స్‌లో ఉంటుంది. ఇక మరుసటి రోజు అసలు ఫుల్ మారథాన్ ప్రారంభం అవుతుంది. పీపుల్స్ ప్లాజా వద్ద ఉదయం మారథాన్ ప్రారంభం అవుతుంది. రాజ్‌భవన్ రోడ్డు, పంజాగుట్ట ఫ్లైఓవర్, కేబీఆర్ పార్కు, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, మైండ్ స్పేస్ జంక్షన్, బయోడైవర్సిటీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, హెచ్‌సీయూ మీదుగా గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియం వద్ద ముగుస్తుంది. హాఫ్ మారథాన్ పీపుల్స్ ప్లాజా వద్ద ప్రారంభమై.. 21 కి.మీ. దూరం ఉండేలా నిర్దేశించిన మార్గంలో రన్ ఉంటుంది. గచ్చిబౌలి స్టేడియం వద్ద ముగుస్తుంది.

ప్రైజ్‌మనీ.. రూ.48 లక్షలు






## ఆర్టిస్టిక్ లైసెన్స్.. 25న..

సాక్షి, సిటీబ్యూరో: కవితలు, కథలు, సంగీతం, హాస్యం.. ఇలా ఏదైనా సరే మనకు నచ్చిన/వచ్చిన అంశంపై కొన్ని నిమిషాల పాటు మన ఇష్టాన్ని, ప్రతిభను ప్రదర్శించేందుకు వీలుగా ఆర్టిస్టిక్ లైసెన్స్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. మనకు పట్టున్న ఏ భాషలోనైనా సరే ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. ఈ నెల 25న జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్ నగర్‌లో ఉన్న అలైన్ హబ్‌లో నిర్వహిస్తున్న ఈ ఓపెన్ మైక్ కార్యక్రమం సాయంత్రం 5గంటల నుంచి ప్రారంభమవుతుంది.

## స్టార్టప్స్ కోసం మీట్.. 24న

సాక్షి, సిటీబ్యూరో: ఔత్సాహిక వ్యాపారవేత్తల కోసం ది ఫౌండర్స్ కాంక్లేవ్ స్టార్టప్ మీటప్ నగరంలో జరుగుతోంది. కొండాపూర్‌లోని గోకర్ణ కో వర్కింగ్ స్పేస్‌లో ఈ నెల 24న జరగనున్న ఈ కార్యక్రమంలో భిన్న రంగాల ప్రముఖులు వైశాలి నియోటియా, నీతా సచన్, రత్నాకర్ సామవేదం హాజరై ప్రసంగిస్తారు. కార్యక్రమం సాయంత్రం 4గంటలకు ప్రారంభమై రాత్రి 7గంటల వరకూ కొనసాగుతుంది.



# 'హరేకృష్ణ' టెంపుల్ 430 అడుగులు



హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో నిర్మాణం

గోష్పాద క్షేత్రంలో ఆరెకరాల స్థలంలో..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నగరం మరో ఆధ్యాత్మిక కట్టడానికి ముస్తాబవుతోంది. హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో 'హరే కృష్ణ హెరిటేజ్ టవర్' పేరుతో 430 అడుగుల ఎత్తులో అద్భుతమైన దేవాలయాన్ని నిర్మించనున్నారు. నార్సింగిలోని గోష్పాద క్షేత్రంలో ఆరు ఎకరాల స్థలంలో నిర్మించనున్నారు. శ్రీరాధా, కృష్ణుల అద్భుతమైన విగ్రహాలతో పాటు సీతారామచంద్రులు, గౌర నితాయి విగ్రహాలను ఈ దేవాలయంలో ప్రతిష్ఠించనున్నారు. శ్రీనివాస గోవిందుడి కోసం పూర్తిగా రాతి నుంచి దేవాలయాన్ని చెక్కనున్నారు. ఈ ప్రాజెక్టులో కాకతీయులు, చాళుక్యులు, ద్రవిడ సంస్కృతి, విభిన్నమైన పురాతన కాలం నాటి దేవాలయ కట్టడాల సంస్కృతి ఉట్టిపడేలా నిర్మాణాలు చేపట్టనున్నారు. శ్రీకృష్ణ గోసేవ మండల్ ఈ ప్రాజెక్టుకు భూసేవక్‌లుగా వ్యవహరించనున్నారు. ఈ క్యాంపస్‌లో లైబ్రరీ, మ్యూజియం, థియేటర్, పిల్లలు, యువతకు ఆధ్యాత్మిక, సంస్కృతి, సంప్రదాయాలపై బోధనలు చేసేందుకు భగవద్గీత హాల్స్ నిర్మించనున్నారు. ఇక, ఈ దేవాలయ నిర్మాణానికి సంబంధించి అనంత శేష స్థాపన కార్యక్రమం ఈ నెల 23వ తేదీన జరగనుంది. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే హరేకృష్ణ మూమెంట్ చైర్మన్ శ్రీమధు పండిట్ దాస ప్రభుజీ, అక్షయ పాత్ర ఫౌండేషన్ చైర్మన్ శ్రీసత్య గౌర చంద్ర దాస ప్రభు జీ తదితరులు పాల్గొననున్నారు.



# క్రేజీ.. మిక్సాలజీ..

సిటీలో ఆదరణ పెంచుకుంటున్న కాక్‌టెయిల్ మిక్సింగ్

మిక్సాలజిస్ట్‌గా మారడంపై యూత్‌లో ఆసక్తి

- సిటీలో వర్క్‌షాప్స్, శిక్షణ తరగతులకు యువత
- మిక్సాలజీ, బార్టెండింగ్ ఛాంపియన్‌షిప్స్ కూడా షురూ..

వంటకాలను అందంగా తీర్చిదిద్దే క్యులినరీ ఆర్ట్ కావొచ్చు.. పానీయాలను వైవిధ్యంగా మేళవించే కాక్‌టెయిల్ మిక్సింగ్ కావొచ్చు.. కాదేదీ కళ కావడానికి అనర్హం అంటోంది ఆధునిక ప్రపంచం.. ఇప్పుడు కాక్‌టెయిల్ మిక్సింగ్ మిక్సాలజీ పేరుతో మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ కళను ఒంట బట్టించుకుంటే అత్యాధునిక జీవనశైలితో పాటు అనూహ్యమైన ఆదాయం కూడా అందుతుండటంతో యువత తమలోని కల సాకారం కోసం మిక్సాలజీ కళని క్రేజీగా సాధన చేస్తున్నారు. వీరిని మరింత ప్రోత్సహించేందుకు మిక్సాలజీ ఛాంపియన్ షిప్స్ సైతం జరుగుతున్నాయి. ఇటీవలే ఢిల్లీలో జరిగిన డియాగో రిజర్వ్ వరల్డ్ క్లాస్ బార్టెండింగ్ ఛాంపియన్ షిప్‌లో టాప్-16లో నిలిచిన వారిలో నగరానికి చెందిన గణేష్ బోయినపల్లి మొదటి స్థానంలో నిలవడం సిటీలో యువతకు ఈ కెరీర్ పట్ల ఉన్న క్రేజ్‌కి ఓ నిదర్శనం.

- సాక్షి, సిటీబ్యూరో



## అభ్యాసమే.. అభివృద్ధి

గతంతో పోలిస్తే తాజాగా మేము నిర్వహించిన అల్టిమేట్ బార్టెండింగ్ ఛాంపియన్‌షిప్‌కు అత్యధిక సంఖ్యలో యువత హాజరవడం ఈ రంగంపై పెరుగుతున్న ఆదరణకు నిదర్శనం. ఈ రంగంలో నైపుణ్యాల అభివృద్ధికి నిరంతర అభ్యాసం అవసరం. బ్రాండ్‌లు బార్టెండర్లు తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చడంలో సహాయపడటానికి శిక్షణ, మార్గదర్శకత్వం వనరులను అందించడం వంటివి యువతకు ఊతమిస్తున్నాయి. కాక్‌టెయిల్‌లను తయారు చేసేటప్పుడు మిక్సాలజిస్ట్‌లు తమ నైపుణ్యాలను నిరంతరం సానబెట్టాల్సిందే. తమ పని ఎవరినీ ఆకట్టుకోవడం కాదు. అతిథులను సంతోషపెట్టడం మాత్రమే అని మిక్సాలజిస్ట్‌లు గుర్తుంచుకోవాలి.

- గౌరవ్ షరీన్, ప్రముఖ మిక్సాలజిస్ట్

సంప్రదాయ రుచులను ఆధునిక పద్ధతులతో మిళితం చేస్తూ మిక్సాలజీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. క్రాఫ్ట్ కాక్‌టెయిల్‌లు ప్రీమియం స్పిరిట్‌ల పట్ల పెరుగుతున్న ఆదరణతో సిటీలో కాక్‌టెయిల్ మేకర్స్ అయిన బార్టెండర్‌లు తమ కళకు మరింత సానబెట్టుకుంటున్నారు. మరోవైపు నవతరం సైతం ఈ రంగంలోకి ప్రవేశించేందుకు ఉత్సాహం చూపుతోంది.

### ఉపాధికి ఊతం..

ఒకప్పుడు మిక్సాలజీ తెలిసిన బార్టెండర్లు కేవలం బార్లకు మాత్రమే పరిమితం అయ్యేవారు. అయితే ఇప్పుడు ఫైవ్‌స్టార్ హోటల్స్, లాంజ్‌లు, పబ్స్, క్లబ్స్.. వంటివి బాగా పెరిగాక మిక్సాలజిస్ట్‌గా బార్టెండర్లకు గౌరవప్రదమైన పేరు వచ్చింది. అలాగే మిక్సాలజీ ఒక సబ్జెక్ట్‌గా ప్రాచుర్యంలోకి వచ్చింది. కేవలం ఆల్కహాల్ డ్రింక్స్ మాత్రమే కాకుండా మాక్‌టైల్స్, పండ్ల రసాలు, ఎనర్జీ డ్రింక్స్.. ఇలా విభిన్న రకాల పానీయాలతో ఈ మిక్సాలజిస్ట్‌లు వెరైటీ డ్రింక్స్ తయారు చేస్తూ వినియోగదారుల ఆదరణతో పాటు మంచి టిప్స్, రూ.50 వేల వరకూ నెలవారీ ఆదాయం పొందుతున్నారు. దీంతో ఈ ప్రొఫెషన్ ఇప్పుడు యువతకు ప్యాషన్‌గా మారింది.



### కాక్‌టెయిల్స్‌లోనూ హెల్తీ స్టైల్స్..

కరోనా తర్వాత వినియోగదారులు సంప్రదాయ పానీయాల వైపు మొగ్గు చూపడం లేదు. దాంతో మిక్సాలజిస్టులు మెనూలను రూపొందించే విధానంలో పూర్తి మార్పు వచ్చింది. సుగంధ ద్రవ్యాలు, మూలికలు పండ్ల వంటి స్థానిక పదార్థాలతో సైతం ప్రయోగాలు చేస్తున్నారు. ఈ మార్పు వల్ల విభిన్నమైన రుచిని అందించే కాక్‌టెయిల్‌లకు డిమాండ్ పెరిగింది. మారుతున్న ట్రెండ్‌లు వినియోగదారుల ప్రాధాన్యతలతో, బార్టెండర్‌లు తమ కెరీర్‌ను బలోపేతం చేసుకోవడానికి ప్రత్యేకమైన సువాసనగల పానీయాలను రూపొందించడానికి కొత్త పద్ధతులను నిరంతరం అన్వేషిస్తున్నారు.



## కె పాప్ పోటీలో సిటీ విజేతలు వీరే..

సాక్షి, సిటీబ్యూరో: కొరియన్ కల్చరల్ సెంటర్ ఇండియా (కేసీసీ) సహకారంతో ప్రముఖ గృహోపకరణ ఉత్పత్తుల బ్రాండ్ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా కె పాప్ పోటీల్లో స్థానిక విజేతలను ప్రకటించారు. ఈ ప్రాంతీయ పోటీల్లో ఆన్‌లైన్ ఆడిషన్స్ ద్వారా గానంలో నగరానికి చెందిన షైలీ ప్రీతమ్, నృత్యంలో సెజల్ దుబేలు గెలుపొందారని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. కొరియన్ పాప్ సంస్కృతికి పట్టం గట్టే అభిమానుల కోసం నిర్వహిస్తున్న జాతీయ పోటీలో భాగంగా ఈ ప్రాంతీయ పోటీలు జులై 27న ప్రారంభమయ్యాయి. బెంగళూరు, కొహిమా, కోల్‌కతా, ముంబై, ఇటానగర్, చెన్నై, ఢిల్లీల తర్వాత నగరంలో ప్రాంతీయ రౌండ్ జరిగింది. ఇవి సెప్టెంబర్ 1 వరకు 11 ప్రాంతాల్లో జరుగుతాయని, వీటి ద్వారా ఎంపికైన విజేతలు ఢిల్లీలో జరిగే సెమీ ఫైనల్స్‌లో పాల్గొంటారని నిర్వాహకులు వివరించారు.




# మె'న్యూ'

ఇటాలియన్ రుచుల టొస్కానో





సాక్షి, సిటీబ్యూరో: సిటీకి ఎన్ని రుచులు పరిచయం అవుతున్నా.. ఎప్పటికీ వన్నెతరగని విదేశీ టేస్ట్‌గా ఇటాలియన్ రుచుల్ని చెప్పొచ్చు. సిటిజనుల్లో ఇటాలియన్ రుచుల ప్రియత్వానికి అనుగుణంగా టొస్కానో పేరిట మరో రెస్టారెంట్ ఏర్పాటైంది. సైబరాబాద్‌లోని నాలెడ్జ్ సిటీ రోడ్‌లో నెలకొల్పిన ఈ రెస్టారెంట్‌ను ఇటలీ రుచులకు ప్రసిద్ధి చెందిన చెఫ్ గౌతమ్ మంగళవారం ప్రారంభించారు. నగరవాసులు గతంలో రుచి చూడని, ఇటలీలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన వంటకాల్ని తాము అందిస్తున్నామని, నేరుగా ఇటలీ నుంచి దిగుమతి చేసుకున్న అత్యుత్తమ ముడి పదార్థాలు, చీజ్‌లను ఉపయోగించి ప్రత్యేక మెనూ తయారు చేశామన్నారు. క్లాసిక్ మార్గెరిటా పిజ్జా, చికెన్ డి టోస్కానో తదితర ఇటలీ వంటకాలు నగరవాసుల్ని ఆకట్టుకుంటాయన్నారు.



మూవింగ్ ఇమేజెస్ ఫిల్మ్‌క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు

- ఈనెల 23 నుంచి 25 వరకు ప్రదర్శనలు, చర్చలు
- జాతీయ, అంతర్జాతీయ చిత్రాల ప్రదర్శన



# సినీమహోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రేక్షకాదరణ పొందిన సినిమా ఉత్సవాలకు హైదరాబాద్ మరోసారి వేదిక కానుంది. మూవింగ్ ఇమేజెస్ ఫిల్మ్‌క్లబ్ 20 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 23వ తేదీ నుంచి 25 వరకు బంజారాహిల్స్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో వివిధ భాషలకు చెందిన చిత్రాలను ప్రదర్శించనున్నారు.

- 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా సాయంత్రం 5.45 గంటలకు మరాఠీ కామెడీ చిత్రం 'బైపన్ భారీ దేవ' ప్రదర్శించనున్నారు. ప్రముఖ మరాఠీ సినీనటులు వందనాగుప్తా, సుకన్య కుల్‌కర్ణి ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.
- 24వ తేదీ రెండవ రోజు మరో అద్భుతమైన చిత్రం 'అఫ్వాహ్' ప్రదర్శించనున్నారు. 'రాత్ కీ సుబ్హా నహీ', ధారావి, చమేలి వంటి ఎన్నో అత్యుత్తమ చిత్రాలను రూపొందించిన ప్రముఖ దర్శకుడు సుధీర్ మిశ్రా ఈ చిత్ర ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అదేరోజు మధ్యాహ్నం అమల అక్కినేని, శార్వానంద్, రితూవర్మ తదితరులు నటించిన తమిళ చిత్రం 'కనమ్' ప్రదర్శన ఉంటుంది. చిత్ర దర్శకుడు శ్రీకార్తీక్ ఈ కార్యక్రమానికి హాజరవుతారు.
- 25న ప్రముఖ సినిమాటోగ్రాఫర్ అసీమ్ మిశ్రాతో ముఖాముఖి చర్చా కార్యక్రమం ఉంటుంది. పాన్‌సింగ్ తోమర్, న్యూయార్క్, బ్యాండ్ బాజా వంటి పలు చిత్రాలకు ఆయన సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. అలాగే చివరి రోజు చిత్రాల్లో భాగంగా 'కాడ్వీ హవా' (చేదు గాలి) సినిమాను ప్రదర్శించనున్నారు. ఎలాంటి టిక్కెట్లు లేవు, అర్థవంతమైన స్ఫూర్తిదాయకమైన సినిమాలను ప్రేక్షకలోకానికి పరిచయం చేసే లక్ష్యంతో ఈ సినీమహోత్సవం నిర్వహిస్తున్నట్లు మూవింగ్ ఇమేజెస్ ఫిల్మ్‌క్లబ్ నిర్వాహకులు సంఘమిత్ర మాలిక్ తెలిపారు.

### ప్రదర్శనలు ఇలా..

- 23వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు బైపన్ భారి దేవ మరాఠీ సినిమా ప్రదర్శన.
- 24వ తేదీ ఉదయం 11.30 గంటలకు హిందీ సినిమా అఫ్వా. మధ్యాహ్నం 3 గంటలకు తమిళ సినిమా కనమ్ ప్రదర్శన ఉంటుంది.
- 25వ తేదీ ఉదయం 11.30 గంటలకు సినిమాటోగ్రాఫర్ అసీమ్ మిశ్రాతో చర్చా కార్యక్రమం, మధ్యాహ్నం 12 గంటలకు కాడ్వి హవా సినిమా ప్రదర్శన.

### మూవింగ్ ఇమేజెస్ ఫిల్మ్‌క్లబ్ ప్రస్థానం..


ప్రముఖ దర్శకులు బిమల్‌రాయ్ కూతురు అపరాజిత సిన్హా మూవింగ్ ఇమేజెస్ ఫిల్మ్ క్లబ్‌ను 2004 ఆగస్టు 28వ తేదీన స్థాపించారు. ఉత్తమ చిత్రాలకు విశేషమైన ప్రాచుర్యం కల్పించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ క్లబ్ ప్రముఖ కవి, రచయిత, దర్శకులు గుల్జార్ సాహెబ్ చేతులమీదుగా ప్రారంభమైంది. 20 ఏళ్లుగా కొనసాగుతున్న అత్యుత్తమ చిత్రాల ప్రదర్శనలో భాగంగానే ప్రస్తుతం 20 ఏళ్ల వేడుకలను నిర్వహిస్తున్నట్లు సంఘమిత్ర చెప్పారు. విభిన్న భాషలకు చెందిన సినీ దర్శకులు, రచయితలు, నటీనటులు ఈ వేడుకల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

# పరదా కడితే.. పడదా?

**పెచ్చులు కిందపడకుండా పరదాలు కట్టిన వైనం**

**పెనుగొండ జెడ్పీ పాఠశాలలో పిల్లల దుస్థితి**


పెనుగొండ జెడ్పీ హైస్కూల్ స్లాబ్‌కు పరదాలు కట్టిన దృశ్యం.. చదువుకుంటున్న విద్యార్థులు


పెనుగొండ హైస్కూల్‌లోని గదిలోని పెచ్చులూడిన స్లాబ్

కేసముద్రం: తరగతి గదుల్లో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న ఓ బడిలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువు నెట్టుకొచ్చేస్తున్నారు. తాత్కాలికంగా పరదాలు కట్టి అడ్డు పెట్టినా ఒక్కోసారి పెద్ద పెద్ద పెచ్చులను పరదాలు కూడా ఆపలేకపోతున్నాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పిల్లల దుస్థితి మాత్రం మారలేదు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ జెడ్పీ హైస్కూల్‌లో 165 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 9 గదులకు గాను ఒక గది స్టోర్ రూం, మరో గది స్టాఫ్‌కు కేటాయించారు. పాఠశాలలో స్లాబ్ శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులు ఊడిపడుతూ, ఇనుప సలాక్‌లు కిందకు వేలాడుతున్నాయి. ఇలా నాలుగు తరగతి గదుల్లో పై పెచ్చులు పడుతుండటంతో వాటిని తప్పించుకునేందుకు పిల్లలు ప్రాణభయంతో బయటకు పరుగులు తీస్తున్నారు. ఇక వర్షం పడినప్పుడల్లా స్లాబ్ కురుస్తుండటం, దాంతో పాటు పెచ్చులు పడుతుండటంతో పిల్లలను పక్కనే ఉన్న డైనింగ్ హాల్‌లో కూర్చోబెడుతున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి తెలిపారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి తదితరులు

# ‘ట్రిపుల్ ఆర్’ సూపర్ గేమ్‌చేంజర్

- రూ. 22 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం
- దీంతో నెక్ట్స్ లెవల్‌లో తెలంగాణ అభివృద్ధి
- క్రెడాయ్ స్టేట్‌కాన్ సదస్సులో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి,హైదరాబాద్: ఔటర్‌రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) హైదరాబాద్‌కు ఎలాగైతే గేమ్ చేంజర్‌గా మారిందో, రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) కూడా తెలంగాణకు సూపర్ గేమ్‌చేంజర్‌గా మారుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రూ.22 వేల కోట్లతో ట్రిపుల్ ఆర్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు ఆయన వెల్లడించారు. భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) ఆధ్వర్యంలో మంగళవారం హైటెక్స్‌లోని నోవాటెల్ హోటల్‌లో ‘తెలంగాణ గోయింగ్ గ్లోబల్’ థీమ్‌తో స్టేట్‌కాన్ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తమ్ మాట్లాడుతూ మూసీ రివర్‌ఫ్రంట్, ట్రిపుల్ ఆర్, మెట్రో విస్తరణ, ముచ్చర్ల ఫోర్త్ సిటీ, స్కిల్స్ యూనివర్సిటీ వంటి బృహత్తర కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, వీటితో రాష్ట్ర అభివృద్ధి నెక్ట్స్ లెవల్‌కు దూసుకెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీర్చడంతోపాటు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం ఉన్న కార్మికులను తయారు చేసేందుకు స్కిల్స్ వర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలో భూముల విలువలు పెంచడంతో పాటు స్టాంప్ డ్యూటీని తగ్గించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదు.. అంతర్జాతీయ నగరాలతో పోటీ పడేస్థాయికి భాగ్యనగరం ఎదిగిందని కొనియాడారు. రాష్ట్ర ప్రగతిలో డెవలపర్లు కూడా భాగస్వాములేనని, నిర్మాణ రంగ సమస్యలను లిఖిత పూర్వకంగా ఇస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## వైఎస్సార్ దూరదృష్టితోనే : మంత్రి కోమటిరెడ్డి

ఉమ్మడి ఏపీలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి కాల పరిమితి పెట్టుకొని, ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ అభివృద్ధికి బాటలు వేశారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 24 నెలల డెడ్‌లైన్‌లోనే ఔటర్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు భూసేకరణ, నిర్మాణ పనులు పూర్తి చేశారని, వీటికి సమాంతరంగా పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేను నిర్మించారని చెప్పారు. దీంతో మాదాపూర్, హైటెక్ సిటీకే పరిమితమైన ఐటీ రంగం వైఎస్సార్ దూరదృష్టితో కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు విస్తరించిందన్నారు. ఔటర్ చుట్టూ 16 రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని, రహదారుల డిజైన్లు డీపీఆర్ దశలో ఉన్నాయని తెలిపారు. ఫోర్త్ సిటీలో అహ్మదాబాద్ తరహాలో క్రికెట్ స్టేడియం నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ఈమేరకు బీసీసీఐ ప్రతినిధులతో సమావేశమయ్యారని చెప్పారు. అనంతరం సీబీఆర్ఈ, సీఆర్ఈడీఏఐ సంయుక్తంగా రూపొందిన ‘తెలంగాణ గోయింగ్ గ్లోబల్’ నివేదికను మంత్రులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే అనిల్, క్రెడాయ్ తెలంగాణ చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, ప్రెసిడెంట్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ప్రెసిడెంట్(ఎలెక్ట్) ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేఆర్ఎంబీ పరిధిలోకి శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు

**సెప్టెంబరు 9కి విచారణ వాయిదా వేసిన సుప్రీంకోర్టు**

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని విద్యుదుత్పత్తి ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి అనుమతులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం విద్యుదుత్పత్తి చేస్తోందని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల ధర్మాసనం విచారించింది. ఈ అంశానికి సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చామని, అఫిడవిట్ దాఖలు చేశామని కేంద్రం తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలిపారు. విద్యుదుత్పత్తికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం కోర్టుకు విజ్ఞప్తి చేసింది. అనంతరం, ఎండ్ ఆఫ్ ద బోర్డుగా ఈ కేసు సెప్టెంబరు 9 నాటి జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. కేఆర్ఎంబీ పరిధిలోకి ఆయా ప్రాజెక్టులను తీసుకురావడంపై తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకత తెలుపుతూ ఇప్పటికే అఫిడవిట్ దాఖలు చేసింది.

## పేదల జీవితాల్లో మార్పు తేవడమే లక్ష్యం

**‘సెర్ప్–బ్రాక్’ అవగాహన ఒప్పంద కార్యక్రమంలో మంత్రి సీతక్క**



సాక్షి, హైదరాబాద్: నిరుపేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), వివిధ దేశాల్లో పేదరిక నిర్మూలనకు పని చేస్తున్న బ్రాక్ ఇంటర్నేషనల్ అనే అంతర్జాతీయ సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం మేరకు రాష్ట్రంలోని కొమురంభీం ఆసిఫాబాద్, ములుగు, నాగర్‌కర్నూల్, నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా నాలు గు వేల అత్యంత పేద కుటుంబాలను గుర్తించి వారిని పేదరికం నుంచి బయటకి తెచ్చేలా ‘బ్రాక్’ పనిచేయనుంది. మూడేళ్ల పాటు ఆ కుటుంబాలకు నైపుణ్యశిక్షణ ఇవ్వడంతోపాటు మెరుగైన జీవనోపాధి కల్పన దాకా అన్ని విధాలుగా బ్రాక్ సహాయ సహకారాలు అందించనుంది. కార్యక్రమంలో పీఆర్ కార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, బ్రాక్ ఇంటర్నేషనల్ సంస్థ ఇండియన్ హెడ్ శ్వేతా బెనర్జీ, ఆగాఖాన్ ఫౌండేషన్ సీఈవో టిన్ని స్వహ్ని, ప్రధాన్, క్రిస్ప్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రపంచస్థాయి బ్యాంకింగ్ సేవలకు కట్టుబడి ఉన్నాం

**ఐదు కొత్త ఎస్‌బీఐ బ్రాంచీల ప్రారంభోత్సవంలో ఎస్‌బీఐ ఎండీ చల్లా శ్రీనివాసులు శెట్టి**



సాక్షి, హైదరాబాద్: ప్రపంచస్థాయి బ్యాంకింగ్ సేవలు, సదుపాయాల కల్పనకు తాము కట్టుబడి ఉన్నామని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ (ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ), చైర్మన్‌గా నియామకమైన (డిజిగ్నేట్) చల్లా శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. ఎస్‌బీఐకు సంబంధించిన ఐదు కొత్త బ్రాంచీలను మంగళవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. రామచంద్రపురంలో బ్యాంక్ ప్రాంతీయ వ్యాపార కార్యాలయం, గచ్చిబౌలిలో స్పెషలైజ్డ్ కరెన్సీ అడ్మినిస్ట్రేషన్ బ్రాంచీ, జీనోమ్‌వ్యాలీ, మల్లంపేట, మలేసియన్ టౌన్‌షిప్ బ్రాంచీలను ప్రారంభించారు. వీటితో పాటే హైదరాబాద్ ప్రాంతీయ ప్రధాన కార్యాలయంలో ఆధునీకరించిన ఎంట్రెన్స్ లాబీని కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ ప్రపంచంలోనే టాప్–20 బ్యాంకులలో ఒకటైన దేశంలోనే అత్యంత పటిష్టమైన బ్యాంకుకు తాను ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేశ్‌కుమార్, జీఎం ఎన్‌డబ్ల్యూ–2 ప్రకాశ్‌చంద్ర బరార్, జీఎం ఎన్‌డబ్ల్యూ–1 రవికుమార్ వర్మ, జీఎం(ఓఎస్‌డీ) శ్రీనివాసు రాచపల్లి, డిప్యూటీ జీఎంలు, ఇతర సీనియర్ మేనేజ్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# మౌన ‘మార్గ’ం.. ఇదీ క్విడ్ ప్రోకో కుట్ర

- చంద్రబాబు కుట్రలు, కుంభకోణాలకు ‘ఈనాడు’ అండ
- ‘మార్గదర్శి’ అక్రమ డిపాజిట్ల దందాకు బాబు రక్షణ
- అక్రమ డిపాజిట్లపై కుట్రపూరిత మౌనం అందుకే
- అటు తెలంగాణ ప్రభుత్వానిదీ అదే వ్యూహాత్మక మౌనం

సాక్షి, అమరావతి: అసలు సిసలైన క్విడ్‌ప్రోకో అంటే ఇదే..! చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు, కుంభకోణాలకు ఈనాడు కొమ్ము కాస్తోంది. అందుకు ప్రతిగా ఆ పత్రిక యాజమాన్యం అక్రమ ఆర్థిక సామ్రాజ్యం మార్గదర్శి ఫైనాన్సియర్స్ అవకతవకలకు చంద్రబాబు సర్కారు రక్షణగా నిలుస్తోంది!! అందుకే ‘మార్గదర్శి’ అక్రమ డిపాజిట్లపై న్యాయస్థానంలో వైఖరి తెలిపేందుకు ససేమిరా అంటోంది. కుట్రపూరితంగా మౌనం పాటిస్తూ సామాన్య డిపాజిట్‌దారుల ప్రయోజనాలను గాలికొదిలేస్తోంది. మార్గదర్శి యాజమాన్యంతో కుమ్మక్కు కుట్రలో ఇటు చంద్రబాబు సర్కారు అటు తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడబలుక్కున్నట్లు ఒకే రీతిలో వ్యవహరిస్తున్నాయి.

**బాబు కుట్రపూరిత మౌనం.. ‘మార్గదర్శి’కి వత్తాసు**

మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల దందాకు చంద్రబాబు ప్రభుత్వం వత్తాసు పలుకుతోంది. ఆ కేసు విచారణను తీవ్ర జాప్యం చేసేలా వ్యవహరిస్తుండటమే అందుకు నిదర్శనం. ‘మార్గదర్శి ఫైనాన్సియర్స్’ పేరిట ఈనాడు రామోజీరావు కుటుంబం యథేచ్ఛగా సాగించిన అక్రమ డిపాజిట్ల దందా ఆధారాలతో సహా బట్టబయలైన విషయం తెలిసిందే. మార్గదర్శి పేరుతో ఏకంగా రూ.2,600 కోట్లకుపైగా అక్రమ డిపాజిట్లు సేకరించారని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇప్పటికే అత్యున్నత న్యాయస్థానానికి నివేదించింది. ఈ నేపథ్యంలో ఆ అక్రమ డిపాజిట్లపై విచారణ నిర్వహించాల్సిందేనని సుప్రీంకోర్టు తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. అంతేకాదు.. ఏపీ, తెలంగాణలో మార్గదర్శి డిపాజిట్‌దారుల ప్రయోజనాలను పరిరక్షించాలని స్పష్టం చేసింది. అందుకోసం మార్గదర్శి అక్రమ డిపాజిట్ల అంశంపై ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు తమ వైఖరిని తెలంగాణ హైకోర్టుకు వెల్లడించాలని పేర్కొంది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆర్బీఐ తెలంగాణ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అయితే ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం, తెలంగాణలో రేవంత్‌రెడ్డి సర్కారు దీనిపై స్పందించలేదు. ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాది మంగళవారం తెలంగాణ హైకోర్టులో ఈ కేసు విచారణకు హాజరైనా పూర్తిగా మౌన ప్రేక్షకపాత్రకే పరిమితం కావడం గమనార్హం. తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కూడా మౌనమే వహించారు. ఇదే అదునుగా ‘మార్గదర్శి’ తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఈ కేసు విచారణను సాగదీసేందుకు ఎత్తుగడ వేశారు. ‘మార్గదర్శి’ సేకరించినవి అక్రమ డిపాజిట్లేనన్న ఆర్బీఐ అఫిడవిట్‌పై తమ వైఖరిని వెల్లడించేందుకు సమయం కావాలని కోరారు. దీంతో తెలంగాణ హైకోర్టు ఈ కేసు విచారణను సెప్టెంబరు 11కు వాయిదా వేసింది. మార్గదర్శి అక్రమ డిపాజిట్ల అంశంపై ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు తమ వైఖరిని తెలియచేస్తూ రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

**కోర్టులు క్రియాశీలం.. ప్రభుత్వాలు ఉదాశీనం**

‘మార్గదర్శి’ అక్రమ డిపాజిట్ల వ్యవహారంపై న్యాయ వ్యవస్థ క్రియాశీలంగా వ్యవహరిస్తోంది. అక్రమ డిపాజిట్ల వ్యవహారంలో నిగ్గు తేలాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. డిపాజిటర్ల పేర్లు, డిపాజిట్ల వివరాలను జిల్లాల వారీగా ప్రకటించాలని.. ఎంతమందికి డిపాజిట్లు వెనక్కి ఇచ్చారో పరిశీలించాలని కూడా ఆదేశించడం గమనార్హం. ఆరు నెలల్లో ఈ కేసు విచారణను పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టుకు నిర్దేశించింది. ఈ క్రమంలో ‘సుప్రీం’ ఆదేశాలతో తెలంగాణ హైకోర్టు ఈ కేసు విచారణను సత్వరం చేపట్టింది. కాగా ‘మార్గదర్శి’ సేకరించినవి అక్రమ డిపాజిట్లేనని ఆర్బీఐ తెలంగాణ హైకోర్టుకు లిఖితపూర్వకంగా వెల్లడించింది. ఈ కేసులో న్యాయస్థానాలు, ఆర్బీఐ చురుగ్గా వ్యవహరిస్తుండగా డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి ఉదాశీన వైఖరిని ప్రదర్శిస్తున్నట్లు స్పష్టమవుతోంది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం.. ‘మార్గదర్శి’ డిపాజిటర్ల వివరాలను జిల్లాలవారీగా ప్రకటిస్తామని, వారికి డిపాజిట్ల మొత్తం చెల్లించారో లేదో పరిశీలిస్తామని, ఎంతమందికి డిపాజిట్లు తిరిగి చెల్లించారు? ఎంతమందికి చెల్లించ లేదు? అనే అంశాలపై వాస్తవాలు తెలుసుకుని తెలంగాణ హైకోర్టు వెల్లడిస్తామని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చెప్పాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఆ బాధ్యతను నిర్వర్తించాల్సింది ఈ రెండు ప్రభుత్వాలే. అయితే ఆ మాట చెప్పేందుకు ఇటు చంద్రబాబు ప్రభుత్వానికిగానీ అటు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి గానీ మనస్కరించడం లేదు. మార్గదర్శి యాజమాన్యానికి పరోక్షంగా సహకరించాలనే ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

**మళ్లీ అదే కుతంత్రం..**

రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ‘మార్గదర్శి’ అక్రమ డిపాజిట్ల దందాకు వత్తాసు పలుకుతోంది. ‘మార్గదర్శి’వి అక్రమ డిపాజిట్లేనని స్వయంగా ఆర్బీఐ నిగ్గు తేల్చడంతో రామోజీ కుటుంబం అడ్డంగా దొరికిపోయింది. ఈ కేసు విచారణను ఆరు నెలల్లో పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టును సుప్రీం కోర్టు ఆదేశించడంతో రామోజీ కుటుంబం తీవ్ర ఆందోళన చెందుతోంది. దీంతో మీ అక్రమాలకు అండగా నేనున్నానంటూ చంద్రబాబు మరోసారి కుట్రలకు తెరతీశారు. అక్రమ డిపాజిట్లపై ప్రభుత్వ వైఖరిని చెప్పకుండా వీలైనంత జాప్యం చేసేలా కుట్ర పన్నుతున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో అఫిడవిట్ దాఖలు చేయాల్సి వస్తే ‘గోడ మీద పిల్లి’ వైఖరి అనుసరించాలని భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇక జిల్లాల వారీగా డిపాజిటర్ల వివరాల వెల్లడి, వారికి డిపాజిట్ మొత్తాన్ని చెల్లించారో లేదో పరిశీలన ప్రక్రియ చేపట్టే ఉద్దేశమే లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా పరిగణించాలని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మార్గదర్శి డిపాజిటర్లకు న్యాయం చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని స్పష్టం చేస్తున్నారు.

## నాడు కొట్టివేతకు బాబు ప్రభుత్వ సహకారం

**కేసును నిలబెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం**

1995 నుంచి 2004 వరకు చంద్రబాబు సర్కారు అండతోనే ఈనాడు అధిపతి చెరుకూరి రామోజీరావు (ఇటీవల మరణించారు) ఉమ్మడి ఏపీలో యథేచ్ఛగా అక్రమ డిపాజిట్ల దందా సాగించారు. దీనిపై 2006లో నాటి ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో రామోజీ వసూలు చేసినవి అక్రమ డిపాజిట్లేనని ఆర్బీఐ స్పష్టం చేయడంతో ఆయన అనివార్యంగా మార్గదర్శి ఫైనాన్సియర్స్‌ను మూసివేశారు. సేకరించిన డిపాజిట్ల మొత్తాన్ని డిపాజిట్‌దారులకు చెల్లించేసినట్లు చెప్పారు. అయితే సేకరించిన డిపాజిట్లు, డిపాజిట్‌దారుల వివరాలు, వారికి తిరిగి చెల్లించిన మొత్తం వివరాలను వెల్లడించాలని కోరుతూ ఉండవల్లి అరుణ్‌కుమార్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వైఎస్సార్ హఠాన్మరణం అనంతరం అధికారంలోకి వచ్చిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాలు ఈ కేసును పట్టించుకోలేదు.

2014లో రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం రామోజీ అక్రమ డిపాజిట్ల దందాకు అండగా నిలిచింది. ఈ క్రమంలో 2018 డిసెంబర్‌లో మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై కేసును కొట్టివేయడం గమనార్హం. అయితే డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీల్ చేయాల్సిన నాటి చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. ఉమ్మడి ఏపీ హైకోర్టు తీర్పును ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో సవాల్ చేసినా చంద్రబాబు ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడుతూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఆ కేసులో ఇంప్లీడ్ అయింది. తద్వారా ఆ కేసు నిలిచేలా చేసింది.

## ‘ఎల్‌ఆర్‌ఎస్’పై వివరణ ఇవ్వండి

**రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు**

సాక్షి, హైదరాబాద్: ఎల్‌ఆర్‌ఎస్‌పై పూర్తి వివరాలతో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని సీఎస్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శికి స్పష్టం చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ ప్రాసెసింగ్ కోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జూలై 30న జారీ చేసిన మెమో చెల్లుబాటును సవాల్ చేస్తూ కరీంనగర్ జిల్లాకు చెందిన జువ్వాడి సాగర్‌రావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సుప్రీంకోర్టు పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌లను మూడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పడం చట్టవిరుద్ధమన్నారు. సేల్‌డీడ్‌తో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కూడా ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించాలంటూ ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ విచారణ వాయిదా వేసింది.

## జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి



**పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం**

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ కాటా ఆమ్రపాలిని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. వివిధ శాఖల అదనపు బాధ్యతల నుంచి ఆమెను తప్పిస్తూ.. ఆయా పోస్టుల్లో ఇతర ఐఏఎస్ అధికారులను నియమించింది. ఈ మేరకు పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్‌కు మూసీ నది అభివృద్ధి సంస్థ(ఎంఆర్‌డీసీఎల్) ఎండీగా అదనపు బాధ్యతలను అప్పగించారు. హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ కోట శ్రీవత్సకు హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక వెయిటింగ్‌లో ఉన్న ఫాహత్ బాజ్‌పాయ్‌ను కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా, నారాయణపేట అదనపు కలెక్టర్ (స్థానిక) మయాంక్ మిత్తల్‌ను జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా స్థాన చలనం కల్పించారు.

# చందాదారులెవరు?

▶ మొదటి పేజీ తరువాయి

దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్ 31న తీర్పునిచ్చింది. అయితే అనంతరం ఈ తీర్పును సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (వైఎస్సార్ సీపీ హయాంలో) సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేశాయి. మరోవైపు తీర్పులో కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లు అన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన తీర్పును 2024 ఏప్రిల్ 9న కొట్టివేసింది. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ.. మార్గదర్శి డిపాజిట్ల సేకరణకు సంబంధించి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని పేర్కొంది.

**మార్గదర్శి అక్రమాలను ఆర్బీఐ కౌంటర్‌లో తేల్చింది..:** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో తెలంగాణ హైకోర్టు తాజాగా మరోసారి విచారణ ప్రారంభించింది. సీనియర్ జడ్జి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టాలన్న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వాన్ని, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ని ప్రతివాదుల జాబితాలో చేర్చింది. గత విచారణ (ఈనెల 6వతేదీన) సందర్భంగా కౌంటర్ దాఖలుకు చివరి అవకాశం ఇవ్వాలన్న ఆర్‌బీఐ వినతికి అంగీకరిస్తూ ఇకపై ఈ పిటిషన్లను మోషన్ లిస్ట్‌లో పేర్కొనాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ క్రమంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ వసూలు చేసిన డిపాజిట్లన్నీ చట్టవిరుద్ధం, అక్రమమేనని, అందుకు బాధ్యులను ప్రాసిక్యూట్ చేయాలని నివేదిస్తూ ఈ నెల 13న ఆర్బీఐ తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. ఈ క్రమంలో మంగళవారం జస్టిస్ సుజోయ్‌పాల్ నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కోర్టు సహాయకులుగా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. ఏపీ ప్రభుత్వ న్యాయవాదితోపాటు తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావు, ఆర్బీఐ న్యాయవాది కె.రతంగపాణిరెడ్డి హాజరయ్యారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ చట్టం 45 (ఎస్)ను ఉల్లంఘించినట్లు ఆర్బీఐ కౌంటర్‌లో తేల్చిందని ఈ సందర్భంగా ఉండవల్లి హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీని ఆధారంగా మార్గదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని నివేదించారు. దాదాపు 70 వేల మంది చందాదారుల వివరాలను 1,500కిపైగా పేజీల్లో మార్గదర్శి సుప్రీం కోర్టుకు సమర్పించిందని, ఆ వివరాలను హైకోర్టుకు కూడా పెన్‌డ్రైవ్‌లో అందజేసేలా ఆదేశించాలని కోరారు. దీనిపై జస్టిస్ సుజోయ్‌పాల్ స్పందిస్తూ.. వివరాలు కోరుతూ ఓ అఫిడవిట్ దాఖలు చేయాలని, ఆ మేరకు ఆర్బీఐ, మార్గదర్శికి ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంటూ తదుపరి విచారణను వాయిదా వేశారు.

# బెయిల్ అంశాల్లో ఆలస్యమెందుకు?



**ఎమ్మెల్సీ కవిత కేసులో ఈడీని ప్రశ్నించిన సుప్రీంకోర్టు**

**తదుపరి విచారణ ఈనెల 27కు వాయిదా**

సాక్షి, న్యూఢిల్లీ: బెయిల్ అంశాల్లో కౌంటర్ల దాఖలుకు ఆలస్యమెందుకో అర్థం కావడం లేదని సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బీఆర్.గవాయి, జస్టిస్ కేవీ.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కవిత తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలు అని తెలిపారు. కేసులో సహ నిందితుడైన సిసోడియాకు బెయిల్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే కేసులో సీబీఐ కౌంటర్ దాఖలు చేయగా, ఈడీ కౌంటర్ దాఖలు చేయలేదని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ.రాజు ధర్మాసనానికి తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. బెయిల్ అంశాల్లో కౌంటర్ల దాఖలుకు ఆలస్యమెందుకు? కోర్టులో కేసు డైరీతోనే నిర్ణయం ఉంటుందంటూ ఈడీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పీఎంఎల్‌ఏ సెక్షన్ 45లో కఠిన నిబంధనల నుంచి మహిళగా కవితకు మినహాయింపు ఉందని ముకుల్ రోహత్గి ప్రస్తావించగా... పీఎంఎల్‌ఏ కఠిన నిబంధనలు ఎందుకెలా వర్తిస్తాయో కింది కోర్టుల న్యాయమూర్తులు వివరణాత్మక కారణాలు తెలిపారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కవితకు ఎందుకు బెయిల్ ఇవ్వలేదో హైకోర్టు కారణాలు వివరించిందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సమయంలో కవితకు మధ్యంతర ఊరట కల్పించాలని ముకుల్ రోహత్గి కోరగా. ధర్మాసనం నిరాకరించింది. ఈడీ బుధవారం కౌంటర్ దాఖలు చేస్తే శుక్రవారం వాదనలు వినిపిస్తామని రోహత్గి తెలిపారు. దీంతో, ఈడీ తరఫు కౌంటర్ దాఖలు చేయడానికి గురువారం వరకూ సమయం ఇవ్వాలని రాజు కోరగా, ఆదేరోజు కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని, శుక్రవారం రిజాయిండర్ దాఖలు చేయా లని పిటిషనర్‌ను ఆదేశించిన ధర్మాసనం.. తదుపరి విచారణ ఈ నెల 27కు వాయిదా వేసింది.

# కాంగ్రెస్సే కవితకు బెయిల్ ఇప్పిస్తోంది




**ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ కుమ్మక్కు: బండి సంజయ్**


మహేశ్వరం: కేసీఆర్ కూతురు కవితకు కాంగ్రెస్ పార్టీయే బెయిల్ ఇప్పిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇందుకు సంబంధించిన కేసును కాంగ్రెస్ నుంచి కాబోయే రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీయే కోర్టులో వాదిస్తున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో మంగళవారం నిర్వహించిన సూర్యగిరి రేణుక ఎల్లమ్మ ఉత్సవాలకు హాజరైన సంజయ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. కేసీఆర్ సూచించిన వారికే రాష్ట్రంలో మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులు, రాజ్యసభ సీట్లు వస్తున్నాయని తెలిపారు. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ నేతలు కేసీఆర్ ఫాంహౌస్‌కు క్యూ కడుతున్నారని వ్యాఖ్యానించారు. అభిషేక్ సింఘ్వీ అనుభవజ్ఞుడైన న్యాయవాది అని, ఆయన తెలంగాణ నుంచి ఎంపీ అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం కోర్టుల్లో, పార్లమెంట్‌లో గట్టిగా వాదిస్తారనుకుంటే .. లిక్కర్ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న కవిత బెయిల్ కోసం వాదిస్తున్నారని ఎద్దేవా చేశారు.

# కావాలనే కవితను జైలులో ఉంచారు

**వచ్చే మంగళవారం బెయిల్ వస్తుందని ఆశిస్తున్నాం**

**మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్**


ప్రశాంత్‌రెడ్డి


శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కవితను ఇబ్బంది పెట్టడానికే ఆమెను జైలులో ఉంచారని మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఢిల్లీ మద్యం విధానం కేసు, ఈడీ, సీబీఐలు వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. వచ్చే మంగళవారం సర్వోన్నత న్యాయస్థానం కవితకు బెయిల్ మంజూరు చేస్తుందనే నమ్మకం ఉందన్నారు. మంగళవారం ఢిల్లీలోని సుప్రీంకోర్టు వద్ద ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. మద్యం కేసు వ్యవహారంలో ఈడీ, సీబీఐల తీరు హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. ఏ–2గా ఉన్న మనీశ్ సిసోడియాకు బెయిలు మంజూరు కాగా, ఏ–13గా ఉన్న కవిత బెయిల్ విషయంలో ఇన్ని అడ్డంకులు సృష్టిస్తూ, దర్యాప్తు సంస్థలు కౌంటర్ దాఖలు చేయకపోవడం దారుణమని, ఉద్దేశపూర్వకంగానే కవితను జైలులో ఉంచారనే విషయం దీని ద్వారా స్పష్టమైందన్నారు.

## ఇద్దరు తెలంగాణ జియో శాస్త్రవేత్తలకు జాతీయ అవార్డులు

**రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ్ము చేతులమీదుగా అందుకున్న ప్రొ.నరసింహ, డా.ప్రశాంత కుమార్**

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన ఇద్దరు జియో శాస్త్రవేత్తలకు 2023 ఏడాదికిగాను ప్రతిష్టాత్మకమైన నేషనల్ జియో సైన్స్ అవార్డులు లభించాయి. మైనింగ్, మినరల్ బెనిఫిసియేషన్ సస్టైనబుల్ మినరల్ డెవలప్‌మెంట్ విభాగంలో ఐఐటీ హైదరాబాద్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్‌కు చెందిన ప్రొఫెసర్ నరసింహ మంగదొడ్డి, అప్లైడ్ జియోసైన్సెస్ విభాగంలో హైదరాబాద్ నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌జీఆర్ఐ) సీఎస్ఐఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బంటు ప్రశాంత కుమార్ పాత్రోలు ఈ అవార్డును అందుకున్నారు. మంగళవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సమక్షంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వీరికి అవార్డులను అందజేశారు.

### అందమైన పెదవుల కోసం ...



- ప్రతిరోజు రాత్రి పడుకోబోయే ముందు బీట్‌రూట్ జ్యూస్‌ని అప్లై చేసి పడుకుంటే పెదవులు పగడాల్లా కాంతులీనుతాయి.
- పడుకునే గంట ముందు కొబ్బరి నూనెతో పెదవులను మసాజ్ చేస్తే మరింత నునుపుతేలతాయి.
- వెన్నతో పెదవులను సుతిమెత్తగా మసాజ్ చేస్తే అవి గులాబి రంగులోకి మారడమే కాకుండా మృదువుగా మారుతాయి.
- ఒక టీ స్పూన్ తేనె, అర టీ స్పూన్ నిమ్మరసం, కొన్ని చుక్కల గ్లిజరిన్‌ని కలిపిన మిశ్రమాన్ని పది నిమిషాలపాటు మసాజ్ చేస్తే పెదవులు నునుపు తేలడమే కాకుండా వాటిపై సన్నని గీతలు మటుమాయమవుతాయి.
- కొత్తిమీర జ్యూస్‌తో పెదవులని నాజూగ్గా మసాజ్ చేస్తే గులాబీ పెదవులు మీ సొంతమవుతాయి.
- నేతిలో గులాబీ రేకులను మెదిపిన మిశ్రమంతో మసాజ్ చేస్తే పెదవులపై ఉండే గరుకుదనాన్ని తొలగించవచ్చు.

## విన్ వీధిలో మెరిసినా...
# పాదాలు నేల మీదే

**చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా సరే... ఆత్మస్థైర్యంతో ఆకాశంకేసి చూడాలి. పెద్ద కలలు కనాలి. కష్టపడి సాధించాలి. కల నెరవేరిన తరువాత ఆకాశంలో ఉండిపోకూడదు. మన పాదాలెప్పుడూ నేల మీదే ఉండాలి. మన దేశంలోని జులేఖ, చైనా దేశానికి చెందిన యకిన్ ఈ విషయాన్ని చెప్పకనే చెబుతున్నారు...**



జులేఖ

## పేవ్‌మెంట్ నుంచి ఒలింపిక్స్ వరకు

పేవ్‌మెంట్‌ల దగ్గర భిక్షాటన చేసిన అమ్మాయి ఆ తరువాత కాలంలో ఒలింపిక్స్‌లో పాల్గొనే స్థాయికి చేరుకుంది. ఇది సినిమా కథ కాదు. నిజ జీవిత కథ. ముంబైకి చెందిన జులేఖ కథ. అనాథాశ్రమంలో పెరిగిన జులేఖ వాలీబాల్ ఆటలో ప్రావీణ్యం సంపాదించింది. ఆ ఆట ఆమెను అబుదాబి స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ సమ్మర్ గేమ్స్‌లో పాల్గొనేలా చేసింది.

మంచం మీద పడుకోవడం 'లగ్జరీ' విషయమేమీ కాదు. జులేఖ షేక్‌కు మాత్రం లగ్జరీనే!

పదహారు సంవత్సరాల క్రితం శుక్రాపూర్ హైవేపై ఎనిమిదేళ్ల జులేఖా షేక్ కాలికి గాయమై పడి ఉండడాన్ని పోలీసులు గమనించి చికిత్స కోసం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.



జులేఖా షేక్

ఆ ఆసుపత్రిలో జులేఖ ఫ్యాన్ కింద బెడ్‌పై పడుకుంది. ఇది తనకు సరికొత్త అనుభవం. కటిక నేల మీద తప్ప ఆమె ఎప్పుడూ బెడ్ మీద పడుకోలేదు. భిక్షాటన చేయడం, ఏదో ఒకటి తిని కడుపు నింపుకోవడం, రాత్రి పడుకోవడానికి స్థలం వెదుక్కోవడం... స్థూలంగా ఇది తన జీవితం.

ఆసుపత్రి నుంచి బయటికి వచ్చిన తరువాత జులేఖను ఒక అనాథాశ్రమంలో చేర్పించారు పోలీసులు. అలా ఆమెకు అనికేత్ సేవాభవి సంస్థ నిర్వాహకురాలు కల్పన వర్పే పరిచయ భాగ్యం కలిగింది. ఆ తరువాత జులేఖ జీవితమే మారిపోయింది.

కట్ చేస్తే... అబుదాబి 2019 స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ సమ్మర్ గేమ్స్‌లో వాలీబాల్‌లో మన దేశానికి ప్రాతినిధ్యం వహించడమే కాదు కాంస్య పతకం గెలుచుకుంది. ఇప్పుడు ఆ పతకం తనకు పతకం మాత్రమే కాదు... కొత్త జీవితం... కొత్త శక్తి! ఈ పతకం గురించి అడిగిన వారికి, అడగని వారికి అందరికీ చూపిస్తూ ఎంతోసేపు సంతోషంగా మాట్లాడుతుంది జులేఖ.

*గతంలోకి వెళితే...*

గ్రౌండ్‌లో అబ్బాయిలు వాలీబాల్ ఆడుతున్నారు. 'సర్, నేను ఆడవచ్చా' అని స్పోర్ట్స్ టీచర్ అశోక్ రామచంద్రన్ నాంగ్రాను అడిగింది జులేఖ. 'కుదరదు' అని ఆయన అని ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. ఆయన పచ్చ జెండా ఊపడంతో గ్రౌండ్‌లోకి అడుగుపెట్టింది. రోజులు గడుస్తున్న కొద్దీ అబ్బాయిలతో సమానంగా, వారిని మించి వాలీబాల్ ఆడడం మొదలుపెట్టింది. ఆ ప్రతిభ తనని రాష్ట్ర, అంతర్‌రాష్ట్ర స్థాయిలో ఎన్నో గేమ్స్ ఆడేలా చేసింది. అబుదాబి ఒలింపిక్స్ కోసం తొలిసారి విమానం ఎక్కడం జులేఖ జీవితంలో మరచిపోలేని మధురమైన అనుభవం.

'బాల్యంలో ఎన్నో కష్టాలు పడి ఉండడం వల్ల మొదట్లో చాలా హైపర్‌గా కనిపించేది. ఆలోచనలు స్థిరంగా ఉండేవి కాదు. ఆ తరువాత ఆమెలో ఎంతో మార్పు వచ్చింది. ఏదైనా సాధించి తనను తాను నిరూపించుకోవాలనే పట్టుదల పెరిగింది' అంటుంది జులేఖ గురించి కల్పనా వర్పే.

'రాత్రి పడుకోవడానికి చోటు వెదుక్కోవడం ఒకప్పుడు కష్టంగా ఉండేది. అనాథాశ్రమంలో చేరిన తరువాత ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్య ఉన్నట్లే ఉండేది. ఎన్నో పద్ధతులు నేర్చుకున్నాను. సెలవుల్లో అమ్మడానికి మట్టి ప్రమిదల నుంచి గ్రీటింగ్ కార్డ్స్ తయారు చేయడం వరకు ఎన్నో చేశాను' అని గతాన్ని గుర్తు చేసుకుంది జులేఖ. కొత్త జీవితాన్ని ఇచ్చిన అనికేత్ సేవాభవి సంస్థకు తన జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకుంది.

'ఇక్కడి వారి పట్ల ఆమె చూపుతున్న శ్రద్ధ, ప్రేమ అపురూపంగా అనిపిస్తుంది. చుట్టుపక్కల నుంచి వచ్చిన వారికి వేడి వేడి చాయి చేసి ఇస్తుంది. వారికి ధైర్యం చెబుతుంటుంది' అని జులేఖ గురించి ప్రశంసాపూర్వకంగా చెబుతుంది కల్పనా వర్పే. ఒకప్పటి జులేఖలాంటి అమ్మాయిలు ఇప్పుడు కూడా ఫుట్‌పాత్‌ల మీద కఠినమైన జీవితాన్ని గడుపుతూ ఉండవచ్చు. అలాంటి వారికి కొత్త జీవితం ఇవ్వాలనేది జులేఖ కల.





యకిన్

## ఒలింపిక్స్ నుంచి రెస్టారెంట్‌లో పనికి!




ఒలింపిక్స్‌లో పాల్గొనడం గొప్ప. పతకం గెల్చుకోవడం మరింత గొప్ప. అసలుసిసలు ఆటగాళ్లు విజయాన్ని ఆస్వాదిస్తారు తప్ప తల కెక్కించుకోరు అని చెప్పడానికి ఒలిపింక్స్‌లో రజత పతకం గెల్చుకున్న చైనా జిమ్నాస్ట్ యకిన్ ఒక ఉదాహరణ.

పద్దెనిమిది సంవత్సరాల ఝూ యకిన్ ఒలింపిక్స్ నుంచి ఇంటికి వచ్చిన తరువాత ఎప్పటిలాగే తన కుటుంబానికి చెందిన రెస్టారెంట్ పనుల్లో పడిపోయింది. ఒలింపిక్ యూనిఫామ్‌లో తమ రెస్టారెంట్‌లో ఎప్పటిలాగే కస్టమర్‌లకు వడ్డిస్తున్న వీడియోని చూస్తూ 'షీ గాట్ ఏ సిల్వర్, బట్ గేవ్ ఏ గోల్డ్ సర్వీస్' అంటున్నారు నెటిజనులు. సెంట్రల్ చైనాలోని హునాన్ ప్రావిన్స్‌లోని హెంగ్యాంగ్ సిటిలో ఈ రెస్టారెంట్ ఉంది. చైనా నుంచి ప్యారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న అయిదుగురు జిమ్నాస్ట్‌లలో యకిన్ ఒకరు.

'ఈ అందమైన చైనీస్ జిమ్నాస్ట్ గుర్తుందా?' అనే కాప్షన్‌తో 'ఎక్స్'లో షేర్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఒలింపిక్స్ విజయాన్ని, కుటుంబ బాధ్యతలతో సమన్వయం చేసుకుంటున్న యకిన్‌పై నెటిజనులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. చేస్తున్న పని చిన్నదా, పెద్దదా అనేది పక్కన పెడితే పనిని గౌరవించడం మన బాధ్యత. పనికి మనం ఇచ్చే గౌరవం వృథా పోదు... ఉన్నత స్థాయికి తీసుకువెళుతుందని చెప్పడానికి కూడా ఝూ యకిన్ నిలువెత్తు ఉదాహరణ.

లీగల్



## బ్యాంకు వారికి ఆ హక్కు లేదు

**ప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ – గ్రాట్యుటీని బ్యాంకు వారు లోన్ బకాయిల రీత్యా జమ కట్టుకోవచ్చా?**

ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్న మాధవరావు (పేరు మార్చాము) అనే ఒక వ్యక్తి కోవిడ్ సమయంలో సేవలు నిర్వహిస్తూ కన్నుమూశారు. ఆయన మరణానంతరం తన వారసులకు –భార్యకు రావలసిన కుటుంబ పెన్షన్, గ్రాట్యుటీ వంటి అంతిమ ఆర్థిక ప్రయోజనాలు (టెర్మినల్ బెనిఫిట్స్) భార్య అకౌంట్లోకి వచ్చాయి. అయితే, అలా అకౌంట్‌లోకి వచ్చిన వెంటనే సదరు బ్యాంకు అధికారులు పెన్షన్ మొత్తాన్ని మాధవ రావు బతికుండగా తీసుకున్న లోన్ బకాయి కింద జమ కట్టుకున్నారు. ఇదెక్కడి అన్యాయం అని ప్రశ్నించిన సదరు ఉద్యోగి భార్యను 'ఇది మా హక్కు' మీ ఆయన మా బ్యాంకులో లోను తీసుకోవడమే కాక, తన టెర్మినల్ బెనిఫిట్స్ నుంచి కూడా రికవరీ చేసుకోవచ్చు అని మాకు రాసి ఇచ్చారు. అంతేకాక మీ భర్త పని చేసిన డిపార్ట్‌మెంట్ వారికి, మా బ్యాంకుకు మధ్య ఒక ఒప్పందం కూడా ఉంది. అందువలన మేము ఆ మొత్తాన్ని లోను కింద జమ కట్టుకున్నాము' అని చెప్పి ఆవిడని వెళ్ళిపొమ్మన్నారు.

అప్పుడు ఇద్దరు మైనర్ పిల్లల తల్లి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం జరిగింది. వాదోపవాదాలు విన్న తర్వాత, పలు హైకోర్టులు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఆధారం చేసుకుని, మరీ ముఖ్యంగా సి.పి.సి లోని సెక్షన్ 60 (1) నిబంధనల ప్రకారం ''టర్మినల్ బెనిఫిట్స్ లోనుంచి వచ్చిన నిధులను, ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ (పీ.ఎఫ్) వంటి సామాజిక సంక్షేమ పథకాల ద్వారా సంక్రమించిన నిధులను ఏ బ్యాంకు అయినా, కోర్టు అయినా అలా తీసుకోవడానికి, అటాచ్మెంట్ చేయడానికి వీలు లేదు'' అని తీర్పునిస్తూ ''ఆ మహిళ అకౌంట్‌లో నుంచి లోను బకాయి పేరుతో బ్యాంకు వారు తీసేసుకున్న డబ్బులు మొత్తం తిరిగి ఆ మహిళకు చెల్లించవలసిందే'' అని ఆదేశించింది. అప్పటికీ కూడా బ్యాంకు వారు తిరిగి చెల్లించకపోవడంతో గౌరవ హైకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు కూడా వేయాల్సి వచ్చింది. మొత్తానికి సదరు మహిళకి ఆ డబ్బులు మొత్తం బ్యాంకు వారు తిరిగి చెల్లించారు. బ్యాంకు వారికి లోన్ రికవరీ చేసే అధికారం వున్నప్పటికీ, చట్ట పరిధిలో ఉండి మాత్రమే రికవరీ చేయాల్సి వుంటుంది. లోన్ తీసుకునే ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే... బ్యాంకు లోన్ తీసుకున్నప్పుడు 'లోన్ ఇన్సూరెన్స్' అనే పథకాన్ని ఎంచుకోవాలి. అంటే, రుణ బకాయిలు ఉండగా లోన్ తీసుకున్న వ్యక్తి మరణించినా, ఏదైనా శాశ్వత వైకల్యం వంటివి కలిగి ఉపాధి కోల్పోయిన సమయాలలో వారు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా ఉండచ్చు. ఇన్సూరెన్స్ కంపెనీ వారు మీ బదులు లోన్ కడతారు. మీ కుటుంబ భవిష్యత్తు బాగుంటుంది. కొన్ని లోన్‌ఖాతాలకి లోన్ ఇన్సూరెన్స్ తప్పనిసరి అయినప్పటికీ, బ్యాంకు వారు కూడా లోన్ ఇన్సూరెన్స్ గురించి అందరికీ చెప్పి, ఖచ్చితంగా ఇన్సూరెన్స్ తీసుకునేలా చేస్తే మంచిది.



**– శ్రీకాంత్ చింతల,**
హైకోర్ట్ అడ్వకేట్

యోగం



## ఏకాగ్రతకు వారియర్ పోజ్

యుద్ధానికి శరీరాన్ని సిద్ధం చేస్తున్నట్టుగా ఈ యోగా భంగిమలు ఉంటాయి. అందుకే, దీనిని వారియర్ పోజ్ అంటారు.

ఈ యోగ భంగిమలో ఒక కాలి తుంటి భాగం ముందుకి ఉంటుంది. మరొక కాలు వెనక్కి చాపి, మునివేళ్ల మీద ఉంచాలి. చేతులను తలమీదుగా నిటారుగా ఉంచి, నమస్కారం చేసినట్టుగా కలపాలి. దృష్టి రూఫ్ వైపుగా ఉండాలి. కొద్దిగా వెనక్కి వంగడం వల్ల వెన్నెముక సాగుతుంది. భుజాలు, ఇరువైపులా శరీర కదలికలు ఈ భంగిమలో ఉంటాయి. అంతర్గత సామర్థ్యానికి ప్రతీకగా చెబుతుంటారు కాబట్టి దీనిని వీరభద్ర ఆసనం అని కూడా అంటారు. దీనిని రోజూ సాధన చేయడం వల్ల తుంటి, కాళ్లు, చీలమండలం, పాదాల ఎముకలకు బలం చేకూరుతుంది. కండరాలను టోనింగ్ చేస్తుంది.

కాళ్లలో శక్తి సమకూరుతుంది. బలం, ఏకాగ్రత, ధైర్యం వంటి మానసిక స్థైర్యం ఈ ఆసన సాధన వల్ల కలుగుతాయి. శ్వాస తీసుకుంటూ, నెమ్మదిగా వదులుతూ ఐదు సార్లు ఈ ఆసనాన్ని సాధన చేయాలి. అన్ని వయసుల వారు చేయచ్చు. ఆర్థరైటిస్ మోకాళ్ల నొప్పులు ఉన్నవాళ్లు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.



**– జి.అనూష,** యోగా నిపుణులు

## మష్రూమ్ కాఫీ మానియా

మష్రూమ్ వంటకాల గురించి తెలిసిన చాలామందికి 'మష్రూమ్ కాఫీ' గురించి తెలియకపోవచ్చు. నిజానికి ఇది లేటెస్ట్ కాఫీ ఏమీ కాదు. 1930 నుంచే ఆహా అనిపిస్తోంది. ఔషధ పుట్టగొడుగుల నుంచి దీన్ని తయారు చేస్తారు.

**ఈ కాఫీ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి...**

- మంచి నిద్రకు ఉపయోగపడుతుంది
- మష్రూమ్ కాఫీలోని అడాప్టోజెనిక్ శరీరానికి మేలు చేస్తుంది. ఒత్తిడి నుంచి బయటపడడానికి ఉపయోగపడుతుంది.
- రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది.
- గొంతు కండరాలను రిలాక్స్ చేస్తుంది.
- యాంటీయాక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి.
- పుట్ట గొడుగులలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియ మెరుగుపడడానికి ఉపయోగపడుతుంది.
- వీటిలో అధికంగా ఉండే విటమిన్ బి అలసట తగ్గిస్తుంది.
- ఎనర్జీ లెవెల్స్ పెంచుతుంది.
- మామూలు కాఫీలో కంటే కెఫిన్ తక్కువగా ఉంటుంది.
- ఏకాగ్రతను పెంచుతుంది.



ఈ కాఫీని మామూలు కాఫీలాగే తయారు చేస్తారు. అయితే మష్రూమ్ పౌడర్ కలుపుతారు.

'మామూలు కాఫీకి ప్రత్యామ్నాయ కాఫీకి'గా మష్రూమ్ కాఫీ గురించి చెబుతున్నటికి దీని వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయి. ముఖ్యంగా మష్రూమ్ అలెర్జీ ఉన్నవారు ఈ కాఫీకి దూరంగా ఉండాలి. దద్దుర్లు, ఛాతీలో నొప్పి, కడుపులో నొప్పి, వాంతి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది... మొదలైనవి మష్రూమ్ అలర్జీ లక్షణాలు.

మూత్రపిండాల సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఈ కాఫీ సైడ్ ఎఫెక్ట్స్ చూపిస్తుందని అంటున్నారు నిపుణులు. జీర్ణ సమస్యలు ఉన్నవారు కూడా మష్రూమ్ కాఫీని సేవించాలనుకోవడానికి ముందు డైటీషియన్‌ను సంప్రదించడం మంచిది.

## ట్వింకిల్... ట్వింకిల్...
# లిటిల్ స్టార్స్ జాగ్రత్త

**'ఒంటరిగా వెళ్లవద్దు.. పార్కుకు, పాఠశాలకు, బీచ్‌కి, మరెక్కడికైనా... మేనమామ, బంధువు లేదా స్నేహితుడైనప్పటికీ.. ఏ వ్యక్తితోనూ ఒంటరిగా వెళ్లవద్దు. ఉదయం, సాయంత్రం మరీ ముఖ్యంగా రాత్రిపూట అస్సలు ఒంటరిగా వెళ్లవద్దు' అంటూ... నలభై ఏళ్ల క్రితం తల్లి తన చిన్నతనంలో నేర్పించిన భద్రతా పాఠాలనే ఇన్నేళ్ల తర్వాత తన కూతురు నితారాకు కూడా బోధిస్తున్నట్లు గుర్తించానని ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా నాటి బాలీవుడ్ నటి ట్వింకిల్ ఖన్నా చెప్పింది.**

కోల్‌కతాలోని ఆర్‌జికర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో యువ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన దారుణ ఘటన అనంతరం తన కుమార్తెతో తాను ఈ విధంగా సంభాషణ జరిపినట్టు తెలిపింది. అమ్మాయిల భద్రతకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో ఇలాంటి ప్రమాదకర స్థితి ఉంటే ఆన్‌లైన్ ముప్పు మరో విధమైన సమస్యలకు లోను చేస్తుంది. డిజిటల్‌లో ఆడపిల్లల భద్రతకు సంబంధించి పెద్దలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నిపుణులేం చెబుతున్నారో తెలుసుకుందాం.



కూతురు నితారాతో ట్వింకిల్ ఖన్నా

నేటి డిజిటల్ యుగంలో అమ్మాయిల భద్రత బయటి ప్రదేశాలకు మించి విస్తరించింది. గతంలో అపరిచితుల నుంచి ప్రమాదం, రహదారి భద్రత, ఆట స్థలం ప్రమాదాలు.. ఈ ఆందోళనలు ఉండేవి. ఇప్పుడు ఇవి ఇలాగే కొనసాగుతుండగా డిజిటల్ యుగం మరో క్లిష్టమైన లేయర్‌ని ప్రవేశపెట్టింది.

### ఆన్‌లైన్ ముప్పు

ఈ రోజుల్లో పిల్లలు ఆన్‌లైన్ ప్రపంచంలోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఇక్కడ పిల్లలను కబళించేందుకు మోసగాళ్లు.. చాట్ రూమ్‌లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, గేమింగ్ కమ్యూనిటీలలో దాగి ఉంటున్నారు. ఆన్‌లైన్ వస్త్రధారణ, దోపిడీ నుంచి వారిని రక్షించడానికి అప్రమత్తత, డిజిటల్ అక్షరాస్యత ప్రతి ఒక్కరికీ అవసరం.

### సైబర్ బెదిరింపులు

ఇంటర్నెట్ అనేది అపరిచితుల నుంచి బెదిరింపులను ప్రోత్సహిస్తుంది. సైబర్ బెదిరింపు పిల్లల మానసిక ఆరోగ్యానికి, ఆత్మగౌరవానికి ముప్పుగా మారుతుంది.

### అనుచితమైన కంటెంట్

కేవలం కొన్ని క్లిక్‌లతో, పిల్లలు వారి వయస్సుకు మించి అనుచితమైన కంటెంట్‌ను యాక్సెస్ చేయగలరు, ఇది వారి అభివృద్ధికి ఆటంకమే కాదు హాని కూడా కలిగించవచ్చు.

రోడ్డు ప్రమాదాలు, గాయాలు, ప్రకృతి వైపరీత్యాలు పిల్లల భద్రతకు ముప్పును కలిగిస్తూనే ఉన్నాయి. అందువల్ల, ఆఫ్‌లైన్– ఆన్‌లైన్ నష్టాలను పరిష్కరించే భద్రతా విద్యకు సమతుల్య విధానం అవసరం.

### డిజిటల్ పేరెంటింగ్ తప్పనిసరి

ఇంట్లో పిల్లలు సేఫ్‌గా ఉన్నారు అనుకుంటారు కానీ, నేటి రోజుల్లో బయట కన్నా డిజిటల్‌లోనే మరిన్ని ప్రమాదాల బారినపడుతున్నారు. నేరుగా కన్నా ఆన్‌లైన్‌లోనే చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ ఎక్కువ జరుగుతుంది. డిజిటల్ మోసగాళ్లు టీనేజ్ అమ్మాయిలను ఆకర్షించి సరోగసి, అర్గాన్ ట్రేడింగ్ చేస్తున్నారు. కొత్తదనాన్ని ఆస్వాదించాలి అంటూ పిల్లలను హిప్నొటైజ్ చేస్తుంటారు. వారిని తప్పుదారి పట్టించి, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు తీసుకోవడం.. ఆ తర్వాత బెదిరింపులకు పాల్పడటం... ఫలితంగా పిల్లలు భయాందోళనకు లోనవడం, ఆత్మహత్యలు చేసుకోవడం వంటివి జరుగుతున్నాయి.

ఫోన్ లేదా ట్యాబ్ లేదా ఇతర గ్యాడ్జెట్స్‌లో పేరెంటల్ కంట్రోల్ ఉండేలా చూసుకోవాలి. ఫ్యామిలీ ఇ-మెయిల్ తప్పనిసరి. ఏ వయసువారికి ఎలాంటి ఆన్‌లైన్ గేమ్స్ బెటర్ అనేవి తెలుసుకోవాలి. ప్రమాదాల వంక పెట్టి పిల్లలను డిజిటల్ నుంచి దూరం చేయకుండా అవగాహన కల్పించడం అవసరం. సమస్య తలెత్తితే చైల్డ్ హెల్ప్‌లైన్: 1098, నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్), ఓసిఎస్ఎఇ (ఆన్‌లైన్ చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ అండ్ ఎక్స్‌ప్లాయిటేషన్), పోక్సో, మినిస్ట్రీ ఆఫ్ ఉమన్ అండ్ చైల్డ్ రైట్స్ (ఎమ్‌డబ్ల్యూసీడీ),..లోనూ కేస్ ఫైల్ చేయచ్చు.




**– అనీల్ రాచమల్ల**
సైబర్ సేఫ్టీ నిపుణులు,
ఎండ్ నౌ ఫౌండేషన్

### అవగాహన తప్పనిసరి

- భయాన్ని పెంచడం కంటే తెలివైన ఎంపికలు చేయడానికి వారిని శక్తిమంతం చేయడంపై దృష్టి పెట్టాలి.
- తగిన పర్యవేక్షణ, మార్గదర్శకత్వాన్ని అందిస్తూనే పిల్లలు పరిపక్వం చెందుతున్నప్పుడు క్రమంగా మరింత స్వాతంత్ర్యం పొందేందుకు అనుమతించాలి.
- పిల్లలకు సమస్య పరిష్కార నైపుణ్యాలను నేర్పించాలి. నమ్మకం, పరస్పర గౌరవం ఉండే వాతావరణాన్ని సృష్టించాలి.
- అధిక రక్షణ వారి అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. ఆందోళనను సృష్టిస్తుంది. వారు వారి తప్పుల నుండి నేర్చుకునేలా వయసుకి తగిన స్వేచ్ఛను, అవకాశాలను ఇవ్వాలి.
- ఆన్‌లైన్ బెదిరింపులను విస్మరించవద్దు. ప్రస్తుత ఆన్‌లైన్ ట్రెండ్స్, ప్రమాదాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. ఇంటర్నెట్ భద్రత గురించి మీ చుట్టూ ఉన్నవారితో మాట్లాడుతూ ఉండండి.
- డిజిటల్ భద్రత అనేది కేవలం శారీరక శ్రేయస్సు కంటే ఎక్కువ. హద్దుల్లో ఉండటం, ఆరోగ్యకరమైన సంబంధాలు, అనుచితమైన ప్రవర్తనను ఎలా గుర్తించాలి, ప్రతిస్పందించాలనే దాని గురించి పిల్లలకు బోధించడం ద్వారా భావోద్వేగ భద్రతను పరిష్కరించాలి.

హెల్దీ డైట్

## సగ్గుబియ్యం పొంగనాలు



**కావలసినవి:** సగ్గుబియ్యం – అర కప్పు (గంట సేపు నానబెట్టాలి); పనీర్ తురుము – 75 గ్రాములు; వేరుశనగపప్పుల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; క్యారట్ తురుము – 3 టేబుల్ స్పూన్‌లు ; బంగాళదుంప – 1 (ఉడికించి తొక్క తీసి చిదమాలి); జీలకర్ర పొడి– టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; క్యాబేజ్ తరుగు – ముప్పావు కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు (రెడ్, గ్రీన్ క్యాప్సికమ్); చీజ్ తురుము – 50 గ్రాములు (12 భాగాలు చేసుకోవాలి); నూనె – టీ స్పూన్.

**తయారీ:**
- ఒక పాత్రలో క్యాబేజ్ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఇందులో నూనె, చీజ్ మినహా మిగిలినవన్నీ వేసి బాగా కలిపి పన్నెండు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో చీజ్ స్టఫ్ చేస్తూ గోళీ చేయాలి
- గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో ఒక్కో చుక్క నూనె రుద్ది పొంగనాన్ని పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు కాల్చాలి.

**పోషకాలు:** (ఒక్కో పొంగనంలో)
- కేలరీలు 63;
- ప్రొటీన్ – 2.5 – 3 గ్రాములు;
- కార్బోహైడ్రేట్లు – 8–9 గ్రాములు;
- ఫ్యాట్ – 2–3 గ్రాములు;
- ఫైబర్– గ్రాము; క్యాల్షియం – 40–50 గ్రాములు



**డాక్టర్ కరుణ**
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్



## రోనక్ దహియాకు కాంస్య పతకం

ప్రపంచ అండర్-17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల బోణీ చేసింది. జోర్డాన్‌లో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో పురుషుల గ్రీకో రోమన్ 110 కేజీల విభాగంలో భారత రెజ్లర్ రోనక్ దహియా కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. మంగళవారం జరిగిన కాంస్య పతక బౌట్‌లో రోనక్ 6-1 పాయింట్ల తేడాతో టర్కీ రెజ్లర్ ఇమ్రుల్లా కప్కాన్‌పై విజయం సాధించాడు. భారత్‌కే చెందిన పార్థ్ సాయినాథ్‌కు (51 కేజీలు) కాంస్య పతకం కోసం పోటీపడే అవకాశం దక్కింది.

## మూడో ర్యాంక్‌లో స్మృతి మంధాన



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ స్మృతి మంధాన ఒక స్థానం మెరుగుపర్చుకుంది. తాజా ర్యాంకింగ్స్ లో స్మృతి 738 రేటింగ్ పాయింట్లతో మూడో ర్యాంక్‌కు చేరుకుంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 648 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో కొనసాగుతోంది. దీప్తి శర్మ 20వ ర్యాంక్‌లో, జెమీమా 33వ ర్యాంక్‌లో ఉన్నారు. ఇంగ్లండ్‌కు చెందిన నటాలీ సీవెర్ బ్రంట్ 783 పాయింట్లతో తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది.

# యూఏఈలో టి20 ప్రపంచకప్

**బంగ్లాదేశ్ నుంచి తరలించిన ఐసీసీ ● అక్టోబర్ 3 నుంచి 20 వరకు మెగా టోర్నీ**






**దుబాయ్:** ఊహించిందే జరిగింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో అక్టోబర్‌లో అక్కడ జరగాల్సిన మహిళల టి20 ప్రపంచకప్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి తరలివెళ్లింది. ఈ మేరకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం ప్రకటన విడుదల చేసింది. మాజీ ప్రధాని షేక్ హసీనా రాజీనామాతో బంగ్లాదేశ్‌లో హింస చెలరేగగా... ముందు జాగ్రత్తగా మహిళల టోర్నీని అక్కడి నుంచి తరలించినట్లు ఐసీసీ వెల్లడించింది. దీంతో అక్టోబర్ 3 నుంచి 20 వరకు దుబాయ్, షార్జాలో మహిళల తొమ్మిదో టి20 ప్రపంచకప్ జరగనుంది. 'మహిళల టి20 ప్రపంచకప్ నిర్వహించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అన్ని ఏర్పాట్లు చేసింది. కానీ పరిస్థితులు సహకరించక పోవడంతో మెగా టోర్నీని అక్కడి నుంచి తరలించాల్సి వచ్చింది. బీసీబీ ఆతిథ్యంలోనే యూఏఈలో మహిళల టి20 వరల్డ్‌కప్ జరుగుతుంది. భవిష్యత్తులో బంగ్లాదేశ్‌కు మరిన్ని ఐసీసీ టోర్నీలు నిర్వహించే అవకాశం ఇస్తాం. మహిళల వరల్డ్‌కప్ నిర్వహించేందుకు ముందుకు వచ్చిన యూఏఈ క్రికెట్ బోర్డుకు ధన్యవాదాలు' అని ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జెఫ్ అలార్డైస్ తెలిపారు.

# ఒకే ఓవర్‌లో 39 పరుగులు

**అంతర్జాతీయ టి20ల్లో కొత్త ప్రపంచ రికార్డు**

- ఆరు సిక్సర్లు కొట్టిన సమోవా బ్యాటర్ విసెర్
- టి20 ప్రపంచకప్ ఈస్ట్ ఆసియా-పసిఫిక్ రీజియన్ క్వాలిఫయింగ్ టోర్నీ


డారియస్ విసెర్

**అపియా (సమోవా):** అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో మంగళవారం అద్భుతం చోటు చేసుకుంది. టి20 ప్రపంచకప్ ఈస్ట్ ఆసియా-పసిఫిక్ రీజియన్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా వనువాటు, సమోవా మధ్య జరిగిన పోరులో ఒకే ఓవర్లో 39 పరుగులు నమోదయ్యాయి. ఈ ఫార్మాట్‌లో గతంలో ఐదుసార్లు ఒకే ఓవర్‌లో 36 పరుగులు నమోదు కాగా... సమోవా దాన్ని అధిగమిస్తూ మొత్తం 39 పరుగులు రాబట్టింది. మిడిలార్డర్ బ్యాటర్ డారియస్ విసెర్ ఆరు సిక్సర్లతో అదరగొట్టాడు. క్వాలిఫయర్స్‌లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో వనువాటుపై సమోవా 10 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన సమోవా నిర్ణీత 20 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. విసెర్ (62 బంతుల్లో 132; 5 ఫోర్లు, 14 సిక్సర్లు) శతక్కొట్టగా... మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. అనంతరం లక్ష్యఛేదనలో వనువాటు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. నళిన్ నిపికో (52 బంతుల్లో 73; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) పోరాడినా ఫలితం లేకపోయింది.

**ఆ ఓవర్ సాగిందిలా..**

వనువాటు బౌలర్ నళిన్ నిపికో వేసిన ఇన్నింగ్స్ 15వ ఓవర్‌లో డారియస్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. వరుసగా 6, 6, 6, 1నోబాల్, 6, 0, 1 నోబాల్, 6+1నోబాల్, 6 పరుగులు సాధించి ఒకే ఓవర్లో 39 పరుగులు పిండుకున్నాడు. గతంలో యువరాజ్ సింగ్ (భారత్; 2007లో ఇంగ్లండ్‌పై; స్టువర్ట్ బ్రాడ్), కీరన్ పొలార్డ్ (వెస్టిండీస్; 2021లో శ్రీలంకపై; అఖిల ధనంజయ), నికోలస్ పూరన్ (వెస్టిండీస్; 2024లో అఫ్గానిస్తాన్‌పై; అజ్మతుల్లా ఒమర్‌జాయ్), దీపేంద్ర సింగ్ (నేపాల్;2024లో ఖతర్‌పై; కమ్రాన్ ఖాన్), రోహిత్ శర్మ-రింకూ సింగ్ (భారత్; 2024లో అఫ్గానిస్తాన్‌పై; కరీమ్ జన్నత్) కూడా ఒకే ఓవర్‌లో 36 పరుగులు సాధించారు. అయితే తాజా మ్యాచ్‌లో వనువాటు బౌలర్ అదనంగా మూడు నోబాల్స్ వేయడంతో... మొత్తం 39 పరుగులు వచ్చాయి. ఒక టి20 ఇన్నింగ్స్ జట్టు స్కోరులో అత్యధిక శాతం పరుగులు చేసిన ప్లేయర్‌గా విసెర్ రికార్డుల్లోకెక్కాడు. సమోవా జట్టు 20 ఓవర్లలో 174 పరుగులు చేయగా.. అందులో విసెర్ ఒక్కడే 132 పరుగులు సాధించాడు. అంటే జట్టు మొత్తం స్కోరులో 75.86 శాతం విసెర్ బ్యాట్ నుంచే వచ్చాయి. గతంలో ఆస్ట్రేలియా ప్లేయర్ ఆరోన్ ఫించ్ జట్టు స్కోరులో 75.01 శాతం పరుగులు సాధించాడు.

# ఎదురులేని సినెర్

- ఈ ఏడాది ఐదో టైటిల్ సొంతం
- సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్ టోర్నీలో తొలిసారి విజేతగా నిలిచిన నంబర్‌వన్
- రెండుసార్లు డోపింగ్‌లో దొరికి బయటపడ్డ ఇటలీ స్టార్


సినెర్

**మేసన్ (అమెరికా):** ఈ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ ఇటలీ టెన్నిస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ ఐదో సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. మంగళవారం ముగిసిన సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీలో 23 ఏళ్ల సినెర్ తొలిసారి చాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో సినెర్ 7-6 (7/4), 6-2తో ఫ్రాన్సెస్ టియాఫో (అమెరికా)పై గెలుపొందాడు. సినెర్‌కు 10,49,460 డాలర్ల (రూ. 8 కోట్ల 78 లక్షలు) ప్రైజ్‌మనీ తోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. టియాఫోతో గంటా 36 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో సినెర్ 13 ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. రెండుసార్లు టియాఫో సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినెర్ తన సర్వీస్‌లో ఒక్కసారి కూడా బ్రేక్ పాయింట్ అవకాశం ఇవ్వలేదు. నెట్ వద్దకు 14 సార్లు దూసుకొచ్చిన సినెర్ 11 సార్లు పాయింట్లు గెలిచాడు. టియాఫో ఓటమితో సిన్సినాటి ఓపెన్ టోర్నీలో అమెరికా ప్లేయర్‌ను విజేతగా చూసేందుకు మరో ఏడాది వేచి చూడాలి. చివరిసారి ఆండీ రాడిక్ రూపంలో 2006లో అమెరికా ప్లేయర్ సిన్సినాటి ఓపెన్ టోర్నీలో టైటిల్ గెలిచాడు. ఈ ఏడాది సినెర్ ఫైనల్ చేరిన ఐదు టోర్నీల్లోనూ విజేతగా నిలువడం విశేషం. ఈ టోర్నీకి ముందు సినెర్ ఆస్ట్రేలియన్ ఓపెన్, మయామి మాస్టర్స్ టోర్నీ, రోటర్‌డామ్ ఓపెన్, హాలె ఓపెన్‌లలో టైటిల్స్ గెలిచాడు.

**డోపింగ్‌లో దొరికినా...**

ఈ ఏడాది మార్చిలో సినెర్ డోపింగ్‌లో పట్టుబడ్డాడని అంతర్జాతీయ టెన్నిస్ ఇంటెగ్రిటీ ఏజెన్సీ వెల్లడించింది. సినెర్ నుంచి రెండుసార్లు సేకరించిన యూరిన్ శాంపిల్స్‌లో నిషేధిత ఉత్ప్రేరకం క్లోస్టెబోల్ ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. దాంతో అతనిపై ఏప్రిల్ 4 నుంచి 5 వరకు... ఏప్రిల్ 17 నుంచి 20 వరకు సస్పెన్షన్ విధించారు. ఈ రెండుసార్లూ వెనువెంటనే సినెర్ సస్పెన్షన్ తొలగించాలని దరఖాస్తు చేసుకున్నాడు. తాను ఉద్దేశపూర్వకంగా నిషేధిత ఉత్ప్రేరకం తీసుకోలేదని ... సహాయక సిబ్బంది గాయం తగ్గడానికి స్ప్రే చేయగా... అది తన శరీరంలోకి వచ్చిందని ఇండిపెండెంట్ ప్యానెల్ ముందు సినెర్ వాదనలు వినిపించాడు. సినెర్ సమాధానాలతో సంతృప్తి చెందిన ప్యానెల్ సినెర్‌పై సస్పెన్షన్ విధించాల్సిన అవసరం లేదని తీర్పు ఇచ్చింది. అయితే మార్చిలో ఇండియన్ వెల్స్ టోర్నీలో అతను గెల్చుకున్న ప్రైజ్‌మనీని, ర్యాంకింగ్ పాయింట్లను వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది.


సబలెంకా

## సబలెంకా సూపర్...

మరోవైపు ఇదే టోర్నీ మహిళల విభాగంలో బెలారస్ స్టార్, ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా కూడా తొలిసారి విజేతగా అవతరించింది. గతంలో మూడుసార్లు సెమీఫైనల్ చేరి ఓడిపోయిన సబలెంకా ఈసారి మాత్రం టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్లో సబలెంకా 6-3, 7-5తో జెస్సికా పెగూలా (అమెరికా)పై గెలిచింది. సబలెంకాకు 5,23,485 డాలర్ల (రూ. 4 కోట్ల 38 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచిన తర్వాత సబలెంకా ఖాతాలో చేరిన మరో టైటిల్ ఇదే కావడం విశేషం. ఓవరాల్‌గా సబలెంకా కెరీర్‌లో ఇది 15వ సింగిల్స్ టైటిల్. తాజా విజయంతో సబలెంకా సోమవారం మొదలయ్యే యూఎస్ ఓపెన్‌లో టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది.

## సురేశ్ జోడీ సంచలనం



**నార్త్ కరోలినా:** విన్‌స్టన్-సాలెమ్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీ డబుల్స్ విభాగంలో భారత టెన్నిస్ ప్లేయర్ దక్షిణేశ్వర్ సురేశ్ సంచలనం సృష్టించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో సురేశ్ (భారత్)-లుకా పౌ (బ్రిటన్) ద్వయం 6-4, 5-7, 10-8తో ఆరో సీడ్ బెహర్ (ఉరుగ్వే)-మొల్టెని (అర్జెంటీనా) జోడీని బోల్తా కొట్టించింది. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సురేశ్ జోడీ తొమ్మిది ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. 'సూపర్ టైబ్రేక్'లో సురేశ్-లుకా పౌ ద్వయం కీలకదశలో పాయింట్లు గెలిచి సంచలన విజయాన్ని ఖరారు చేసుకుంది.

## తొలి రౌండ్ దాటలేకపోయారు

**జపాన్ ఓపెన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ముగిసిన భారత్ పోరు**


ఆకర్షి కశ్యప్

**యోకోహామా:** భవిష్యత్ ఆశాకిరణాలుగా భావిస్తున్న ముగ్గురు భారత యువ క్రీడాకారిణులకు జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ నిరాశను మిగిల్చింది. మంగళవారం మొదలైన ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ విభాగంలో బరిలోకి దిగిన ముగ్గురు భారత షట్లర్లు మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్, అష్మిత చాలిహా తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. అష్మిత 16-21, 12-21తో టాప్ సీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) చేతిలో... మాళవిక 21-23, 19-21తో పొలీనా బురోవా (ఉక్రెయిన్) చేతిలో... ఆకర్షి 13-21, 12-21తో కిమ్ గా యున్ (దక్షిణ కొరియా) చేతిలో ఓటమి చవిచూశారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్-ఆద్యా వరియత్ (భారత్) జోడీ 10-21, 18-21తో రెహాన్-లీసా కుసుమవతి (ఇండోనేసియా) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడ్డ భారత స్టార్స్ పీవీ సింధు, లక్ష్య సేన్, హెచ్ఎస్ ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో ఈ టోర్నీకి దూరంగా ఉన్నారు.

# సినిమా

## దీపావళికి లక్కీ భాస్కర్


దుల్కర్ సల్మాన్

**అ**నుకున్న సమయాని కన్నా కాస్త లేట్‌గా థియేటర్స్‌లోకి రానున్నాడు లక్కీ భాస్కర్. దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రాన్ని సెప్టెంబరు 7న విడుదల చేయాలనుకున్నారు. కానీ నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి కావడానికి మరికొంత టైమ్ పడుతుందని, అందుకే వాయిదా వేసి, దీపావళికి తెలుగు, మలయాళ, తమిళ, హిందీ భాషల్లో అక్టోబరు 31న రిలీజ్ చేయనున్నామని మేకర్స్ ప్రకటించారు. ''ఓ సాధారణ వ్యక్తికి చెందిన అసాధారణ ప్రయాణమే ఈ చిత్రం. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినివ్వడం కోసం డబ్బింగ్‌తో సహా అన్ని సాంకేతిక విభాగాల విషయంలో రాజీ పడకుండా పని చేస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

## డబుల్ చాన్స్?


త్రిష

**హీ**రోయిన్ త్రిష ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్నారు. తెలుగులో చిరంజీవి 'విశ్వంభర', తమిళంలో కమల్‌హాసన్ 'థగ్ లైఫ్', అజిత్ 'విడా ముయర్చి', మలయాళంలో మోహన్‌లాల్ 'రామ్'... ఇలా అగ్ర హీరోలతో సినిమాలు చేస్తున్నారు. ఇంకా త్రిషకు మరో రెండు పెద్ద అవకాశాలు వచ్చాయనే టాక్ వినిపిస్తోంది. 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' (2007), 'నమో వెంకటేశాయ' (2010), 'బాడీగార్డ్' (2012) చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్‌తో కలిసి త్రిష మరోసారి నటించనున్నారట. నందు దర్శకత్వంలో వెంకటేశ్ ఓ సినిమా చేయనున్నారని, ఇందులోనే త్రిష నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. అలాగే 'వర్షం' (2004), 'పౌర్ణమి' (2006), 'బుజ్జిగాడు' (2008) సినిమాల్లో ప్రభాస్, త్రిష జంటగా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. మళ్లీ ఈ ఇద్దరూ కలిసి నటించనున్నారట. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోనే త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇక పద్దెనిమిదేళ్ల తర్వాత చిరంజీవితో కలిసి త్రిష 'విశ్వంభర' చేస్తున్నారు. గతంలో ఈ ఇద్దరూ కలిసి 'స్టాలిన్' (2006) చేశారు. మరి.. పన్నెండేళ్ల తర్వాత వెంకటేశ్‌తో, పదహారేళ్ల తర్వాత ప్రభాస్‌తో నటించే డబుల్ చాన్స్ త్రిషకు దక్కుతుందా? వేచి చూడాలి.

## తెరపైకి యువరాజ్ సింగ్ జీవితం


యువరాజ్ సింగ్, భూషణ్‌కుమార్, రవిభాగ్

**భా**రత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ జీవితం ఆధారంగా ఓ సినిమా రానుంది. భూషణ్ కుమార్, రవిభాగ్ చందక్ నిర్మించనున్న ఈ బయోపిక్‌ను మంగళవారం ప్రకటించారు. భారత క్రికెట్‌లో పదిహేడేళ్ల సుదీర్ఘమైన సక్సెస్‌ఫుల్ కెరీర్, ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు కొట్టడం, క్యాన్సర్ మహమ్మారితో పోరాడటం, 2007లో టీ20 వరల్డ్‌కప్ గెలిచిన భారత టీమ్‌లో రాణించడం, ధోనీతో విభేదాలు అనే వార్త, ఓ బాలీవుడ్ హీరోయిన్‌తో ప్రేమ అనే గాసిప్... ఇలా యువరాజ్ లైఫ్‌లో ఎన్నో ఆసక్తికర విషయాలు ఉన్నాయి. ఈ అంశాలను ఈ సినిమాలో ఎంత మేరకు చూపించాలనుకుంటున్నారని తెలియాల్సి ఉంది. అలాగే యువరాజ్ సింగ్‌గా ఎవరు నటించనున్నారు? దర్శకత్వం వహించేది ఎవరు? అనే విషయాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. ''ప్రపంచవ్యాప్తంగా ఉన్న నా ఫ్యాన్స్ కోసం నా బయోపిక్ తెరకెక్కనున్నందుకు హ్యాపీగా ఉంది. సవాళ్లను ఎదుర్కొంటూ, సమస్యలను అధిగమిస్తూ వారి కలలను నెరవేర్చుకునేలా నా బయోపిక్ స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను'' అని పేర్కొన్నారు యువరాజ్ సింగ్.

## దసరాకి రాజావారు


నార్నే నితిన్, సంపద

'మ్యాడ్, ఆయ్' చిత్రాలతో హిట్స్ అందుకున్న నార్నే నితిన్ (హీరో ఎన్టీఆర్ బావమరిది) హీరోగా నటించిన తాజా చిత్రం 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు'. 'శతమానం భవతి' ఫేమ్ దర్శకుడు సతీష్ వేగేశ్న తెరకెక్కించిన ఈ చిత్రంలో సంపద హీరోయిన్‌గా నటించారు. చింతపల్లి రామారావు నిర్మించిన ఈ చిత్రాన్ని దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా చింతపల్లి రామారావు మాట్లాడుతూ–''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు'. భారీ తారాగణంతో పూర్తి వాణిజ్య అంశాలతో ఈ సినిమాని రూపొందించాం. సతీష్ వేగేశ్న ఎక్కడా రాజీపడకుండా ఈ మూవీ తెరకెక్కించారు'' అన్నారు.

## ఆ రోజు ఏం జరిగింది?


కరీనా కపూర్

**డి**టెక్టివ్‌గా ఓ మర్డర్ కేసును పరిష్కరించే పనిలో పడ్డారు హీరోయిన్ కరీనా కపూర్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన హిందీ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'ది బకింగ్‌హమ్ మర్డర్స్'. హన్సల్ మెహతా దర్శకత్వం వహించిన ఈ చిత్రం సెప్టెంబరు 13న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. విదేశాల్లో నివసిస్తున్న ఓ భారతీయుడి కుటుంబంలోని ఓ చిన్నారి హత్య నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని, ఇందులో బ్రిటిష్- ఇండియన్ డిటెక్టివ్ జస్మిత్ భామ్రా పాత్రలో కరీనా నటిస్తున్నారని తెలుస్తోంది. ''ఆ రోజు పార్కులో ఏం జరిగింది?, నువ్వు అతన్ని ఎలా చంపావ్?'...., 'నువ్వు డిటెక్టివ్ కదా.. తెలుసుకో...!' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఏక్తా కపూర్, శోభా కపూర్‌లతో కలిసి ఈ సినిమాను కరీనా కపూర్ నిర్మించడం విశేషం.

## ఒకరికి ఒకరం

''**ఓ** సరే సరే నువ్వు ఏ లోకాన ఉన్న ... ఓ సరే సరే నేనే లోకాన ఉన్న... ఒకరికి ఒకరం నేడు...' అంటూ సాగుతుంది 'ఉత్సవం' సినిమాలోని 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' సాంగ్. దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్‌లో నటించిన 'ఉత్సవం' సినిమాలోనిదీ పాట. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేష్ పాటిల్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 13న విడుదల కానుంది. ఏపీ, తెలంగాణలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ సినిమాను రిలీజ్ చేయనుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ సారథ్యంలో అనంత శ్రీరామ్ సాహిత్యం అందించిన ఈ పాటను అర్మాన్ మాలిక్ పాడారు.


రెజీనా, దిలీప్ ప్రకాశ్

## అబ్బాయిలకూ జాగ్రత్తలు చెప్పాలి


ఫైజల్, రిషిత

**రి**షిత, ఫైజల్, షేక్ అల్లా బకాషు, ఖుషీ యాదవ్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'కావేరి'. రాజేశ్ నెల్లూరు దర్శకత్వంలో షేక్ అల్లా బకాషు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాజేశ్ నెల్లూరు మాట్లాడుతూ–''సామాజిక సందేశంతో తెరకెక్కిన చిత్రమిది. కావేరి పాత్రలో రిషిత నటించారు'' అన్నారు. ''తల్లిదండ్రులెప్పుడూ అమ్మాయిలకే జాగ్రత్తలు చెబుతుంటారు. ఇవే జాగ్రత్తలు అబ్బాయిలకు చెబితే సమాజంలో మహిళల పట్ల ఇన్ని ఆకృత్యాలు జరగవు'' అని రిషిత తెలిపారు. ''ఈ సినిమాలో మంచి సందేశంతో పాటు వినోదం, వాణిజ్య అంశాలుంటాయి'' అని షేక్ అల్లా బకాషు చెప్పారు.

## తిరోగమనం పై తీవ్ర నిరసన
# తిరిగి చూడు పాట

**- మౌనశ్రీ మల్లిక్**

**'తిరిగి చూడు తిరిగి చూడు తిరుగుతున్న భూమిని... కలిసి చూడు కలిసి చూడు మనిషిలోని మనిషి'... ఈ పాట ఇప్పుడు చాలామంది అభిమానులను సంపాదించుకుంది. రాజకీయవేత్త అద్దంకి దయాకర్ ముఖ్య పాత్రలో నటిస్తున్న 'ఇండియా ఫైల్స్' కోసం కీరవాణి పాడి, సంగీతం అందించిన ఈ పాటను రాసింది మౌనశ్రీ మల్లిక్. స్వీయ దర్శకత్వంలో బొమ్మకు మురళి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదలకు సిద్ధం అవుతోంది. గద్దర్ కథ అందించిన 'ఇండియా ఫైల్స్' లోని పాటలు యూట్యూబ్‌లో విడుదలై లక్షల వ్యూస్ సాధిస్తున్నాయి. ఈ సందర్భంగా 'సాక్షి' ఇంటర్వ్యూలో మౌనశ్రీ మల్లిక్ వెల్లడించిన అభిప్రాయాలు....**


కీరవాణితో మౌనశ్రీ మల్లిక్

- 'ఇండియా ఫైల్స్' కోసం 'తిరిగి చూడు', 'జై ఇండియా' పాటలు రాశాను. రెండూ పెద్ద హిట్ కావడం సంతోషంగా ఉంది. 'ఇండియా ఫైల్స్' కథలో అద్దంకి దయాకర్ గారిది సామాజిక కార్యకర్త పాత్ర. సమాజంలో పేరుకుపోతున్న మూఢత్వాన్ని, తిరోగమనాన్ని చూసి మార్పు రావాలంటే ఏం చేయాలో తెలియ చేయమని తన గురువు (సుమన్)ను అడుగుతాడు. దేశమంతా తిరిగి చూస్తే నీకే జవాబు దొరుకుతుంది అని గురువు సూచిస్తాడు. అద్దంకి దయాకర్ దేశాన్ని తిరిగి చూసే సందర్భంలో వస్తుందీ పాట.
- 'పుణ్యపుడమిలో పరిఢవిల్లిన మేధలేదిపుడెందుకో... ధన్యధరణిలో నెత్తుటేరులు పారుతున్నది ఎందుకో' అని ఈ పాటలో రాశాను. ఒకప్పుడు మేధావులతో నిండిన ఈ దేశంలో జ్ఞానవికాసానికి బదులు ఛాందసం మొలకెత్తడం బాధాకరం. అందుకే 'గాయపడిన భరతజాతికి వైద్యమేదో చదువుకో' అని కూడా రాశాను. నాలుగు చరణాల ఈ పాటను విని దర్శకుడు బొమ్మకు మురళి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కనకదుర్గ చాలా సంతోషపడ్డారు. కీరవాణిగారైతే ఎంత మెచ్చుకున్నారో తెలియదు. దీనిని నేనే పాడ తానని చెన్నైలో తన సంగీత దర్శకత్వంలో రికార్డు చేశారు. పాట రిలీజై ఇంత స్పందన రావడం సంతృప్తిగా ఉంది.
- రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడం 'ఇండియా ఫైల్స్' కథాంశం. రాజ్యాంగం సరిగా అమలైతే పేదవాడు పేదవాడిగా ఉండిపోడని ఈ సినిమాలో చెబుతాం. 'ప్రశ్నించే వారికి స్వేచ్ఛ ఉండాలి' అని ఇదే సినిమాలోని 'జై ఇండియా' గీతంలో రాశాను.
- మాది వరంగల్ జిల్లా వర్ధన్న పేట. జర్నలిస్ట్‌గా పని చేశాను. చిన్నప్పుడు పేదరికంలో రేడియో ఒక్కటే వినోదంగా ఉండేది. అందులో వినిపించే పాటలే నన్ను కవిని, గీతకర్తను చేశాయి. సామాజిక చైతన్యం కలిగిన కవిగా సాహిత్యవేత్తగా రాణిస్తూనే టీవీ, సినిమాల్లో పని చేస్తున్నాను. కె. రాఘవేంద్రరావు గారు పాటలకు ప్రాధాన్యం ఉన్న 'కోకిలమ్మ', 'కృష్ణతులసి' సీరియల్స్‌లో నా చేత వరదలాగా పాటలు రాయించడంతో గుర్తింపు వచ్చింది. ఇప్పుడు టీవీ సీరియల్స్‌కు టైటిల్ సాంగ్ అనగానే నా పేరే గుర్తుకు వస్తోంది.
- చిన్న సినిమాలకు చాలా పాటలు రాశాను. 'గుడ్ మార్నింగ్' సినిమాకు నేను రాసిన పాటకు 2012లో గీతా మాధురికి నంది అవార్డు వచ్చింది. 'ఇండియా ఫైల్స్' పాటలతో వచ్చిన గుర్తింపుతో ఇకపై సినిమా రంగంలో మరింత ఉత్సాహంగా పాటలు రాయాలని అనుకుంటున్నాను.

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 378 | 126 |
| 80,803 | 24,699 |

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 17,816 | ▼ | 61 |
| డోజోన్స్ | 40,837 | ▼ | 60 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,273 | ▼ | 84 |
| డాక్స్ | 18,358 | ▼ | 64 |
| షాంఘై | 2,867 | ▼ | 27 |
| నికాయ్ | 38,063 | ▲ | 674 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## బులియన్ (రూ.లలో)

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | | |
| 71,945 | ▲ | 837 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | | |
| 71,657 | ▲ | 834 |
| వెండి (కిలో) | | |
| 85,321 | ▲ | 2030 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 81.36 | 84.48 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 107.69 | 110.29 |
| € | యూరో | ఎస్‌బీఐ | 91.82 | 94.21 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 56.54 | 57.82 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 55.75 | 57.37 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 61.86 | 66.53 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.45 | 23.71 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.93 | 23.71 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.88 | 12.70 |

# ఫ్రిజ్.. ఏసీ.. మైక్రోవేవ్.. దీర్ఘాయుష్మాన్‌భవ!

- వైట్ గూడ్స్ కంపెనీల వారంటీ వార్!
- ఏసీ, ఫ్రిజ్ కంప్రెషర్లపై 12 ఏళ్ల వరకు వారంటీ
- వాషింగ్ మెషీన్, డిష్‌వాషర్ మోటార్లపై 20 ఏళ్ల వరకు
- ఈ ఆఫర్లతో సేల్స్ పెరుగుతున్నాయంటున్న రిటైలర్లు

**ఏసీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్ ఓవెన్లు, డిష్ వాషర్లు తదితర ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాలపై ఇప్పుడు వారంటీ వార్ నడుస్తోంది. వైట్ గూడ్స్ కంపెనీలు తమ ఉత్పత్తులకు పోటీ పడి మరీ ఏళ్లకు ఏళ్లు రక్షణ కల్పిస్తున్నాయి. ముఖ్యంగా ఖరీదైన ఉత్పత్తులపై 10–20 ఏళ్ల పాటు బ్రాండ్ వారంటీని అందిస్తున్నాయి. ఈ వ్యూహంతో డిమాండ్ కూడా పెరుగుతోందనేది పరిశ్రమ వర్గాల మాట!** - సాక్షి, బిజినెస్ డెస్క్

కన్జూమర్ డ్యూరబుల్స్ తయారీ సంస్థలు సేల్స్ పెంచుకోవడానికి కొత్త రూట్లో వెళ్తున్నాయి. ఎల్‌జీ, శాంసంగ్, హయర్, గోద్రెజ్, వోల్టాస్, పానాసోనిక్ వంటి దిగ్గజ బ్రాండ్లన్నీ తమ ఉత్పత్తుల్లో ప్రధానమైన విడిభాగాలకు 10 ఏళ్ల వరకు వారంటీ ఇస్తున్నాయి. ఏసీ, రిఫ్రిజిరేటర్ల కంప్రెషర్ల వంటి వాటికి ఇవి వర్తిస్తాయి. ఇక వాషింగ్ మెషీన్, డిష్ వాషర్ మోటార్లపై ఏకంగా 20 ఏళ్ల వరకూ వారంటీ లభిస్తోంది. కొన్ని కంపెనీలైతే ఈ ఆఫర్లను 'లైఫ్ టైమ్' వారంటీగా కూడా పేర్కొంటుండటం విశేషం. ముఖ్యంగా 35 ఏళ్లు పైబడిన వినియోగదారులు అధిక వారంటీ ఆఫర్లకు బాగా ఆకర్షితులవుతున్నారని, దీంతో అమ్మకాలు కూడా పుంజుకుంటున్నట్లు ఎలక్ట్రానిక్స్ రిటైలర్లు చెబుతున్నారు.

### రేటు ఎంత ఎక్కువైతే....

వారంటీ విషయంలో ఉత్పత్తుల రేటు కీలకంగా నిలుస్తోంది. ఎంత ప్రీమియం లేదా ఖరీదైన ఉత్పత్తి అయితే వారంటీ అంత ఎక్కువ కాలం ఆఫర్ చేస్తున్నాయి కంపెనీలు. కొన్ని బ్రాండ్లైతే మార్కెట్ వాటాను పెంచుకోవడం కోసం పరిశ్రమ ప్రమాణాలకు మించి ఒకట్రెండు సంవత్సరాలు అధికంగా కూడా వారంటీని అందిస్తుండటం గమనార్హం. ఉదాహరణకు, హయర్, వోల్టాస్ బెకో రిఫ్రిజిరేటర్ కంప్రెషర్లపై 12 ఏళ్లు వారంటీ లభిస్తోంది. ఎల్‌జీ వారంటీ వ్యవధి 10 ఏళ్లు మాత్రమే. ఇక వాషింగ్ మెషీన్ ఇన్వర్టర్ మోటార్‌పై శాంసంగ్, హయర్ 20 ఏళ్ల వారంటీని ఆఫర్ చేస్తుండగా... వోల్టాస్ బెకో, గోద్రెజ్ విషయంలో ఈ వ్యవధి 10 ఏళ్లు ఉంటోంది. అయితే, మొత్తం ఉత్పత్తిపై, అలాగే అన్ని విడిభాగాలపై పూర్తి స్థాయి వారంటీని మాత్రం దాదాపు అన్ని ప్రోడక్టులపై కంపెనీలన్నీ ఒకేలా ఇస్తున్నాయి. ఒక ఏడాది లేదంటే గరిష్ఠంగా మూడేళ్ల వరకు మాత్రమే పరిమితం చేస్తున్నాయి.




**వారంటీ ఇలా... (సగటున సంవత్సరాలు)**

| ప్రోడక్ట్ | మొత్తం ఉత్పత్తిపై | ప్రధాన విడిభాగంపై |
|---|---|---|
| ఏసీ | 1-5 | 5-12 |
| రిఫ్రిజిరేటర్ | 1-2 | 5-20 |
| వాషింగ్ మెషీన్ | 2-3 | 5-20 |
| మైక్రోవేవ్ ఓవెన్ | 1-2 | 2-4 |
| టీవీ | 1-2 | -- |

### ప్రధాన విడిభాగాలపైనే...

చాలా కంపెనీలు ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాల్లో ప్రధాన విడిభాగంపైనే ఎక్కువ కాలం వారంటీని ఇవ్వడానికి ప్రధాన కారణం.. దానికి మన్నిక అధికంగా ఉండటమే. అయితే, సుదీర్ఘ వ్యవధి పాటు వారంటీ ఇచ్చేందుకు కంపెనీలు కొంత ఎక్కువ మొత్తాన్ని పక్కనబెట్టాల్సి వస్తోందని పరిశ్రమ ఎగ్జిక్యూటివ్‌లు చెబుతున్నారు. పోటీ తీవ్రంగా ఉండటంతో ఈ వ్యయాల భారాన్ని కస్టమర్లపై మోపేందుకు కంపెనీలు వెనకాడుతున్నాయి. ఉదాహరణకు, ఫ్లాట్ ప్యానెల్ టీవీ సెట్లపై చాలా బ్రాండ్‌లు మూడేళ్ల వారంటీ ఇచ్చేందుకు భారీగా వెచ్చించాయి. మరోపక్క, ఈ రోజుల్లో టీవీ ప్యానెల్స్ 12–18 నెలల్లోనే పాడవుతున్న పరిస్థితి. దీంతో వారంటీ మేరకు కొత్త టీవీ ఇవ్వడం కోసం కంపెనీలకు తడిసిమోపెడైనట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

- అధిక వారంటీ వ్యవధి వల్ల అప్‌గ్రేడ్ కొనుగోళ్లపై ప్రభావం లేదంటున్న పరిశ్రమ వర్గాలు.
- యువ కస్టమర్లు తమ కొనుగోలు నిర్ణయంలో వారంటీ అంశాన్ని పెద్దగా పట్టించుకోకపోవడం విశేషం.

### వారంటీ తీరకుండానే మార్చేస్తున్నారు...

వాస్తవానికి వారంటీ అనేది కొనుగోళ్ల విషయంలో కీలకమైనప్పటికీ... యువ కస్టమర్లు దీన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. వారు వినూత్న ఫీచర్లకే ఎక్కువ ప్రాధాన్యమిస్తుండటం విశేషం. పాత ప్రోడక్ట్ స్థానంలో కొత్తది కొనే వినియోగదారులపై కూడా సుదీర్ఘ వారంటీ పెద్దగా ప్రభావం చూపడం లేదని విశ్లేషకులు చెబుతున్నారు. 'బ్రాండ్‌లు ఏటా కొంగొత్త మోడళ్లను విడుదల చేస్తున్నాయి. కొత్త టెక్నాలజీ పేరుతో పాత ప్రోడక్టులను మార్చేసేలా ప్రోత్సహిస్తున్నాయి. మరోపక్క, ఎక్కువ ఏళ్ల పాటు వారంటీ ఇవ్వడం విచిత్రం. అధిక వారంటీకి కస్టమర్లు ప్రాధాన్యం ఇస్తున్నా, వాస్తవ వాడకంలో పెద్దగా ఉపయోగం లేకుండా పోతోంది' అని ఒక రిటైల్ స్టోర్ డైరెక్టర్ అభిప్రాయపడ్డారు.



| కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో) | |
|---|---|
| 21-8-2024 | |
| విశాఖ | 505-00 |
| చిత్తూరు | 508-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 480-00 |
| విజయవాడ | 480-00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| హైదరాబాద్ | 450-00 |
| వరంగల్ | 452-00 |
| రిటైల్ ధర | 5.10 |

## పసిడి రికార్డుల పరుగు

### అంతర్జాతీయ అంశాల దన్ను



న్యూఢిల్లీ: బంగారం ధరలు అటు అంతర్జాతీయంగా, ఇటు దేశీయంగా మంగళవారం పరుగుపెట్టాయి. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ నైమెక్స్‌లో చురుగ్గా ట్రేడవుతున్న డిసెంబర్ కాంట్రాక్ట్ పసిడి ఔన్స్ (31.1గ్రాములు) ధర ఒక దశలో చరిత్రాత్మక రికార్డు 2,570.2 డాలర్ల స్థాయిని తాకింది. ఈ వార్త రాస్తున్న రాత్రి 9 గంటల సమయంలో క్రితం ముగింపుతో పోల్చితే 20 డాలర్ల లాభంతో పటిష్ఠంగా 2,562 డాలర్ల పైన ట్రేడవుతోంది. అమెరికా మాంద్యం భయాలు, ఫెడ్ వడ్డీరేట్లు తగ్గుతాయన్న అంచనాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు దీనికి కారణం.

**దేశంలోనూ దూకుడే..**

ఇక అంతర్జాతీయ అంశాల దన్నుతో దేశీయంగా కూడా పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో 10 గ్రాముల పూర్తి 99.9 స్వచ్ఛత ధర రూ.1,400 పెరిగి రూ.74,150కి చేరింది. 99.5 స్వచ్ఛత ధర కూడా ఇదే స్థాయిలో పెరిగి రూ.73,800 స్థాయిని చూసింది. వెండి కేజీ ధర సైతం రూ.3,150 ఎగసి రూ.87,150కి చేరింది. ముంబైలో 99.9 స్వచ్ఛత, 99.5 స్వచ్ఛత ధరలు రూ.837, రూ.834 చొప్పున పెరిగి వరుసగా రూ.71,945, రూ.71,657కు చేరాయి. వెండి ధర రూ.2,030 పెరిగి రూ.85,321కు పెరిగింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
కార్ కంపెనీల డిస్కౌంట్ల బాట
ఓఎన్‌జీసీకి మేఘా అత్యాధునిక రిగ్
సమస్యాత్మక టెలిమార్కెటర్లపై ట్రాయ్ కఠిన చర్యలు

## బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్

### సెన్సెక్స్ లాభం 378 పాయింట్లు ● నిఫ్టీకి నాలుగోరోజూ లాభాలే



ముంబై: బ్యాంకులు, ఫైనాన్స్, ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు మంగళవారం అరశాతం లాభపడ్డాయి. పశ్చిమాసియా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, క్రూడాయిల్ ధరలు దిగిరావడం కలిసొచ్చాయి. సెప్టెంబర్‌లో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత ఉండొచ్చన్న అంచనాలూ సెంటిమెంట్‌ను బలపరిచాయి. సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ప్రారంభంలో కాస్త తడబడినా.., వెంటనే తేరుకున్నాయి. రోజంతా ఒడిదుడుకులకు లోనవుతూ సానుకూలంగా ముందుకు కదిలాయి.

**సూచీల కదలికలు ఇలా..:** సెన్సెక్స్ 80,723 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 518 పాయింట్లు పెరిగి 80,943 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 378 పాయింట్ల లాభంతో 80,803 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 24,699 వద్ద స్థిరపడింది. రోజంతా 24,734 – 24,607 శ్రేణిలో ట్రేడైంది. ఈ సూచీకిది నాలుగోరోజూ లాభాల ముగింపు.

**రూపాయికి 10 పైసలు లాభం:** అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో పాటు అమెరికా డాలర్ బలహీనపడంతో దేశీయ కరెన్సీ రూపాయి ఎనిమిది పైసలు బలపడి 83.77 వద్ద స్థిరపడింది.

**ఓలాకు బ్రేకులు:** లిస్టింగ్ రోజు నుంచి లాభాల్లో దూసుకెళ్తున్న ఓలా షేరు ర్యాలీకి బ్రేక్ పడింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో డీలా పడింది. బీఎస్‌ఈలో 6% నష్టపోయి రూ.138 వద్ద ముగిసింది. ఇంట్రాడే ఆరున్నర శాతం క్షీణించి రూ.154 వద్ద కనిష్టాన్ని తాకింది.

**సరస్వతి శారీ డిపో లిస్టింగ్ సక్సెస్**

శారీ హోల్‌సేల్ విభాగానికి చెందిన సరస్వతి శారీ డిపో లిస్టింగ్‌లో మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(160%)తో పోలిస్తే 25% ప్రీమియంతో రూ.200 వద్ద లిస్టయ్యింది. షేరుకు భారీ కొనుగోళ్ల మద్దతు లభించడంతో 31% ర్యాలీ ఎగసి రూ.210 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి.., అక్కడి ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.831.40 కోట్లుగా నమోదైంది.

**రీట్ హోల్డర్లకు రూ.1,371 కోట్లు**

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టైన ఎంబసీ బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్‌లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో తమ రీట్ హోల్డర్లకు రూ.1,371 కోట్లు పంచాయి. ఇండియన్ రీట్స్ అసోసియేషన్ డేటా ప్రకారం ఈ నాలుగు రీట్‌లకు మొత్తం 2.45 లక్షల యూనిట్ హోల్డర్లు ఉన్నారు.

## భారీ పెట్టుబడులకు కార్పొరేట్ దిగ్గజాలు రెడీ

### ఏడాదికి రూ. 4.2 లక్షల కోట్లు ● 30 శాతం వాటాతో ఆర్‌ఐఎల్ జోరు



న్యూఢిల్లీ: దేశీ కార్పొరేట్లు వచ్చే రెండేళ్లలో భారీస్థాయిలో పెట్టుబడులు వెచ్చించనున్నట్లు గ్లోబల్ రేటింగ్స్ దిగ్గజం మూడీస్ తాజాగా పేర్కొంది. సామర్థ్య విస్తరణ తదితరాలకు ఏడాదికి 45–50 బిలియన్ డాలర్లు(దాదాపు 4.2 లక్షల కోట్లు) చొప్పున ఇన్వెస్ట్ చేయనున్నట్లు నివేదికలో తెలియజేసింది. పెట్టుబడుల్లో ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) 30 శాతం వాటాను ఆక్రమించుకోవడం ద్వారా టాప్ ర్యాంకులో నిలవనున్నట్లు అభిప్రాయపడింది. సరఫరా చైన్ తదితర భిన్న విభాగాలను ఏకీకృతం చేయడం, కర్బన రహిత(నెట్ జీరో) సంస్థగా ఆవిర్భవించడం వంటి లక్ష్యాలకు నిధులను వినియోగించనున్నట్లు వివరించింది. ఇండియా, ఇండోనేసియాలో కార్పొరేట్లు పేరిట మూడీస్ వెలువరించిన నివేదిక ప్రకారం ఆర్‌ఐఎల్ సుమారు 15 బిలియన్ డాలర్లు(దాదాపు రూ. 1,26,000 కోట్లు) వెచ్చించనుంది. వార్షికంగా వివిధ బిజినెస్ విభాగాలపై పెట్టుబడులు వెచ్చించనుంది. రానున్న రెండేళ్లలో దేశీ చమురు, గ్యాస్ రంగం పెట్టుబడుల్లో ఆర్‌ఐఎల్ 60% వాటాను ఆక్రమించనుంది. మిగిలిన ఏడు రేటెడ్ దిగ్గజాలు ఉమ్మడిగా 30 శాతం పెట్టుబడులకు తెరతీయనున్నాయి. వెరసి ఈ కంపెనీలు సామర్థ్య విస్తరణ, గ్రీన్ ఎనర్జీలపై 15 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. ఉదాహరణకు రానున్న రెండేళ్లలో పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీ 6 బిలియన్ డాలర్లు, ఐవోసీ 4 బిలియన్ డాలర్లు చొప్పున వార్షికంగా వెచ్చించనున్నాయి.

---

# భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com




### పవర్‌గ్రిడ్‌లో 38 పోస్టులు

గుర్‌గావ్‌లోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పవర్‌గ్రిడ్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 38.
- **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్ (సర్వే ఇంజనీరింగ్) గ్రేడ్–3 (ఎస్2)–15, సర్వేయర్ గ్రేడ్–4(డబ్ల్యూ–4)–15, డ్రాఫ్ట్స్‌మ్యాన్ (గ్రేడ్ –4 /డబ్ల్యూ4)–08.
- **అర్హత:** ఐటీఐ (డ్రాఫ్ట్స్‌మ్యాన్ సివిల్/ఆర్కిటెక్చరల్ డ్రాఫ్ట్స్‌మ్యాన్), ఇంజనీరింగ్ డిప్లొమా(సివిల్/సర్వేయర్), బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** జూనియర్ ఇంజనీర్ పోస్టులకు 31 ఏళ్లు, సర్వేయర్, డ్రాఫ్ట్స్‌మాన్ పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** జూనియర్ ఇంజనీర్ పోస్టులకు రూ. 26,000 నుంచి రూ.1,18,000, సర్వేయర్, డ్రాఫ్ట్స్‌మాన్ పోస్టులకు రూ.22,000 నుంచి రూ.85,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, షార్ట్ లిస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 29.08.2024.
- వెబ్‌సైట్: https://www.powergrid.in


### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో వివిధ ఉద్యోగాలు

తెలంగాణ ప్రభుత్వం, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎస్సీ డెవలప్‌మెంట్ స్టడీ సర్కిల్.. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
- **పోస్టుల వివరాలు:** ఆఫీస్ మేనేజర్ కమ్ అకౌంటెంట్–01, కోర్సు కోఆర్డినేటర్–01, ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్–01, ఆఫీస్ అసిస్టెంట్/అటెండర్–03.
- **అర్హత:** ఆఫీస్ అసిస్టెంట్/అటెండర్ పోస్టుకు ఏడో తరగతి, ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుకు డిగ్రీ, పీజీడీసీఏ, లోయర్ గ్రేడ్ ఇంగ్లిష్/తెలుగు టైప్ రైటింగ్ సర్టిఫికెట్, కోర్సు కో–ఆర్డినేటర్ పోస్టుకు ఏదైనా పీజీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఆఫీస్ మేనేజర్ కమ్ అకౌంటెంట్ పోస్టుకు బీకాం లేదా ఎంబీఏతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **వేతనం:** నెలకు ఆఫీస్ అసిస్టెంట్/అటెండర్ పోస్టుకు రూ.22,000.ఇతర పోస్టులకు 31,000.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఇంటర్వ్యూ, పని అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం, రాజన్న సిరిసిల్ల చిరునామకు అందజేయాలి.
- దరఖాస్తులకు చివరితేది: 25.08.2024.
- వెబ్‌సైట్: https://rajannasircilla.telangana.gov.in



### సుప్రీంకోర్టులో 80 జూనియర్ కోర్టు అటెండెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు.. జూనియర్ కోర్టు అటెండెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 80.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.46,210.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ప్రాక్టికల్ ట్రేడ్ స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరితేది: 12.09.2024.
- వెబ్‌సైట్: https://www.sci.gov.in

### ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు (స్పోర్ట్స్) పోస్టులు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా.. క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్నివీర్ వాయు(స్పోర్ట్స్) (01/2025) ఖాళీల భర్తీకి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **క్రీడలు:** అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉషు.
- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2(మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్) లేదా ఏదైనా స్ట్రీమ్/సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు(మెకానికల్/ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ /ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక దారుఢ్యం/వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తప్పనిసరిగా ఉండాలి. 152 సెం.మీ. కనీస ఎత్తు ఉండాలి.
- **వయసు:** 02.01.2004 నుంచి 02.07.2007 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.
- **ఎంపిక విధానం:** సెలక్షన్ టెస్ట్, స్పోర్ట్స్ స్కిల్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది: 20.08.2024.
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది: 29.08.2024.
- రిక్రూట్‌మెంట్ ట్రయల్స్ షెడ్యూల్:18.09.2024 నుంచి 20.09.2024 వరకు
- ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ.
- వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in

### నిట్ వరంగల్‌లో 10 నాన్ టీచింగ్ పోస్టులు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్).. డైరెక్ట్/డిప్యూటేషన్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
- **పోస్టుల వివరాలు:** ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్–02, ప్రిన్సిపల్ స్టూడెంట్స్ యాక్టివిటీ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్–01, డిప్యూటీ రిజిస్ట్రార్–02, అసిస్టెంట్ రిజిస్ట్రార్–01, టెక్నికల్ ఆఫీసర్–01, అసిస్టెంట్ ఇంజనీర్–03.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** టెక్నికల్ ఆఫీసర్ పోస్టుకు 35 ఏళ్లు, ఇతర పోస్టులకు 56 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 16.08.2024.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 09.09.2024.
- వెబ్‌సైట్: https://nitw.ac.in/careers

# ఆర్మీ కొలువుకు మార్గం

- పదో తరగతి, ఇంటర్‌తో త్రివిధ దళాల్లో ఉద్యోగాలు
- సార్జంట్ మొదలు మేజర్ వరకు పలు అవకాశాలు
- 10+2 ఎంట్రీ స్కీమ్‌తో కొలువుతోపాటు డిగ్రీ సర్టిఫికెట్




**దేశంలో యూనిఫామ్ కొలువులపై యువతకు ఎంతో క్రేజ్! సైన్యంలో చేరితే.. దేశ సేవతోపాటు సుస్థిర కెరీర్ సొంతమవుతుంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఆర్మీలో చేరే అవకాశముంది. అందుకు ఎన్‌డీఏ ఎగ్జామినేషన్, 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్, అగ్నివీర్ తదితర మార్గాలున్నాయి. ఈ నేపథ్యంలో.. ఆర్మీలో ఉద్యోగాలు, అర్హతలు, ఎంపిక విధానం, కెరీర్ స్కోప్‌పై ప్రత్యేక కథనం..**

### ఎన్‌డీఏ ఎగ్జామినేషన్

ఇంటర్మీడియెట్ అర్హతతో త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకుతో కొలువులో చేరేందుకు మార్గం.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్ (ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ). ఈ పరీక్ష ద్వారా ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్.. ఇలా మూడు దళాల్లోకి పర్మనెంట్ కమిషన్ ర్యాంకు హోదాతో ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు.

- ఈ పరీక్షను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఏటా రెండుసార్లు నిర్వహిస్తుంది. 900 మార్కులకు రాత పరీక్ష, మరో 900 మార్కులకు సర్వీస్ సెలక్షన్ బోర్డ్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ రెండు దశల్లో చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతలకు ఇండియన్ మిలటరీ అకాడమీ, నేవల్ అకాడమీ, ఎయిర్ ఫోర్స్ అకాడమీల్లో శిక్షణిస్తారు. ఈ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకుంటే.. బీఎస్సీ/బీఎస్సీ(కంప్యూటర్స్), బీఏ/బీటెక్ డిగ్రీతోపాటు వారు ఎంచుకున్న విభాగంలో పర్మనెంట్ కమిషన్‌తో కొలువు ఖరారవుతుంది. ఆర్మీలో లెఫ్టినెంట్, నేవీలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్ ఫోర్స్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో కెరీర్ ప్రారంభించే అవకాశం ఉంది.

### 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్

ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఆర్మీలో ప్రవేశించేందుకు అవకాశం కల్పించే స్కీమ్ ఇది. ఇంటర్మీడియెట్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లతో 70 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు.. 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌కు అర్హులు. ఇంటర్మీడియెట్‌లో పొందిన మార్కులను ప్రాతిపదికగా తీసుకుని ముందుగా అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేస్తారు. ఎంపికైనవారికి సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్‌ఎస్‌బీ) ఐదు రోజుల పాటు రెండు దశల్లో సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. వీటిలో విజయం సాధించి 10+2 ఎంట్రీ స్కీమ్ కోర్సులో చేరిన వారికి అయిదేళ్ల పాటు శిక్షణనిస్తారు. మొదటి ఏడాది బేసిక్ ట్రైనింగ్, తర్వాత నాలుగేళ్లు టెక్నికల్ ట్రైనింగ్ ఇస్తారు. దీన్ని పూర్తి చేసుకున్న వారికి వారు శిక్షణ సమయంలో తీసుకున్న సబ్జెక్ట్‌ల ఆధారంగా ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ పట్టాలను అందిస్తారు. ఆ తర్వాత సదరు అభ్యర్థులను లెఫ్టినెంట్ హోదాతో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకులో నియమిస్తారు.

### అగ్నివీర్ నియామకాలు

కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా.. ఆర్మీలో అగ్నివీర్ నియామకాలు చేపడుతున్నారు. పదో తరగతి అర్హతతో అగ్నివీర్ (జనరల్ డ్యూటీ), అగ్నివీర్(ట్రేడ్స్‌మెన్); ఇంటర్మీడియెట్ అర్హతతో అగ్నివీర్ (టెక్నికల్), అగ్నివీర్ (క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్) పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు.

### రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

- నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగిన వారికి రెండు దశల ఎంపిక ప్రక్రియ చేపడతారు. తొలి దశలో కామన్ కాంపిటీటివ్ ఎగ్జామ్ పేరుతో ఆన్‌లైన్ టెస్ట్ ఉంటుంది. ఈ ఆన్‌లైన్ టెస్ట్‌లో భాగంగా జనరల్, నాన్–టెక్నికల్ విభాగాల వారికి 50 ప్రశ్నలు–100 మార్కులతో పరీక్ష నిర్వహిస్తారు. జనరల్ నాలెడ్జ్ (15 ప్రశ్నలు–30 మార్కులు), జనరల్ సైన్స్ (15 ప్రశ్నలు–30 మార్కులు), మ్యాథమెటిక్స్(15 ప్రశ్నలు–30 మార్కులు), లాజికల్ రీజనింగ్ (5 ప్రశ్నలు–10 మార్కులు) నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- టెక్నికల్ బ్రాంచ్‌ల అభ్యర్థులకు 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. జనరల్ నాలెడ్జ్(10 ప్రశ్నలు), మ్యాథమెటిక్స్(15 ప్రశ్నలు), ఫిజిక్స్(15 ప్రశ్నలు), కెమిస్ట్రీ(10 ప్రశ్నలు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు కేటాయిస్తారు.
- క్లర్క్ పోస్టుల అభ్యర్థులకు పార్ట్–1(జనరల్ నాలెడ్జ్–5 ప్రశ్నలు, జనరల్ సైన్స్–5 ప్రశ్నలు, మ్యాథమెటిక్స్–10 ప్రశ్నలు, కంప్యూటర్ సైన్స్ –5 ప్రశ్నలు), పార్ట్–2 (జనరల్ ఇంగ్లిష్–25 ప్రశ్నలు) పేరుతో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు చొప్పున 200 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది.
- అన్ని విభాగాలకు సంబంధించి రాత పరీక్ష ముగిసిన తర్వాత అందులో ప్రతిభ ఆధారంగా.. తదుపరి దశలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ పేరుతో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 1.6 కిలోమీటర్ల పరుగు పందెం, పుల్ అప్స్ పరీక్షలు ఉంటాయి. ఇది కూడా పూర్తయిన తర్వాత ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహించి నియామకాలు ఖరారు చేస్తారు.
- అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా నాలుగేళ్ల కాలానికి అగ్నివీర్‌లను ఎంపిక చేస్తారు. తొలి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది నెలకు రూ.33 వేలు, మూడో ఏడాది నెలకు రూ.36,500, నాలుగో ఏడాది నెలకు రూ.40 వేలు చొప్పున వేతనం అందిస్తారు. నాలుగేళ్లు పూర్తి చేసుకున్న తర్వాత స్కిల్ సర్టిఫికెట్ కూడా అందిస్తారు.

### ఉజ్వల కెరీర్

ఆర్మీలో చేరిన వారికి కెరీర్ ఉజ్వలంగా ఉంటుందని చెప్పొచ్చు. లెఫ్టినెంట్ హోదాతో కెరీర్ ప్రారంభించిన రెండేళ్లకు కెప్టెన్, ఆరేళ్లకు మేజర్, పదమూడేళ్లకు లెఫ్టినెంట్ కల్నల్, ఇరవై ఆరేళ్లకు కల్నల్.. ఇలా వివిధ హోదాల్లో ప్రమోషన్లు పొందుతారు. భవిష్యత్తులో పనితీరు ఆధారంగా సదరు విభాగానికి అధిపతి స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది.

ఆర్మీ ఉద్యోగాల పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in



## చేపల ఇగురు.. చేపల ఫ్రై.. చేపల పులుసు..

అలస్కాలో సమ్మర్ మొదలైందంటే.. సాల్మన్ ఫిష్‌ల సందడి కూడా మొదలవుతుంది. అలాగే ఎలుగుబంట్లది కూడా.. వాటికి అవంటే చాలా ఇష్టం. చూశారుగా.. వారానికి కావాల్సిన సరుకు ఇక్కడే అందిపుచ్చుకునే చాన్స్.. ఆ్రలేడీ ఇంట్లో మసాలా నూరమని చెప్పే వచ్చిందట. ఈ రోజు ఈ ఎలుగుబంటికి ఫెస్టివల్.. పాపం.. సాల్మన్‌లకు ఇన్‌ఫ్రంట్ క్రొకొడైల్ ఫెస్టివల్! కట్మై నేషనల్ పార్కులోని ఈ సన్నివేశాన్ని ఆడమ్ రైస్ అనే ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు.

## చిన్నారికి జీవితకాలం ఉచిత బస్సు పాస్

- ప్రసవం చేసిన నర్సుకు ఏడాది ఉచిత ప్రయాణం
- ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి




కండక్టర్, డ్రైవర్, నర్సులకు బహుమతులు అందజేస్తున్న సజ్జనార్

గద్వాల క్రైం: గద్వాల ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న గర్భిణికి స్టాఫ్‌నర్సు సహాయంతో కండక్టర్ సుఖ ప్రసవం చేయడంపై ఆర్టీసీ యాజమాన్యం, ఎండీ సజ్జనార్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులో పురుడు పోసుకున్న ఈ చిన్నారికి జీవితకాలంపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. గద్వాల మండలంలోని కొండపల్లికి చెందిన గర్భిణి సంధ్య సోమవారం రాఖీ పండుగ కోసం ఆర్టీసీ బస్సులో వనపర్తికి వెళ్తుండగా పురిటి నొప్పులు రావడంతో మార్గమధ్యలోనే కండక్టర్ భారతి స్టాఫ్‌నర్సు అలివేలు సహాయంతో సుఖ ప్రసవం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్పందించిన ఆర్టీసీ యాజమాన్యం మంగళవారం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో కండక్టర్ భారతి, స్టాఫ్‌నర్సు అలివేలు, బస్సు డ్రైవర్ అంజిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. మహిళకు ప్రసవం చేసేందుకు సహకరించిన స్టాఫ్‌నర్సు అలివేలుకు ఏడాదిపాటు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీవోవో రవీందర్, సిబ్బంది మునిశేఖర్, కృష్ణకాంత్, శ్రీదేవి, జ్యోతి, గద్వాల డిపో మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి, సెంట్రల్ డెస్క్

## రోడ్డుకు లెఫ్టా.. రైటా..?




**మీరు రోడ్డుకు ఏ వైపు వాహనం నడుపుతారు? ఇదేం పిచ్చి ప్రశ్న అనుకుంటున్నారా?**

కానీ ప్రపంచ దేశాలను చుట్టొచ్చే పర్యాటకులను ముఖ్యంగా విదేశాల్లో కార్లను అద్దెకు తీసుకొని సరదాగా విహరిద్దామనుకొనే వారిని మాత్రం ఈ ప్రశ్న తొలిచేస్తూ ఉంటుంది. ఎందుకంటే.. ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు రోడ్డుకు ఎడమ వైపును అంటిపెట్టుకొని వాహనాలు నడిపే పద్ధతిని అనుసరిస్తుంటే మరికొన్ని దేశాలు కుడివైపు బాటలో ముందుకు సాగే విధానాన్ని ఫాలో అవుతున్నాయి. మొత్తంగా చూస్తే మూడొంతుల దేశాల్లో ప్రజలు రోడ్డుకు కుడివైపు వాహనాలు నడుపుతుండగా మిగిలిన వారు రోడ్డుకు ఎడమ వైపు నుంచే వాహనాలు నడుపుతున్నారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే.. 174 దేశాలు, ప్రాంతాల్లో రైట్ హ్యాండ్ డ్రైవ్ ట్రాఫిక్ ఉంటే కేవలం 78 దేశాల్లో లెఫ్ట్ హ్యాండ్ సైడ్ డ్రైవ్ ఉంది. రోడ్డుకు ఎడమ వైపు నుంచి వాహనాలు నడిపే దేశాల్లో ఒకప్పటి బ్రిటిష్ కాలనీలైన భారత్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ కూడా ఉన్నాయి. అయితే యూరోప్‌లోని దేశాల్లో యూకే, ఐర్లాండ్, మాల్టా, సైప్రస్ మాత్రమే ఎడమ వైపు వాహనాలు నడిపే విధానాన్ని అనుసరిస్తున్నాయి.

సాక్షి, సెంట్రల్ డెస్క్

## నేటి నుంచి ఇంజనీరింగ్ సీట్ల స్లైడింగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో బుధవారం నుంచి అంతర్గత స్లైడింగ్ ప్రక్రియ మొదలుకానుంది. దీన్ని ఈసారి సాంకేతిక విద్య విభాగం నిర్వహిస్తోంది. ప్రతీ ఏటా స్లైడింగ్‌ను సంబంధిత కాలేజీలే నిర్వ హించేవి. స్లైడింగ్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను సాంకేతిక విద్య కమిష నర్ దేవసేన మంగళవారం విడుదల చేశా రు. కాలేజీల్లో ఇప్పటికే సీట్లు పొందిన విద్యార్థులు, బ్రాంచీ మార్చుకోవా లనుకుంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. తుది దశ కౌన్సెలింగ్ ముగిసే సమయానికి ఐదు వేల సీట్లు భర్తీ కాలేదు. సీట్లు కేటాయించినప్పటికీ దాదాపు 6,800 మంది విద్యార్థులు రిపోర్టు చేయలేదు. దీంతో 11,800 ఖాళీలు ఏర్పడ్డాయి. స్లైడింగ్‌కు ఆన్లైన్ ద్వారా ఈ నెల 21, 22 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని, 24న సీట్లు కేటాయిస్తామని, 25 వరకూ అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇదే రోజు సీటు వచ్చిన బ్రాంచీలో రిపోర్టు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఏ కాలేజీలో ఎన్ని సీట్లు ఉన్నాయనే వివరాలను 21వ తేదీ ఉదయం 11.30కు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

## 22, 23 తేదీల్లో జాతీయ వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: ఆగస్టు 22, 23 తేదీల్లో రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో 'ఆన్ కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ స్కీమ్'అంశంపై జాతీయ వర్క్‌షాప్ జరగనుంది. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈఎస్ఈ డివిజన్ ప్రిన్సిపల్ ఎకనమిక్ అడ్వైజర్ దేవజిత్ ఖవుండ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. వర్క్‌షాప్‌లో 19 రాష్ట్రాల నుంచి సుమారు 120 మంది ప్రతినిధులు అనేక అంశాలపై చర్చలు జరుపుతారని విశ్వవిద్యాలయం సంచాలకురాలు డాక్టర్ కె.సుహాసిని తెలిపారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 

సాగుబడి


మఖ కార్తె: ఆగస్టు 31 వరకు

- అహ్మదాబాద్‌లో మూడేళ్లలో 100 ఖంబాతి కువ బావుల నిర్మాణం
- హైదరాబాద్‌లో కుండపోత వర్షాల వరద నివారణకు ఈ ఇంకుడు బావుల నిర్మాణమే మార్గం

కుండపోత వర్షాలు కురిసినప్పుడు కూడా వరద నీటిని తక్కువ సమయంలో భూమి లోపలికి ఇంకింపజేసేందుకు ఈ పురాతన 'ఇంకుడు బావులు' ఉపయుక్తంగా ఉన్నాయి. పంట పొలాల్లో, నివాస ప్రాంతాల్లో లేదా నగరాలు/ పట్టణాల్లో కుండపోత వర్షాలతో ఏర్పడే వరద సమస్యను అధిగమించటంతో పాటు.. భూగర్భ జలాలను పెంపొందించుకునేందుకు ఇంకుడు బావులు ఉపయోగపడతున్నాయని గుజరాతీ పర్యావరణ కార్యకర్తలు చెబుతున్నారు. గుజరాతీ భాషలో ఈ ఇంకుడు బావిని 'ఖంబాతి కువ' అంటారు.


ఇలా తవ్వాలి


ఈ విధంగా ఇటుకలతో గోడ కట్టాలి


వరద నీరు బావిలోకి చేరేలా గొట్టాల ఏర్పాట్లు

## వరద నీటిని నిమిషాల్లో నింపేసుకునే ఖంబాతి కువ బావులు!

గుజరాత్‌లో పూర్వీకుల సంప్రదాయ జ్ఞానానికి నిదర్శనంగా నిలిచే ఖంబాతి కువ బావులను సాధారణంగా 30 అడుగుల లోతు నిర్మిస్తారు. దీని చుట్టుకొలత అవసరాన్ని బట్టి 3 నుంచి 30 అడుగుల వరకు ఉంటుంది. బావి తవ్విన తర్వాత హానికోంబ్ పద్ధతిలో మట్టి ఇటుకలను పేర్చుతూ, నీరు ఇంకడానికి ఇటుకల మధ్య ఖాళీలు వదులుతూ, గోడను నిర్మిస్తారు. దానిపైన ఆర్‌సిసి శ్లాబ్ వేసి నీరు లోపలికి వెళ్లే మార్గాలను, ఇన్‌స్పెక్షన్ కవర్‌ను నిర్మిస్తారు.

అహ్మదాబాద్‌లో వాననీటి సంరక్షణపై పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థ త్రీవాక్స్ సమాచారం ప్రకారం.. 3 అడుగుల చుట్టుకొలత, 30 అడుగుల లోతు ఉన్న ఇంకుడు బావి నిర్మాణానికి రూ. 60 వేల వరకు ఖర్చవుతుంది. ఇది గంటకు 5 వేల నుంచి 7 వేల వరకు వరద నీటిని భూమి లోపలికి ఇంకింపజేయగలదు. 10 అడుగుల చుట్టుకొలత గల బావి నిర్మాణానికి రూ. 2,10,000 ఖర్చవుతుంది. ఇది గంటకు 35-45 వేల లీటర్లను ఇంకింపజేయగలదు. 30 అడుగుల చుట్టుకొలత, 30 అడుగుల లోతు ఉండే బావి నిర్మాణానికి రూ. 10 లక్షలు ఖర్చవుతుంది. దీని ద్వారా గంటకు 25 వేల నుంచి లక్ష లీటర్ల నీరు ఇంకింపజేయవచ్చు అని చెబుతున్నారు. బావి నిర్మించే ప్రాంతంలో జియలాజికల్ పరిస్థితుల్ని బట్టి ఎంత నీరు భూమి లోపలికి ఇంకుతుందనే విషయం ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు.

గత మూడేళ్లలో అహ్మదాబాద్‌లో ముంచుకొచ్చే ఆకస్మిక వరద బెడదను తగ్గించడానికి 100 ఖంబాతి కువ బావులు నిర్మించారు. ఒక కాలనీలో నిర్మించిన బావి వల్ల 3 ఏళ్లలోనే భూగర్భ జలాల్లో నీట కరిగిన లవణాల (టీడీఎస్)ను 1,700 నుంచి 1,000కి తగ్గినట్లు చెబుతున్నారు. అహ్మదాబాద్‌లోని భీమానగర్‌లో 25 అడుగుల చుట్టుకొలత గల ఇంకుడు బావి 20 ఏళ్లుగా చక్కగా పనిచేస్తోందట. ఖంబటి కువ ద్వారా ఎక్కువ నీటిని భూగర్భంలోకి ఇంకింపజేయాలంటే ఇసుక పొర బయటపడే వరకు తవ్వాలి. 8 అడుగుల చుట్టుకొలత గల బావి అడుగున 5 అడుగుల మేర ఇసుక పొర ఉంటే గంటకు 40 లీటర్ల నీటిని ఇంకింపజేయగలదని త్రీవాక్స్ స్వచ్ఛంద సంస్థ చెబుతోంది. పంట పొలాల్లో అయినా, హైదరాబాద్ వంటి నగరాల్లో అయినా కుండపోత వర్షాల వల్ల పారే వరదను చప్పున, సమర్థవంతంగా భూమి లోపలికి ఇంకింపజేసుకోవడానికి ఈ 'ఇంకుడు బావులు' చవకైన, సమర్థ సాధనాలని చెప్పొచ్చు.

### సాగు నీటిలో టీడీఎస్ 450-2000 మధ్య ఉండాలి!

భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) నివేదిక ప్రకారం.. భూగర్భ జలాల్లో నీట కరిగిన లవణాలు (టీడీఎస్) 450 ఎం.జి./ లీ. కన్నా తక్కువగా ఉంటే ఆ నీరు వ్యవసాయానికి అనుకూలం. అత్యధికంగా టీడీఎస్ 2000 ఎం.జి./లీ. వరకు పర్వాలేదు. అంతకన్నా ఎక్కువ ఉంటే వ్యవసాయానికి ఆ నీరు పనికిరాదు. నీటిలో టీడీఎస్ ఎక్కువగా ఉంటే పంట మొక్కల్లో కిరణజన్య సంయోగ క్రియ తగ్గి పెరుగుదల మందగిస్తుంది. భార ఖనిజాలు, విషతుల్య పదార్థాలు పంటను దెబ్బతీస్తాయి. భూగర్భ జలాల్లో టీడీఎస్‌ను తగ్గించుకునేందుకు కుంభవృష్టి సమయాల్లో పెద్ద మొత్తంలో నీటిని భూమిలోకి ఇంకింపజేయాల్సి ఉంటుంది. ఇందుకు ఖంబాతి కువ ఇంకుడు బావులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. సాధారణ వర్షపు నీటిని భూమి లోపలికి ఇంకింపజేయడానికి కందకాలు, నీటి కుంటలు ఉపయోగపడతాయి.

### పదేళ్ల వరకు నిర్వహణ ఖర్చు లేదు



ఖంబాతి కువ (ఇంకుడు బావు)లు వాన నీటి సంరక్షణకు అద్భుత సాధనాలు. ఇవి చాలా ఎక్కువ నీటిని, చాలా వేగంగా భూమిలోకి ఇంకింపజేస్తాయి. అంతేకాదు, జీరో మెయింటెనెన్స్. 8-10 ఏళ్ల వరకు ఎటువంటి నిర్వహణ అవసరం లేదు. అహ్మదాబాద్‌లో దశాబ్దాలుగా రివర్స్ బోర్ల ద్వారా నీటి సంరక్షణ జరిగినా భూగర్భ జలాలు అడుగంటుతూనే ఉన్నాయి. ఖంబాతి కువల నిర్మాణమే అసలైన పరిష్కారం అని మా అనుభవాలు చెబుతున్నాయి. ఉదాహరణకు.. అహ్మదాబాద్‌లో నందన్ బాగ్ సొసైటీలో 7 ఖంబాతి కువలను నిర్మించాం. కుండపోత వర్షాలు కురిసినప్పుడు వచ్చే వరదను కూడా పూర్తిగా భూమిలోకి ఇంకుతోంది. ఈ ఒక్క సొసైటీలోనే ఏటా 15 కోట్ల లీటర్ల నీటి సంరక్షణ జరుగుతోంది.

- లోకేంద్ర బలసారియా, పర్యావరణ కార్యకర్త, ఆర్కిటెక్ట్, త్రీవాక్స్ వ్యవస్థాపకుడు, అహ్మదాబాద్

---

- పాల సొసైటీల మాదిరిగానే మెన్యూర్ సొసైటీలు
- గుజరాత్‌లో 'మెన్యూర్ కోఆపరేటివ్ సొసైటీ' నమూనా కూడా సక్సెస్
- దేశవ్యాప్త విస్తరణ యోచనలో ఎన్.డి.డి.బి.


తన ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న బయోగ్యాస్ బెలూన్ వద్ద మహిళా రైతు


## బయో సహకార విప్లవం

పాడి రైతుల సహకార ఉద్యమానికి పట్టుగొమ్మగా నిలిచిన గుజరాత్.. మరో సరికొత్త రకం సహకార విప్లవానికి దారులువేస్తోంది. దేశంలోనే అత్యధిక సంఖ్యలో సహకార సంఘాలకు నిలయమైన గుజరాత్‌లో జాతీయ పాడి అభివృద్ధి సంస్థ (ఎన్.డి.డి.బి.) సరికొత్త సహకారోద్యమానికి శ్రీకారం చుట్టింది.





పాల ఉత్పత్తికే పరిమితమై పనిచేస్తున్న 'మహిళా పాడి రైతుల సహకార సంఘాలు' కోకొల్లలు. ఈ సంఘాలకు అనుబంధంగా ఇప్పుడు పేడతో బయోగ్యాస్, సేంద్రియ ఎరువులను తయారు చేసే మహిళా సహకార సంఘాలు ఏర్పాటవుతున్నాయి. గుజరాత్ ఆనంద్ జిల్లాలోని మారుమూల గ్రామమైన జకారియాపుర గ్రామంలో రెండేళ్ల క్రితం తొట్టతొలి 'ఆల్-వుమన్ మెన్యూర్ కోఆపరేటివ్' (జకారియాపుర సఖి ఖాద్ సహకారి మండలి) వెలసింది. చక్కటి విజయాలు సాధించిన ఈ నమూనాను ఎన్.డి.డి.బి. ఇప్పటికే పది రాష్ట్రాలకు విస్తరింపజేసింది.



పాలు ఉత్పత్తి చేస్తున్న చిన్న, సన్నకారు మహిళా రైతులు ఇప్పుడు ఇంటిపట్టునే బయోగ్యాస్ తయారు చేసుకొని ఇంట్లో వంటకు వాడుతున్నారు. వీరికి 2 క్యూబిక్ మీటర్ల ఉత్పత్తి సామర్థ్యం గల బయోగ్యాస్ ప్లాంట్లను ఎన్.డి.డి.బి. ఉచితంగా పంపిణీ చేసింది. 2, 3 ఆవులు లేదా గేదెలు వేసే పేడ ఈ యూనిట్‌కు ఇన్‌పుట్‌గా సరిపోతుంది. ఆ విధంగా పాడి రైతుల ఇళ్ల దగ్గరే బయోగ్యాస్ ఉత్పత్తి ప్రారంభమైంది. ఈ బయోగ్యాస్ 5,6గురితో కూడిన కుటుంబానికి వంటకు సరిపోతోంది. బయోగ్యాస్ ఉత్పత్తి వల్ల వంట చెరకు కొనుగోలు ఖర్చు తగ్గింది. కట్టెల పొయ్యి పొగ గృహిణులకు కలిగించే ఆరోగ్య సమస్యలు తీరిపోయాయి.

బయోగ్యాస్ యూనిట్ నుంచి వెలువడే స్లర్రీ (చిక్కటి పేడ ద్రవం) కూడా వృథాగా పోవటం లేదు. 'ఎన్.డి.డి.బి. మ్రిదా లిమిటెడ్' సంస్థ మహిళా రైతుల నుంచి స్లర్రీని కొనుగోలు చేస్తోంది. జకారియాపుర మెన్యూర్ కోఆపరేటివ్ సభ్యుల నుంచి ట్యాంకర్ల ద్వారా సేకరించిన స్లర్రీని సేంద్రియ ఎరువులు ఉత్పత్తి కేంద్రానికి చేర్చుతారు. అక్కడ ప్రాసెసింగ్ యంత్రాల ద్వారా 'సుధాన్' బ్రాండ్ పేరుతో రకరకాల సేంద్రియ ఘన, ద్రవరూప ఎరువులను తయారు చేసి తిరిగి రైతులకు విక్రయిస్తున్నారు. ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మెన్యూర్(ఎఫ్.ఓ.ఎం.), ఫాస్ఫేట్ రిచ్ ఆర్గానిక్ మెన్యూర్ (పి.ఆర్.ఓ.ఎం.) వంటివి అందులో కొన్ని. మెన్యూర్ కోఆపరేటివ్ సభ్యులకు స్లర్రీ అమ్మకం ద్వారా అదనపు ఆదాయం సమకూరటంతో పాటు మహిళా సాధికారత కూడా చేకూరుతోంది.

స్లర్రీ ఆధారిత ఎరువులు వాడటం వల్ల గులాబీ, అరటి రైతులు చక్కటి ఫలితాలు పొందుతున్నారు. ఖంకువ గ్రామానికి చెందిన రైతు సంజయ్‌భాయ్ ఠాకూర్ రెండేళ్లుగా ఈ ఎరువులు వాడుతున్నారు. 'సుధాన్ సేంద్రియ ఎరువులు చవకగానే ఉన్నాయి. వీటిని వాడిన తర్వాత మా గులాబీ తోటలో పూల దిగుబడి, నాణ్యత బాగా పెరిగాయ'ని ఠాకూర్ అన్నారు. సుధాన్ మైక్రో న్యూట్రియంట్స్ వాడినందు వల్ల తన అరటి తోటలో గెలల బరువు 35-40 కిలోల వరకు పెరిగిందని సర్సకు చెందిన రైతు ప్రవీణ్ చంద్ర ఛద్వ సంతృప్తిని వ్యక్తం చేశారు. బావుంది కదూ..!

### దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తాం!



జకారియాపురలో మెన్యూర్ కోఆపరేటివ్ ద్వారా ప్రయోగాత్మకంగా అమలు చేసిన వేస్ట్ టు వెల్త్ కార్యక్రమం విజయవంతమైంది. ఇప్పటికే పది రాష్ట్రాల్లో అమలు ప్రారంభించాం. త్వరలోనే ఈ మెన్యూర్ కోఆపరేటివ్ నమూనాను దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తాం.

- డాక్టర్ మీనేశ్ షా, చైర్మన్, జాతీయ పాడి అభివృద్ధి సంస్థ

### ఆ గ్రామంలో 368 బయోగ్యాస్ ప్లాంట్లు



మా జకారియాపుర గ్రామంలో 368 బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నాం. లబ్ధిదారులందరూ మహిళలే. ఎన్.డి.డి.బి. అధికారులు వచ్చి పశువుల పేడతో బయోగ్యాస్ తయారు చేయవచ్చని చెప్పే వరకు మాకు తెలీదు. స్లర్రీ నుంచి కూడా ఆదాయం వస్తోంది.

- మధుబెన్ పర్మర్, కార్యదర్శి, జకారియాపుర సఖి ఖాద్ సహకారి మండలి

---



ఇదొక అరుదైన చెర్రీ టొమాటో వంగడం. మొక్కపై ఉండగానే పండి, 80% ఎండుతుంది! యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయేల్‌లో ఈ వినూత్న వంగడం వెలుగులోకి వచ్చింది. జన్యుమార్పిడి / జన్యుసవరణ చేయలేదు. తోటలోనే కోతకు ముందే ఎండిపోయే అనేక పండ్లు, కూరగాయ వంగడాలు మనకూ కొద్ది ఏళ్లలో అందుబాటులోకి రానున్నాయన్న మాట!

## ఎండు చెర్రీ టొమాటోలు.. ఈ మొక్కలకే కాస్తాయి!

చెర్రీ టొమాటో పండ్లకు బదులు ఎండు పండ్లను కాచే ప్రత్యేకత కలిగిన ఓ విలక్షణ టొమాటో వంగడాన్ని ఇజ్రాయేల్‌కు చెందిన ఎస్ఆర్‌జీస్ సంస్థ పరిశోధకులు కనుగొన్నారు. పక్వానికి వచ్చిన పండ్లు, కోయటానికి ముందే, సహజంగానే ఎండే సహజ గుణం ఈ వంగడం సొంతం. ఈ క్రమంలో నాణ్యత, పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు కూడా చెక్కు చెదరటం లేదని ఎస్ఆర్‌జీస్ సీఈవో గిల్ రోనెన్ తెలిపారు. జన్యుమార్పిడి లేదా జన్యుసవరణ చేయలేదని, ఇది దక్షిణ అమెరికా అటవీ ప్రాంత చెర్రీ టొమాటో వంగడంలోని ప్రత్యేక లక్షణమన్నారు. ఇదే మాదిరిగా ద్రాక్ష తదితర పండ్లు, కూరగాయ వంగడాలను అభివృద్ధి చేయనున్నామని, ఇందుకోసం సుప్రీ అనే అనుబంధ స్టార్టప్‌ను నెలకొల్పినట్లు ఆయన తెలిపారు.

ఇజ్రేల్-పాలస్తీనా యుద్ధ నేపథ్యంలో ఈ ప్రత్యేక లక్షణం గల వంగడం బయటపడింది. దక్షిణ ఇజ్రేల్‌లో గాజా సరిహద్దులోని నెతీవ్ హసారాలోని గ్రీన్‌హౌస్‌లలో చెర్రీ టొమాటోలు సాగవుతున్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో పాలస్తీనా దాడిలో గ్రీన్ హౌస్‌లు ధ్వంసమయ్యాయి. అక్కడ పనిచేస్తున్న థాయ్ వ్యవసాయ కార్మికులు పారిపోయారు. ఆ నేపథ్యంలో పంట కోత ఆలస్యం కావటంతో కుళ్లిపోకుండా చక్కగా ఎండిన ఈ విలక్షణ గుణం వెలుగుచూసింది.


కొత్త పంట

ఈ కొత్త రకం చెర్రీ టొమాటోలు ఆహ్లాదకరంగా నున్నగా నిగనిగలాడుతూ ఉండవు. ముడతలు పడి, ఎండు ద్రాక్ష లేదా ఎండిన క్రాన్‌బెర్రీలాగా కనిపిస్తాయి. మొక్కపైనే సహజంగానే ఎండినవి కాబట్టి, కోసి విడిగా ఎండబెట్టిన టొమాటోల కంటే నాలుగు రెట్లు ఎక్కువ రసంతో కూడి ఉంటాయి. తీపి, పులుపు కలగలిసిన రుచితో ఉంటాయి. 'ఇది పూర్తిగా సహజమైనది. జన్యు ఇంజనీరింగ్ లేదా జన్యు సవరణ చేయలేదు' అని రోనెన్ మరోసారి నొక్కి చెప్పారు.



ఈ రకం టొమాటోలు నాలుగు నెలల వ్యవధిలో గ్రీన్‌హౌస్‌లలో పెరుగుతాయి. నియంత్రిత వాతావరణంలో సంవత్సరానికి కనీసం 11 నెలలు సాగు చేయవచ్చు. పంట కోతకు రోబోలు లేదా హార్వెస్టర్లు వాడొచ్చు. కూలీల కొరత వల్ల పెరుగుతున్న ఖర్చులను గణనీయంగా తగ్గించడానికి ఈ వంగడం సహాయపడుతుందన్నారు.

సుప్రీ అభివృద్ధి చేస్తున్న ఈ రకం చెర్రీ టొమాటో పండిన దశలో 15 గ్రాములు బరువు ఉంటుంది. మొక్క తీగపై ఎండిన తర్వాత 3 గ్రాములకు తగ్గుతుంది.

పండు చర్మం పై సూక్ష్మస్థాయిలో పగుళ్లు రావటంతో తేమ ఆవిరికావటం వల్ల మొక్కకు ఉన్నప్పుడే పక్వానికి వచ్చిన పండు పాక్షికంగా ఎండుతుంది. ఈ సహజ ప్రక్రియ ఆ పండు రుచి, రంగు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లను ఏమాత్రం కోల్పోదు. 80% బరువు పొలంలోనే తగ్గిపోవటం వల్ల రవాణా ఖర్చు భారీగా తగ్గుతుంది. ఏడాది పాటు నిల్వ ఉంటాయి.

2030 నాటికి ఈ చెర్రీ టొమాటోల వ్యాపారం 150 బిలియన్ డాలర్ల మేరకు పెరుగుతుందని సుప్రీ ఆశిస్తోంది. కోతకు ముందే మొక్కపైనే సహజంగా తనను తాను ఎండబెట్టుకునే రంగు రంగుల టొమాటోలతోపాటు మిరప, వంగ, గుమ్మడి వంటి అనేక పండ్లు, కూరగాయ వంగడాల అభివృద్ధిపై సుప్రీ దృష్టి సారించింది.

అంటే.. ఒకటి రెండేళ్లలో మన దేశంలోనూ ఈ వంగడాలు అందుబాటులోకి వస్తాయని ఆశించవచ్చు. విదేశీ మార్కెట్లను టార్గెట్ చేసే ఆధునిక రైతులకు ఇవి గొప్ప విజయావకాశాలను అందిస్తాయన్న మాట. మేడలపైన, పెరట్లో ఇంటిపంటలు పండించుకునే వారికి సైతం ఈ విలక్షణ వంగడాలు ఉపయోగపడతాయనటంలో ఎటువంటి సందేహమూ లేదు!

---


ద్రాక్ష


గుత్తి బీరకాయ


ఝాన్సీ టెర్రస్ గార్డెన్‌లో దొండ పాదు


వెరైటీ టొమాటో

## అపార్ట్‌మెంట్ టెరస్‌పై అరుదైన అర్బన్ ఫార్మర్!

తాతల నాటి కాలంలో పెరటి తోటలో ఇంటికి కావాల్సిన కూరగాయలన్నీ ఇష్టంగా, స్వయం కృషితో పండించుకోవటం ఇప్పుడు మధ్య వయస్కులందరికీ బాల్యానందంగా తెలిసిన విషయమే. అయితే, ఆకాశ హర్మ్యాల అత్యాధునిక మహానగర జీవన కాలంలోనూ సేంద్రియ ఇంటిపంటలను అంతే ఇష్టంగా, అంతే అత్యంత ఆవశ్యకమైన ఆహార, ఆరోగ్య రక్షక బాధ్యతగా తీసుకుంటున్న వారెందరు?

మారిన పరిస్థితులకు అనుగుణంపై మేడపైన టెర్రస్ నిండా కుండీలు, బక్కెట్లు ఏర్పాటు చేసుకొని రెంచాడు రసాయనాలు వాడకుండా కూరగాయలు, ఆకుకూరలను సంపూర్ణ సేంద్రియంగా పండించుకొని, అత్యంత తాజాగా ఆరోగ్యదాయకంగా వండుకు తింటున్న కుటుంబాలెన్ని? అని ప్రశ్నించుకుంటే.. అతికొద్ది మంది మాత్రమే అని చెప్పక తప్పదు. అత్యాధునిక గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో జీవనం సాగిస్తూ కూడా ఎం. ఝాన్సీ నిర్మల కుమారి అరుదైన అర్బన్ ఫార్మర్‌గా విశేష కృషి చేస్తుండటం ప్రశంసనీయం. టెర్రస్‌పైన ఖాళీ స్థలాన్ని బిల్డర్ నుంచి ముందుచూపుతో కొనుగోలు చేసి పెట్టుకొని మరీ మిద్దెతోటను సాగు చేస్తున్నారామె. ఏడాది పొడవునా తమ మిద్దెతోట కూరగాయలు, ఆకుకూరలనే తినటంతో పాటు మరో రెండు కుటుంబాలకు కూడా అందిస్తున్న అర్బన్ ఫార్మర్‌తో 'సాక్షి సాగుబడి' ముచ్చటించింది. ఆ వివరాలు...

గుంటూరు - విజయవాడ మధ్యలో నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట రెయిన్‌ట్రీ పార్క్ గేటెడ్ కమ్యూనిటీ ఉంది. ఇందులో 32 హైరైజ్ అపార్ట్‌మెంట్ బ్లాక్‌లు ఉన్నాయి. 8 అంతస్థుల నుంచి 12 అంతస్థుల ఎత్తులో అపార్ట్‌మెంట్ బాక్‌లు నిర్మితమయ్యాయి. 12 అంతస్థులున్న ఓ బ్లాక్‌లో 9వ అంతస్థులోని ఫ్లాట్‌ను ఎం. ఝాన్సీ నిర్మల కుమారి కుటుంబం కొనుగోలు చేసింది. ఆ పక్కనే 8 అంతస్థుల ఎత్తున్న బ్లాక్ టెర్రస్ పైన ఖాళీ స్థలాన్ని ఝాన్సీ నిర్మల కుమారి కుటుంబం పదేళ్ల క్రితమే రూ. 15 లక్షలు చెల్లించి బిల్డర్ నుంచి కొనుగోలు చేసింది. ఈ రెండు బ్లాక్‌లను అనుసంధానం చేస్తూ వంతెనను నిర్మించటంతో.. వంటింటికి కూతవేటు దూరంలోనే సేంద్రియ మిద్దెతోటను ఆమె సాగు చేసుకునేందుకు అవకాశం దొరికింది. 1,450 చదరపు అడుగుల విస్తీర్ణంలో గల టెర్రస్‌పై గత పదేళ్లుగా పంటలను ఝాన్సీ స్వహస్తాలతో సాగు చేస్తూ ముగ్గురు సభ్యులున్న తమ కుటుంబంతో పాటు మరో 2 కుటుంబాలకు పోషకాహారాన్ని అందిస్తున్నారు.


ఇంటి పంట

కూరగాయలు, ఆకుకూరలు, ఔషధ మొక్కలతో టెర్రస్‌ను ఝాన్సీ నింపేశారు. 500-600 వరకు గ్రోబ్యాగ్‌లు, ఫిష్ ట్రేలు, పెరుగు బక్కెట్లు, పెయింట్ బక్కెట్లలో సాగు చేస్తున్నారు. అన్ని రకాల తీగజాతి, చెట్టుజాతి కూరగాయలు, అనేక రకాల ఆకుకూరలను సాగు చేస్తున్నారు. అనేక జాతుల పంట మొక్కలతో వ్యవసాయక జీవవైవిధ్యంతో ఆ టెర్రస్ కిచెన్ గార్డెన్ కళకళలాడుతూ ఉంటుంది. 15 రకాల వంగ, 8 రకాల బెండ, రెండు రకాల దొండ మొక్కల్ని సాగు చేస్తున్నానని ఆమె తెలిపారు. గత పదేళ్లుగా తమ మిద్దె తోటలో పండిన ఆకుకూరలు, కూరగాయలనే రోజూ తినటం అలవాటు అయినందు వల్ల.. ఎప్పుడైనా బయటికి వెళ్లినప్పుడు కూరలు తినాలంటే పురుగుమందుల వాసన వస్తోందని ఝాన్సీ నిర్మల కుమారి తెలిపారు. అంత సెన్సిటివ్‌గా పురుగుమందుల అవశేషాలను గుర్తించగలుగుతున్నామన్నారు. ముఖ్యంగా బెండ, వంగలో తేడా ఇట్టే తెలిసిపోతుందన్నారు.

### ఇంత పనెవరు చేస్తారు..?

అదే టెర్రస్ మీద మనం ఏర్పాటు చేసుకునే కూరగాయల తోటలో భిన్నమైన ఎకోసిస్టం ఉంటుందన్నారు. అనేక రకాల కూరగాయ పంటలను కలిపి సాగు చేస్తున్నందు వల్ల, చేలలో మాదిరిగా కాకుండా మేడపైన రకరకాలు కలిపి సాగు చేస్తున్నందు వల్ల చీడపీడల సమస్య ఉండదన్నారు. అయితే, మిద్దెతోటల సంస్కృతి విస్తరిస్తున్నప్పటికీ.. చాలామంది అవకాశం ఉన్నా ఇంత పని ఎవరు చేస్తారు? ఇంత ఖర్చు ఎవరు పెడతారు? కొనుక్కుంటే సరిపోతుందిలే అన్న భావనతో మిన్నకుంటున్నారన్నారు. కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం యలమర్రులో తమ తాత పెరటి తోటలు శ్రద్ధగా సాగు చేసే వారని ఝాన్సీ గుర్తుచేసుకున్నారు. చిన్నప్పటి ఆ జ్ఞాపకాలే అపార్ట్‌మెంట్‌పైన కూడా కూరగాయల తోట పెట్టుకోవాలన్న ఆకాంక్షకు బీజం వేసిందన్నారామె. అపార్ట్‌మెంట్ టెర్రస్‌ను కొనుగోలు చేసి మిద్దెతోటను ఏర్పాటు చేసే ముందే వాటర్‌ప్రూఫ్ చేయించామన్నారు. ఏడాదంతా కూరగాయలే తింటున్నామని ఝాన్సీ నిర్మల కుమారి ఆనందంగా చెప్పారు. అంతకన్నా ఇంకేం కావాలి ఏ గృహిణికైనా?

### మిగిలితే ఫ్రీజ్ చేసి తర్వాత తింటున్నాం!



స్వయంకృషితో ఇష్టంగా పండించుకున్న కూరగాయలను వృథా కాకుండా వాడుకోవటం అవసరం. ఇందుకోసం, సీజన్‌లో ఎక్కువగా పండిన కొన్ని రకాల కూరగాయలను డీప్ ఫ్రిజ్‌లో పెట్టి ఫ్రీజ్ చేసి నిల్వ చేస్తానని, పంటలు అందుబాటులో లేని రోజుల్లో వాటిని తీసి వండుకొని తింటామని ఝాన్సీ చెప్పారు. చిక్కుడు కాయలు, టొమాటోలు, ఆకుకూరలను హాఫ్ బాయిల్ చేసి, ఆరబెట్టిన తర్వాత ప్యాక్ చేసి డీప్ ఫ్రిజ్‌లో పెడతానన్నారు. అన్‌సీజన్‌లో కూడా కూరగాయలతో పాటు ఆకుకూరలను సైతం ఈ విధంగా నిల్వ చేసుకొని వాడుతున్నాం అన్నారు. బయట కొనేవి ఎన్ని రసాయనాలు కుమ్మరించి పండిస్తున్నారో తెలియదు కాబట్టి.. ఎవరికి వారే పండించుకున్నవే తినాలి అని సూచిస్తున్నారు ఝాన్సీ నిర్మల కుమారి.

## బిజినెస్ రీల్

### ఈ ఏడాదే అరబిందో చైనా ప్లాంటు షురూ




న్యూఢిల్లీ: ఔషధ తయారీ సంస్థ అరబిందో ఫార్మా చైనాలో ఏర్పాటు చేసిన ప్లాంటులో వచ్చే త్రైమాసికం నుంచి ఉత్పత్తి ప్రారంభం కానుంది. పూర్తి స్థాయి తయారీ సామర్థ్యానికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేరుకుంటుందని అనలిస్ట్ కాల్ సందర్భంగా సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సంతానం సుబ్రమణియన్ తెలిపారు. చైనాతోపాటు యుఎస్ కోసం కొన్ని ఏఎన్‌డీఏల ఫైలింగ్స్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇవన్నీ రాబోయే సంవత్సరాల్లో చైనా ఆదాయ సామర్థ్యాన్ని పెంచుతాయని, ఈ సంవత్సరం పరిమాణం, విలువను తక్కువ స్థాయిలో చూస్తామని వివరించారు. 15,000 టన్నుల వార్షిక సామర్థ్యంతో రూ.2,400 కోట్లతో ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల నూతనంగా ప్రారంభించిన పెన్‌-జి ప్లాంటులో అక్టోబర్ నుంచి తయారీ పెరగనుందని అన్నారు. యుఎస్ మార్కెట్లో ప్రస్తుత ధరల స్థితి కొనసాగుతుందని భావిస్తున్నట్లు వెల్లడించారు. యూరప్, డిమాండ్ పెరుగుతున్న మార్కెట్లు వృద్ధి జోరును కొనసాగించగలవని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎబిటా లక్ష్య మార్జిన్ 21–22 శాతం సాధించగలదని నమ్మకంగా ఉందని పేర్కొన్నారు. అరబిందో ఫార్మా 2024–25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ కాలంలో కన్సాలిడేటెడ్ నికర లాభం 61 శాతం దూసుకెళ్లి రూ.919 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ రూ.7,567 కోట్లు సాధించింది.

### హింద్ కాపర్ షేర్ల విక్రయం

రూ. 447 కోట్లు అందుకున్న ఎల్ఐసీ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ తాజాగా పీఎస్‌యూ మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ కాపర్‌లో దాదాపు 2.09 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 221.64 సగటు ధరలో ఎల్ఐసీ 2,01,62,682 షేర్లను అమ్మివేసింది. తద్వారా రూ. 447 కోట్లు అందుకుంది. దీంతో హిందుస్తాన్ కాపర్‌లో ఎల్ఐసీ వాటా 8.17 శాతం నుంచి 6.09 శాతానికి దిగివచ్చింది. మైనింగ్ శాఖ నిర్వహణలో హిందుస్తాన్ కాపర్ కార్యకలాపాలు కొనసాగించే సంగతి తెలిసిందే.

బీఎస్ఈలో హింద్ కాపర్ షేరు 1.5 శాతం పతనంతో రూ. 319 వద్ద ముగిసింది.

### న్యూఢిల్లీ-విజయవాడ మధ్య ఇండిగో డైరెక్ట్ ఫ్లైట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విమానయాన సంస్థ ఇండిగో న్యూఢిల్లీ-విజయవాడ మధ్య డెయిలీ డైరెక్ట్ ఫ్లైట్ నడుపనున్నట్టు మంగళవారం ప్రకటించింది. సెప్టెంబర్ 14 నుంచి ఈ సర్వీసులు ప్రారంభంకానున్నాయి. న్యూఢిల్లీలో ఉదయం 8.10కి బయల్దేరే విమానం 10.40కి విజయవాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఉదయం 11.10కి విమానం బయల్దేరి మధ్యాహ్నం 1.40కి న్యూఢిల్లీ చేరుకుంటుంది. నూతన సర్వీస్ చేరికతో విజయవాడ నుంచి తొమ్మిది నగరాలకు విమాన సర్వీసుల సంఖ్య వారంలో 135కు పెరుగుతుందని ఇండిగో గ్లోబల్ సేల్స్ హెడ్ వినయ్ మల్హోత్రా తెలిపారు.

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| SBILIFE | 1,763.20 | 5.48 |
| HDFCLIFE | 709.55 | 3.48 |
| BAJAJFINSV | 1,604.00 | 3.41 |
| INDUSINDBK | 1,382.00 | 2.55 |
| SHRIRAMFIN | 3,149.25 | 2.39 |

### నిఫ్టీ 50


టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| BHARTIARTL | 1,449.00 | -1.41 |
| ONGC | 330.6 | -1.4 |
| APOLLOHOSP | 6,650.00 | -1.11 |
| ADANIENT | 3,071.00 | -1.02 |
| CIPLA | 1,562.90 | -0.8 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 13,700 |
| ఎన్ఎస్ఈ | 1,16,805 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 2,12,263 |
| ఎఫ్ఐఐ | - 1,458 |
| డీఐఐ | + 2,252 |

### ముడిచమురు... (బ్యారెల్)



| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 73.19 | $ 73.66 |
| బ్రెంట్ | 77.13 | $ 77.66 |

# కార్ కంపెనీల డిస్కౌంట్ల బాట

- మునుపెన్నడూ లేనంత తగ్గింపు
- డిమాండ్ ఉన్న మోడళ్లకూ వర్తింపు
- నిల్వలు పేరుకుపోవడమే కారణం

న్యూఢిల్లీ: కార్ల రిటైల్ మార్కెట్లో డిస్కౌంట్ల పండగ నడుస్తోంది. మునుపెన్నడూ లేనంతగా కార్లపై తగ్గింపు ఉండడం గమనార్హం. 2023 ఆగస్ట్‌తో పోలిస్తే డిస్కౌంట్లు రెండింతలు అయ్యాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. డిసెంబర్ వరకు ఈ తగ్గింపులు కొనసాగే అవకాశం ఉందని అంటున్నాయి. విక్రయాలు మందగించడంతో కంపెనీలు, డీలర్‌షిప్ కేంద్రాల వద్ద నిల్వలు పేరుకుపోయాయి. వీటిని క్లియర్ చేసుకోవడంలో భాగంగా కంపెనీలు, డీలర్లు డిస్కౌంట్ల బాట పట్టారు. మార్కెట్ లీడర్ మారుతీ సుజుకీ మొదలుకుని హ్యుండై, టాటా మోటార్స్, స్కోడా, హోండా డిస్కౌంట్ల పోటీలో నిలిచాయి. నగదు తగ్గింపు, ఎక్స్చేంజ్ బోనస్, అదనపు ప్రయోజనాలను కల్పిస్తున్నాయి. పాపులర్ మోడళ్లకూ వీటిని వర్తింపజేస్తుండడం విశేషం. ఆఫర్స్, ప్రయోజనాలు మారుతీ సుజుకీ బ్రెజ్జా రూ.25,000, గ్రాండ్ విటారాపై రూ.1,28,000 వరకు అందిస్తోంది. హ్యుండై ఎక్స్‌టర్‌పై రూ.40,000, ఆల్కజార్‌పై రూ.90,000 వరకు, టాటా మోటార్స్ నెక్సన్ రూ.16,000–1,00,000, హ్యారియర్‌పై రూ.1,20,000 వరకు ఆఫర్ చేస్తున్నాయి. హోండా ఎలివేట్‌పై రూ.80,000 వరకు ఆఫర్స్, ప్రయోజనాలు ఉన్నాయి.




#### భారీగా కార్ల నిల్వలు..

2019–20 తర్వాత అధిక డిస్కౌంట్లు ప్రస్తుతం ఉన్నాయని పరిశ్రమ ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. భారత్ స్టేజ్–6 ఉద్గార ప్రమాణాలు 2020 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో నిల్వలను క్లియర్ చేసుకోవడానికి 2019–20లో మార్కెట్లో డిస్కౌంట్ల జోరు కొనసాగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో కార్ల నిల్వలు సుమారు 3,00,000 యూనిట్ల స్థాయిలో నమోదయ్యాయి. 30 రోజుల డిమాండ్‌కు ఇవి సరిపోతాయి. అయితే అమ్మకాలు మందగించడంతో కొద్దిరోజుల్లోనే నిల్వలకు మరో 1,00,000 యూనిట్లు తోడయ్యాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కార్ల తయారీ కంపెనీలు, డీలర్లు డిస్కౌంట్లకు తెరలేపారు. 2019–20 స్థాయిలో తగ్గింపులు ఉన్నాయని పరిశ్రమ చెబుతోంది. 2023–24లో దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు అత్యధిక స్థాయిలో 42.3 లక్షల యూనిట్లు నమోదయ్యాయి. సెమికండక్టర్ల కొరత ప్రభావం తగ్గడం, డిమాండ్ కొనసాగడం ఈ జోరుకు కారణమైంది. మూడేళ్లు పరుగుపెట్టిన ప్యాసింజర్ వెహికిల్స్ పరిశ్రమ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విక్రయాలు మందగించడం ప్రారంభమైంది.

# ఆటోమేషన్‌తో మహిళలకు అవకాశాలు

- తయారీలో పెరగనున్న ప్రాతినిధ్యం
- టీమ్‌లీజ్ సర్వీసెస్ నివేదిక

ముంబై: తయారీ రంగంలో మహిళలకు మరిన్ని అవకాశాలు రానున్నాయి. పురుషులకు ఎక్కువ అవకాశాలు కల్పించే ఈ రంగంలో ఆటోమేషన్ (మెషినరీ సాయంతో పనుల నిర్వహణ)తో మహిళల నియామకాలు పెరుగుతాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ అంచనా వేస్తోంది. 2047 నాటికి 35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్నది భారత్ లక్ష్యంగా ఉంది. ఈ క్రమంలో తయారీ రంగం మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఆటోమేషన్‌ను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నట్టు టీమ్‌లీజ్ నివేదిక తెలిపింది. ''దశలవారీ ఆటోమేషన్‌ను ఈ కంపెనీలు అమలు చేస్తున్నాయి. మహిళల నియామకాలు మొదలు పెట్టాయి. తయారీ రంగాల్లో ఆటోమేషన్ అమలు పెరుగుతున్న కొద్దీ కంపెనీలు మరింత మంది మహిళలను పనుల్లోకి తీసుకుంటాయి. భారత తయారీ రంగంలో మహిళల ప్రాతినిధ్యం ఇప్పటికీ చాలా తక్కువగా ఉంది. మొత్తం శ్రామిక శక్తిలో మహిళలు 15–20 శాతం లోపే ఉంటారు. ఆటోమేషన్‌ను వేగంగా అమలు చేస్తున్న కంపెనీల్లో ఇప్పటికే మహిళల నియామకాలు పెరిగాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, టెలికం విడిభాగాల తయారీ సంస్థలు మరింత మంది మహిళలను తీసుకునేందుకు చర్యలు చేపట్టాయి. శ్రామికశక్తిలో లింగ సమతుల్యంపై కొన్ని కంపెనీలు దృష్టి సారించాయి''అని టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ సుబ్బురాతినమ్ పి తెలిపారు.



#### కొన్ని విభాగాల్లో మెరుగైన అవకాశాలు

తయారీలో కొన్ని రంగాలు మహిళలకు పెద్ద ఎత్తున అవకాశాలు కల్పిస్తుండడాన్ని టీమ్‌లీజ్ నివేదిక ప్రస్తావించింది. ఎలక్ట్రానిక్స్ తయారీలో కార్మికుల్లో 70–80 శాతం మహిళలు ఉన్నట్టు పేర్కొంది. అలాగే టెక్స్‌టైల్స్, వస్త్రాల తయారీలోనూ సహజంగానే మహిళల శాతం ఎక్కువగా ఉన్నట్టు తెలిపింది. ఫ్యాబ్రికేటెడ్, బేసిక్ మెటల్స్, మెషినరీ, ఎక్విప్‌మెంట్, మోటారు వాహనాలు, ఆటో విడిభాగాల తయారీ పరిశ్రమల్లో కఠినమైన పని పరిస్థితుల దృష్ట్యా పురుషులే ఎక్కువగా ఉంటున్నారని, వీటిల్లో ఆటోమేషన్ అమలు తక్కువగా ఉన్నట్టు టీమ్‌లీజ్ తెలిపింది. ఇక ఫార్మాస్యూటికల్స్, కెమికల్స్‌లోనూ పురుషులే ఎక్కువగా ఉన్నట్టు పేర్కొంది.

### ఆంధ్రప్రదేశ్‌లో అగర్వాల్ ఐ హాస్పిటల్స్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంటి వైద్య సేవల్లో ఉన్న డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో నూతన కేంద్రాన్ని ప్రారంభించింది. 9,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక మౌలిక వసతులతో తీర్చిదిద్దారు. దీంతో సంస్థ ఆసుపత్రుల సంఖ్య ఏపీలో 10కి చేరుకుంది.

### ఐకియా సేమ్ డే డెలివరీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫర్నీచర్ తయారీ దిగ్గజం ఐకియా ప్రయోగాత్మకంగా హైదరాబాద్ మార్కెట్లో సేమ్ డే డెలివరీ ప్రారంభించింది. వచ్చే ఏడాదిలోగా తమ అన్ని మార్కెట్లలో ఈ సేవలను విస్తరించాలని యోచిస్తున్నట్లు తెలిపింది. హైదరాబాద్, బెంగళూరు, పుణేలో 100 శాతం డెలివరీలను ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా పూర్తి చేసినట్లు కంపెనీ ప్రకటించింది. ముంబైలోనూ పూర్తిగా ఈవీలనే వినియోగించనున్నట్లు ఐకియా ఇండియా సీఈవో సుసాన్ పల్వరర్ తెలిపారు. ఐకియా తదుపరి కొత్త స్టోర్ ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో రాబోతోంది.

### ఆర్ఐఎల్, డిస్నీ విలీనానికి చెక్!

పోటీ పరిస్థితులకు విఘాతం?

న్యూఢిల్లీ: దిగ్గజాలు రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ట్‌డిస్నీ విలీనానికి కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) ప్రతికూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. 8.5 బిలియన్ డాలర్ల(రూ. కోట్లు) విలువైన విలీనం పోటీ పరిస్థితులను దెబ్బతీసే వీలున్నట్లు సీసీఐ ప్రాథమికంగా అభిప్రాయపడినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ వివరాలను వార్తా సంస్థ రాయిటర్స్ తెలియజేసింది. ప్రధానంగా క్రికెట్ ప్రసార హక్కుల కారణంగా పోటీ పరిస్థితులకు విఘాతం కలగనున్నట్లు సీసీఐ ప్రాథమిక అంచనాకు వచ్చింది. దీంతో ఈ అంశంపై దర్యాప్తునకు తెరతీసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. విలీన సంస్థలో మెజారిటీ వాటా ఆర్ఐఎల్‌కు చెందనుంది. దీంతో వందలకొద్దీ డాలర్ల విలువైన క్రికెట్ ప్రసార హక్కులపై గుత్తాధిపత్యానికి తెరలేచే అవకాశమున్నట్లు సీసీఐ భావిస్తోంది. తద్వారా ధరలు, ప్రకటనకర్తలపై ఆధిపత్యానికి దారితీయవచ్చని అంచనా వేస్తోంది.

# ఓఎన్‌జీసీకి మేఘా అత్యాధునిక రిగ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ సంస్థ మేఘా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) 2,000 హెచ్‌పీ సామర్థ్యంతో తయారు చేసిన అత్యాధునిక ఆటోమేటెడ్ హైడ్రాలిక్ ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్‌ను రాజమండ్రిలోని ఓఎన్‌జీసీ చమురు క్షేత్రంలో విజయవంతంగా ఏర్పాటు చేసింది. ఇది రాజమండ్రి క్షేత్రంలో ఓఎన్‌జీసీ కోసం ఎంఈఐఎల్ ఏర్పాటు చేసిన మూడవ రిగ్. ఈ రిగ్ 6,000 మీటర్ల లోతు వరకు తవ్వగలదు. అధిక పీడనాలు, ఉష్ణోగ్రతలు ఉన్న సందర్భాలలో కూడా సమర్థవంతంగా, ప్రమాద రహితంగా పనిచేస్తుందని కంపెనీ తెలిపింది. రిగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ డైరెక్టర్ ఓం ప్రకాశ్ సింగ్, ఎంఈఐఎల్ కాంట్రాక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ మను వర్మ తదితరులు పాల్గొన్నారు.

# మరింత చెరకుతోనే అనుకున్న లక్ష్యం

- పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్
- ఈ ఏడాదిలో సాధించాలనుకుంటున్న కేంద్రం
- కీలక సూచనలు చేసిన క్రిసిల్ రేటింగ్స్
- గత సీజన్‌లో 14 శాతానికి చేరిక




ముంబై: పెట్రోల్‌లో 20% మేర ఇథనాల్ మిశ్రమ లక్ష్యాన్ని 2025 సరఫరా సంవత్సరంలోనే సాధించాలంటే అందుకు మరింత చెరకు వినియోగించాల్సి ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. దీనివల్ల మిల్లర్లకు నగదు ప్రవాహాలు మెరుగవుతాయని పేర్కొంది. నవంబర్ నుంచి అక్టోబర్ వరకు ఇథనాల్ సరఫరా సంవత్సరంగా (ఈఎస్‌వై) పరిగణిస్తుంటారు. ఈ ఏడాది అక్టోబర్ వరకు.. ఈఎస్‌వై 2025 సీజన్ పరిధిలోకి వస్తుంది. ఈఎస్‌వై 2025 నాటికి పెట్రోల్‌లో 20% ఇథనాల్‌ను కలపాలన్నది కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా ఉంది. ''ఇందుకు ఏటా 990 కోట్ల లీటర్ల ఇథనాల్ అవసరం. ఇందుకు చెరకుతోపాటు, గ్రెయిన్(ధాన్యాలు)ను సైతం వినియోగించుకోవడం ద్వారానే సరఫరా మెరుగుపడుతుంది''అని క్రిసిల్ రేటింగ్స్ తన తాజా నివేదికలో వివరించింది. ధాన్యం ద్వారా వార్షిక ఇథనాల్ ఉత్పత్తి గణనీయంగా పెరిగి వచ్చే సీజన్ నాటికి 600 కోట్ల లీటర్లకు చేరుకుంటుందని క్రిసిల్ తెలిపింది. ప్రస్తుత సీజన్‌లో ఇది 380 కోట్ల లీటర్లుగా ఉంటుందని అంచనా. మిగిలిన మేర చెరకు వినియోగం ద్వారా ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని పేర్కొంది. మిల్లుల్లో గణనీయమైన తయారీ సామర్థ్యం కారణంగా అది సాధ్యమేనని అభిప్రాయపడింది. చక్కెర నిల్వలను ఇథనాల్ తయారీకి మళ్లించకుండా, ఎగుమతులు చేయకుండా కేంద్రం నిషేధం విధించడంతో నిల్వలు పెరగడాన్ని క్రిసిల్ నివేదిక ప్రస్తావించింది. ఈ నిల్వలను ఇథనాల్ తయారీకి అనుమతించాలని సూచించింది.

#### పెట్రోల్ దిగుమతులు తగ్గించుకోవచ్చు..

20 శాతం ఇథనాల్‌ను కలపడం ద్వారా పెట్రోల్ దిగుమతులపై ఆధారపడడాన్ని భారత్ తగ్గించుకోవచ్చని క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. ఈఎస్‌వై 2021 నుంచి ఏటా పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం 2–3 శాతం మేర పెరుగుతూ వస్తున్నట్టు వెల్లడించింది. ''ఇథనాల్ తయారీకి ఆహార ధాన్యాల వినియోగంపై కేంద్రం ఎలాంటి నియంత్రణలు విధించలేదు. కాకపోతే డిమాండ్–సరఫరా అంచనాల ఆధారంగా ఎంత మేర చెరకును ఇథనాల్ కోసం వినియోగించుకోవాలన్నది సీజన్‌కు ముందు నిర్ణయిస్తుంది. గతేడాది వర్షాలు సరిగ్గా లేకపోవడంతో ఈ ఏడాది సీజన్‌లో చెరకు ఉత్పత్తిపై ప్రభావం పడింది''అని క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. దీంతో ఈ సీజన్‌లో చెరకు ఆధారిత ఇథనాల్ ఉత్పత్తి 250 కోట్ల లీటర్లకు పరిమితం కావచ్చని అంచనా వేసింది. ధాన్యాల ద్వారా ఇథనాల్ తయారీ 40 శాతం పెరగడంతో ఈఎస్‌వై 2024 సీజన్‌లో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం 14 శాతానికి చేరినట్టు వివరించింది. చెరకు నుంచి ఇథనాల్ తయారీ తగ్గడాన్ని ఇది భర్తీ చేసినట్టు తెలిపింది.

#### భారీ స్థాయిలో చెరకు అవసరం

ఈఎస్‌వై 2025 సీజన్‌లోనే పెట్రోల్‌లో 20 % ఇథనాల్ లక్ష్యాన్ని సాధించాలంటే 4 మిలియన్ టన్నుల చక్కెర తయారీకి సరిపడా చెరకును ఇథనాల్ కోసం కేటాయించాల్సి ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ పూనమ్ ఉపాధ్యాయ తెలిపారు. ఈఎస్‌వై 2025 సీజన్‌లో స్థూల చక్కెర ఉత్పత్తి 33.5 మిలియన్ టన్నులుగా ఉంటుందని, చక్కెర వినియోగం 29.5 మిలియన్ టన్నుల స్థాయిలో ఉండొచ్చని క్రిసిల్ నివేదిక పేర్కొంది. ఈ సీజన్ చివరికి చక్కెర నిల్వలు మెరుగైన స్థాయిలో ఉంటాయంటూ.. ఇథనాల్ తయారీకి సరిపడా చెరకును అనుమతించాలని సూచించింది. దీంతో చక్కెర నిల్వలనూ తగిన స్థాయిలో వినియోగించుకోవడానికి వీలు కలుగుతుందని పేర్కొంది.

# రెండోసారి అత్యుత్తమ బ్యాంకర్‌గా ఆర్‌బీఐ గవర్నర్

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వరుసగా రెండోసారి అంతర్జాతీయ అత్యుత్తమ బ్యాంకర్‌గా నిలిచారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజీన్ ఇచ్చిన ర్యాంకుల్లో ఆయనకు మరోసారి అగ్రస్థానం దక్కింది. 'గ్లోబల్ ఫైనాన్స్ సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్స్ 2024'లో శక్తికాంత దాస్‌కు 'ఏ+' రేటింగ్ లభించింది. 2023లోనూ శక్తికాంత దాస్ అంతర్జాతీయ అత్యుత్తమ బ్యాంకర్‌గా ఎన్నిక కావడం విశేషం. ద్రవ్యోల్బణ కట్టడి, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలు, కరెన్సీ స్థిరత్వం, వడ్డీ రేట్ల నిర్వహణ ఆధారంగా ఏ నుంచి ఎఫ్ వరకు గ్రేడ్‌లను కేటాయించారు. అద్భుతమైన పనితీరుకు ఏ, అధ్వాన పనితీరుకు ఎఫ్ రేటింగ్ ఇచ్చారు. శక్తికాంత దాస్‌తో పాటు బ్యాంక్ డెన్మార్క్ గవర్నర్ క్రిస్టియన్ కెట్టల్, థాసన్, స్విట్జర్లాండ్(స్విస్ సెంట్రల్ బ్యాంక్)గవర్నర్ థామస్ జె. జోర్డాన్‌లు ఏ+ రేటింగ్‌ను దక్కించుకున్నారు.



# సమస్యాత్మక టెలిమార్కెటర్లపై కఠిన చర్యలు

టెలికం సంస్థలకు ట్రాయ్ ఆదేశాలు

న్యూఢిల్లీ: వినియోగదారులకు సమస్యాత్మకంగా తయారయ్యే టెలిమార్కెటర్లపై ట్రాయ్ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. మెసేజ్ సేవల దుర్వినియోగాన్ని అరికట్టడానికి, మోసపూరిత విధానాల నుండి వినియోగదారులను రక్షించడానికి నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని టెల్కోలను ఆదేశించింది. అయాచిత స్పామ్ కాల్స్, మెసేజ్‌ల కట్టడికి ట్రాయ్ గత కొద్ది కాలంగా తగిన కఠిన చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. పంపినవారి అధీకృత సమాచారం తెలియని యూఆర్‌ఎల్‌లు, ఓటీటీ లింక్‌లను లేదా కాల్ బ్యాక్ నంబర్‌లను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి యాక్సెస్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రసారం చేయకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాయ్ స్పష్టం చేసింది. పంపినవారి నుండి గ్రహీతల వరకు అన్ని మెసేజ్‌లను ట్రేస్ (గుర్తించడానికి) చేయడానికి నవంబర్ నుంచి తగిన చర్యలు తీసుకోవాలని ట్రాయ్ నిర్దేశించింది. పారదర్శకతలేని టెలిమార్కెటర్ చైన్ నుంచి వచ్చే సందేశాల ప్రసారం నిలిపివేతకు కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది.




# అనుబంధ కంపెనీలో సైయంట్ వాటా విక్రయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ సంస్థ సైయంట్ తన అనుబంధ కంపెనీ సైయంట్ డీఎల్ఎంలో 1,14,99,390 ఈక్విటీ షేర్లను విక్రయించాలని బోర్డు మంగళవారం నిర్ణయించింది. ఇది 14.5 శాతం వాటాకు సమానం. డీల్ విలువ రూ.861 కోట్లు. ఎన్ఎస్ఈలో ముగింపు ధరపై 5 శాతం డిస్కౌంట్‌తో ఫ్లోర్ ప్రైస్ ఒక్కో షేరుకు రూ.748.65లుగా నిర్ణయించారు. బ్లాక్ డీల్ ద్వారా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ దశల్లో ఈ వాటాలను విక్రయించనున్నట్టు తెలిపింది. ఆగస్ట్ 21లోగా ఈ బ్లాక్‌డీల్ పూర్తి అవుతుందని సైయంట్ వివరించింది. జూన్ 30 నాటికి సైయంట్ డీఎల్ఎంలో సైయంట్‌కు 66.66 శాతం వాటా ఉంది. డీల్ తదనంతరం ప్రమోటర్ వాటా సైయంట్ డీఎల్ఎంలో 52.16 శాతానికి వచ్చి చేరనుంది.




# ఎల్‌అండ్‌టీ జీఎస్‌టీ నోటీస్ రద్దు

న్యూఢిల్లీ: గత అనుబంధ సంస్థకు సంబంధించి జారీ అయిన వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) డిమాండు నోటీసును ముంబై హైకోర్టు తాజాగా రద్దు చేసినట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం ఎల్‌అండ్‌టీ తాజాగా వెల్లడించింది. సర్వీస్ ట్యాక్స్‌కింద రూ. 2,237 కోట్లు చెల్లించవలసిందిగా జీఎస్‌టీ, సర్వీస్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ నుంచి జారీ అయిన షోకాజ్ నోటీసుపై తాజా ఆదేశాలు జారీ అయినట్లు పేర్కొంది. కంపెనీల విడదీతలో భాగంగా చేపట్టిన లావాదేవీలకింద అప్పటికే పన్ను చెల్లించిన కారణంగా ముంబై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు ఎల్‌అండ్‌టీ తెలియజేసింది.




# కృష్ణపట్నంలో కార్గో హ్యాండ్లింగ్ స్పీడ్

ముంబై: ప్రయివేట్ రంగ అదానీ గ్రూప్.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం పోర్టులో కార్గో హ్యాండ్లింగ్‌కు ఆధునిక(అడ్వాన్స్‌డ్) వ్యవస్థను ఏర్పాటు చేసింది. తద్వారా పోర్ట్ ప్రస్తుత హ్యాండ్లింగ్ సామర్థ్యం, ఉత్పాదకత మరింత పెరగనున్నట్లు కంపెనీ పేర్కొంది. దీంతో కంటెయినర్లు, బల్క్ కార్గో.. రెండింటి నిర్వహణను క్రమబద్ధీకరించేందుకు వీలున్నట్లు తెలియజేసింది. అడ్వాన్స్‌డ్ వ్యవస్థ కారణంగా ఆటోమేటెడ్ ట్రాకింగ్, రియల్‌టైమ్ డేటా విశ్లేషణ, లాజిస్టిక్స్ సమన్వయం, వేగం, రక్షణ, వ్యయాల తగ్గింపు తదితరాలకు వీలు చిక్కనున్నట్లు వివరించింది. వెరసి దేశీ దిగుమతిదారులకు అత్యంత సమర్ధవంత, వేగవంత లాజిస్టిక్స్ వ్యవస్థకు తెరతీసినట్లు తెలియజేసింది.




# విదేశాల్లో మేడిన్ ఇండియా టూవీలర్ల జోరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా తయారైన ద్విచక్ర వాహనాల ఎగుమతులు ఈ ఏడాది ఏప్రిల్-జూలైలో 12.48 లక్షల యూనిట్లు నమోదయ్యాయి. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 14 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. దేశీయంగా అమ్మకాలు తగ్గుతున్న నేపథ్యంలో తయారీ కంపెనీలకు కాస్త ఊరట కలిగించే విషయం. అలాగే టూవీలర్ల తయారీ విషయంలో భారత్ అనుసరిస్తున్న నాణ్యత, భద్రత ప్రమాణాలకు ఈ గణాంకాలు నిదర్శనం. 2024 జూలైతో ముగిసిన నాలుగు నెలల్లో మోటార్‌సైకిళ్లు 13 శాతం వృద్ధితో 10,40,226 యూనిట్లు వివిధ దేశాలకు సరఫరా అయ్యాయి. మొత్తం ఎగుమతుల్లో వీటి వాటా ఏకంగా 83 శాతానికి ఎగసింది. స్కూటర్ల ఎగుమతులు 21 శాతం అధికమై 2,06,006 యూనిట్లుగా ఉంది. టూవీలర్స్ ఎగుమతుల్లో బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్ కో, హోండా మోటార్‌సైకిల్స్ అండ్ స్కూటర్స్ ఇండియా, ఇండియా యమహా మోటార్, హీరో మోటోకార్ప్, సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా టాప్‌లో కొనసాగుతున్నాయి.

#### అగ్రస్థానంలో బజాజ్..

ద్విచక్ర వాహనాల ఎగుమతుల్లో బజాజ్ ఆటో అగ్రస్థానంలో నిలిచింది. ఈ కంపెనీ 5 శాతం వృద్ధితో ఏప్రిల్-జూలైలో 4,97,114 యూనిట్లు నమోదు చేసింది. ఇందులో 4,97,112 యూనిట్లు మోటార్‌సైకిళ్లు ఉండడం గమనార్హం. టీవీఎస్ మోటార్ కో 14 శాతం వృద్ధితో 3,13,453 యూనిట్లతో రెండవ స్థానంలో కొనసాగుతోంది. హోండా మోటార్స్ అండ్ స్కూటర్స్ 76 శాతం దూసుకెళ్లి 1,82,542 యూనిట్లు, ఇండియా యమహా మోటార్ 28 శాతం అధికమై 79,082 యూనిట్లు, హీరో మోటోకార్ప్ 33 శాతం ఎగసి 73,731 యూనిట్లను విదేశాలకు సరఫరా చేశాయి. సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా 30 శాతం క్షీణించి 64,103 యూనిట్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ 2 శాతం వృద్ధితో 28,278 యూనిట్లు, పియాజియో వెహికిల్స్ 56 శాతం దూసుకెళ్లి 9,673 యూనిట్ల ఎగుమతులను సాధించాయి. బైక్స్‌లో బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్ కో, హోండా, స్కూటర్స్‌లో హోండా, టీవీఎస్ మోటార్, ఇండియా యమహా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.



### స్మార్ట్‌వర్క్స్‌కు తగ్గిన నష్టాలు

ముంబై: ఐపీవో సన్నాహాల్లో ఉన్న స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్ మార్చితో ముగిసిన గతేడాది(2023–24) దాదాపు రూ. 50 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ఇందుకు ప్రధానంగా వ్యయాలు పెరగడం ప్రభావం చూపింది. అయితే కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అంతక్రితం ఏడాది(2022–23) నమోదైన రూ. 101 కోట్లతో పోలిస్తే తాజా నష్టాలు 50 శాతం తగ్గడం గమనార్హం! కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 744 కోట్ల నుంచి రూ. 1,113 కోట్లకు జంప్ చేసింది. కంపెనీ ఇప్పటికే సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 550 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 67.59 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. ఐపీవో నిధుల్లో రూ. 282 కోట్లు పెట్టుబడి వ్యయాలకు, రూ. 140 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. 2024 మార్చికల్లా కంపెనీ రుణ భారం రూ. 427.35 కోట్లుగా నమోదైంది.





## మెస్సీ లేకుండానే...

**బ్యూనస్ ఎయిర్స్:** అర్జెంటీనా ఫుట్‌బాల్ సూపర్ స్టార్, 2022 ప్రపంచకప్ విజయసారథి లయోనల్ మెస్సీ గాయంతో ఫుట్‌బాల్ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌కు దూరమయ్యాడు. వచ్చేనెలలో రెండు క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో తలపడే అర్జెంటీనా జట్టును కోచ్ లయోనల్ స్కాలోని మంగళవారం ప్రకటించారు. మొత్తం 28 మంది సభ్యులతో క్వాలిఫయింగ్ పోటీలకు అర్జెంటీనా జట్టు సిద్ధమైంది. అయితే 37 ఏళ్ల మెస్సీ కుడి కాలి చీలమండ గాయంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతను... సెప్టెంబర్ 5న చిలీతో, 10న కొలంబియాతో జరిగే రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ప్రపంచకప్ చాంపియన్ అర్జెంటీనా దక్షిణ అమెరికా క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు 6 మ్యాచ్‌లాడిన అర్జెంటీనా ఖాతాలో 15 పాయింట్లున్నాయి.

# క్రీడలను కెరీర్‌గా ఎంచుకోండి

**జీవితం అందంగా ఉంటుంది ● చెన్నై విద్యార్థులతో షూటర్ మనూ చిట్‌చాట్**



**చెన్నై:** పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలతో చరిత్ర సృష్టించిన భారత మహిళా షూటర్ మనూ భాకర్ క్రీడారంగంలోనూ అందమైన కెరీర్ ఉంటుందని చెప్పింది. డాక్టర్లు, ఇంజినీర్లే కాదు క్రీడాకారులుగా కూడా అందమైన జీవితాన్ని గడపొచ్చని 22 ఏళ్ల మనూ చెన్నై విద్యార్థులకు సూచించింది. మంగళవారం వేళమ్మాల్ నెక్సస్ స్కూల్ మనూను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్ల క్రితం టోక్యోలో ఎదురైనా పరాభవాన్ని పారిస్‌లో రెండు పతకాలతో అధిగమించిన తీరును వివరించింది.

### ఓటమిని రుచి చూసి...

'ప్రపంచ రెండో ర్యాంక్ షూటర్‌గా టోక్యోకు వెళ్లాను. కానీ ఒలింపిక్స్‌లో నా గురి అస్సలు కుదర్లేదు. పాల్గొన్న ప్రతి ఈవెంట్లోనూ ఎదురైన చేదు అనుభవం కొన్నాళ్లు నా ప్రయాణాన్ని కష్టంగా మార్చింది. అయినా నేనెప్పుడూ దాన్నే తలచుకొని దిగులుపడలేదు. ఓటమిని రుచి చూసిన నాకు విజయం దక్కుతుందని తెలుసు. స్పోర్ట్స్ అంటేనే అది! ఒకదాంట్లో పరాజయం, మరోదాంట్లో విజయం సహజం. అయితే ఇవన్నీ కూడా కష్టపడితేనే సాధ్యం' అని పేర్కొంది. మనం కనే పెద్ద పెద్ద కలల్ని సాకారం చేసుకోవాలంటే ఆ స్థాయిలో కఠోరంగా శ్రమించాల్సిందేనని మనూ తెలిపింది. లక్ష్యాన్ని పెట్టుకుంటే దాని కోసం చెమటోడ్చాలని, ఒక్కసారిగా అవి సాకారం కాకపోవచ్చని... కానీ అంతమాత్రాన నిరాశ చెందకుండా లక్ష్యం కోసం నిరంతరం పనిచేయాలని వివరించింది.

### ఆత్మవిశ్వాసంతో...

'నేనెప్పుడు కూడా పోటీల్లో జయాపజయాల గురించి పట్టించుకోలేదు. ప్రతీసారి ఆత్మవిశ్వాసంతో ఉంటాను. ప్రతీ పరీక్షను ఆ ఆత్మవిశ్వాసంతోనే నెట్టుకొస్తాను. మనకు కెరీర్‌లో ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు, ప్రత్యామ్నాయాలుంటాయి. చాలామంది డాక్టరో, ఇంజనీర్‌తోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనుకుంటారు. కానీ క్రీడల్లోనూ అపారమైన అవకాశాలున్నాయన్న సంగతి గుర్తుంచుకోండి. ఆర్థికపరమైన మద్దతు కావొచ్చు ఇంకేదైనా ఉండొచ్చు. క్రీడల్లో అవన్నీ దక్కుతాయి' అని మనూ భాకర్ వివరించింది.

### అమ్మ చూపిన దారి...

తనకు తన అమ్మ స్ఫూర్తి అని ఆమె చూపించిన దారే తనను ఈ స్థాయిలో నిలబెట్టిందని చెప్పింది. అడుగడుగునా తల్లిదండ్రుల సహాయ సహకారాలు లేకపోతే పిల్లలకు ఇవేవి సాధ్యం కానేకావని తెలిపింది. 'ఏ క్రీడయినా సరై బీజం పడేది ఇంట్లోనే! ఆ తర్వాత స్కూల్లో మొదలవుతుంది. తల్లిదండ్రులు, టీచర్లు విద్యార్థుల భవితకు చక్కని బాట వేయడంలో కీలక భూమిక పోషిస్తారు' అని వినమ్రంగా చెప్పింది. మన సంస్కృతి, నేపథ్యం ఏదైనా మనం ఏ విషయంలోనూ చిన్నబుచ్చుకోకూడదని, చిన్న చిన్న అవరోధాలు ఎదురైనంత మాత్రాన ఆగిపోకూడదని స్ఫూర్తివంతమైన మాటలతో విద్యార్థులను మనూ ఉత్తేజపరిచింది. మన ప్రదర్శన బాలేకపోయినా, కొన్నిసార్లు విఫలమైనా, క్రీడల్లో పతకాలు గెలవలేకపోయినా, పరీక్షల్లో పాస్ కాకపోయినా ఎట్టిపరిస్థితుల్లోనూ కుంగిపోకూడదని ఉద్బోధించింది. పారిస్ ఒలింపిక్స్‌లో మనూ మహిళల 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్, 10 మీటర్ల మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రెండు కాంస్య పతకాలు గెలుపొందింది.

## రేసింగ్‌లో నాగ చైతన్య టీమ్

- హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ ఫ్రాంచైజీ కొనుగోలు
- ఈనెల 24 నుంచి రేసింగ్ షురూ




**సాక్షి, హైదరాబాద్:** తెలుగు సినీ హీరో అక్కినేని నాగ చైతన్య తనకు ఎంతో ఇష్టమైన రేసింగ్‌లోకి అడుగు పెట్టారు. ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్)లో పోటీపడే హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడంతో ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ (ఐఆర్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగే 'ఫార్ములా 4'లో భాగమయ్యాడు. ఈ సీజన్‌కు సంబంధించిన రేసులు ఈ నెల 24న మొదలవనున్నాయి. యూత్ ఫాలోయింగ్ ఉన్న యువ హీరో నాగ చైతన్యకు ఫార్ములావన్ అంటే క్రేజీ! బుల్లెట్‌లా దూసుకెళ్లే ఈ కారు రేసింగ్‌ను కుదిరితే ప్రత్యక్షంగా లేదంటే పరోక్షంగా టీవీల్లో చూస్తుంటారు. ఈ ఆసక్తితోనే ఆయన సూపర్ కార్స్, కొత్తకొత్త హై రేంజ్ స్పీడ్ మోటార్ సైకిళ్లను కొని తన గ్యారేజీలో పెట్టుకుంటారు. సినీ ఇండస్ట్రీకి చెందిన అక్కినేని వారసుడు తమ రేసింగ్ లీగ్‌లో భాగం కావడంతో లీగ్‌పై ప్రేక్షకాదరణ కూడా అంతకంతకు పెరుగుతుందని నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. నాగ చైతన్య మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచే రేసింగ్ అంటే ఇష్టం. ఫార్ములావన్ అంటే పిచ్చి. హైస్పీడ్ డ్రామాను ఎంజాయ్ చేస్తాను. ఈ ఫార్ములావన్ క్రేజీతోనే నేను సూపర్ కార్స్, బైక్స్ కొనేలా చేశాయి. నాకు తెలిసి ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ కేవలం ఈవెంట్ మాత్రమే కాదు. అంతకు మించిన అడ్వెంచర్ కూడా! అందుకే నేను నా అభిరుచి ఉన్న రేసింగ్ క్రీడలో భాగమయ్యాను. హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీమ్ మా అంచనాలకు అనుగుణంగా రేసింగ్‌లో దూసుకెళ్తుంది' అని అన్నారు. నిజానికి రేసింగ్ అంటే అక్కినేని ఇంటికి కొత్తేం కాదు. స్టార్ హీరో నాగార్జున కుమారుడు నాగ చైతన్య రేసింగ్ ప్రేమికుడైతే... ఆయన సోదరుడు ఆదిత్య (అక్కినేని వెంకట్ కుమారుడు) స్వయంగా రేసర్. కొన్నేళ్ల క్రితం ఆదిత్య మోటార్ రేసింగ్ ట్రాక్‌పై పలు రేసుల్లో పాల్గొన్నారు.

## టీపీఎల్‌లో సుమిత్ నగాల్



**ముంబై:** భారత నంబర్ వన్ సింగిల్స్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఈ సీజన్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) బరిలోకి దిగనున్నాడు. డిసెంబర్ 3 నుంచి 8 వరకు ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియాలోని టెన్నిస్ కోర్టుల్లో ఆరో సీజన్ పోటీలు జరుగుతాయి. హైదరాబాద్ స్ట్రయికర్స్, పుణే జాగ్వార్స్, బెంగాల్ విజార్డ్స్, పంజాబ్ పేట్రియాట్స్, గుజరాత్ పాంథర్స్, ముంబై లియోన్ ఆర్మీ, బెంగళూరు స్పైపర్స్ ఈ లీగ్‌లో ఆడనున్నాయి.

## డింగ్ లిరెన్‌తో గుకేశ్ గేమ్ 'డ్రా'




**సెయింట్ లూయిస్ (అమెరికా):** సింక్‌ఫీల్డ్ కప్ క్లాసికల్ చెస్ టోర్నమెంట్‌ను భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ 'డ్రా'తో ప్రారంభించాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో జరిగిన తొలి రౌండ్ గేమ్‌ను గుకేశ్ 28 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. డింగ్ లిరెన్, గుకేశ్ మధ్య ఈ ఏడాది నవంబర్‌లో సింగపూర్ వేదికగా ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో వీరిద్దరు తలపడటం ఆసక్తిని కలిగించింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద కూడా తన తొలి గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. నొదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 36 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. మొత్తం పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్లు ఫాబియానో కరువానా (అమెరికా), అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్), వెస్లీ సో (అమెరికా), అనీశ్ గిరి (నెదర్లాండ్స్), డింగ్ లిరెన్ (చైనా), ఇయాన్ నెపోమ్‌నిషి (రష్యా), మాక్సిమి వాచెర్ లెగ్రావ్ (ఫ్రాన్స్), నొదిర్‌బెక్ మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది.

## ఐసీసీ చైర్మన్ రేసులో జై షా

**దుబాయ్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. ప్రస్తుత చైర్మన్ గ్రెగ్ బార్‌్క్లే రెండో దఫా పదవీ కాలం ఈ నవంబర్ 30వ తేదీతో ముగియనుంది. ఐసీసీ నియమావళి ప్రకారం ఒక వ్యక్తి చైర్మన్ పదవిలో గరిష్టంగా మూడుసార్లు (రెండేళ్ల చొప్పున ఆరేళ్ల పాటు) కొనసాగే అవకాశముంది. అయితే న్యూజిలాండ్‌కు చెందిన సీనియర్ అటార్నీ అయిన బార్‌్క్లే వరుసగా మూడోసారి కొనసాగేందుకు విముఖత చూపారు. దీంతో కొత్త చైర్మన్ ఎన్నిక అనివార్యం కావడంతో ఈ నెల 27వ తేదీలోపు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.




### రొనాల్డో 898

పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో మరో మైలురాయికి చేరువయ్యాడు. ప్రస్తుతం రొనాల్డో సౌదీ సూపర్ కప్ టోర్నీలో అల్ నాసర్ క్లబ్‌కు ఆడుతున్నాడు. అల్ హిలాల్ క్లబ్‌తో జరిగిన మ్యాచ్‌లో అల్ నాసర్ క్లబ్ 1-4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. అల్ నాసర్ జట్టు చేసిన ఏకైక గోల్ రొనాల్డో ద్వారా వచ్చింది. రొనాల్డో ప్రొఫెషనల్ కెరీర్‌లో ఇది 898వ గోల్. మరో రెండు గోల్స్ సాధిస్తే రొనాల్డో కెరీర్‌లో 900 గోల్స్ పూర్తి చేసుకుంటాడు. తద్వారా ఈ ఘనత సాధించిన నాలుగో ప్లేయర్‌గా గుర్తింపు పొందుతాడు. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం ఎర్విన్ హెల్మ్‌చెన్ (జర్మనీ: 987 గోల్స్), జోసెఫ్ బికాన్ (ఆస్ట్రియా-చెక్ రిపబ్లిక్: 950 గోల్స్), రొనాల్డ్ లెస్లీ రూకీ (ఇంగ్లండ్: 934 గోల్స్) కెరీర్‌లో 900 గోల్స్ మైలురాయిని దాటారు.

# పేస్‌కు, స్పిన్‌కు మధ్య సమరం

**నేటి నుంచి పాకిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య తొలి టెస్టు**




టెస్టు సిరీస్ ట్రోఫీతో షాంటో, షాన్ మసూద్

రావల్పిండి: పేసర్లతో పటిష్టంగా పాకిస్తాన్.. స్పిన్నర్లే ప్రధాన బలంగా బంగ్లాదేశ్... టెస్టు సిరీస్‌కు సిద్ధమయ్యాయి. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో భాగంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ మధ్య బుధవారం తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు 13 టెస్టులు జరిగాయి. బంగ్లాదేశ్ ఒక్కసారి కూడా టెస్టుల్లో పాక్‌ను ఓడించలేకపోయింది. ఈసారి మాత్రం గెలుపుతో చరిత్ర తిరగరాయాలని భావిస్తోంది. ఆస్ట్రేలియా చేతిలో వైట్‌వాష్‌కు గురైన పాకిస్తాన్ సొంతగడ్డపై సత్తా చాటేందుకు సిద్ధమైంది. మొదటి టెస్టు జరగనున్న రావల్పిండి పిచ్ పేస్‌తో పాటు బ్యాటింగ్‌కు సహకరించనుంది. ఇక్కడ జరిగిన గత నాలుగు టెస్టుల్లో భారీ స్కోర్లు నమోదయ్యాయి. షాహీన్ షా అఫ్రీది, నసీమ్ షా, ఖుర్రం షహజాద్, మొహమ్మద్ అలీతో పాకిస్తాన్ పేస్ విభాగం దుర్భేద్యంగా కనిపిస్తుంటే.. ప్రధాన స్పిన్నర్లు షకీబ్ అల్ హసన్, మెహదీ హసన్ మిరాజ్‌నే బంగ్లాదేశ్ నమ్ముకుంటోంది. సుదీర్ఘ కాలంగా బంగ్లాదేశ్ జట్టులో ప్రధాన పాత్ర పోషిస్తున్న షకీబ్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ భారీ ఆశలు పెట్టుకుంది. 'అతడు చాన్నాళ్లుగా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. రాజకీయ విషయాలు అతడి ఆటతీరుపై ప్రభావం చూపవు. ఈ సిరీస్‌లో అతడు ఏదైనా ప్రత్యేకంగా చేస్తాడనుకుంటున్నాం. పాకిస్తాన్ పేసర్లను ఎదుర్కోవడం అంత తేలిక కాదని తెలుసు. అయినా రాణించగలమనే నమ్మకం ఉంది' అని బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ షాంటో పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా మాజీ పేసర్ జాసన్ గెలెస్పీ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం పాకిస్తాన్ ఆడుతున్న తొలి టెస్టు సిరీస్ ఇదే కాగా... బ్యాటింగ్‌లో బాబర్ ఆజమ్, అబ్దుల్లా షఫీఖ్, షాన్ మసూద్, సౌద్ షకీల్, మొహమ్మద్ రిజ్వాన్ కీలకం కానున్నారు. బంగ్లా తరఫున నజ్ముల్ షాంటో, మోమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్, షకీబ్, లిటన్ దాస్ సమష్టిగా సత్తా చాటాల్సిన అవసరం ఉంది. మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఆట సాగే ఐదు రోజుల పాటు వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో పాకిస్తాన్ (36.66 పాయింట్లు) ఆరో స్థానంలో.. బంగ్లాదేశ్ (25.00 పాయింట్లు) ఎనిమిదో స్థానంలో ఉన్నాయి.

# ఆ రెండు పిచ్‌లు అసంతృప్తికరం

**టి20 ప్రపంచకప్ సెమీఫైనల్ వేదికపై ఐసీసీ నివేదిక**

**దుబాయ్:** టి20 ప్రపంచ కప్‌లో అఫ్గానిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య వెస్టిండీస్‌లో జరిగిన తొలి సెమీఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చిన టరోబా పిచ్ సంతృప్తికరంగా లేదని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వెల్లడించింది. మెగా టోర్నీ ముగిసిన రెండు నెలల తర్వాత పిచ్‌లపై ఐసీసీ మంగళవారం నివేదిక విడుదల చేసింది. టరోబా పిచ్‌తో పాటు.. అమెరికాలో నిర్వహించిన ప్రపంచకప్ తొలి రెండు మ్యాచ్‌లకు వేదికగా ఉన్న న్యూయార్క్ పిచ్‌లు కూడా బాగాలేవని ఐసీసీ వెల్లడించింది. తాత్కాలికంగా నిర్మించిన స్టేడియంలో జరిగిన ఒక మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో శ్రీలంక 77 పరుగులకు ఆలౌట్ కాగా... భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ 96 పరుగులకు పరిమితమైంది. అస్థిర బౌన్స్‌తో ఆ పిచ్‌లు బ్యాటర్లను ఇబ్బంది పెట్టాయని అప్పుడే వ్యాఖ్యతలు పేర్కొనగా... తాజాగా ఆ రెండింటిని ఐసీసీ 'అసంతృప్తికరం' జాబితాలో చేర్చింది. ఐర్లాండ్, భారత్ మ్యాచ్‌లో అయితే అనూహ్య బౌన్స్ కారణంగా టీమిండియా సారథి రోహిత్ శర్మ, వికెట్ కీపర్ రిషభ్ పంత్ గాయాలబారిన పడ్డారు. అనంతరం బుమ్రా బౌలింగ్‌లో ఐర్లాండ్ బ్యాటర్లకు కూడా గాయాలయ్యాయి. దీంతో టి20 ప్రపంచకప్ కోసమే ప్రత్యేకంగా రూపొందించిన డ్రాప్-ఇన్ పిచ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఇక భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జరిగిన పిచ్‌కు ఐసీసీ మంచి రేటింగ్ ఇచ్చింది. సాధారణంగా పిచ్‌ల ప్రమాణాలను బట్టి ఐసీసీ 'చాలా బాగుంది', 'బాగుంది', 'సంతృప్తికరం', 'అసంతృప్తికరం', 'అన్‌ఫిట్' రేటింగ్స్ ఇస్తుంది. ఈ ఏడాది అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా టి20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యమివ్వగా.. తుదిపోరులో దక్షిణాఫ్రికాపై నెగ్గి భారత్ చాంపియన్‌గా నిలిచింది.



# ట్రైన్ ఫోర్స్ వన్ @ మోదీ

**ఈ నెల 23న ఉక్రెయిన్‌లో పర్యటించనున్న ప్రధాని మోదీ**

**విలాసవంతమైన రైలులో 20 గంటలపాటు ప్రయాణం**





ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో చరిత్రాత్మక పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. రష్యా దండయాత్రతో పూర్తిస్థాయి యుద్ధక్షేత్రంగా మారిన ఉక్రెయిన్‌లో పర్యటించబోతున్నారు. ఈ పర్యటనకు ఒక ప్రత్యేకత ఉంది. విమానంలో కాకుండా, అత్యంత విలాసవంతమైన 'ట్రైన్ ఫోర్స్ వన్'రైలులో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు మోదీ చేరుకుంటారు. రానుపోను 20 గంటలపాటు రైలులో ప్రయాణిస్తారు. మోదీ తొలుత ఈ నెల 22న పోలాండ్‌లో అధికారిక సమావేశాల్లో పాల్గొంటారు. అక్కడ నుంచి ట్రైన్ ఫోర్స్ వన్‌లో బయలుదేరి 23న ఉదయం కీవ్‌లో అడుగుపెడతారు. ఏడు గంటలపాటు కీవ్‌లో ఉంటారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమై చర్చిస్తారు. అనంతరం అదే రైలులో పోలాండ్‌కు తిరిగివస్తారు. ట్రైన్ ఫోర్స్ వన్‌లో ఇంతకుముందు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాను యేల్ మేక్రాన్, జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ ప్రయాణించారు. రష్యా దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్‌లో విమానాశ్రయాలు మూతపడ్డాయి. గగనతలంలో విమానాల రాకపోకలను అనుమతించడం లేదు. రోడ్లపై ప్రయాణం సురక్షితం కాదు. ఎప్పుడు, ఎక్కడ క్షిపణి దాడి, బాంబు దాడి జరుగుతుందో తెలియదు. అందుకే ఉక్రెయిన్ పర్యటనకు దేశాధినేతలు రైలునే ఎంచుకుంటున్నారు. అదే సురక్షితమని భావిస్తున్నారు.

**మోదీ పర్యటన ఎందుకంటే..**

భారత ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన ఉక్రెయిన్ పర్యటనను ప్రపంచదేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ తటస్థంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఏ పక్షమూ వహించకుండా భారత్ ఇరుదేశాల మధ్య సమదూరం పాటిస్తోంది. తద్వారా ఆ రెండు దేశాలూ తమ ముఖ్యమేనని, మిత్రదేశాలేనని స్పష్టమైన సంకేతాలిస్తోంది. రష్యా–ఉక్రెయిన్ నడుమ సంఘర్షణను ఆపి, శాంతిని నెలకొల్పే శక్తి భారత్‌కు ఉందని ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు భావిస్తున్నాయి. ఆ దిశగా చొరవ తీసుకోవాలని ప్రధాని మోదీని కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ ఈ ఏడాది జూలైలో రష్యాలో పర్యటించారు. రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమయ్యారు. వ్యాపార, వాణిజ్య, ఆర్థికపరమైన అంశాలపై చర్చించారు. ఈ పరిణామం సహజంగానే ఉక్రెయిన్‌కు అసంతృప్తి కలిగించింది. దీంతో సమతూకం చెడిపోకుండా ఉక్రెయిన్ పర్యటనకు నరేంద్ర మోదీ సన్నద్ధమయ్యారు. ఉక్రెయిన్ పర్యటనలో అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఏయే అంశాలపై చర్చిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రధాని మోదీ ఉక్రెయిన్‌లో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి.

– సాక్షి, నేషనల్ డెస్క్



2023 ఫిబ్రవరిలో ట్రైన్ ఫోర్స్ వన్‌లో ఉక్రెయిన్‌కు వెళ్తున్న బైడెన్

## ట్రైన్ ఫోర్స్ వన్ ప్రత్యేకతలివీ..

- ఉక్రెయిన్‌కు చెందిన క్రిమియా ద్వీపకల్పంలో పర్యటించే వారి కోసం ట్రైన్ ఫోర్స్ వన్ రైలును 2014లో రూపొందించారు. ఆ తర్వాత క్రిమియాను రష్యా బలవంతంగా విలీనం చేసుకుంది. దీంతో ఉక్రెయిన్ అధికారులు ఈ రైలును దేశాధినేతలు, వీఐపీలు ప్రయాణించేందుకు వీలుగా తీర్చిదిద్దారు.
- ఇందులో అత్యంత విలాసవంతమైన వసతులు ఉన్నాయి. భద్రతకు ఢోకా లేదు.
- లోపలి అలంకరణ అతిథులను ఆకట్టుకొనేలా ఉంటుంది. సమావేశాలకు ఒక గది, ఇంటర్నెట్, టీవీ ఉన్నాయి. హాయిగా నిద్రించడానికి సౌకర్యవంతమైన పడక గది ఏర్పాటు చేశారు.
- ట్రైన్ ఫోర్స్ వన్‌కు మొదట ఎలక్ట్రికల్ ఇంజన్ ఉండేది. రష్యాతో యుద్ధం మొదలైన తర్వాత విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతుండడంతో డీజిల్ ఇంజన్ అమర్చారు.
- రైలులో పోలాండ్ నుంచి కీవ్‌కు చేరుకోవడానికి 10 గంటలు పడుతుంది. తిరిగి రావడానికి అంతే సమయం ప్రయాణించాల్సి ఉంటుంది.
- ట్రైన్ ఫోర్స్ వన్‌లో ప్రయాణం అంటే కేవలం ఒక ప్రయాణం కాదు. యుద్ధంలో నష్టపోయిన ఉక్రెయిన్ ప్రజల పట్ల ఒక సుహృద్భావ ప్రకటన అని భావించవచ్చు.
- యుద్ధం మొదలైన తొలి రోజుల్లో సాధారణ ప్రజలను ఈ రైలులో సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- రైలు ప్రయాణాలంటే ఇష్టపడే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ట్రైన్ ఫోర్స్ వన్ ఎంతగానో నచ్చింది. ఆయన ఈ రైలులో 20 గంటలు ప్రయాణించారు. తనకు లభించిన ఆతిథ్యానికి సంతోషించారు. రైలు సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## గాజా టన్నెల్‌లో ఆరుగురు బందీల మృతదేహాలు

**స్వాధీనం చేసుకున్నామన్న ఇజ్రాయెల్ సైన్యం**

**జెరూసలేం:** గతేడాది అక్టోబర్‌లో హమాస్ బందీలుగా పట్టుకున్న వారిలో ఆరుగురి మృతదేహాలను గాజాలోని ఓ టన్నెల్‌లో కనుగొన్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. దక్షిణ గాజా ప్రాంతంలో అర్ధరాత్రి చేపట్టిన ఆపరేషన్‌లో మృతదేహాలు దొరికాయని తెలిపింది. మృతులను చెయిమ్ పెర్రీ(80), యోరమ్ మెట్జ్‌జెర్(80), అవ్‌రహమ్ ముండెర్(79), అలెగ్జాండర్ డాన్సిగ్(76), నడవ్ పాపుల్‌వెల్(51), యగెవ్ బుచ్‌ష్టవ్(35)గా గుర్తించారు. వారు ఎప్పుడు, ఎలా చనిపోయారన్నది మాత్రం వెల్లడించలేదు. హమాస్ నిర్మించుకున్న సొరంగ మార్గాల్లో చేపట్టిన క్లిష్టమైన ఆపరేషన్‌లో మృతదేహాలను గుర్తించామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి తెలిపారు. ముండెర్ చనిపోయినట్లు మంగళవారమే అతడుండే వ్యవసాయ క్షేత్రం నిర్వాహకులు ధ్రువీకరించారు. మిగతా ఐదుగురు చనిపోయిన విషయాన్ని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. హమాస్ చెరలో ఇప్పటికీ కనీసం 110 మంది సజీవంగా ఉండి ఉంటారని ఇజ్రాయెల్ అంటోంది. ఇలా ఉండగా, మంగళవారం గాజాలోని శరణార్థులు తలదాచుకున్న ముస్తాఫా హఫీజ్ స్కూలు భవనంపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడిలో కనీసం 10 మంది చనిపోయారు. ఘటన సమయంలో అందులో కనీసం 700 మంది ఉన్నట్లు సమాచారం. తాము హమాస్ కమాండ్ సెంటర్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ అనంతరం ప్రకటించింది. అదేవిధంగా, సెంట్రల్ గాజాలో చేపట్టిన మరో దాడిలో ఒక మహిళ, ఆమె ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. స్కూల్ టీచర్ అయిన ఈమె భర్త అలా అబూ జెయిద్ గత 9 నెలలుగా ఇజ్రాయెల్ జైలులో ఉన్నాడు.

## మలేషియా వెళ్లేందుకు తీస్తా సెతల్వాద్‌కు సుప్రీం అనుమతి



**న్యూఢిల్లీ:** మలేషియాలో పర్యటించేందుకు ప్రముఖ సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు సుప్రీంకోర్టు అనుమతి మంజూరు చేసింది. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు మలేషియాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా జరిగే ఓ సదస్సుకు హాజరు కావాల్సి ఉందని, అనుమతి ఇవ్వాలంటూ తీస్తా సెతల్వాద్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. సెతల్వాద్ వినతి పట్ల సానుకూలంగా స్పందించింది. అనుమతి మంజూరు చేస్తున్నట్లు వెల్లడించింది. అయితే, సదస్సు ముగిసిన తర్వాత షెడ్యూల్ ప్రకారం వెనక్కి వచ్చేస్తానంటూ హామీ ఇవ్వాలని, యథాతథంగా విచారణను ఎదుర్కోవాలని, సెషన్స్ కోర్టులో రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని షరతు విధించింది. మలేషియా నుంచి వచ్చిన తర్వాత పాసుపోర్టును మళ్లీ సరెండర్ చేయాలని తేల్చిచెప్పింది. 2002 నాటి గోద్రా అనంతర అల్లర్ల కేసులో అమాయకులను ఇరికించేందుకు తప్పుడు పత్రాలు సృష్టించినట్లు తీస్తా సెతల్వాద్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులో సుప్రీంకోర్టు గతేడాది జూలైలో ఆమెకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. అయితే, దేశం విడిచిపెట్టి వెళ్లిపోవద్దని ఆదేశించింది. అంతేకాదు ఆమె పాస్‌పోర్టును సెషన్స్ కోర్టులో సమర్పించాలని స్పష్టంచేసింది.

## రాజ్యసభ బరిలో రవనీత్‌సింగ్, కురియన్

**9 మంది అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ**

**న్యూఢిల్లీ:** ఖాళీగా ఉన్న రాజ్యసభ స్థానాల భర్తీకి వచ్చే నెల 3న జరిగే ఉపఎన్నికలకు అధికార బీజేపీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. 9 మంది అభ్యర్థుల పేర్లను మంగళవారం ప్రకటించింది. కేంద్ర మంత్రులు రవనీత్‌సింగ్ బిట్టూను రాజస్తాన్ నుంచి, జార్జి కురియన్‌ను మధ్యప్రదేశ్ నుంచి బరిలోకి దింపుతోంది. బిజూ జనతాదళ్(బీజేడీ) మాజీ నేత మమతా మొహంతా బీజేపీ అభ్యర్థిగా ఒడిశా నుంచి పోటీ చేయబోతున్నారు. కాంగ్రెస్ మాజీ నేత కిరణ్ చౌదరి హరియాణా నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీకి దిగుతున్నారు. వీరిద్దరూ ఇటీవలే బీజేపీలో చేరారు.

## ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మహిళ కన్నుమూత



**మాడ్రిడ్:** ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా భావిస్తున్న 117 ఏళ్ల బామ్మ ఇకలేరు. అమెరికాలో జన్మించిన, స్పెయిన్ దేశస్తురాలు మరియా బ్రన్యాస్ కన్నుమూశారని ఆమె కుటుంబసభ్యులు మంగళవారం ప్రకటించారు. బ్రన్యాస్ 'ఎక్స్'పేజీలో వారు..'మరియా బ్రన్యాస్ మనల్ని విడిచి వెళ్లిపోయారు. కోరుకున్న విధంగానే నిద్రలోనే, ప్రశాంతంగా, ఎలాంటి బాధా లేకుండా తుదిశ్వాస విడిచారు'అని పేర్కొన్నారు. 110, అంతకంటే ఎక్కువ ఏళ్లు జీవించి ఉన్న వ్యక్తుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించే గెరంటాలజీ రీసెర్చ్ గ్రూప్.. ఫ్రాన్సుకు చెందిన లుసిలె రాండన్ అనే నన్ గతేడాది మరణించాక, మనకు తెలిసినంత వరకు అత్యంత వృద్ధ మహిళ బ్రన్యాస్ అని ప్రకటించింది. బ్రన్యాస్ మరణంతో ఆ స్థానం 116 ఏళ్ల జపనీయురాలు తొమికొ ఇకూటాకు దక్కుతుందని తాజాగా ఆ గ్రూప్ తెలిపింది. 1907 మార్చి 4వ తేదీన అమెరికాలో శాన్ ఫ్రాన్సిస్కోలో బ్రన్యాస్ జన్మించారు. ఆమె కుటుంబం కొన్నాళ్లపాటు న్యూఆర్లియన్స్‌లోనూ ఉంది. ఆమె తండ్రి స్పెయిన్‌లో ఓ మ్యాగజీన్‌ను ప్రారంభించడంతో, కుటుంబంతోపాటు ఆమె కూడా ఇక్కడికే వచ్చేశారు. మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజుల్లో అట్లాంటిక్ సముద్రం మీదుగా స్పెయిన్‌కు జరిగిన అప్పటి ప్రయాణం తనకు గుర్తుందని చెప్పేవారు బ్రన్యాస్. 'ఎక్స్'లోని సూపర్ కాటలాన్ గ్రాండ్‌మా అనే పేజీలో బ్రన్యాస్..'నేను వృద్ధురాలిని. అత్యంత వృద్ధురాలిని. మూర్ఖురాలిని మాత్రం కాదు'అని పెట్టుకున్నారు. 113 ఏళ్ల వయస్సులో తక్కువ తీవ్రతతో సోకిన కోవిడ్ నుంచి ఆమె సురక్షితంగా బయటపడ్డారు. కాటలాన్ ప్రాంతంలోని ఒలోట్ పట్టణంలోని ఓ నర్సింగ్ హోంలో ఆమె కన్నుమూశారు. 'ఎప్పుడో తెలియదు కానీ, ఈ సుదీర్ఘ ప్రయాణం త్వరలోనే ముగుస్తుంది. ఇంత దీర్ఘకాలం జీవించి శిథిలమైన స్థితిలో ఉన్న నన్ను మరణం ఆవహిస్తుంది. నవ్వుతూ మరణాన్ని ఆహ్వానిస్తాను. స్వేచ్ఛగా, సంతృప్తికరంగా జీవితం ముగించాలనుకుంటున్నాను'అని కొన్ని రోజుల క్రితం బ్రన్యాస్ తమతో అన్నారని కుటుంబసభ్యులు తెలిపారు.

## కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ 27 దాకా పొడిగింపు



**న్యూఢిల్లీ:** మద్యం కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు ఈ నెల 27వ తేదీ దాకా పొడిగించింది. ఈ మేరకు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో కేజ్రీవాల్‌ను సీబీఐ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ పాత్రపై సీబీఐ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌పై ఈ నెల 27న ఢిల్లీ కోర్టు నిర్ణయం తీసుకోనుంది.

## రష్యాలో పట్టుబిగిస్తున్న ఉక్రెయిన్ కస్క్‌లో మూడో వంతెన పేల్చివేత




**కీవ్:** రష్యాలోని కస్క్ ప్రాంతంపై ఉక్రెయిన్ పట్టుబిగిస్తోంది. కీవ్ బలగాలు కస్క్‌ను మిగతా దేశంతో కలిపే రేమ్ నదిపై ఉన్న ప్రధాన వంతెనను ధ్వంసం చేసినట్లు రష్యా ఆర్మీ తెలిపింది. తమ బలగాలు ఉక్రెయిన్ ఆర్మీలోని 19 మంది మెరైన్లను పట్టుకున్నాయని వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను సైతం విడుదల చేసింది. ఉక్రెయిన్ ఈ ప్రకటనలపై స్పందించలేదు. కాగా, ఆగస్టు 6న సరిహద్దులు దాటి రష్యాలోని కస్క్‌లో ప్రవేశించిన ఉక్రెయిన్ ఆర్మీ ఆదివారం సెమ్ నదిపైని రెండో వంతెనను పేల్చివేసింది. మొదటగా గ్లుష్కోవో పట్టణంలోని వంతెనను ధ్వంసం చేసింది. రష్యా యుద్ధ సామర్థ్యాన్ని సాధ్యమైనంత మేరకు దెబ్బతీయడం, ఎదురుదాడులకు దిగడమే తమ లక్ష్యమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ అంటున్నారు. కస్క్‌లో బఫర్ జోన్ ఏర్పాటు చేయడం ద్వారా, రష్యా బలగాలు నేరుగా సరిహద్దుల్లోకి రాకుండా చేయడమనే సుదీర్ఘ వ్యూహం దాగుందని పరిశీలకులు అంటున్నారు. అదే సమయంలో ఉక్రెయిన్ బలగాలు సొంత భూభాగంలో రష్యా ఆర్మీ నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. తూర్పు ప్రాంతంలోని కీలక నగరం పొక్రొవ్స్క్ దిశగా ముందుకు సాగుతున్న రష్యా ఆర్మీని నిలువరించేందుకు చెమటోడ్చుతున్నాయి. డోన్బాస్ రీజియన్‌లో ఉక్రెయిన్ ఆర్మీ సరఫరాలకు వ్యూహాత్మకంగా పొక్రొవ్స్క్ అత్యంత కీలకమైంది. ఈ నగరానికి కేవలం ఆరు మైళ్ల దూరంలోనే రష్యా బలగాలు ప్రస్తుతం ఉన్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. రష్యా దాడులతో భీతిల్లిన జనం నగరాన్ని వీడి వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే మరో వారం రోజుల్లో రష్యా బలగాలు పొక్రొవ్స్క్‌లోకి చేరుకునే అవకాశముందని అంచనా వేస్తున్నారు.



బాధిత దళిత కుటుంబంతో మాట్లాడుతున్న రాహుల్

## న్యాయం జరిగేలా చూస్తా

**దళితుడి కుటుంబానికి రాహుల్ పరామర్శ**

**రాయ్‌బరేలీ:** ఇటీవలి హత్యకు గురైన 22 ఏళ్ల దళిత యువకుడి కుటుంబాన్ని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మంగళవారం పరామర్శించారు. న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సలోన్ ప్రాంతంలో అర్జున్ పాసీ అనే దళిత యువకుడిని దుండగులు కాల్చి చంపారు. 'ఈ హత్యకు సూత్రధారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇక్కడి ప్రజలందరూ ఆగ్రహంగా ఉన్నారు. దళితుడిని చంపేశారు. ప్రజలు న్యాయం కావాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తం అతని కుటుంబాన్ని బెదిరించారు'అని రాహుల్ భువల్‌పూర్ సైనీ గ్రామంలో విలేకరులతో అన్నారు. రాహుల్‌గాంధీ రాయ్‌బరేలీ ఎంపీ అనే విషయం తెలిసిందే. ఇక్కడి ఎస్పీ సూత్రధారి జోలికి వెళ్లడం లేదు. చిన్నవాళ్లను అరెస్టు చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేదాకా విశ్రమించేది లేదని రాహుల్ అన్నారు.

## నేడు దళితులు, ఆదివాసీల భారత్ బంద్

**న్యూఢిల్లీ:** అణగారిన వర్గాలకు భద్రత కల్పించాలని, ప్రాతినిధ్యం మరింతగా పెంచాలనే డిమాండ్‌తో దళితులు, ఆదివాసీల సంఘాలు బుధవారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం, సమానత్వం దక్కేలా చర్యలు తీసుకోవాలని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ దళిత్ అండ్ ఆదివాసీ ఆర్గనైజేషన్ కోరుతోంది. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై గతంలో ఇందిరా సాహ్ని కేసులో ఇచ్చి న తీర్పుకు విరుద్ధంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఈ సమాఖ్య అభ్యంతరం వ్యక్తం చేసింది. తాజా తీర్పుతో ఎస్సీలు, ఎస్టీల రాజ్యాంగ హక్కులకు భంగం వాటిల్లనుందని తెలిపింది. సుప్రీం తీర్పును పట్టించుకోవద్దని, ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీల రిజర్వేషన్లకు రక్షణ కల్పిస్తూ మళ్లీ రాజ్యాంగ సవరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

## నేను గెలిస్తే మంత్రిగా మస్క్: ట్రంప్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తాను మళ్లీ గెలిస్తే ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్‌కు మంత్రి పదవిస్తానని రిపబ్లికన్ల అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రాయిటర్స్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ మేరకు వెల్లడించారు. 'మస్క్ చాలా తెలివైన వ్యక్తి. ఆయన ఒప్పుకుంటే మంత్రి పదవి కచ్చితంగా ఇస్తా''అన్నారు. ట్రంప్‌కు మస్క్ మద్దతు ప్రకటించడం తెలిసిందే. 2016లో ట్రంప్ అధ్యక్షుడయ్యాక మస్క్‌ను పర్యావరణ, వలస విధాన సలహా మండళ్ల సలహాదారుగా నియమించారు. చరిత్రాత్మక పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడాన్ని నిరసిస్తూ 2017లో ఆ పదవులకు మస్క్ రాజీనామా చేశారు. ట్రంప్ గెలిస్తే మస్క్‌ను పాలనలో భాగస్వామిని చేస్తారని, వాల్ స్ట్రీట్ జర్నల్ ఇప్పటికే పేర్కొంది.

## చిక్కుల్లో కేంద్రమంత్రి కుమారస్వామి



**బనశంకరి:** కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి చిక్కుల్లో పడ్డారు. సీఎంగా ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా గనులను కాంట్రాక్టు ఇచ్చినట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. దీనిపై కుమారస్వామిపై చార్జిషీట్ వేసేందుకు అనుమతి కోరుతూ సిట్ అధికారులు మంగళవారం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు లేఖ రాశారు. సీఎంగా ఉండగా కుమారస్వామి 2007లో శ్రీసాయి వెంకటేశ్వర మినరల్స్ కంపెనీకి 550 ఎకరాల విస్తీర్ణంలోని గనులను మంజూరు చేశారు. ఇందులో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు సిట్ ఆరోపిస్తోంది. గనుల్లో అక్రమాలపై లోకాయుక్త న్యాయమూర్తి సంతోష్ హెగ్డే 2011లో అందజేసిన నివేదిక ఆధారంగా సిట్ దర్యాప్తు చేపట్టింది.

## ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌కు అరెస్ట్ వారెంట్

**సుల్తాన్‌పూర్(యూపీ):** ఇరవై ఏళ్లనాటి కేసులో విచారణకు హాజరుకాని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌పై సుల్తాన్‌పూర్ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన్ను అరెస్ట్ చేసి, ఈ నెల 28వ తేదీన తమ ఎదుట హాజరుపర్చాలని పోలీసులను మంగళవారం ఆదేశించింది. సంజయ్ సింగ్, ఎస్పీ నేత అనూప్ సండాతోపాటు మరో నలుగురిపై కోర్టు ఈనెల 13న నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మంగళవారం జరిగిన విచారణకు వారు హాజరు కావాల్సి ఉంది. కానీ, రాకపోవడంతో అందరినీ అరెస్ట్ చేసి, తీసుకు రావాల్సిందిగా ఆదేశాలిచ్చింది.

## మంకీపాక్స్‌పై ఢిల్లీ ఎయిమ్స్ మార్గదర్శకాలు

**న్యూఢిల్లీ:** మంకీపాక్స్ అనుమానిత రోగుల చికిత్సపై ఢిల్లీ ఎయిమ్స్ పలు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఐసోలేషన్ కోసం ఎయిమ్స్‌లో ఐదు బెడ్లను ప్రత్యేకించాలని సూచించింది. ఇతర రోగులు, సిబ్బందికి ఈ వ్యాధి సోకకుండా అనుమానిత రోగులను ఈ ఐసోలేషన్ ఏరియాలో ఉంచాలని తెలిపింది. సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించే వరకు అనుమానితులకు ఇక్కడ తాత్కాలిక ఐసోలేషన్ ఏర్పాట్లు చేయాలని తెలిపింది. ఎయిమ్స్ సూచనల మేరకు లోక్‌నాయక్ జయప్రకాశ్ (ఎల్ఎన్‌జేపీ), జీటీబీ, బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆస్పత్రుల్లో ఐసోలేషన్ వార్డులను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

## కుల వ్యవస్థ రాజ్యాంగ విరుద్ధమని నిర్ధారించలేం

**పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ:** దేశంలో కుల వ్యవస్థ రాజ్యాంగ విరుద్ధమని నిర్ధారిస్తూ ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం తోసిపుచ్చింది. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని వెల్లడించింది. రాజ్యాంగంలో షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ)ల ప్రస్తావన ఉందని గుర్తుచేసింది. కుల వ్యవస్థ రాజ్యాంగ విరుద్ధమని నిర్ధారించలేమని పరోక్షంగా తేల్చిచెప్పింది. కుల వ్యవస్థ అనేది ప్రాథమిక హక్కులకు విరుద్ధమని పేర్కొంటూ వజీర్ సింగ్ పూనియా అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు.

## త్రిపురలో కొండచరియల బీభత్సం

**ఏడుగురి మృతి... ఇద్దరు అదృశ్యం**

**అగర్తలా/గాంగ్‌టక్:** ఈశాన్యం రాష్ట్రం త్రిపుర ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చాలాచోట్ల జనజీవనం స్తంభించింది. మరోవైపు విరిగిపడుతున్న కొండచరియలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కొండచరియల ధాటికి మంగళవారం దక్షిణ త్రిపుర జిల్లాలో ఐదుగురు, గోమతి జిల్లాలో ఒకరు, ఖోవాయ్ జిల్లాలో ఒకరు మరణించినట్లు త్రిపుర రెవెన్యూ శాఖ కార్యదర్శి బ్రిజేశ్ పాండే చెప్పారు. మరో ఇద్దరు కనిపించకుండాపోయారని తెలిపారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఉన్నారని వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో దక్షిణ త్రిపుర జిల్లాలో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. మిగిలిన జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.

**సిక్కింలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ధ్వంసం**

భీకర వర్షాలు, వరదలు సిక్కింను ముంచెత్తుతున్నాయి. దక్షిణ సిక్కింలో గాంగ్‌టక్ జిల్లాలోని దిపూ దారాలో మంగళవారం భారీ కొండచరియలు విరిగిపడడంతో 510 మెగావాట్ల హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టు చాలా వరకు ధ్వంసమైంది. ఉదయం 7.30 గంటలకు ఈ సంఘటన జరిగినట్లు అధికారులు చెప్పారు. నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌పీసీ) ఆధ్వర్యంలోని ఈ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని తీస్తా స్టేజ్–5 హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టు అని పిలుస్తారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు. ప్రమాద సమయంలో ఇక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో జీఎస్ఎస్ భవనంతోపాటు దాదాపు 18 ఇళ్లు దెబ్బతిన్నాయి. సిక్కిం–డిక్చు రహదారిపై రాళ్లు పడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



సిక్కింలోని దిపూ దారాలో జలవిద్యుత్ ప్రాజెక్టుపైకి వచ్చి పడుతున్న కొండచరియలు

## పీఏసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్



**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం బాధ్యతలు తీసుకున్నట్లు ఆయన 'ఎక్స్'లో వెల్లడించారు. 'పదవిలో నియమించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు, నాపై విశ్వాసం ఉంచినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ధన్యవాదాలు. ప్రతి ఒక్కరూ అత్యున్నత ప్రమాణాలు, జవాబుదారీ తనం పాటించేలా నా బాధ్యతలు నిర్వర్తిస్తానని ప్రమాణం చేస్తున్నా'అని వేణుగోపాల్ పేర్కొన్నారు.

## బతుకుపోరులో మరో రోజు



'అమ్మ గోదావరి అక్కున చేర్చుకుంటే కడుపు నింపుకోవడానికి కొదవేముంటుంది' అనుకుంటూ ఉదయాన్నే అఖండ గోదావరిలో ఆశగా బతుకు వేట ప్రారంభించిన మత్స్యకారులు భానుడు పశ్చిమ కనుమల్లో అస్తమిస్తున్న సమయంలో తాము వేటాడిన మత్స్య సంపదతో ఇలా తీరానికి చేరుకుంటున్నారు. సాయంసంధ్య వేళ గోదారమ్మ ఒడిలో ఓలలాడుతున్న ఈ బతుకు నావను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - ప్రసాద్, సాక్షి ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

## కల్లోల సాగరం



విశాఖ సాగర తీరాన సేదతీరుదామనుకున్న పర్యాటకులు ఉవ్వెత్తున ఎగసిపడుతూ తీరానికి దూసుకొచ్చిన అలలను చూసి ఒక్కసారిగా కంగారుపడ్డారు. ఆటుపోట్ల కారణంగా మంగళవారం విశాఖ తీరంలో సముద్రం 10 నుంచి 15 మీటర్లు ముందుకు వచ్చింది. దీంతో బీచ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పర్యాటకులు ఇసుక తిన్నెల మీదకు కూడా వెళ్లలేకపోయారు. - నవాజ్ సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## మేమూ అప్డేటయ్యాం..



ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీయం యాప్‌ల ద్వారా చెల్లింపులు పెరిగిపోవడంతో చాలమంది జేబులో చిల్లర ఉంచడంలేదు. దీంతో యాచకులు అడగ్గానే చిల్లర లేదని చెప్పడం పరిపాటిగా మారింది. ఆలోచనలో పడ్డ యాచకులు ఇలా క్యూఆర్ కోడ్ పట్టుకుని అడుక్కోవడం మొదలు పెట్టారు. విశాఖ బీచ్‌రోడ్డులో ఓ యాచకుడు ఇలా క్యూఆర్ కోడ్ పట్టుకుని తిరుగుతున్నాడు. - నవాజ్, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## క్లుప్తంగా...

### నేడు భారత్ బంద్

**విజయవంతం చేయాలని మాల మహానాడు జేఏసీ పిలుపు**

**సాక్షి, అమరావతి:** దేశంలో అనేక సంఘాలు పలు సమస్యలపై భారత్‌బంద్ నిర్వహిస్తున్నాయని, దీన్లోభాగంగా వర్గీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు ఐక్య జేఏసీ గౌరవ అధ్యక్షుడు నల్లి రాజేశ్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. మణిపూర్‌లో అల్లర్లు, పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం, రైతుల సమస్యలు వంటి అనేక అంశాలపై అనేక సంఘాలు బంద్ నిర్వహిస్తున్నాయని, ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్ అంశాలపై బంద్ పిలుపునిచ్చామని పేర్కొన్నారు. ఈ బంద్‌కు విద్యా సంస్థలు, వర్తక వాణిజ్య సంస్థలు సహకరించాలని రాజేశ్ విజ్ఞప్తి చేశారు.

### రోడ్డు పాలైన టమాటా



**చిప్పగిరి:** టమాట ధర పూర్తిగా పడిపోవడంతో రైతులు నట్టేట మునుగుతున్నారు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలంలోని కొందరు రైతులు బోర్ల కింద, మరికొందరు వర్షాధారంగా టమాట సాగు చేశారు. వర్షాధారం కింద సాగు చేసిన టమాటాలు రాక ముందే రేటు దారుణంగా పడిపోవడంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. ఇక బోరు బావుల కింద సాగుచేసిన రైతులు పండించిన టమాటాలు సమీపంలోని మార్కెట్‌కు తరలిస్తుండగా 20 కేజీల బాక్సు ధర రూ.150 -రూ.250 వరకు పలుకుతుండటంతో రవాణా ఖర్చులకు కూడా సరిపోక తలలు పట్టుకుంటున్నారు. మంగళవారం మండలంలోని నేమకల్లు రోడ్డు పక్కన కొందరు టమాట రైతులు దిగుబడులను పడేసి వెళ్లడం గమనార్హం.

### హక్కుదారులకు న్యాయం చేయండి

**సీపీఎం మాజీ ఎంపీ మధు లేఖ**

**సాక్షి, అమరావతి:** తిరుపతి జిల్లా శెట్టిపల్లి గ్రామంలో భూ హక్కుదారులకు న్యాయం చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఎం మాజీ ఎంపీ పి.మధు మంగళవారం లేఖ రాశారు. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను తక్షణం పరిష్కరించేలా జోక్యం చేసుకుని పేదలకు న్యాయం చేయాలని మధు విజ్ఞప్తి చేశారు. ఈ లేఖతో పాటు ప్రభుత్వం జారీ చేసిన జీవోలను కూడా ఆయన జత చేశారు.

### పశ్చిమ బెంగాల్ ఘటనపై విద్యుత్ సౌధ ఉద్యోగులు నిరసన

**సాక్షి, అమరావతి:** పశ్చిమబెంగాల్ విధుల్లో ఉన్న డాక్టర్‌పై అతి క్రూరంగా జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ విద్యుత్ శాఖ మంగళవారం విజయవాడలోని విద్యుత్ సౌధ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. జరిగిన సంఘటన పట్ల మానవ జన్మ ఎత్తిన ప్రతి వ్యక్తి, సిగ్గుతో తలా వంచుకోవాలని ఈ సందర్భంగా ఉద్యోగ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇటువంటి అకృత్యాలకు మూలము తల్లితండ్రుల పెంపకం లోపం, మద్యపాన అలవాట్లతో పాటు మొబైల్ ఫోన్ల కారణంగా అరచేతిలోనే అన్ని అశ్లీల దృశ్యాలు, వీడియోలు అందుబాటు ఉండడం ఇలాంటి ఘటనలకు అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు.

### రాజీవ్ పిటిషన్‌పై వాదనలు

**విజయవాడస్పోర్ట్స్:** అగ్రి గోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారంలో అరెస్టయి, రిమాండ్ ఖైదీగా ఉన్న జోగి రాజీవ్ బెయిల్ పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో మంగళవారం వాదనలు కొనసాగాయి. రాజీవ్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని, అతనికి వెంటనే బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాజీవ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనికి కౌంటర్‌గా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేసిన పిటిషన్‌పైనా వాదనలు జరిగాయి. మరోవైపు రాజీవ్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఏసీబీ అధికారులు వేసిన పిటిషన్ పైనా వాదనలు జరిగాయి.

# పక్కా ప్లానింగ్‌తోనే విశాఖకు డ్రగ్స్..

**వేల కోట్ల డ్రగ్స్ తరలింపులో ప్రస్తుత ప్రభుత్వ పెద్దల అనుయాయులు?**



పోర్టులో డ్రగ్స్ కంటైనర్స్

- దర్యాప్తు నిలిచిపోవడం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం?
- బ్రెజిల్‌లో సీబీఐ పరిశీలనలో ప్రాథమిక ఆధారాలు లభ్యం
- బ్రెజిఇల్ పోర్టులో డ్రగ్స్ కంటైనర్ నంబర్‌తో ఉన్న మరో కంటైనర్
- అందులో ఎలాంటి డ్రగ్స్ అవశేషాలు లేవని గుర్తించిన సీబీఐ
- ముందస్తు ప్లాన్ ప్రకారమే ఒకే నెంబర్‌తో రెండు కంటైనర్లు ఏర్పాటు
- 4 నెలలు దాటినా అడుగు ముందుకు వేయని సీబీఐ

**సాక్షి, విశాఖపట్నం:** బ్రెజిల్ నుంచి పక్కా ప్రణాళికతోనే విశాఖకు భారీ కంటైనర్‌తో డ్రగ్స్ తీసుకువచ్చినట్లుగా సీబీఐ ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. తొలుత పొరపాటున వైజాగ్‌కు డ్రగ్స్ వచ్చాయని భావించినా.. సీబీఐ బ్రెజిల్‌లో చేసిన దర్యాప్తులో ఇదంతా వ్యూహం ప్రకారమే జరిగిందని తేలింది. అయినా తదుపరి చర్యలపై సీబీఐ ఇంకా మీనమేషాలు లెక్కిస్తోంది. వేల కోట్లు విలువ చేసే ఈ డ్రగ్స్ దందాలో ఉన్నది ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు అనుయాయులేనని, అందువల్లే దర్యాప్తుని తొక్కి పెడుతున్నారన్న విషయం క్రమంగా బయట పడుతోంది.

ఈ ఏడాది మార్చి 19న విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ (వీసీటీపీఎల్)లో 25 వేల కిలోల డ్రైఈస్ట్‌తో పాటు వేల కోట్లు విలువ చేసే డ్రగ్స్ దిగుమతి అయిన విషయాన్ని సీబీఐ బట్టబయలు చేసింది. బ్రెజిల్‌లోని శాంటోస్ పోర్టు నుంచి వచ్చిన షిప్‌లోని కంటైనర్‌లో డ్రైఈస్ట్‌ని తీసుకొచ్చిన సంధ్యా ఆక్వా సంస్థ.. అందులో డ్రగ్స్ ఎలా వచ్చాయో తమకు తెలీదని చెబుతోంది. డ్రగ్స్ దొరికిన తొలి రోజున సంస్థ ప్రతినిధుల్ని రెండు గంటలు మాత్రమే సీబీఐ అధికారులు విచారించి వదిలేశారు. వారి నుంచి కీలక సమాచారం రాబట్టే అవకాశాలున్నప్పటికీ, ఇప్పటివరకు ఆ ప్రయత్నం చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మొత్తం కంటైనర్‌లో వచ్చిన వెయ్యి బ్యాగుల్లో 70 శాతం బ్యాగుల్లో ఉన్న డ్రైఈస్ట్‌లో కొకైన్, హెరాయిన్, ఓపియం, కొడైన్, మెథలాక్విన్ తదితర డ్రగ్స్ అవశేషాలున్నాయి. ఈ వ్యవహారంలో దర్యాప్తునకు సీబీఐ బృందం బ్రెజిల్ వెళ్లింది. నౌక వచ్చిన శాంటోస్ పోర్టు, డ్రైఈస్ట్ తరలించిన ఓషన్ నెట్‌వర్క్ ఎక్స్‌ప్రెస్ సంస్థ, ఆ నౌక వచ్చిన మార్గం, ఆగిన పోర్టుల్లో సీసీటీవీ ఫుటేజ్ సేకరించింది. అయితే, షిప్‌లోకి డ్రగ్స్ కంటైనర్ ఎక్కించిన శాంటోస్ పోర్టులో అదే కంటైనర్‌ని పోలి, అదే నంబర్ (ఎస్ఈకేయూ-4375380)తో ఉన్న మరో కంటైనర్‌ను చూసిన దర్యాప్తు బృందం షాక్‌కు గురైంది. దానిని పరీక్షించగా, ఎలాంటి డ్రగ్స్ ఆనవాళ్లు లభించలేదు. దీంతో పక్కా పథకం ప్రకారమే డ్రగ్స్ తరలించారని సీబీఐ నిర్ధారణకు వచ్చింది. తనిఖీల సమయంలో ఒక కంటైనర్‌ని చూపించి.., లోడింగ్ చేసేటప్పుడు డ్రగ్స్ ఉన్న కంటైనర్‌ని నౌకలోకి ఎక్కించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. శాంటోస్ పోర్టులో ఉన్న కంటైనర్ ఫొటోలు, వీడియో ఫుటేజీ, ఇతర ఆధారాలను సీబీఐ సేకరించింది.

### వివరాలు తీసుకొని పరిశీలిస్తాం : హోంమంత్రి అనిత




విశాఖని డ్రగ్స్ మాఫియాగా చేసేశారంటూ అప్పట్లో నానా యాగీ చేసిన ప్రస్తుత హోం మంత్రి అనిత.. సీబీఐ దర్యాప్తు గురించి ఇంతవరకూ కనుక్కోలేదని చెప్పడం విడ్డూరం. ఆమె విశాఖలో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డ్రగ్స్ దర్యాప్తు గురించి మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. సీబీఐ దర్యాప్తు ఎంతవరకూ చేసిందో ఆ వివరాలు తీసుకోలేదని, నివేదిక వచ్చిన తర్వాత పరిశీలించి చెబుతామంటూ దాటవేయడం గమనార్హం.

### నివేదికలు తొక్కిపెడుతున్నారా?

గ్రాము కొకైన్ దొరికితే నానా హడావుడి చేసే పోలీసులు, సీబీఐ అధికారులు.. వేల కోట్ల రూపాయల డ్రగ్స్ దొరికి, ప్రాథమిక ఆధారాలు లభించినా, ఆ తర్వాత దర్యాప్తులో ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. కంటైనర్లలోని బ్యాగుల్లో ఏ డ్రగ్స్ ఎంత మొత్తం ఉన్నాయో సమగ్ర నివేదిక కోసం ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కి నమూనాలు పంపించారు. సాధారణంగా ఎఫ్ఎస్ఎల్ నివేదికలు 15 రోజుల్లోనే వస్తాయి. కానీ, డ్రగ్స్ పట్టుబడి 4 నెలలవుతున్నా ఇప్పటివరకు ఎఫ్ఎస్ఎల్ నివేదికలేవీ రాలేదని సీబీఐ చెబుతోంది. మరో పక్క విశాఖ టెర్మినల్‌లో డ్రగ్స్ కంటైనర్‌ని సీబీఐ సీజ్ చేసినప్పటికీ, దానికి సరైన భద్రత కల్పించలేదు. కేవలం భద్రత కల్పించాలని పోర్టు, కస్టమ్స్ అధికారులకు ఓ సూచన చేసి, కస్టమ్స్ తనిఖీల్లో పట్టుబడిన మిగతా కంటైనర్లతో పాటు వేల కోట్లు విలువ చేసే డ్రగ్స్ ఉన్న కంటైనర్‌నీ అక్కడే వదిలేశారు. సీబీఐ తరఫున ఒక్కరిని కూడా కంటైనర్ వద్ద ఉంచలేదు. ఇలా దర్యాప్తును, కంటైనర్‌ని వదిలేయడం వెనుక ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ నేతల అనుయాయులు ఈ డ్రగ్స్ దందాలో ఉన్నందున, తమ కూటమిలో ఉన్న కేంద్ర ప్రభుత్వంలోని కొందరి అండతో దర్యాప్తుని నిలిపేసినట్లు తెలుస్తోంది. ప్రతిపక్షంలో ఉండగా వేల కోట్ల డ్రగ్స్ అంటూ ఊదరగొట్టి వైఎస్సార్‌సీపీ నేతలపై ఆరోపణలు చేసిన కూటమి నేతలు.. ఇప్పుడు వారి ప్రభుత్వంలోనే దర్యాప్తుని తొక్కిపెట్టడం ఈ భారీ రాకెట్‌లో వారి ప్రమేయాన్ని సుస్పష్టం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# కామ్రేడ్స్‌పై కపట ప్రేమ

**కమ్యూనిస్టులను బుజ్జగించేలా చంద్రబాబు వ్యూహం**



- ప్రజాసమస్యలపై ఉద్యమించకుండా కుటిలయత్నం
- ఒక వైపు కమలంతో చెలిమి.. మరో వైపు కామ్రేడ్స్‌తో బంధం
- కమ్యూనిస్టులకు కబురు పంపి మరీ రప్పించుకున్న వైనం

**సాక్షి, అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు తన రాజకీయ అవసరాల కోసం ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకుంటారనే విషయం అందరికీ తెలిసిందే. ఆయా పార్టీలను తన రాజకీయ అవసరాలకు వాడుకోవడంలో ఆయన సిద్ధహస్తుడు అన్న విషయం కూడా జగద్విదితమే. తాజాగా ఆయన ఇప్పుడు 'డియర్ కామ్రేడ్స్' అంటూ కమ్యూనిస్టులతో లోపాయికారీ వ్యవహారాలు నడుపుతుండటం ఆయన నైజాన్ని చెప్పకనే చెబుతోంది. చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత గత నెల 26న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో పాటు ఆ పార్టీ కీలక నేతలు ఎంఏ గఫూర్, సీహెచ్ బాబూరావు, వై.వెంకటేశ్వరరావు ఆయన్ను కలసి అభినందించారు. ఆపై మీడియాతో మాట్లాడుతూ.. సీఎం దృష్టికి ప్రజా సమస్యలు తీసుకెళ్లినట్టు వివరించారు. ఆ తర్వాత గత నెల 31న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర కీలక నేతల బృందం బాబును కలిసి అభినందించి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించినట్టు ప్రకటించారు.

**కలయికలో మర్మం అదేనా?..**

ఉభయ కమ్యూనిస్టు నేతలు పోటీ పడి మరీ సీఎంను కలిసి ప్రజా సమస్యలు వివరించడంలో తప్పులేదని.. అయితే దీని వెనుక పెద్ద మంత్రాంగం నడిచిందని వామపక్ష శ్రేణులే చెబుతున్నాయి. బాబు పథకం ప్రకారమే టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ ద్వారా కమ్యూనిస్టు నేతలను తన వద్దకు పిలిపించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ముందు నుంచి వామపక్షాలకు టచ్‌లో ఉన్న జనార్దన్ వారిని టీడీపీకి అనుకూలంగా మలుచుకునేలా పనిచేశారని కమ్యూనిస్టు శ్రేణులే చెబుతున్నాయి. ఎన్నికల ముందు పాలకపక్షానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు ప్రజాసంఘాలు ఉద్యమించడంతో టీడీపీకి మేలు జరిగేలా జనార్దన్ ప్రయత్నాలు చేసినట్టు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చాక వారిని బాబు వద్దకు తీసుకెళ్లడంలో కూడా జనార్దన్ కీలకంగా వ్యవహరించారన్నారు. ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు ఉద్యమించకుండా ఉండేందుకే ఈ తతంగం నడిచిందని, అందుకే తమ పార్టీ నేతలపై బాబు కపట ప్రేమ కనబరచారని కమ్యూనిస్టు నేతలు చెబుతున్నారు.

**పథకంలో భాగమే లోకేశ్ స్పందన..**

తండ్రికి తగ్గట్టుగానే తనయుడు లోకేశ్ సైతం కామ్రేడ్స్‌పై ఎన్నడూ లేని ప్రేమను ఒలకబోయడం వెనుక చంద్రబాబు పథకం ఉందని చెబుతున్నారు. ఈ నెల 1న శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఆ సందర్భంగా సీపీఎం నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేశారు. దీనిపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా స్పందిస్తూ.. తాము ఎటువంటి నిరసనకు పిలుపు ఇవ్వకపోయినా తమ నేతలను అరెస్ట్ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నారా లోకేశ్ ఎక్స్‌లో స్పందిస్తూ ×మమ్మల్ని మన్నించండి కామ్రేడ్స్× అంటూ పోస్టు చేశారు. కమ్యూనిస్టుల గృహనిర్బంధం నెపాన్ని పోలీసులపై నెట్టేశారు. ఈ వ్యవహారాలన్నీ చూశాక.. పాలకపక్షాన్ని ప్రశ్నించే కమ్యూనిస్టుల్లో మార్పు వచ్చిందా? పథకం ప్రకారం పాలకపక్షమే వారిని ప్రజల్లో పలచన చేస్తోందా? అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# పూర్తిస్థాయి బడ్జెట్‌కు కసరత్తు!

- ఎన్నికల హామీల అమలును తప్పించుకునేందుకు ఇప్పటికే ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- నవంబర్ 30తో ముగియనున్న కాలపరిమితి
- ఆర్థిక సంవత్సరం మరో 4 నెలల్లో ముగియనుండగా పూర్తి స్థాయి బడ్జెట్‌కు నిర్ణయం
- ఈ నెలాఖరులోగా ప్రతిపాదనలు పంపాలంటూ అన్ని శాఖలకు ఆర్థిక శాఖ ఆదేశం
- సెప్టెంబర్ చివర్లో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం

**సాక్షి, అమరావతి:** కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడానికి కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల నేపథ్యంలో వైఎస్ జగన్ ప్రభుత్వం మొదటి నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలు నుంచి తప్పించుకునేందుకు మరో నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ తీసుకు వచ్చింది. దీనిపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ఆర్థిక సంవత్సరం నాలుగు నెలల్లో ముగియనుండగా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు నవంబర్ 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో నవంబర్ 30లోగా బడ్జెట్ ప్రవేశపెట్టడానికి కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సెప్టెంబర్ నెలాఖరులో బడ్జెట్ సమావేశాలు పెట్టి 2024-25వ ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేసేందుకు అన్ని శాఖల అధిపతులతో ఆర్థిక శాఖ ముందస్తు బడ్జెట్ తయారీ సమావేశాలకు శ్రీకారం చుట్టింది. బడ్జెట్ ప్రతిపాదనల్లో పాటించాల్సిన నిబంధనలను తెలియజేయడానికి వివిధ శాఖల అధిపతులు, ఉన్నతాధికారులతో ఈనెల 19 నుంచి 22 వరకు నిర్వహించనున్న సమావేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ విడుదల చేశారు. సచివాలయంలోని రెండో బ్లాక్‌లో ఈ సమావేశాలు జరగనున్నాయి. ప్రతి విభాగం తమ బడ్జెట్ ప్రతిపాదనలను ఈ నెల 28లోగా సచివాలయంలోని ప్రభుత్వ విభాగాలకు పంపాలని ఆయన ఆదేశించారు. వాటిని పరిశీలించిన ఆయా శాఖలు.. తమ బడ్జెట్ ప్రతిపాదనలను ఈనెల 31లోగా ఆర్థిక శాఖకు పంపించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆ తర్వాత బడ్జెట్ ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి.. అన్ని శాఖల ప్రత్యేక, ముఖ్య, కార్యదర్శులు, విభాగాధిపతులతో సెప్టెంబర్ 2న సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖలు పంపిన బడ్జెట్ ప్రతిపాదనలు పరిశీలించి తగిన సూచనలు, మార్పులు చేయనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# 'పొన్నవోలు' భద్రతపై ముగిసిన వాదనలు

- తీర్పు వాయిదా వేసిన జస్టిస్ చక్రవర్తి
- అప్పటివరకు భద్రత కొనసాగింపునకు ఆదేశాలు

**సాక్షి, అమరావతి :** గత ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు వ్యతిరేకంగా కేసులు వాదించానన్న కక్షతో తనకున్న భద్రతను ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని.. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని, తనకున్న భద్రతను కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీ నరసింహ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. అంతకుముందు.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ, సుధాకర్‌రెడ్డికి ఎలాంటి ప్రాణహాని లేదన్నారు. కేసులు వాదించాను కాబట్టి ప్రాణహాని ఉందంటే, ప్రతీరోజూ పీపీ, హోంశాఖ జీపీ కూడా కేసులు వాదిస్తుంటారని, అప్పుడు వారు కూడా ప్రాణహాని ఉందని చెప్పొచ్చునన్నారు. ప్రాణహాని ఉందంటే సరిపోదని, అందుకు తగిన ఆధారాలను చూపాల్సిన బాధ్యత సుధాకర్‌రెడ్డిపై ఉందన్నారు.

**ఎస్ఆర్‌సీలో ఎస్పీ సభ్యుడు కాదు..**

పొన్నవోలు తరఫు సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, పిటిషనర్‌కు ప్రాణహాని లేదంటూ సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్ఆర్‌సీ) నివేదిక ఇచ్చిందని చెబుతున్నారని, ఆ నివేదికను మాత్రం తమకు అందజేయలేదన్నారు. ఎస్ఆర్‌సీ నిర్ణయాన్ని మాత్రమే జిల్లా ఎస్పీ పిటిషనర్‌కు తెలియజేశారని తెలిపారు. వాస్తవానికి.. ఎస్ఆర్‌సీలో జిల్లా ఎస్పీ సభ్యుడు కాదన్నారు. ప్రాణహానిని పరిగణనలోకి తీసుకుని భద్రతను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తీర్పు వెలువరించే వరకు సుధాకర్‌రెడ్డికి ప్రస్తుతం 2+2 భద్రతను కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. అయితే, ఇందుకయ్యే వ్యయాన్ని సుధాకర్‌రెడ్డే భరించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

# భద్రతపై సర్కారు వివక్ష

**ఒక్కొక్కరితో ఒక్కోలా వ్యవహరిస్తోంది**

- 2004 నుంచి 2+2 భద్రత ఉంటే, చెప్పాపెట్టకుండా ఇప్పుడు 1+1కి కుదించారు
- హైకోర్టుకు నివేదించిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి న్యాయవాది
- ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానమివ్వాలని హైకోర్టు ఆదేశం

**సాక్షి, అమరావతి :** రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన తరఫు న్యాయవాది యర్రంరెడ్డి నాగిరెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఒక్కో వ్యక్తిపట్ల ఒక్కో రకంగా ఈ సర్కారు వ్యవహరిస్తోందన్నారు. 2004 నుంచి సుబ్బారెడ్డికి 2+2 భద్రత ఉండగా, ఇప్పుడు ఆ భద్రతను 1+1కు కుదించిందని ఆయన వివరించారు. అయితే, ఇదే కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రస్తుతానికి 2+2 భద్రతను కొనసాగిస్తోందని ఆయన కోర్టుకు వివరించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. ప్రాణహాని లేనందున భద్రతను కుదిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సుబ్బారెడ్డికి తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, భద్రత కుదింపు విషయంలో ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌కు బదులివ్వాలని నాగిరెడ్డిని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటివరకు సుబ్బారెడ్డికి 2+2 భద్రతను కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

**ప్రాణహానిలేదు.. అందుకే కుదించాం..**

ఎలాంటి నోటీసు, సమాచారం ఇవ్వకుండా ఉన్నట్టుండి తనకున్న 2+2 భద్రతను కుదించడాన్ని సవాలుచేస్తూ వైవీ సుబ్బారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం జస్టిస్ చక్రవర్తి విచారణ జరిపారు. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది (జీపీ) కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ, పిటిషనర్‌కు ఎలాంటి ప్రాణహాని లేదన్నారు. ఆ మేర సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్ఆర్‌సీ) నివేదిక ఇచ్చిందన్నారు. ఇంటెలిజెన్స్ అందించిన సమాచారం ఆధారంగానే ఎస్ఆర్‌సీ నివేదికను తయారుచేసిందని.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేశామని తెలిపారు.

**ఎస్ఆర్‌సీ నివేదికను మాకివ్వలేదు..**

ఈ సమయంలో సుబ్బారెడ్డి తరఫు న్యాయవాది నాగిరెడ్డి జోక్యం చేసుకుంటూ, ఎస్ఆర్‌సీ నివేదికను తమకు అందచేయలేదన్నారు. కృష్ణారెడ్డి స్పందిస్తూ, అది అత్యంత రహస్య నివేదిక అని, దానిని బహిర్గతం చేయడం సాధ్యంకాదన్నారు. భద్రతను కుదిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని మాత్రం సుబ్బారెడ్డికి అందచేశామన్నారు. కానీ, ఎలాంటి నిర్ణయాన్ని తమకు అందజేయలేదని నాగిరెడ్డి చెప్పారు. భద్రతను కుదించిన వివరాలను సుబ్బారెడ్డికి అందజేయాలని కృష్ణారెడ్డికి న్యాయమూర్తి స్పష్టంచేశారు. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ.. సుబ్బారెడ్డికి ప్రస్తుతమున్న 2+2 భద్రతను తదుపరి విచారణ వరకు పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

## క్లుప్తంగా...

### అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో ఏపీ విద్యార్థులకు ప్రవేశం కల్పించాలి

**ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్**

**సాక్షి, అమరావతి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లక్షల మంది విద్యార్థులకు దూర విద్య ద్వారా డిగ్రీలు అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ విద్యార్థులకు మాత్రమే ప్రవేశమంటూ నోటిఫికేషన్ విడుదల చేయడం విచారకరమని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఓ ప్రకటనలో పేర్కొంది. వర్సిటీ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని ఖండించింది. ఈ అంశంపై రెండు రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని, ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలు ఈ విద్యా సంవత్సరం నుంచి ఉమ్మడిగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సమస్య పునరావృతం కాకుండా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రాష్ట్రంలో నెలకొల్పేందుకు వీలుగా అమరావతిలో స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేసింది.

### ప్రతి స్త్రీ భద్రత.. మనందరి బాధ్యత

**హోం శాఖ మంత్రి అనిత**

**మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):** ప్రతి స్త్రీ భద్రత మనందరి బాధ్యత అని హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత అన్నారు. వాసవ్య మహిళా మండలి, లేడీస్ సర్కిల్, ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతితో పాటుగా వివిధ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. విజయవాడ బందరురోడ్డులోని డీవీ మానర్ దగ్గర మొదలైన ర్యాలీ టిక్కిల్ రోడ్డు మీదుగా మదర్‌థెరిస్సా జంక్షన్, సిద్ధార్థ జంక్షన్ వరకు జరిగింది. అనంతరం సిద్ధార్థ కళాశాల గ్రౌండ్‌లో జరిగిన సభలో అనిత మాట్లాడుతూ గతంలో పిల్లలను ఆడుకోడానికి, పనుల మీద బయటకు పంపితే కొంచెం ఆలస్యం అయినా ఇంటికి వస్తారని తల్లిదండ్రులు ధైర్యంగా ఉండేవారని, ఇప్పుడు పిల్లలను బయటకు కాదు కాదా ఇంటి ఆవరణలో ఉన్నా ఎవరి మధ్య ఉన్నారా అని తరచూ చూసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయని అన్నారు. గంజాయి విచ్చలవిడిగా లభించడంతో నేరాలు, అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. ఆసుపత్రుల్లో పనిచేస్తున్న మహిళా వైద్యుల కోసం ప్రత్యేకంగా మహిళా వైద్యుల విశ్రాంతి గదిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళల రక్షణకు కూడా చర్యలు తీసుకుంటామని అనిత చెప్పారు.

### సంప్రదాయ వృత్తిదారులకు శిక్షణ

**ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ భాస్కరరావు**

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** కార్పెంటర్స్, పడవల తయారీ దారులు, శిల్పకారులు, కుమ్మరులు, చర్మకారులు, టైలర్లు వంటి పద్దెనిమిది రకాల సంప్రదాయ వృత్తిదారులకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా వృత్తిపరమైన శిక్షణ/నైపుణ్యాలను ఉచితంగా అందిస్తామని యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి కన్వీనర్(ఎస్ఎల్‌బీసీ) సీవీఎస్ భాస్కరరావు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి నేతృత్వంలో మంగళవారం విజయవాడలో పీఎమ్ విశ్వకర్మ స్కీమ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ఒకరికి మాత్రమే ఈ స్కీమ్ వర్తిస్తుందని చెప్పారు. ఈ స్కీమ్‌లో ఐదు నుంచి ఏడు రోజుల వరకు ప్రాథమిక శిక్షణతోపాటు 15 రోజుల ఉన్నత స్థాయి శిక్షణ ఏర్పాటు చేస్తున్నామని భాస్కరరావు తెలిపారు.

# ఆకుపచ్చని విలయం




**అందమైన ఆకులు, ఊదారంగు పువ్వులు.. చూసినకొద్దీ చూడాలనిపిస్తుంది. కానీ ఈ అందం వెనుక మరో కఠోర సత్యం దాగిఉంది. గులాబీ వెనుక ముల్లులాగా.. దీనివెనుక రైతు వెన్నువిరిచే ఆపదుంది. జీవ వైవిధ్యానికి విఘాతం కలిగించే విషాదం ఉంది. రిజర్వాయర్ల నుంచి పంట బోదెల వరకూ ఎక్కడ చూసినా కనిపించే గుర్రపు డెక్క వ్యవసాయ రంగానికి పెను సవాల్‌గా మారింది. శరవేగంగా వ్యాపిస్తూ పంట కాల్వలను మూసేస్తున్న దీన్ని తొలగించలేక అధికారులు, రైతులు తలలు పట్టుకుంటున్నారు.**

– సూరపు అప్పలనాయుడు, సాక్షి సెంట్రల్ డెస్క్

#### అమెజాన్ అడవుల నుంచి..

వాటర్ హైసింత్ (ఇచ్చోర్నియా క్రాసిప్స్) అనే శాస్త్రీయ నామం కలిగిన గుర్రపు డెక్క మూలస్థానం దక్షిణ అమెరికా ఖండంలోని అమెజాన్ ప్రాంతం. అందంగా అలంకరణ మొక్కలా కనిపించే దీన్ని 18వ శతాబ్దం చివర్లో బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ భార్య లేడీ హేస్టింగ్ ఇండియాకు తీసుకువచ్చింది. సహజ శత్రువులు లేకపోవడం, వేగంగా విస్తరించే గుణం వల్ల తక్కువ కాలంలోనే ఇది ఉపఖండం మొత్తం వ్యాపించింది. బంగ్లాదేశ్‌లో ఈమొక్కను 'జర్మన్ కలుపు' అని భారత్‌లో 'టెర్రర్ ఆఫ్ బెంగాల్' అని, శ్రీలంకలో 'జపనీస్ ట్రబుల్' అని పిలుస్తారు. ప్రస్తుతం ఈ కలుపు మొక్క అంటార్కిటికా ఖండంలో తప్ప ప్రపంచంలోని మిగిలిన అన్ని ప్రాంతాలకూ విస్తరించింది.

#### 10 మొక్కల నుంచి 6 లక్షల మొక్కలు!

నీటిపై తేలియాడే గుర్రపు డెక్క మొక్క సాధారణంగా 10 నుంచి 20 సెంటీమీటర్ల ఎత్తువరకూ పెరుగుతుంది. ఎక్కువ కాలం ఒకేచోట స్థిరంగా ఉండే సందర్భాల్లో మీటరు ఎత్తువరకూ పెరుగుతుంది. దీని అడుగుభాగంలో ఉబ్బిన మూత్రాశయంలాంటి గాలిగదుల నిర్మాణం వల్ల ఇది చాలా తేలికగా ఉంటుంది. ఈ మొక్క ఆకులు మందంగా ఉండి ఒక చోట నుంచి మరోచోటికి వెళ్లడానికి తెరచాపలా పనిచేస్తాయి. దీని పుష్పగుచ్ఛానికి 8 నుంచి 10 వరకు ఊదారంగు పూలు ఉంటాయి. ఒక్కో మొక్క నుంచి దాదాపు 200 వరకు విత్తనాలు ఉత్పత్తి అవుతాయి. దీంతోపాటు వేరుభాగం నుంచి పిలకల మాదిరిగా మొక్కల పునరుత్పత్తి జరిగి గాలికి అవి వేరుపడి కొత్త మొక్క ఏర్పడుతుంది. 8 నెలల వ్యవధిలో 10 మొక్కల నుంచి దాదాపు 6 లక్షల మొక్కలు ఉత్పత్తి అవుతాయని పరిశోధకులు చెబుతున్నారు. 28 నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రత, 6.5 నుంచి 8.5 మధ్య నీటి పీహెచ్ విలువ ఉన్నచోట ఈ కలుపు మొక్క శరవేగంగా వ్యాపిస్తుంది.



**స్థానికంగా పేరు:** గుర్రపు డెక్క

**శాస్త్రీయనామం:** వాటర్ హైసింత్ (ఇచ్చోర్నియా క్రాసిప్స్)

**మూలస్థానం:** దక్షిణ అమెరికాలోని అమెజాన్ ప్రాంతం

**భారత్‌కు వచ్చినది:** 18వ శతాబ్దపు చివరిలో బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ భార్య లేడీ హేస్టింగ్స్ ద్వారా

- గుర్రపు డెక్క కారణంగా దేశీయంగా నీటివనరులు వేగంగా తగ్గిపోతున్నాయి.
- ఈ మొక్క నీటిలో ఆక్సిజన్ స్థాయిలను తగ్గించి చేపలకు ఊపిరాడకుండా చేస్తుంది
- ఇది ఒక ఆధిపత్యజాతి మొక్క. దీని చుట్టుపక్కల ఉండే మొక్కలకు తగినంత పోషకాలు అందకుండా చేస్తుంది.
- ఈ మొక్క ఉన్న చెరువులు, సరస్సుల్లో వేసవిలో నీటి బాష్పీభవన రేటు 2.5 రెట్లు పెరుగుతుంది. ఫలితంగా నీటివనరులు త్వరగా ఎండిపోతాయి
- పొడుగ్గా, దట్టంగా ఉండే ఈ మొక్క వేర్లు దోమల లార్వాలు వృద్ధిచెందేందుకు దోహదపడతాయి

#### వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం

భారతదేశ నీటి వనరుల్లో పాతుకుపోయిన వాటర్ హైసింత్ పర్యావరణ, ఆర్థిక వ్యవస్థలపై పెను ప్రభావం చూపిస్తోంది. సాగునీటి కాలువల్లో మ్యాట్ మాదిరి ఏర్పడటంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలిగి శివారుభూములకు నీరు అందని పరిస్థితి ఏర్పడుతోంది. నీటి ప్రవాహాన్ని ఇది బలంగా అడ్డుకుంటుండటంతో భారీ ఎత్తున వర్షాలు కురిసే సందర్భాల్లో కొన్నిచోట్ల కట్టలు తెగి పంటలు కొట్టుకుపోతున్నాయి. ఏటా పంటసాగు ప్రారంభానికి ముందు కాలువల్లో దీన్ని తొలగించాల్సి రావడం రైతులు, అధికారులకు పెద్ద తలనొప్పిగా మారుతోంది. దీనికోసం పెద్దమొత్తంలో ఖర్చుచేయాల్సి వస్తోంది. ఇది సరస్సుల్లో నీటి ఉపరితలంపై వ్యాపించి నీటిలో ఆక్సిజన్‌ను పీల్చేయడం, సూర్యరశ్మి తగలకుండా చేయడంతో నీరు సాధారణంకంటే 2.5 రెట్లు వేగంగా ఆవిరైపోతుంది. దీంతో నీటివనరులు వేగంగా క్షీణించిపోయి వ్యవసాయరంగం ఇబ్బందులపాలవుతోంది. చెరువు మట్టిని పంటపొలాలకు తోలే సందర్భాల్లో సాగు భూముల్లోనూ విస్తరించి రైతుల్ని ఇబ్బంది





#### జలచరాలకు చావుదెబ్బ

పర్యావరణ వ్యవస్థపై ఈ మొక్క గణనీయమైన ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. నీటి ఉపరితలంపైన దట్టంగా అల్లుకుని ఉండటంవల్ల నీటిలో ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోయి చేపలు వంటి జలచరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయి. వీటికి గుడ్లు పెట్టే అవకాశం లేక కొన్ని జాతులు సంఖ్య బాగా తగ్గిపోతోంది. దట్టంగా అల్లుకున్న ఈ మొక్కల్లో దోమలు, నత్తలు వంటివి పెరగటానికి అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఫలితంగా బిల్హర్జియా, మలేరియా వంటి రోగాల వ్యాప్తికి కూడా ఈ మొక్కలు కారణమవుతున్నాయి. వాటర్ హైసింత్ (గుర్రపు డెక్క) మొక్కలు పెద్దపెద్ద సరస్సుల్లో మొత్తం నిండిపోవడంతో రవాణా, పర్యాటక రంగానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మత్స్యకారులకు సరస్సుల్లో చేపలు పట్టుకునే అవకాశం లేకుండాపోతోంది. వాటర్ హైసింత్ వల్ల నీటి నాణ్యత కూడా గణనీయంగా ప్రభావితమవుతుంది.

#### సంక్షోభంలోనూ అవకాశం..

గుర్రపు డెక్క మొక్క వల్ల తీవ్రంగా ప్రభావితమైన దేశాల్లో వియత్నాం ఒకటి. ఈ దేశానికి ఆయువుపట్టు అయిన మెకాంగ్ డెల్టా స్వల్ప కాలంలోనే గుర్రపు డెక్కతో నిండిపోవడంతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. క్రమంగా దీన్ని ఎలా ఉపయోగించుకోవాలా అని ఆలోచించి హస్తకళల్లో ముడి పదార్థంగా వినియోగించడం మొదలు పెట్టారు. దీనితో అనేక వస్తువులు తయారు చేసి చైనా, జపాన్, యూరప్, దక్షిణ కొరియా వంటి దేశాలకు ఎగుమతి చేయడం మొదలుపెట్టారు. దీంతో అనేకమందికి ఉపాధి లభించింది. అంతేకాకుండా గుర్రపుడెక్కను పశువులు, పందులకు మేతగా కూడా వినియోగిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)కి చెందిన పరిశోధకులు వాటర్ హైసింత్‌ను సేంద్రియ ఎరువుగా మార్చే ప్రక్రియను కనుగొన్నారు. పుష్కలమైన లభ్యత, అధిక సెల్యులోజ్, తక్కువ లిగ్నైట్ పరిమాణం కారణంగా భవిష్యత్తులో ఈ మొక్క జీవ ఇంధన అవసరాలు తీర్చే ముడి పదార్థంగా ఉపయోగపడుతుందని పరిశోధకులు చెబుతున్నారు.

#### నియంత్రణ ఎలా?

వాటర్ హైసింత్ ఒకసారి నీటివనరులోకి ప్రవేశించిన తరువాత దాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించడం చాలా కష్టం. చిన్నచిన్న నీటివనరుల్లో ఇది ప్రవేశించిన వెంటనే తీసి బయట పడేయడం ద్వారా చాలావరకూ ఫలితం ఉంటుంది. పెద్దపెద్ద సరస్సులు, రిజర్వాయర్లలో ఇది సాధ్యంకాదు. కొన్ని దేశాలు దీని సహజ శత్రువులైన సూక్ష్మజీవులను ఉపయోగించి నియంత్రిస్తున్నాయి కానీ అన్ని ప్రాంతాల్లో ఇది సమర్థనీయంకాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వాటర్ హైసింత్‌కు అనేక సహజ శత్రువులు ఉన్నప్పటికీ దక్షిణ అమెరికా ఖండంలో నియోచెటీనా ఐచోర్నియా, నియోచెటీనా బ్రూచీ అనే కీటకాలు ఈ కలుపు మొక్కవ్యాప్తిని అడ్డుకుంటున్నాయి. లేక్ చివెరో (జింబాబ్వే), లేక్ విక్టోరియా (కెన్యా), లూసియానా (అమెరికా)తో పాటు మెక్సికో, పపువా న్యూ గినియా, బెనిన్ దేశాల్లో ఈ కీటకాల ద్వారా దీని వ్యాప్తిని అడ్డుకుంటున్నారు.

# షేర్ వల.. పేదలు విలవిల

- షేర్ మార్కెట్ నంబర్ల ఆధారంగా వినూత్న దోపిడీ
- పేదల రక్తాన్ని పిండుతున్న ఏజెంట్లు
- చీరాల నియోజకవర్గవ్యాప్తంగా జోరుగా సాగుతున్న వైనం
- పట్టించుకోని పోలీసులు

**చీరాల:** మోసాలలో షేర్ మార్కెట్ మోసాలు వేరయా అన్న చందంగా తయారైంది. జూదం, క్రికెట్ బెట్టింగ్, మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ తదితర మోసాల గురించి విన్నాం. కానీ నంబర్లతో కొత్త జూదం మీరెప్పుడైనా విన్నారా.. అయితే ఇది చదవండి... షేర్ మార్కెట్ ఆధారంగా నడిచే జూదం మోసగాళ్ల సరికొత్త ఆయుధంగా కనిపిస్తోంది. సెన్సెక్స్‌లో చివరి అంకె, నిఫ్టీలో చివరి అంకెను కలిపి ఒక సంఖ్యగా లెక్కిస్తున్నారు. ఈ రెండు సంఖ్యలు కలిపి లెక్కించగా 90 వస్తే బెట్టింగ్ పెట్టిన వ్యక్తికి 60 రెట్లు అధికంగా డబ్బులు చెల్లిస్తామని ఆశ పెట్టి పేదల రక్తాన్ని జలగల్లా తాగుతున్నారు. షేర్ మార్కెట్ ఆధారంగా నిర్వహించే ఈ జూదాన్ని ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. ఈ ఆట ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో జోరుగా జరుగుతోంది.

#### రోజువారీ కూలీలే టార్గెట్

చీరాల నియోజకవర్గంలో చేనేతలు, పేదలు, వ్యవసాయ, రోజువారీ కూలీలు అధికం. చీరాల మండలంలోని దేవినూతల నుంచి వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి గ్రామం వరకు ఎక్కువ భాగం నివశించేది పేదలే. కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగించే వారే. ఈ గ్రామ పంచాయతీలతో పాటుగా మున్సిపాలిటీలోని వార్డుల్లో షేర్ మార్కెట్ దోపిడీ నడుస్తుంది. బేల్దారీ పనులు చేసుకునే వారు, చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు, కూరగాయలు అమ్ముకునే వారు, ఆటో డ్రైవర్లు, పెయింట్ పనికి వెళ్లే దినసరి కూలీలే టార్గెట్‌గా ఈ దోపిడీ జరుగుతోంది.

#### లక్షలు గడిస్తున్న బుకీలు..

మాయా జూదంతో పేదలు అప్పుల పాలవుతుండగా బుకీలు, ఏజెంట్లు మాత్రం రూ.లక్షలు గడిస్తున్నారు. రూ.100 పెట్టుబడి పెడితే రూ. 5 వేలు వస్తాయనే



ఆశలు కల్పించి పేదలు ఈ ఆటల వైపు మొగ్గు చూపేలా గ్రామాలు, వార్డుల్లో ఏజెంట్ల ద్వారా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం ఏజెంట్ల ద్వారా ఈ జూదంలో పెట్టుబడి పెట్టించి సాయంత్రానికి సెన్సెక్స్‌లో వచ్చే షేర్ మార్కెట్ ఫలితాల ప్రకటన అనంతరం ఆఖరి నంబర్లు ఆధారంగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. షేర్ మార్కెట్ జరిగే ప్రతి రోజూ ఈ జూదం జోరుగా జరుతుంది. సెలవు రోజుల్లో మాత్రం జూదగాళ్లు బొసీ అనే ఆటలు ఆడుతున్నారు. ఈ షేర్ మార్కెట్ జూదంలో పెట్టుబడి పెట్టే వారికి అసలు ఈ జూదంలో విజేతగా ఎలా నిర్ణయిస్తారో కనీసం అవగాహన లేకపోవడంతో ఏజెంట్ల మాయ మాటలతో ఆర్థికంగా చితికిపోతున్నారు.

#### సూత్రధారులెవరు ?

ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ పెద్ద మొత్తంలో షేర్ జూదం జరుగుతున్నా పోలీసులు కనిపెట్టలేకపోతున్నారంటే ఏవో కారణాలు ఉండవచ్చనే అనుమానాలు కలుగుతున్నాయి. నెలకు రూ.5 కోట్లకు పైగానే జూదం జరుగుతున్నప్పటికీ సూత్రధారులను గుర్తించలేకపోతున్నారంటే ఆ రహస్యం తేల్చాల్సి ఉంది. విస్తతంగా ఏజెంట్లు, రోజూ నగదు మార్పిడి, పేదల నుంచి డబ్బుల వసూళ్లు చేస్తుంది ఎవరు ? ఎవరికి చెల్లిస్తున్నారు ? ఎంత కమీషన్లు వసూళ్లు చేస్తున్నారు? ఎవరెవరికి ఇస్తున్నారో? పోలీసులు విచారణ చేస్తేనే బహిరంగం అవుతాయి.

#### నెలకు రూ.5 కోట్లకు పైనే దోపిడీ..

ఈ జూదంలో డబ్బులు కట్టే వ్యక్తి సాయంత్రం షేర్ మార్కెట్‌లో ఆఖరున ఫలానా నంబర్ వస్తుందని బెట్టింగ్ కడుతాడు. ఇందుకు ముందుగానే ఏజెంట్‌కు డబ్బులు చెల్లించి ఒక పేపర్ తీసుకుంటాడు. ఒకవేళ తాను కట్టిన నెంబర్ (అరుదుగా వస్తుంది) షేర్ మార్కెట్ ఆఖరున వస్తే డబ్బులు చెల్లిస్తారు ఏజెంట్లు. లేకపోతే కట్టిన డబ్బులు హుష్. చీరాల నియోజకవర్గంలో షేర్ దోపిడీ ఎక్కువగా జరుగుతున్నా పోలీసులు కట్టడి చేయలేకపోతున్నారే విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలో నెలకు రూ.5 కోట్లకు పైనే దోపిడీ జరుగుతుందని సమాచారం. పెద్ద ఎత్తున ఏజెంట్లు పేదల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు.

### శ్రీసిటీలో 'స్కోర్' పోర్టల్ ప్రారంభం

**శ్రీసిటీ (వరదయ్యపాళెం):** సుస్థిరాభివృద్ధి చర్యల్లో భాగంగా తిరుపతి జిల్లాలోని శ్రీసిటీ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'స్కోర్' (శ్రీసిటీ ఆన్‌లైన్ రిసోర్స్ ఎక్స్ఛేంజ్) వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించింది. దీనిద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలో పరస్పర సహకార ఆర్థిక విధానాలను ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ పరిశ్రమల పర్యావరణ నిర్వాహకులు, సీనియర్ సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్‌ల సమక్షంలో మంగళవారం వర్చువల్ లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. అమెరికాలోని మిచిగాన్ యూనివర్సిటీకి చెందిన సస్టైనబులిటీ నిపుణులు డాక్టర్ సుధాకర్ జి.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా.. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ జనరల్ మేనేజర్ (పర్యావరణం) డాక్టర్ పి. వెంకటేశ్వరన్ మాట్లాడుతూ.. స్కోర్ అనేది వనరుల భాగస్వామ్యం కోసం ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేస్తుందని.. సమాచార మార్పిడికి, పర్యావరణ ఆర్థిక ప్రభావిత విషయ విశ్లేషణకు సహకారం అందిస్తుందని వివరించారు. అత్యంత ఉపయోగకరమైన పోర్టల్‌ను ప్రారంభించడంలో శ్రీసిటీ చొరవను ఆయన అభినందించారు.

## ఆధ్యాత్మిక సమాచారం

### శ్రీవారి దర్శనానికి 18 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 71,595 మంది స్వామివారిని దర్శించుకోగా 28,981 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### 27న గోకులాష్టమి ఆస్థానం, 28న ఉట్లోత్సవం

**తిరుమల:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సాక్షాత్తు ద్వాపరయుగపురుషుడైన శ్రీకృష్ణునిగా స్మరించుకుని ఆగస్టు 27వ తేదీన శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖ మండపంలో రాత్రి 8 నుండి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. ఆగస్టు 28న తిరుమలలో ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 28న శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిసేవలైన ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

### ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

**చాగల్లు:** తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణగూడెంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద నిర్మించే అభయాంజనేయ స్వామి వారి విగ్రహానికి భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన విగ్రహ దాత దాసర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో 18 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

### వైభవంగా పోలమాంబ వార్షికోత్సవం

**రాయవరం:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా రాయవరంలో కొలువైన పోలమాంబ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఏటా శ్రావణ మాసంలో వచ్చే మూడో మంగళవారం నిర్వహించడం ఆనవాయితీ.

### నేడు పరదేశమ్మ తల్లి జాతర

**తుని రూరల్:** కాకినాడ జిల్లా ఎస్.అన్నవరం శివారు కొత్త సూరవరంలో ఉన్న పరదేశమ్మ అమ్మవారి 39వ జాతర మహోత్సవాలు బుధ, గురువారాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. బుధవారం రాత్రి జాతర, గురువారం తీర్థం, అమ్మవారి దర్శనాలు ఏర్పాటు చేశారు.

### రత్నగిరిపై జోరుగా వివాహాలు

**అన్నవరం:** కాకినాడ జిల్లా అన్నవరంలోని వీర వెంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానంలో వివాహాల సందడి మొదలైంది. నూతన దంపతులతో సత్యదేవుని ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతోంది. రత్నగిరిపై బుధవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకూ భారీ సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఈ మూడు రోజులూ రత్నగిరిపై సత్రం గదులలో దాదాపు 70 శాతం, అన్ని వివాహ మండపాలను పెళ్లి బృందాలు రిజర్వ్ చేసుకున్నాయి. ఇదే ముహూర్తానికి పెళ్లిళ్లు పెట్టుకున్న మిగిలిన వారందరూ మంటపాలు లభ్యం కాక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

### ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

### సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేషంగా అభిషేకాలు

**సింహాచలం:** అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

## విద్యా సమాచారం

### నేటి నుంచి పీజీ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

**తిరుపతి సిటీ:** వర్సిటీలలో పీజీ కోర్సులలో ప్రవేశం కొరకు నిర్వహించిన ఏపీ పీజీ సెట్–2024 కౌన్సిలింగ్ ప్రక్రియకు సోమవారంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగిసింది. మొదటి విడత సీట్ల కేటాయింపులో భాగంగా బుధవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియకు ఉన్నత విద్యామండలి అవకాశం ఇచ్చింది.

### ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపేయాలి

**తిరుపతి ఎడ్యుకేషన్:** అసంబద్ధ జీఓలతో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సర్దుబాటును తక్షణమే ప్రభుత్వం నిలిపివేయాలని, లేని పక్షంలో బహిష్కరణకు పిలుపునివ్వాల్సి ఉంటుందని ఆపస్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు ఓ సంయుక్త ప్రభుత్వంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### నేటి నుంచి ఐసెట్-2024 అడ్మిషన్లు

**తిరుపతి సిటీ:** ఎంబీఏ, ఎంసీఏ కోర్సులల్లో అడ్మిషన్ల కొరకు నిర్వహించిన ఐసెట్–2024 ద్వారా ఎస్వీయూలో సీట్లు పొందిన విద్యార్థులకు బుధవారం నుంచి సర్టిఫికేట్ల పరిశీలనతో పాటు అడ్మిషన్లు కల్పించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశం పొందే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో బుధవారం నుంచి ఈనెల 24వతేదీలోపు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

### 30న పారామెడికల్ అడ్మిషన్లు

**తిరుపతి తుడా:** పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 30వ తేదీన ఎస్వీ వైద్య కళాశాల సమావేశ మందిరంలో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ ఒక ప్రకటనలో తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అర్హతగత అభ్యర్థులకు సీటు కేటాయిస్తామని, ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను తీసుకురావాలని తెలియజేశారు. కళాశాలలో మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ) కోర్సులో 30సీట్లు, డిప్లొమో ఇన్ అనస్తీషియా(డీఏఎన్ఎస్) కోర్సులో 30సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### 29న సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

**తిరుపతి (అలిపిరి):** టీటీడీ ఆసుపత్రులు, డిస్పెన్సరీలలో ఒక ఏడాది కాంట్రాక్టు ప్రాతిపదికన 5 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ఈనెల 29న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బీసీ–బీ ఉమెన్, బీసీడీ ఉమెన్, ఎస్టీ ఉమెన్, బీసీ బీ, ఎస్సీలో ఒక్కొక్క పోస్టు చొప్పున భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

# పడకేసిన పల్లె పాలన

తొమ్మిది నెలలుగా నిధులివ్వని రాష్ట్ర ప్రభుత్వం ● గ్రామ పంచాయతీలకు సరిపోని కేంద్ర నిధులు

సొంత డబ్బులు ఖర్చు పెడుతున్న కార్యదర్శులు ● అప్పుల భారం మోయలేక సామూహిక సెలవులు!




చక్కని రంగులతో చిన్న గీతలు కూడా లేకుండా చూడముచ్చటగా ఉన్న ఈ భవనం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం ఒడ్డుగూడేనికి చెందినది. పైకి భవనం ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ ఇదంతా మేడిపండు చందమే. ఇప్పుడక్కడ పల్లెపాలన పడకేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ దాదాపు ఇదే తరహా పరిస్థితి నెలకొంది.

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** నిధుల కొరతతో పల్లెల్లో పాలన పడకేస్తోంది. పచ్చదనం-స్వచ్ఛదనం అనేవి మాటలకే పరిమితమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలున్నాయి. 500 జనాభా ఉన్న గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటే పంచాయతీల నిర్వహణకు సగటున ప్రతీ నెల రూ.70 వేలు రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్‌గా అందుతాయి. వివిధ సబ్‌ప్లాన్‌ల కింద 15వ ఆర్థిక సంఘం పేరుతో కేంద్రం నుంచి సగటున రూ.50 వేల వరకు నిధులు విడుదలవుతాయి. గ్రామాల్లో ఆస్తి పన్ను అనేది నామ్‌కే వాస్తేగా ఉంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులతోనే పారిశుధ్యం, వీధిలైట్లు మొదలు.. తాగునీటి సరఫరా వంటివి నిర్వహించాలి. దీని కోసం ప్రతీ గ్రామంలో కనీసం ఇద్దరు మల్టీపర్పస్ వర్కర్లు అవసరం. వారికి వేతనాలతో పాటు ట్రాక్టర్ల నిర్వహణ తదితర కనీస అవసరాలకే సగటున రూ.70 వేలు వరకు ఖర్చవుతోంది. ఇది కాకుండా పచ్చదనం-స్వచ్ఛదనం, ఎమ్మెల్యేల పర్యటనలు, గ్రామసభల వంటి ఖర్చులను సైతం పంచాయతీలే భరించాలి.

## నిధుల్లేక నీరసం..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత అనేక కొత్త పంచాయతీలు ఏర్పాటయ్యాయి. అన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు, క్రీడా ప్రాంగణాలు వెలిశాయి. మిషన్ భగీరథ తదితర పథకాలు అమల్లోకి వచ్చి గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సకాలంలో నిధులు అందినంత కాలం ఎక్కడా ఇబ్బందులు రాలేదు. కరోనా సంక్షోభం తర్వాత పంచాయతీలకు నిధులు అందడంలో ఆలస్యం కావడం ప్రారంభమైంది. ఇక 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక పల్లెల ఆర్థిక పరిస్థితి 'పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్ట'యింది. ఈ ఆగస్టుతో కలిపి వరుసగా తొమ్మిది నెలలు పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్‌లు రాలేదు. కేంద్ర నిధులు వచ్చినా సిబ్బంది జీతభత్యాలు, అత్యవసర పనులకే సరిపోతున్నాయి.

## పల్లెల్లో తప్పని తిప్పలు

నిధుల కొరత ఉన్నా.. ఆయా పంచాయతీల సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులతో పాటు ఆర్థిక స్తోమతను బట్టి వార్డు సభ్యులూ పల్లెపాలనకు అవసరమైన డబ్బును సొంతంగా భరించి, ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన తర్వాత తీసుకునేవారు. అయితే గత ఫిబ్రవరి 1తో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. పేరుకు ప్రత్యేకాధికారులను నియమించినా పల్లెపాలనలో పంచాయతీ కార్యదర్శులే కీలకంగా మారారు. గత ఏడు నెలలుగా ట్రాక్టర్లకు ఇంధనం నుంచి చిన్నచితకా మరమ్మతులకు కార్యదర్శులే సొంత డబ్బులు పెడుతూ వచ్చారు. అయితే ఆరు నెలలు దాటినా నిధులు రాకపోవడంతో వారికి కూడా చేయాడని పరిస్థితి నెలకొంది.

### నిధులు మంజూరు చేయాలి



గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సొంతంగా ఖర్చులు పెట్టుకుని ఆర్థిక భారం మోస్తున్నారు. చాలీ చాలని జీతంతో ఉండే మాకు ఇది అదనపు భారమైంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు విడుదల చేయాలి.

– ఈ. వంశీకృష్ణ, భద్రాద్రి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు

## కార్యదర్శుల్లో కలవరం..

ప్రస్తుతం నిధుల కొరతతో పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. ప్రతీరోజూ పారిశుధ్య పనులు చేయాల్సి ఉండగా.. నాలుగైదు రోజులకు ఒకసారి ట్రాక్టర్ వీధుల్లోకి వెళ్తోంది. వీధిలైట్లు వెలగకపోతే రోజుల తరబడి మరమ్మతు చేసే పరిస్థితి లేదు. ప్రకృతివనాలు బోసిపోతున్నాయి. మిషన్ భగీరథ పైపులైన్లలో ఇబ్బంది వచ్చిందనే వార్త వింటే పంచాయతీ గుండె ఝల్లుమంటోంది. రిపేర్లు చేయించేందుకు అప్పు పుట్టని పరిస్థితి నెలకొనడమే అందుకు కారణం. ఆఖరికి స్వాతంత్ర దినోత్సవం వంటి వేడుకలకు ఫ్లెక్సీలు ప్రింట్ చేయించడం కూడా కొన్నిచోట్ల కష్టంగా మారింది. మరోవైపు వీఐపీలు వచ్చేప్పుడు ఏర్పాటుచేసే కార్యక్రమాలు, ఫ్లెక్సీల ఖర్చు కార్యదర్శులను కలవరపరుస్తోంది. పరిస్థితి చేయిదాటి పోతుండటంతో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రారంభంలోనే తమ నిరసనను వ్యక్తం చేసినా ఎలాంటి మార్పు రాలేదు. దీంతో కొందరు కార్యదర్శులు సామూహిక సెలవుల్లో వెళ్తున్నారు. పరిస్థితిలో మార్పు రాకుంటే తాము కూడా మండల కేంద్రాలకే పరిమితమవ్వాలనే దిశగా పంచాయతీ కార్యదర్శులు ఆలోచన చేస్తున్నారు.

---

# సొంత ఆలోచనలకు సెల్'వు

జెన్-జీపై సోషల్ మీడియా స్వారీ



- 78 శాతం యువత నిర్ణయాధికారంపై పెత్తనం
- ఐక్యూ క్వెస్ట్ నివేదికలో వెల్లడి..
- 6700 మంది యువతపై అధ్యయనం

**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుత సాంకేతిక యుగంలో మొబైల్ ఫోన్ వాడకం తీవ్రంగా పెరిగిపోయింది. రోజురోజుకూ సామాజిక మాధ్యమాల్లో గడిపే సమయం విరివిగా పెరిగిపోతోంది. యువత ఒకరకంగా సోషల్ మీడియాకు బానిసగా మారిందనడంలో అతిశయోక్తి లేదని చెప్పొచ్చు. జెన్-జీ (1997-2012 మధ్య జన్మించిన వారు) యువత సొంత నిర్ణయాలు తీసుకోవడంలో కూడా సోషల్ మీడియాపై ఆధారపడుతున్నట్టు తాజా అధ్యయనంలో తేలింది. ఐక్యూ.. సైబర్ మీడియా రీసెర్చ్ సంయుక్తంగా క్వెస్ట్-2024 పేరిట నివేదిక విడుదల చేసింది. ఈ నివేదికలో యువత అభిరుచులు, వారి ఆశయాలు, వారు తీసుకునే నిర్ణయాల గురించి దాదాపు 6,700 మంది అభిప్రాయాలను సేకరించింది. భారత్‌తో పాటు అమెరికా, యూకే, బ్రెజిల్, మలేసియా, థాయ్‌లాండ్, ఇండోనేసియా దేశాల్లోని యువత మనోగతాన్ని ఈ నివేదికలో ఆవిష్కరించింది.

**రాష్ట్ర యువత ఇలా..**

రాష్ట్రంలోని 78 శాతం యువత తీసుకునే నిర్ణయాలపై సోషల్ మీడియా ప్రభావం పడుతోందని పేర్కొంది. కాకపోతే 96 శాతం మంది యువత తమ కలలను సాకారం చేసుకునేందుకు తీవ్రంగా కష్టపడుతున్నారని, ఇందుకు తమ అభిరుచులు, ఆసక్తులను పక్కన పెట్టేందుకు కూడా వెనుకాడటం లేదని నివేదిక స్పష్టం చేసింది. తాజా పరిణామాలపై అప్‌డేటెడ్‌గా ఉండేందుకు సాంకేతికత ఎంతో ఉపయోగపడుతోందని 58 శాతం మంది నమ్ముతున్నారు. 98 శాతం మంది తమ జీవిత ఆశయాల గురించి స్పష్టత కలిగి ఉన్నారు. శత శాతం జెన్‌జీ యువత ఆశయ సాధనకు తల్లిదండ్రులు కూడా మద్దతివ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ప్రస్తుత తరంలో కృత్రిమ మేధ, సైబర్‌సెక్యూరిటీ, కంటెంట్ క్రియేషన్ వంటి రంగాల్లో స్థిరపడాలని ఆకాంక్షిస్తోంది.

---

# విద్యుత్ సంస్థలను కాపాడుకోవాలి

ఎన్పీడీసీఎల్ ఉద్యోగులతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**సాక్షి, హైదరాబాద్:** నష్టాల్లో ఉన్న విద్యుత్ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత, భవిష్యత్తు తరాలకు వాటిని అందించాల్సిన కర్తవ్యం మనందరిపైనా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేనప్పటికీ విద్యుత్ ఉద్యోగుల ప్రయోజనం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆకాంక్షల మేరకు పదోన్నతులు కల్పించామని తెలిపారు. పదోన్నతులు పొందిన టీజీఎన్పీడీసీఎల్ ఉద్యోగులు మంగళవారం ప్రజాభవన్‌లో ఆయనను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ...గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో విద్యుత్ సంస్థల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మళ్లీ వాటిని లాభాలబాట పట్టించడానికి సమష్టిగా కష్టపడాల్సిన అవసరముందని చెప్పారు. ప్రభుత్వ ప్రణాళికలు క్షేత్రస్థాయిలో అమలైతేనే తెలంగాణ ఏర్పాటుకు సార్థకత ఉంటుందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో విద్యుత్ పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉద్యోగుల కష్టసుఖాల్లో ప్రభుత్వం అండగా ఉంటుంది, ఉద్యోగులు ప్రజల కష్టసుఖాల్లో భాగం కావాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి మంత్రి మండలి కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఉద్యోగుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

# ఆరేళ్లలో అమర్‌రాజా ప్లాంట్

మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



**సాక్షి, హైదరాబాద్:** మహబూబ్‌నగర్ జిల్లాలో దివిటిపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న అమర్‌రాజా లిథియం అయాన్ బ్యాటరీ ప్లాంట్ పురోగతిపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, అమర్ రాజా చైర్మన్ జయదేవ్‌గల్లాతో పాటు సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. మొత్తం మూడు దశల్లో 16 గిగావాట్ల సామర్థ్యంతో లిథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తి జరుగుతుందని మంత్రి వెల్లడించారు. రూ.9,500 కోట్ల పెట్టుబడితో మొదలైన ఈ కర్మాగారం మొదటి దశ ఇప్పటికే పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించిందని, ప్రస్తుతం 350 మంది పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం కేటాయించిన 262 ఎకరాల భూమిలో ప్లాంటు రెండో, మూడో దశ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. మరో ఆరేళ్లలో 2030 నాటికి కర్మాగారం పూర్తి స్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తే మరో 3,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. అప్రోచ్ రోడ్డు, 220 కిలోవాట్ల విద్యుత్తు లైన్ నిర్మాణం, నీటి సరఫరాకు సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ స్టోరేజ్ డైరెక్టర్ వింగ్ కమాండర్ డా.సూర్యకాంత్ శర్మ, అమర్ రాజా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమాదిత్య పాల్గొన్నారు.

---

# పుష్కర కాలమైనా ప్రమోషన్ ఏది?

పాత వరంగల్ జోన్‌లోని 101 మంది ఎస్సైల మనోవేదన

- జీవో 317తో తమకు అన్యాయం జరిగిందని వెల్లడి
- ఇన్‌స్పెక్టర్ పదోన్నతుల కోసం 2012 బ్యాచ్ ఎస్సైల ఎదురుచూపు



**సాక్షి, హైదరాబాద్ :** సర్వీస్‌లో చేరి 12 ఏళ్లు అవుతున్నా ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ దక్కలేదంటూ మల్టీజోన్-1(పాతవరంగల్ జోన్)లోని 2012 బ్యాచ్‌కు చెందిన ఎస్సైలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్‌తో పాటు తమకు పదోన్నతులు దక్కేలా చర్యలు తీసుకోవాలంటూ 101 మంది ఎస్సైలు మంత్రులు, పోలీస్ ఉన్నతాధికారులను కోరుతున్నారు. 2012లో తమతోపాటు వరంగల్ జోన్ ఎస్సైలుగా నియమితులైన మొత్తం 146 మందిలో 45 మందికి 2021లోనే ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు దక్కినట్టు వారు పేర్కొంటున్నారు. ఒకే జోన్ పరిధిలో పనిచేసే ఒకే బ్యాచ్‌కు చెందిన వారిలో కొందరికి సీఐలుగా ప్రమోషన్లు దక్కి మూడున్నరేళ్లు అవుతున్నా...తాము ఇంకా ఎస్సైలుగానే కొనసాగుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వం తెచ్చిన జీవో 317 కారణంగానే ఈ సమస్య తలెత్తిందని చెబుతున్నారు. ఈ జీవోతో ఆరోజోన్‌లోని కొన్ని జిల్లాలు మల్టీజోన్-1లో కలవడంతో ఆయా జిల్లాలకు చెందిన 66 మంది ఎస్సైలు సీనియారిటీ జాబితాలో తమకంటే (పాత వరంగల్ జోన్‌లోని వారికంటే)ముందుకొచ్చారని, దీంతో ప్రమోషన్లకు అడ్డుకట్టపడిందని వాపోతున్నారు. ఎస్సైగా ఆరేళ్ల సర్వీస్ పూర్తయితే ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతికి అర్హత వస్తుంది. కానీ, 12 ఏళ్లుగా ఒకే పోస్టులో కొనసాగుతున్నామని వారు చెప్పారు.

## స్టేషన్ల అప్‌గ్రేడేషన్‌తో పదోన్నతుల చిక్కులు పోతాయి

మల్టీజోన్‌లో పదోన్నతుల సమస్య పరిష్కారం కావాలంటే అది పోలీస్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్‌తోనే సాధ్యమని తెలుస్తోంది. ఇటీవల హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో కొత్త పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. అయితే జిల్లాల పరిధిలో అది జరగలేదు. ఏడాదికి 200కిపైగా కేసులు నమోదయ్యే పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఉండాలి. ఇలా పాత పోలీస్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్, కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుతో ఇన్‌స్పెక్టర్ పోస్టులు పెరుగుతాయి. దీంతో పదోన్నతులకు మార్గం సుగమం అవుతుంది. ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని ఆయా శాఖల మంత్రులకు వరుసగా వినతిపత్రాలు ఇచ్చినట్టు పదోన్నతి కోసం ఎదురుచూస్తున్న ఓ ఎస్సై 'సాక్షి'కి చెప్పారు.

---

# కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రత పెంపు

- కోల్‌కతా ఘటన నేపథ్యంలో నిర్ణయం
- ఎయిమ్స్, ఈఎస్ఐ సహా పలు ఆస్పత్రుల్లో రక్షణ చర్యలు



**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎయిమ్స్, ఈఎస్ఐ వంటి ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల్లో భద్రతను పెంచాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం మార్గదర్శకాలు జారీచేసింది. ప్రైవేట్ ఆసుపత్రులతో పోలిస్తే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎవరైనా సులువుగా రాకపోకలు సాగించడానికి అనువుగా ఉంటాయి. దీనివల్ల కొన్నిసార్లు వైద్య సిబ్బందిపై దాడుల వంటి ఘటనలు జరుగుతున్నాయని కేంద్రం పేర్కొంది. ఆసుపత్రి ప్రాంగణంలో వైద్య సిబ్బందిపై దాడులను నిరోధించడానికి రాష్ట్ర చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రుల ప్రవేశాలు, నిష్క్రమణలు, కారిడార్లు సహా అన్ని ప్రాంతాల్లో తగిన సంఖ్యలో హై-రిజల్యూషన్ సీసీటీవీ కెమెరాలు అమర్చాలి. అత్యవసర పరిస్థితికి తగినట్లుగా స్పందించేందుకు కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేయాలి. కంట్రోల్ రూమ్‌లో భద్రతా సిబ్బందితోపాటు ఒక అడ్మిన్, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. ప్రాంగణంలో సరైన పర్యవేక్షణ కోసం తగిన సంఖ్యలో సుశిక్షితులైన సెక్యూరిటీ గార్డులను నియమించాలి. సిబ్బంది, రోగులు, సందర్శకుల కోసం గుర్తింపు కార్డులు ఇవ్వాలి. విధుల్లో ఉన్నప్పుడు ఆసుపత్రి సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డును ప్రదర్శించాలి. రోగితో ఒకరు లేదా ఇద్దరు సహాయకులను మాత్రమే అనుమతించాలి. అత్యవసర సమయాల్లో సమాచారాన్ని త్వరగా వ్యాప్తి చేయడానికి పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లను రూపొందించాలి. ఆసుపత్రుల క్యాంపస్‌లోని డార్క్ స్పాట్‌లను మ్యాప్ చేయాలి. మహిళా వైద్య సిబ్బంది విధులు నిర్వహించే ప్రదేశాలు, పార్కింగ్ స్థలాలు, ప్రవేశ మార్గాల్లో తగినంత వెలుతురు ఉండేలా చూడాలి. మహిళా వైద్య సిబ్బంది కోసం సురక్షితమైన డ్యూటీ రూమ్‌లను తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలి. రాత్రిపూట మహిళా ఆరోగ్య వైద్య సిబ్బందిని ఒకరి కంటే ఎక్కువ సంఖ్యలో నియమించాలి.

# రాజకీయంగా అవకాశమివ్వండి

కాంగ్రెస్ పార్టీలోని గొల్ల కురుమ నేతల డిమాండ్

**సాక్షి, హైదరాబాద్:** టీపీసీసీ అధ్యక్షుడిగా, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, ఇంకా రాజకీయంగా తమ సామాజిక వర్గానికి అవకాశమివ్వాలని గొల్ల కురుమ నేతలు డిమాండ్ చేశారు. అదే విధంగా రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించడంతోపాటు జెడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్‌ల ఎంపికలో కూడా ప్రాధాన్యమివ్వాలని కోరారు. వెనుకబడిన వర్గాల్లో పెద్ద సామాజికవర్గంగా గుర్తింపు పొందిన తమకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని కోరేందుకు మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమైన కాంగ్రెస్ యాదవ నేతలు ఈ మేరకు డిమాండ్ చేశారు. ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్లలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీలోని యాదవ సామాజికవర్గం నేతలు తోటకూర జంగయ్య యాదవ్, చరణ్‌కౌశిక్ యాదవ్, గౌరి సతీశ్, లోకేశ్ యాదవ్, రాజేశ్, గడ్డం శేఖర్, శ్రీనివాస్ యాదవ్, సొదని భూమన్న యాదవ్, కల్పన, మధుకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

---

# వైద్య విధాన పరిషత్తులో బదిలీలు



**సాక్షి, హైదరాబాద్:** కొత్త వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్య విధాన పరిషత్ వైద్యులను, ఆయా ఆసుపత్రులకు బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చాలా జిల్లాల్లో వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న జిల్లా ఆసుపత్రులనే వైద్య కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. వెంటనే వైద్యులను నియమించే అవకాశం లేకపోవడంతో, అందులో పనిచేస్తున్న వీవీపీ వైద్యులను అక్కడే కొనసాగించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కొత్త వైద్య కళాశాలలన్నింటికీ టీచింగ్ వైద్యులను బదిలీ చేశారు. దీంతో ఆయా ఆసుపత్రుల్లో ప్రస్తుతం పనిచేస్తున్న వీవీపీ వైద్యులను అక్కడి నుంచి, వీవీపీ పరిధిలోని ఇతర ఆసుపత్రులకు పంపించాలని నిర్ణయించారు. ఏ జిల్లాలోని వైద్యులను, అదే జిల్లాలోని ఆసుపత్రుల్లో సర్దుబాటు చేయనున్నారు. ఈ బాధ్యతను ఆయా జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షునిగా యడవల్లి బాధ్యతల స్వీకరణ

**సాక్షి, హైదరాబాద్:** భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షునిగా యడవల్లి వెంకటస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే నియమితులైన వెంకటస్వామి మంగళవారం గాంధీభవన్‌కు ర్యాలీగా తరలివచ్చి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వెంకటస్వామి మాట్లాడుతూ సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన తాను.. రాహుల్‌గాంధీ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఇన్‌చార్జి ప్రహ్లాద్‌తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీటిపారుదల శాఖ అప్రమత్తంగా ఉండాలి: ఉత్తమ్

**సాక్షి, హైదరాబాద్:** భారీ వర్షాల నేపథ్యంలో నీటి పారుదలశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. రిజర్వాయర్లు, మైనర్ ఇరిగేషన్ చెరువుల వద్ద ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ భద్రతాచర్యలు చేపట్టాలన్నారు. ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఇంజనీర్ల బృందం సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే తక్షణమే ఈఎన్‌సీలను అప్రమత్తం చేయాలని కోరారు.

# గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని గురుకుల ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక, అర్థికేతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని పీఆర్టీటీఏ, పీఆర్‌టీయూటీఎస్ నేతలు కోరారు. సీఎస్‌ను కలిసిన వారిలో పీఆర్‌జీటీఏ అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి ఉన్నారు. నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



సీఎస్‌ను కలిసిన సంఘం నేతలు

---

# ముందుగా పంచాయతీ ఎన్నికలు!

ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు షురూ

కులగణన, బీసీ రిజర్వేషన్లపై ఇంకా సర్కార్ నుంచి కచ్చితమైన సంకేతాలు లేకపోయినా తనవంతుగా సిద్ధమవుతోన్న ఎస్ఈసీ

నేడు వివిధ స్థాయి అధికారులతో ఎస్ఈసీ సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ముందస్తు కసరత్తుకు రాష్ట్ర ఎన్నికలసంఘం (ఎస్ఈసీ) సిద్ధమైంది. ప్రభుత్వపరంగా గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుపుతుందనే దానిపై ఇంకా స్పష్టత లేకపోయినా, ఎస్ఈసీగా చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టింది. ఈ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు కులగణన లేదా తాజా ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుంటారా అనేదానిపై ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. అయినా బుధవారం ఎస్ఈసీ కార్యాలయంలో వివిధ స్థాయిల అధికారులతో ఎన్నికలకు సంబంధించి ఓ సమావేశం నిర్వహిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి లోక్‌సభ ఎన్నికలకు అనుసరించిన ఓటర్ల జాబితా అధికారికంగా ఎస్ఈసీకి చేరినట్టు సమాచారం. దీంతో ఈ జాబితా ఆధారంగా గ్రామస్థాయిల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాపై స్పష్టత సాధించి, వాటి ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో తొలుత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ సన్నద్ధమవుతున్నట్టుగా అధికారవర్గాల సమాచారం. జీపీల పదవీకాలం ముగిసి ఆరున్నర నెలలు పూర్తవడం, మళ్లీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి జీపీలకు నేరుగా అందాల్సిన నిధులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. దీంతో ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్టు సమాచారం. మండల, జిల్లా పరిషత్‌లకు కూడా త్వరలోనే కేంద్ర నిధులు నిలిపివేసే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు.



## ఇదీ ఎస్ఈసీ కసరత్తు...

ఎన్నికల నిర్వహణకు దాదాపు నెలరోజులకు ముందుగానే ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లను ఫైనలైజ్ చేసేందుకు ఎస్ఈసీ నోటిఫికేషన్లు విడుదల చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా మొదట ఎలక్టోరల్ నోటిఫికేషన్ జారీచేసి.. డ్రాఫ్ట్ అభ్యంతరాలు ఫైనలైజ్ చేసేందుకు షెడ్యూల్ జారీ చేస్తారు. ఇది పూర్తయ్యాక పోలింగ్ స్టేషన్ల ఖరారుకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేస్తారు. ఈ ప్రక్రియ అంతా ముగిసేందుకు ఎస్ఈసీకి దాదాపు నెలరోజుల సమయం పడుతుంది. ఇంతలోగా రాష్ట్ర బీసీ కమిషన్ నివేదిక ద్వారా బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ధారించిన జాబితా రాష్ట్ర ప్రభుత్వానికి చేరాల్సి ఉంటుంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎస్ఈసీకి రిజర్వేషన్ల జాబితా అందాలి. ఈ జాబితా అందిన రోజే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఎస్ఈసీ జారీ చేస్తుంది. ఇది జారీ అయిన తేదీ నుంచి 21 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. ముందుగా జీపీ ఎన్నికలు నిర్వహించాక, ఆ వెంటనే మండల, జిల్లా పరిషత్ జరిపే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. వచ్చే ఏడాది ప్రథమార్థంలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు కూడా నిర్వహించేందుకు ఎస్ఈసీ సిద్ధమవుతున్నట్టుగా అధికారవర్గాల సమాచారం.

# భారతీయ సంగీత మూలాలు ఏ వేదంలో ఉన్నాయి?

### ప్రాచీన భారతదేశ చరిత్ర

#### వేదకాల నాగరికత (క్రీపూ. 2000-1500)

ఆర్యులు ఆసియా మైనర్, మెసపటోమియా మీదుగా పర్షియాలోకి ప్రవేశించారు. ఆ తర్వాత బాక్ట్రియా, హిందూకుష్ పర్వత శ్రేణుల మీదుగా భారతదేశంలోకి వచ్చారు. పంజాబ్ ప్రాంతంలోని సప్తసింధు లోయను మొదటి స్థావరంగా చేసుకుని స్థిరపడ్డారు.

#### తొలివేద కాలం (క్రీపూ. 1500-1000)

ఈ కాలంలో ఆర్యులు సప్తసింధు ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యారు. ఈ కాలం గురించి తెలుసుకోవడానికి రుగ్వేదం ఒక్కటే ప్రధాన ఆధారంగా ఉంది. ఆర్యులు భారతదేశంలో స్థిరపడ్డ తర్వాత రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదాలు రాశారు. వేదాలన్నింటిలో రుగ్వేదం ప్రాచీనమైంది. ఇందులో పది మండలాలున్నాయి. యజుర్వేదం క్రతువుల నిర్వహణకు ఆధార గ్రంథం . సామవేదం సంగీతానికి మూలం. అధర్వణ వేదం మంత్రతంత్రాలకు సంబంధించింది.

ఈ కాలంలో రాజ్యానికి రాజే అధిపతి. రాజరికం వంశపారంపర్యం. ప్రజల రక్షణ బాధ్యత రాజు చూసేవాడు. దీనికిగాను ప్రజలు రాజుకు గోవులను కానుకగా ఇచ్చేవారు. ఈ విధానాన్ని 'బలి' అని పిలిచేవారు. పాలనా వ్యవహారాల్లో 'సమితి', 'సభ' అనే సంస్థలు రాజుకు సాయపడేవి. సమాజంలో స్త్రీకి గౌరవప్రదమైన స్థానం ఉండేది. 'సమితి', 'సభ' సమావేశాల్లో మహిళలు సైతం పాల్గొనేవారు. వితంతు పునర్వివాహాలు జరిగేవి. సతీసహగమనం, పరదా పద్ధతి వీరికి తెలియదు. రుగ్వేదకాలం నాటి ఆర్యులకు పశుపోషణ, వ్యవసాయం ప్రధాన వృత్తులు. పశువులను..ముఖ్యంగా ఆవులను ప్రాణప్రదంగా భావించేవారు. వీటిని వర్తకంలో మారకంగా ఉపయోగించేవారు. ఆర్యులు ప్రకృతి శక్తులను పూజించారు. ద్యుస్(ఆకాశం), ఇంద్ర, వరుణ, వాయు, అగ్ని,సోమ తదితర పురుష దైవాలతో పాటు అతిథి, ఉషస్సు లాంటి స్త్రీ మూర్తులను కూడా ఆరాధించేవారు. ఇంద్రుడు వీరి ప్రధాన దైవం.

#### మలివేదకాల ఆర్య నాగరికత (క్రీపూ.1000-600)

ఈ కాలంలో ఆర్యులు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తర బిహార్ ప్రాంతాలకు విస్తరించారు. వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా స్వీకరించిన జాతులన్నీ స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి. క్రమంగా ఆధిపత్యం కోసం తెగల మధ్య యుద్ధాలు ప్రారంభమయ్యాయి. విజయం సాధించిన తెగ నాయకుడు విశాల భూభాగానికి అధినేతగా మారాడు. అతడు సామ్రాట్ తదితర బిరుదులను వహించడం ఆరంభమైంది. అశ్వమేథ,రాజసూయ,బలి కర్మకాండలు ప్రారంభమయ్యాయి. సామ్రాజ్యాల విస్తరణ పెరిగింది. రాజు దైవాంశ సంభూతుడుగా మారాడు.

**అహింసా సిద్ధాంతం బౌద్ధ మతం నుంచి ఆవిర్భవించిందే. తర్వాతి కాలంలో దీన్ని గాంధీ మహాత్ముడు అనుసరించారు. బుద్ధ విగ్రహాలు గాంధార శిల్ప కళారీతిలో ఉంటాయి. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా మానవ విగ్రహాల పూజ బౌద్ధ మతంలోనే ప్రారంభమైంది. స్థానిక భాషలకు ఈ మతం బాగా ప్రోత్సాహాన్ని అందించింది.**

రుగ్వేదంలోని పురుష సూక్తం ఆధారంగా మలివేద కాలంలో వర్ణవ్యవస్థ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలుగా సమాజ విభజన జరిగింది. క్రమంగా వృత్తులు వంశపారంపర్యమయ్యాయి. ఈ యుగంలో స్త్రీ అంతకుముందున్న సామాజిక స్థాయిని కోల్పోయింది. సతీ సహగమన పద్ధతి మొదలైంది. వివాహ నిబంధనలు కఠినమయ్యాయి.

కొత్తగా భూములు సాగులోకి రావడంతో వ్యవసాయాభివృద్ధి అధికమైంది. వర్తకం, వాణిజ్యం, పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పట్టణాలు ఏర్పడ్డాయి. తక్షశిల, హస్తినాపురం, కౌశాంబి, కాంపిల్య, వైశాలి, శ్రావస్తి, వారణాసి మొదలైనవి నాటి ప్రసిద్ధ నగరాలు. వస్తుమార్పిడి స్థానంలో 'నిష్క', 'శతమాన', 'కర్షాపణం' అనే నాణేలు ప్రవేశించాయి. బంగారం, వెండి, రాగితో ఈ నాణేలను తయారు చేసేవారు. సృష్టికర్తగా 'ప్రజాపతి' ఈ యుగ ప్రధాన ఆరాధ్య దైవం. అగ్ని, ఇంద్రుడు లాంటి దైవాలకు ప్రాధాన్యం తగ్గి త్రిమూర్తుల (విష్ణు, బ్రహ్మ, శివుడు) ఆరాధన పెరిగింది.

**రుగ్వేద సంహిత:** ఇందులో 1028 శ్లోకాలున్నాయి. ఇది పురాతనమైంది. అగ్ని, ఇంద్రుడు, వరుణుడు లాంటి అనేక దేవతల స్తోత్ర పాఠాలు ఈ సంహితంలో ఉన్నాయి. ఇందులో ఇంద్రుడి గురించి ఎక్కువ శ్లోకాలు ఉన్నాయి.

**సామవేద సంహిత:** సోమ యజ్ఞాలు చేసేప్పుడు సంగీత బద్ధంగా శ్లోకాలను ఎలా ఆలపించాలో సామవేద సంహిత తెలుపుతుంది. భారతీయ సంగీత మూలాలు సామవేదంలో కనిపిస్తాయి.

**యజుర్వేద సంహిత:** ఇందులో యజ్ఞ సమయంలో అనుసరించాల్సిన నియమ నిబంధనలు, పఠించే మంత్రాల గురించి ఉన్నాయి.


గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం
ప్రాచీన భారతదేశ చరిత్ర

**అధర్వణ వేద సంహిత:** రోగాలు, దుష్టశక్తులను పారదోలడానికి అవసరమైన మంత్రాలు, తంత్రాలు ఇందులో ఉన్నాయి. ఆర్యేతరుల విశ్వాసాల గురించి ఇది కొంతవరకు తెలుపుతుంది.

**బ్రాహ్మణాలు:** ఇవి వేదాల తర్వాత వచ్చాయి. కర్మకాండల విధానాన్ని వివరిస్తాయి. వీటిలో ప్రధానంగా యజ్ఞాలు, బలులకు సంబంధించిన విధి విధానాలు ఉన్నాయి.

**అరణ్యకాలు:** ఇవి తాత్విక చింతనకు చెందిన అంశాలతో కూడి ఉన్నాయి.

**ఉపనిషత్తులు:** ఉపనిషత్తులు తాత్విక గ్రంథాలు. వీటిలో ఆత్మ, అంతరాత్మ, ప్రకృతి రహస్యాల గురించి ఉన్నాయి. ఉపనిషత్తులు కర్మకాండలను నిరసించాయి. ఇవి సరైన జ్ఞానం, సన్మార్గానికి ప్రాముఖ్యం ఇస్తాయి.

#### సామాజిక మార్పులు (క్రీపూ. 600-300)

ఈ కాలంలో అనేక మత ఉద్యమాలు ఆవిర్భవించాయి. ఆర్థిక,సామాజిక, రాజకీయ మార్పులు అధికంగా జరిగాయి. 16 జనపదాలు, పట్టణాలు ఏర్పడ్డాయి. దీన్ని రెండో పట్టణీకరణ కాలంగా పేర్కొంటారు. ఇనుముతో రూపొందించిన పరికరాల వాడకం వల్ల వ్యవసాయంలో అధిక వృద్ధి సాధ్యమైంది.

ఈ కాలంలో చాతుర్ వర్ణ వ్యవస్థ బలపడింది. ద్విజులుగా పేర్కొనే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులకు.. ద్విజులు కాని శూద్రులకు మధ్య సాంఘిక వ్యత్యాసం ఎక్కువైంది. బ్రాహ్మణాధిపత్యం వైశ్యులకు, క్షత్రియులకు నచ్చలేదు. అస్పృశ్యులను ఒక ప్రత్యేక వర్గంగా చూడటం ఈ కాలంలోనే ప్రారంభమైంది. వ్యవసాయ రంగంలోని మిగులుతో రాజులు సైన్యాన్ని నిర్మించారు. రాజులు పన్ను వసూలు చేసేవారు.న్యాయ వ్యవస్థకు పునాది పడింది. జీవహింసకు వ్యతిరేకమైన బౌద్ధ, జైన మతాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడ్డాయి.

#### బౌద్ధమతం (క్రీపూ. 563-483)

బౌద్ధమత స్థాపకుడు సిద్ధార్థుడు (గౌతముడు). ఈయన క్షత్రియ వంశానికి చెందినవారు. క్రీ.పూ. 563లో శాక్యరాజ్యాధిపతి శుద్ధోదనుడు, మాయాదేవికి రాజధాని 'కపిలవస్తు' సమీపంలోని 'లుంబినీ వనం'లో జన్మించారు. గౌతముని భార్య పేరు 'యశోధర', కుమారుని పేరు 'రాహులుడు'. కపిలవస్తు నగరంలో కనిపించిన వృద్ధుడు, వ్యాధిగ్రస్తుడు, శవం, సన్యాసి దృశ్యాలు ఆయన్ని కదల్చివేశాయి. దీంతో భవబంధాల నుంచి బయటపడ్డారు. దీన్నే 'మహాభినిష్క్రమణం' అంటారు. గయ సమీపంలో బోధి వృక్షం కింద నలభై రోజుల తపస్సు తర్వాత 'సంబోధి'ని పొంది 'బుద్ధుడై' పరిపూర్ణ జ్ఞానంతో ఉద్దీప్తుడయ్యాడు. మొదటగా సారనాథ్‌లోని 'మృగదావనం'లో అయిదుగురు శిష్యులకు జ్ఞానబోధ చేశాడు. ఈ ప్రబోధాన్ని 'ధర్మచక్ర ప్రవర్తనం' అంటారు. బుద్ధుడు తన 80వ ఏట క్రీ.పూ. 483లో మహాపరి నిర్యాణం పొందారు. బుద్ధుడి శిష్యుడు ఆనందుడు.

#### ఆర్య సత్యాలు

1) ప్రపంచం దుఃఖమయం.
2) దుఃఖాలకు కోర్కెలే కారణం.
3) కోర్కెలను నిరోధిస్తే దుఃఖం అంతమవుతుంది.
4)దుఃఖాన్ని అంతమొందించడానికి మార్గం ఉంది.

అజ్ఞానమే దుఃఖానికి కారణమని పేర్కొని, దీన్ని తొలగించడానికి 'అష్టాంగమార్గం' రూపొందించాడు. అవి.. సరైన వాక్కు, క్రియ, జీవనం, శ్రమ, ఆలోచన, ధ్యానం, నిశ్చయం, దృష్టి. పునర్జన్మ రహితమైన మోక్షమే నిర్యాణం అని చెప్పారు. బౌద్ధ మతం హేతుబద్ధమైంది. బుద్ధుడు ఆత్మ, భగవంతుడి ఉనికిని గుర్తించలేదు. వైదిక కర్మకాండలను, వేదాలను నిరసించారు.

మొదటి 'బౌద్ధ సంగీతి' రాజగృహంలో అజాతశత్రువు పాలనా కాలంలో జరిగింది. దీని అధ్యక్షుడు మహాకాశ్యప. ఈ సంగీతిలో 'వినయ', 'సుత్త' అనే పీఠికల (నియమావళి గ్రంథాలు)ను సంకలనం చేశారు. రెండో సంగీతి 'వైశాలి'లో జరిగింది. ఈ సంగీతిలో బౌద్ధసంఘం 'థెరవాదులు', 'మహాసాంఘికులు' అనే రెండు వర్గాలుగా చీలిపోయింది. మూడో సంగీతి అశోకుడి కాలంలో పాటలీపుత్రంలో జరిగింది. ఈ సంగీతిలో అభిదమ్మ పీటకాన్ని రచించారు. నాలుగో సంగీతి కనిష్కుడి పాలనా కాలంలో వసుమిత్రుడి అధ్యక్షతన జరిగింది. సాంచి, బార్హూత్, అమరావతి ఈ కాలంనాటి శిల్పకళకు ప్రతీకలైన స్తూపాలు. చైత్య గృహాల నిర్మాణానికి అజంతా, ఎల్లోరా ఉదాహరణలు. బుద్ధుని సందేశాన్ని భిక్షకులు విదేశీయులకు అందించారు. బౌద్ధ మతం ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. చైనా, జపాన్, శ్రీలంక, బర్మా మొదలైన తూర్పు, ఆగ్నేయాసియా దేశాల్లో బౌద్ధ మతం విస్తరించింది. కాశ్మీర్‌లో జరిగిన నాలుగో బౌద్ధ సంగీతిలో బౌద్ధ మతం మహాయాన, హీనాయాన శాఖలుగా చీలిపోయింది.

**మహాయానం:** ఈ శాఖకు చెందినవారు బుద్ధ విగ్రహాలను ఆరాధించేవారు. బుద్ధుడు, బోధిసత్వుల ద్వారా మానవులు మోక్షం పొందొచ్చని భావించారు. ఈ శాఖ ఇండియా, చైనా, జపాన్‌లో బాగా ప్రాచుర్యం పొందింది. నాగార్జునుడు మాధ్యమిక చింతనను ప్రవేశపెట్టాడు. ప్రపంచమంతా మిథ్య, భ్రమ అని నాగార్జునుడి వాదన.

**హీనాయానం:** బర్మా, థాయిలాండ్, కాంబోడియాలో ఈ శాఖ బాగా వ్యాపించింది. బుద్ధుడి ప్రవచనాలను మాత్రమే తీసుకుని ధ్యానం ద్వారా మోక్షం పొందొచ్చని వీరు భావించారు. విగ్రహారాధనకు వీరు వ్యతిరేకం. పాళీ భాషలో సుత్త, వినయ, అభిదమ్మగా పేర్కొనే త్రిపీఠకాలను వీరు రచించారు. క్రీ.శ 8వ శతాబ్దంలో వజ్రాయానం అనే కొత్త శాఖ వెలిసింది.

**స్తూపాలు:** బుద్ధుడు లేదా ఇతర ప్రముఖ సన్యాసుల అవశేషాలను నిక్షిప్తం చేసి నిర్మించారు. వీటినే స్తూపాలు అంటారు.

**చైత్యం:** ఇందులో ప్రధానంగా ప్రార్థనాలయం ఉంటుంది.

**ప్రధాన బౌద్ధ గుహాలయాలు, చైత్యాలయాలు:**

| | |
|---|---|
| 1) కార్లే | 2) నాసిక్ |
| 3) భాజ | 4) బార్హూత్ |
| 5) సాంచి | 6) అమరావతి |
| 7) నాగార్జున కొండ | 8) భట్టిప్రోలు |

**విహారం:** బౌద్ధ సన్యాసులు నివసించే ప్రాంతమైన అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ ఆసియాలో అతిపెద్ద బౌద్ధ విహార కేంద్రం.

#### వేదాలు

| | |
|---|---|
| 1) రుగ్వేదం | 2) యజుర్వేదం |
| 3) సామవేదం | 4) అథర్వణ వేదం |

#### ఉపవేదాలు

| | |
|---|---|
| 1) ధనుర్వేదం | 2) ఆయుర్వేదం |
| 3) శిల్పవేదం | 4) గాంధార వేదం |

#### వేదాంగాలు

1) శిక్ష 2) కల్పం 3) జ్యోతిషం
4) వ్యాకరణం 5) నిరుక్తం 6) చంధస్సు

#### దర్శనాలు - అందులో ప్రసిద్ధులు

1) సాంఖ్య - కపిలుడు
2) వైశేషిక - కణాదుడు
3) న్యాయం - గౌతముడు
4) యోగ - పతంజలి
5) మీమాంస - జైమిని
6) ఉత్తర మీమాంస - బాదరాయణుడు

#### బుద్ధుడికి సంబంధించిన అంశాలు

| | |
|---|---|
| తండ్రి | శుద్ధోదనుడు |
| తల్లి | మాయాదేవి |
| సవతి తల్లి | గౌతమి |
| బంధువు | దేవదత్త |
| భార్య | యశోధర |
| కుమారుడు | రాహుల్ |
| రథ చోదకుడు | చెన్నుడు |
| గుర్రం | కంఠక |
| గురువు | అలారకలామ |
| బుద్ధగయలో పరిచర్యలు చేసినది | సుజాత |

#### మహా జనపదాలు - పట్టణాలు

| | | |
|---|---|---|
| 1) మగధ | - | పాటలీపుత్రం |
| 2) కాశీ | - | వారణాసి |
| 3) అంగ | - | చంపా |
| 4) చేది | - | భుక్తిమతి |
| 5) కోసల | - | అయోధ్య |
| 6) కురు | - | ఇంద్రప్రస్థం |
| 7) వత్స | - | కౌశాంబి |
| 8) పాంచాల | - | అవిచ్ఛత్రము |
| 9) మత్స్య | - | విరాటనగరం |
| 10) అస్మక | - | పూతన్ |
| 11) సూరసేన | - | మధుర |
| 12) అవంతి | - | ఉజ్జయిని |
| 13) కాంభోజ | - | రాజపురం |
| 14) గాంధార | - | తక్షశిల |
| 15) వజ్జి | - | విదేహ |
| 16) మల్ల | - | కుశి |

# 'జై తెలంగాణ పార్టీ' స్థాపకుడు ఎవరు?

### తెలంగాణ ఉద్యమ చరిత్ర



1. 1975 నుంచి 1985 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నియామకాలన్నింటినీ పరిశీలించి 58,962 మందిని ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికేతరులను అక్రమంగా నియమించారని పేర్కొన్న కమిటీ ఏది?
   1) జె.ఎం. గిర్‌గ్లానీ కమిటీ
   2) కంచె ఐలయ్య కమిటీ
   3) జై భారత్ రెడ్డి కమిటీ
   4) సచార్ కమిటీ
2. 2009 అక్టోబర్‌లో 'తెలంగాణ ఉద్యోగుల గర్జన' ఎక్కడ నిర్వహించారు?
   1) సిద్దిపేట 2) కరీంనగర్
   3) జనగాం 4) కామారెడ్డి
3. తెలంగాణ ఉద్యమంలో జరిగిన వివిధ సంఘటనలను కాల క్రమానుగుణంగా అమర్చండి.
   ఎ) కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష
   బి) తెలంగాణ మార్చ్
   సి) తెలంగాణ జేఏసీ ఏర్పాటు
   డి) జేఏసీ నుంచి టీడీపీ బహిష్కరణ
   1) ఎ, డి, బి, సి 2) ఎ, సి, బి, డి
   3) బి, ఎ, డి, సి 4) ఎ, సి, డి, బి
4. ఆరు సూత్రాల పథకాన్ని ఎప్పుడు ప్రకటించారు?
   1) 1973 2) 1974
   3) 1975 4) 1976
5. కింది వారిలో శ్రీకృష్ణ కమిటీలో సభ్యులు కాని వారెవరు?
   1) వినోద్ దుగ్గల్ 2) రవీందర్ కౌర్
   3) రణబీర్ సింగ్ 4) చిన్మయ గోస్వామి
6. 'జై తెలంగాణ పార్టీ' స్థాపకుడు ఎవరు?
   1) కొండా లక్ష్మణ్ బాపూజీ
   2) నాగం జనార్దన్ రెడ్డి
   3) పి. ఇంద్రా రెడ్డి 4) పి. జనార్దన్ రెడ్డి
7. తెలంగాణ జాగృతి సమితిని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 2008 2) 2009
   3) 2010 4) 2011
8. 'భాషా ప్రాతిపదిక రాష్ట్ర విధానానికి తొలి సవాల్ తెలంగాణలో ఎదురైంది' అని వ్యాఖ్యానించిన వారెవరు?
   1) మధు లిమాయో
   2) అటల్ బిహారీ వాజ్‌పేయి
   3) హెచ్.సి.సి. హెడ్గేవార్
   4) రామచంద్ర నాయక్
9. 2006లో క్విట్ తెలంగాణ ఉద్యమాన్ని నిర్వహించిన సంస్థ ఏది?
   1) తెలంగాణ రైతుల సంఘం
   2) తెలంగాణ ఉద్యోగుల సంఘం
   3) తెలంగాణ ప్రజా పరిషత్
   4) తెలంగాణ మహాసభ
10. కింది వాటిలో 2004 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రాతినిధ్యం లేని జిల్లా ఏది?
    1) మహబూబ్ నగర్ 2) నల్లగొండ
    3) ఖమ్మం 4) హైదరాబాద్
11. శ్రీకృష్ణ కమిటీ తన నివేదికలో హైదరాబాద్ నగర అంశాన్ని ఏ పరిష్కారంతో పోల్చింది?
    1) బ్రస్సెల్స్ నగర పరిష్కారం
    2) బెర్లిన్ నగర పరిష్కారం
    3) చండీగఢ్ నగర పరిష్కారం
    4) న్యూయార్క్ నగర పరిష్కారం
12. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలకు వ్యతిరేకంగా 'ఎందుకు రాలిపోతావు నువ్వు.. ఎందుకు కాలిపోతావు' అనే గేయాన్ని రాసిందెవరు?
    1) మిట్టపల్లి సురెందర్ 2) గద్దర్
    3) మిత్ర 4) పసునూరి రవీందర్
13. 1975 రాష్ట్రపతి ఉత్తర్వులు తెలంగాణకు చేసిన అపార నష్టం ఏది?
    1) ఆంధ్ర అక్రమ ఉద్యోగుల క్రమబద్ధీకరణ
    2) జోనల్ వ్యవస్థను నెలకొల్పడం
    3) స్థానికతను కొన్ని ఉద్యోగాలకు మాత్రమే పరిమితం చేయడం
    4) పైవన్నీ
14. ముల్కీ రూల్స్ రాజ్యాంగబద్ధమేనని తీర్పు వెలువరించిన హైకోర్టు న్యాయమూర్తి ఎవరు?
    1) జస్టిస్ కుప్పుస్వామి
    2) జస్టిస్ చిన్నపరెడ్డి
    3) జస్టిస్ సుభాషణ్ రెడ్డి
    4) జస్టిస్ కొండా మాధవరెడ్డి

**సమాధానాలు**

1) 3 2) 1 3) 2 4) 1 5) 4
6) 3 7) 1 8) 2 9) 2 10) 3
11) 1 12) 3 13) 4 14) 4

# శాతవాహనుల రాజ్యభాష ఏది?

### శాతవాహనుల చరిత్ర

#### శ్రేణులు - ప్రాధాన్యం

జున్నార్ శాసనాల్లో 'ధమ్మక', 'కాసాకార', 'తెసకార' శ్రేణుల గురించి పేర్కొన్నారు. గోవర్ధనలో 'కాలీకనికాయ' శ్రేణులుండేవి. నాసిక్ శాసనాల్లో 'కులరిక', 'తెలపిషిక', 'ఒదయంత్రిక' మొదలైన శ్రేణుల గురించి పేర్కొన్నారు. ప్రతి శ్రేణికి అధ్యక్షుడిగా శ్రేష్ఠి ఉండేవాడు. శ్రేణుల కార్యాలయాలు పుర మందిరంలో లేదా నిగమసభలో ఉండేవి. ఉషవదత్తుడు శ్రేణుల్లో పెట్టిన పెట్టుబడులు 'నిగమసభ'లో రిజిస్టర్ చేశారు.

#### బ్యాంకులు - రుణపరపతి విధానాలు

శాతవాహనుల కాలంలో వడ్డీకి అప్పులు ఇచ్చే పద్ధతి ఉండేది. స్వల్ప వడ్డీ మాత్రమే వసూలు చేసేవారు. అప్పుల మీద వడ్డీరేటు సాధారణంగా ఏడాదికి 12 శాతం ఉండేది. దీన్ని నెలకు ఒకసారి గణించే పద్ధతిలో నిర్ణయించేవారు. నాటి సంస్థలు,బ్యాంకులు ఈ విధానాన్ని అనుసరించాయని పశ్చిమ దక్కన్‌లో దొరికిన శాసనాలు ధ్రువపరుస్తున్నాయి. ఉషవదత్తుని నాసిక్ శాసనంలో గోవర్ధనలోని చేనేత పనివారి శ్రేణి రెండు డిపాజిట్లు స్వీకరించినట్లుగా పేర్కొన్నారు. అందులో మొదటిది నెలకు ఒక శాతం వడ్డీ రేటుతో 2,000 కార్షాపణలు, రెండోది నెలకు 3/4 శాతం వడ్డీ రేటు మీద 1,000 కార్షాపణలు ఉన్నాయి. మొదటి డిపాజిట్ మీద వచ్చే వడ్డీ మొత్తాన్ని నాసిక్‌లోని గుహలో వర్షాకాలంలో నివాసం ఏర్పాటు చేసుకున్న బౌద్ధ సన్యాసులకు ప్రతి ఒక్కరికి ఏడాదికి వస్త్రాలు ఖరీదు చేసేందుకుగాను 12 కార్షాపణలుగా ఖర్చు పెట్టడానికి నిర్దేశించారు. రెండో డిపాజిట్‌పై వచ్చే మొత్తాన్ని ఆ బౌద్ధ సన్యాసుల ఇతర అవసరాలకు కేటాయించారు.

#### సాంస్కృతిక విధానం

దక్కన్ పీఠభూమికి చెందిన పాతరాతి యుగం నిర్మాతలకు ఇనుము, వ్యవసాయానికి సంబంధించిన పరిజ్ఞానం ఉందని వివిధ ఆధారాల ద్వారా తెలుస్తోంది. కరీంనగర్ జిల్లాలోని ఒక ప్రాంతంలో కమ్మరి కొలిమి బయటపడింది. కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని ఇనుప ఖనిజ నిక్షేపాలను శాతవాహనులు ఉపయోగించుకున్నట్లుగా ఆధారాలున్నాయి. రాతి యుగంలోనే ఇనుము పరిశ్రమ ఉన్నట్లుగా ఆయా ప్రాంతాల్లో ఆధారాలు లభించాయి. శాతవాహనులు బంగారాన్ని ఆభరణాల్లో మాత్రమే ఉపయోగించి ఉండవచ్చు. కుషాణులలా వీరు బంగారు నాణేలను ముద్రించలేదు. వీరు ప్రధానంగా సీసంతో చేసిన నాణేలను ముద్రించారు. ఇవి దక్కన్ పీఠభూమి ప్రాంతంలో లభించాయి. వీరు రాగి, కంచు నాణేలను కూడా ముద్రించారు.

ప్లీని (క్రీ.శ. మొదటి శతాబ్దంలో వచ్చిన గ్రీకు యాత్రికుడు) కథనం ప్రకారం ఆంధ్ర సామ్రాజ్యం లక్ష మంది కాల్బలం, రెండువేల గుర్రాలు, వెయ్యి ఏనుగులను కలిగిన సైన్యాన్ని పోషించేది. దీని వెనుక పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రజానీకం ఉండేదని, వారు పెద్ద సైన్యాన్ని పోషించగలిగే అదనపు ఆహారాన్ని ఉత్పత్తి చేసేవారని ఊహించవచ్చు.

కరీంనగర్ జిల్లాలోని పెద్ద బంకూరులో క్రీ.పూ. 200-క్రీ.శ. 200 మధ్యకాలంలో కాల్చిన ఇటుకలు, ఇంటి పైకప్పుల్లో సమతలంగా ఉన్న పెంకులను వినియోగించినట్లు ఆధారాలున్నాయి. ఈ ప్రాంతంలో మురుగునీటిని సంబంధిత గుంటల్లోకి తీసుకువెళ్లే మూతమూసిన కాలువలు కూడా బయటపడ్డాయి. ఆంధ్రప్రాంతంలో 30 కోటలు కలిగిన పట్టణాలు, అసంఖ్యాక గ్రామాలు ఉన్నట్లుగా మెగస్తనీస్ పేర్కొన్నాడు. రెండో, మూడో శతాబ్దాలకు చెందిన అనేక పట్టణాల వివరాలు కూడా శాసనాలు, తవ్వకాల ద్వారా తెలుస్తోంది.

యజ్ఞశ్రీ శాతకర్ణి చేనేత పనివారి శ్రేణికి 1,000 కార్షాపణలు, వడ్రంగి పనివారి శ్రేణికి 2,000 కార్షాపణలు, నూనె గానుగ పనివారి శ్రేణికి 5,000 కార్షాపణాలు డిపాజిట్ చేసినట్లుగా శాసనాల ద్వారా తెలుస్తోంది.

#### మత విధానాలు

దేవతలు, ఆరాధ్య వృక్ష జంతుగణాలు, వైదిక క్రతువుల వివరాలు క్రీ.శ.2వ శతాబ్ది నాటి బౌద్ధ మత వికాసం గురించి తెలుపుతున్నాయి. నాగానిక వేయించిన శాసనంలో తనను తాను 'దీక్షవ్రత యజ్ఞసుంద', 'యజ్ఞహుత ధూపన సుగంధాయ'గా వర్ణించుకుంది. అదేవిధంగా గౌతమీ బాలశ్రీ నాసిక్ శాసనంలో రాజర్షి వధువు (వైదిక మతానుయాయ అయిన రాజుకు ధర్మపత్ని)గా ప్రకటించుకుంది. నానాఘాట్ శాసనం ప్రారంభంలో ఇంద్ర, ధర్మ, లోకపాలక, సంకర్షణ, వాసుదేవులను, సూర్య, చంద్రులను స్తుతించే అంశాలున్నాయి. శాతకర్ణి కుమారుల్లో ఒకరికి వేదసిరి అనే పేరుండటం, తర్వాతి రాజులకు యజ్ఞశ్రీ తదితర పేర్లు ఉండటం లాంటివి వైదిక మతం పట్ల శాతవాహనుల గౌరవ, ఆదరణలను సూచిస్తున్నాయి. రామాయణ, మహాభారతంలోని ఘట్టాలను గృహాల్లో చిత్రపటాలుగా అలంకరించుకున్నట్లు ఆధారాలు లభించాయి. గాథాసప్తశతిలో కృష్ణలీలలను వర్ణిస్తూ రాసిన కొన్ని కథలు పౌరాణికం, ఇతిహాసం, మతానికి ఉన్న ప్రజాదరణ గురించి తెలుపుతున్నాయి. ఉషవదత్తుని శాసనాలు కూడా అతడి వైదిక మతాభిమానం; బ్రాహ్మణ పోషణ; ప్రభాస, పుష్కర మొదలైన తీర్థయాత్రల సందర్శన గురించి వివరిస్తున్నాయి.

**జైనమతం:** శాతవాహన వంశ స్థాపకుడైన సిముకుడు జైన మతాన్ని ఆదరించేవాడని అనేక ప్రాచీన జైన గ్రంథాల ద్వారా తెలుస్తోంది. తర్వాత కాలంలో రెండో శాతకర్ణి జైనమతాచార్యుడైన కొండ కుందాచార్యుని ఆగ్రహానికి గురయ్యాడనీ, జైనాచార్యుడు శాతవాహనుల అధికారాన్ని నిర్మూలించడానికి భారతదేశానికి శకులను ఆహ్వానించాడని కొన్ని జైన గ్రంథాల్లో పేర్కొన్నారు.


గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం
తెలంగాణ హిస్టరీ

**బౌద్ధమతం:** భద్రయానీయ శాఖకు చెందిన బౌద్ధులకు గౌతమీ బాలశ్రీ నాసిక్‌లో గుహాలయాన్ని తొలిపించింది. క్షత్రియుడైన ఉషవదత్తుడు నాసిక్ వద్ద కొన్ని గుహలను తొలిపించి వాటి నిర్వహణ కోసం వేలాదిగా కార్షాపణాలను దానం చేశాడు. మహా సాంఘికుల్లోని చైత్యాక, శైల, పూర్వశైల, అపరశైల శాఖలు కూడా తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రజాదరణ పొందాయి. నాటి హీనయాన బౌద్ధం లేదా మహాథేరవాదం కూడా తెలంగాణలో నేటికీ కొనసాగుతూనే ఉంది. వీరికి, సాంఘికవాదులకు మధ్య వీరిద్దరినీ సమీకరించే దృష్టితో బహుతృతీయ అనే మరోశాఖ కూడా తెలంగాణ బౌద్ధుల్లో కనిపిస్తుంది.

#### శిల్పకళ - సేవలు

గుడిమల్లం (చిత్తూరు జిల్లా)లో ఇటీవల జరిపిన తవ్వకాల్లో బయటపడిన దేవాలయ శిథిలాలు శాతవాహన యుగానికి చెందినవే అనే అభిప్రాయం ఉంది. బౌద్ధశిల్పాలకు బుద్ధుని జీవితంలోని పంచ కల్యాణాలు, బుద్ధ జాతక కథలు, సామాన్య జీవిత దృశ్యాలు కథా వస్తువులు. కృష్ణా లోయలోని స్తూపాల్లో చాలావాటికి నాలుగు దిక్కుల్లో వేదికలు, వాటిపై విదేశీ 'ఆయక స్తంభాలు' ఉండేవి. ఇవి పంచ కల్యాణాలను (బుద్ధుని జననం, మహాభినిష్క్రమణ, సంబోధి, ధర్మచక్ర పరివర్తనం, మహా పరినిర్యాణం) సూచిస్తాయి.

**విహారం:** వర్షాకాలంలో బౌద్ధ బిక్షువుల నివాసానికి ఉద్దేశించినవి విహారాలు.

**చైత్యం:** పూజా వస్తువుగా చైత్యం లేదా బుద్ధ విగ్రహం ఉండి నిత్యార్చనకు ఉపయోగించే ఆలయమే చైత్యగృహం లేదా చైత్యాలయం.

**సంఘారామం:** ఒకే ఆవరణలో మూడు, నాలుగు విహారాలుండి, అధ్యయనానికి అనుకూలమైనది సంఘారామం.

#### చిత్ర కళలు

అజంతా 10వ గుహలోని 'శ్వేతగజ జాతక' చిత్రం శాతవాహన యుగానిదే. నాటి ప్రజలు రామాయణ భాగవతాది పురాణ గాథలను ఇళ్ల గోడలపై చిత్రించుకునే వారని గాథాసప్తశతి ద్వారా తెలుస్తోంది.

#### సాహిత్య సేవ

శాతవాహన రాజులు సాహిత్య ప్రియులు. వీరి రాజ్యభాష ప్రాకృతం. ప్రాకృత భాషా వికాసానికి వీరు చాలా కృషి చేశారు. కుంతల శాతకర్ణి అంతఃపురంలో ప్రాకృతభాషను ఉపయోగించినట్లు రాజశేఖరుడు తన 'కావ్య మీమాంస'లో పేర్కొన్నాడు. హాలుడు సంకలితపరిచిన 'గాథాసప్తశతి' ద్వారా నాటి సామాన్య ప్రజలు కూడా ప్రాకృత భాషలో కవితలు చెప్పగలిగేవారని, కేవలం రాజాదరణ వల్లే కాకుండా ప్రజాదరణ వల్ల కూడా సాహిత్య వికాసం జరిగిందని తెలుస్తోంది. శక-క్షత్రువుల శాసనాలు చాలావరకు సంస్కృత భాషలో ఉన్నాయి.

యజ్ఞశ్రీ శాతకర్ణికి సంబంధించిన ద్వైభాషిక నాణేలపై ప్రాకృతం కాకుండా ఉన్న మరో భాష తెలుగేనని డి.సి.సర్కార్ నిర్ణయించారు. ఆచార్య నాగార్జునుడు (భారతదేశ ఐన్‌స్టీన్) రచించిన సుహృల్లేఖ(స్నేహితునికి లేఖ) గ్రంథాన్ని నాటి పాఠ్యాంశాల్లో భాగంగా చేర్చి, విద్యార్థులతో కంఠస్థం చేయించేవారని ఇత్సింగ్ రచనల ద్వారా తెలుస్తోంది.

ఆర్యమంజూశ్రీ రాసిన 'కల్పసూత్రం', గుణాఢ్యుడి 'బృహత్కథ', శర్వవర్మ రాసిన 'కాతంత్ర వ్యాకరణం', ఆర్యదేవుడు రాసిన 'చిత్తశుద్ధి' మొదలైనవి శాతవాహనుల కాలంనాటి ప్రముఖ గ్రంథాలు.

# బయాలజీ - విటమిన్లు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ



మనిషి ఆహారంలో స్వల్ప మోతాదులో మాత్రమే అవసరమయ్యే కర్బన పోషకాలు విటమిన్లు.

- విటమిన్లు శక్తి వనరులు కాదు.
- ఒక విటమిన్ లేదా విటమిన్‌లోని ఒక భాగం లేదా విటమిన్ నుంచి ఏర్పడిన ఉత్పాదకం సహ ఎంజైమ్‌గా వ్యవహరిస్తూ రసాయనిక చర్యలో పాల్గొనే ఎంజైమ్‌లకు సహాయపడతాయి.
- విటమిన్ అనే పదాన్ని కాసిమర్ ఫంక్ ప్రతిపాదించాడు. విటమిన్లను ఆంగ్ల అక్షరాల క్రమంలో నామకరణం చేసే పద్ధతిని ప్రతిపాదించింది జె.సి. డ్రుమాన్డ్.
- విటమిన్లు ప్రధానంగా 2 రకాలు
- కొవ్వుల్లో కరిగేవి: ఎ, డి, ఇ, కె.
- నీటిలో కరిగేవి: బి-కాంప్లెక్స్, సి

### విటమిన్ - ఎ

విటమిన్-ఎ రసాయన నామం రెటినాల్. సాధారణ నామం జీరాఫ్తాల్మియా నిరోధక విటమిన్. ఆరోగ్యకరమైన దృష్టికి, సాధారణ ఆరోగ్యానికి ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే కంటిలోని కార్నియా దెబ్బతిని జీరాఫ్తాల్మియా సంభవిస్తుంది.

**లభ్యత:** క్యారెట్, పసుపు రంగులోని ఫలాలు, నారింజ, సొరచేప కాలేయం నూనె, ఆకుకూరలు, జంతువుల కాలేయంలో ఎక్కువగా లభిస్తుంది. శాకాహారంలో ఇది బీటా కెరోటిన్ రూపంలో లభిస్తుంది. పేగులోని సూక్ష్మజీవులు దీన్ని రెటినాల్‌గా మారుస్తాయి.

### విటమిన్ - డి

దీని రసాయన నామం కాల్సిఫెరాల్. దీన్నే రికెట్స్ నిరోధక విటమిన్, సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు. బలమైన ఎముకలు, దంతాలకు ఇది అవసరం. శరీరంలోని కాల్షియం, ఫాస్ఫరస్, జీవక్రియలను నియంత్రిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే చిన్నారుల్లో రికెట్స్ వ్యాధి సంభవిస్తుంది. ఎముకలు బలహీనపడి, వంకరలు తిరగడం ఈ వ్యాధి లక్షణం. పెద్దల్లో ఈ విటమిన్ లోపం వల్ల ఎముకలు బలహీనపడి ఆస్టియోమలేసియా వ్యాధి సంభవిస్తుంది.

**లభ్యత:** శాకాహారంలో ఇది లభించదు. పాలు, గుడ్లు, కాడ్ చేప కాలేయం నూనె, జంతువుల కాలేయం, పుట్టగొడుగుల్లో సమృద్ధిగా లభిస్తుంది.

### విటమిన్ - ఇ

దీని రసాయన నామం టోకోఫెరాల్. దీన్ని బ్యూటీ విటమిన్ లేదా వంధ్యత్వ నిరోధక విటమిన్ అంటారు. స్త్రీ, పురుషుల్లో ప్రత్యుత్పత్తి వ్యవస్థకు ఇది అవసరం. కాంతివంతమైన చర్మాన్ని ఇస్తుంది. దీని లోపం అరుదుగా సంభవిస్తుంది. ఇది లోపిస్తే పురుషుల్లో వంధ్యత్వం వస్తుంది, మహిళల్లో గర్భస్రావం జరుగుతుంది.

**లభ్యత:** ఫలాలు,కూరగాయలు, విత్తనాలు (బాదం, పిస్తా), చేపలు, మాంసం, చేప నూనె, కాలేయంలో లభిస్తుంది.

### విటమిన్ - కె

దీని రసాయన నామం ఫిలోక్వినోన్ లేదా మెనాక్వినోన్. దీన్ని రక్తస్రావ నిరోధక విటమిన్ అని కూడా అంటారు. రక్త స్కంధన ప్రక్రియలో అనుబంధ రక్తస్కంధన కారకంగా ఇది వ్యవహరిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే గాయాలైనప్పుడు రక్తం ఆలస్యంగా గడ్డ కడుతుంది.

**లభ్యత:** పేగులోని సూక్ష్మజీవులు దీన్ని తయారుచేస్తాయి. కాలిఫ్లవర్, క్యాబేజి, ఆకుకూరలు, కాలేయం, మూత్రపిండాల్లో లభిస్తుంది.

### విటమిన్ - సి (ఆస్కార్బిక్ ఆమ్లం)

ఇది స్కర్వీ నిరోధక విటమిన్. బలమైన చిగుళ్లకు, నోటి ఆరోగ్యానికి ఇది అవసరం. ఇది లోపిస్తే స్కర్వీ వ్యాధి సంభవిస్తుంది.

**లక్షణాలు:** చిగుళ్ల నుంచి రక్తం కారడం, దంతాలు ఊడిపోవడం, నాలుకపై పుండ్లు ఏర్పడటం ఈ వ్యాధి లక్షణాలు.

**లభ్యత:** నారింజ, బత్తాయి, నిమ్మ లాంటి సిట్రస్ ఫలాలు, ఉసిరి, మాంసం, కాలేయంలో లభిస్తుంది.

### విటమిన్ - బి1

దీని రసాయన నామం థయమిన్. బెరిబెరి నిరోధక విటమిన్ అని అంటారు. శక్తి విడుదల, నాడీవ్యవస్థ, రక్తప్రసరణ అభివృద్ధి వ్యవస్థకు అవసరం. దీనిలోపం ద్వారా బెరిబెరి వ్యాధి వస్తుంది. చిన్నారుల్లో తడి బెరి బెరి (ఛాతీలో నీరు నిండటం), పెద్దల్లో పొడి బెరిబెరి (చర్మం పొడిబారటం) సంభవిస్తుంది. పాలీన్యూరిటిస్ అనే నాడీ క్షీణత వ్యాధి సంభవిస్తుంది.

**లభ్యత:** పొట్టు తీయని అన్ని రకాల ధాన్యాలు, మాంసంలో లభిస్తుంది.

### విటమిన్ - బి2

దీన్నే విటమిన్-జి లేదా ఎల్లో ఎంజైమ్ అని కూడా అంటారు. కొవ్వులు, పిండి పదార్థాల జీవక్రియలో పాల్గొంటుంది. ఈ విటమిన్ లోపిస్తే అరిబోఫ్లెవినోసిస్ అనే వ్యాధి వస్తుంది. నోటి అంచున పగుళ్లు ఏర్పడటం(ఖీలోసిస్/ యాంగ్యులర్ స్టొమాటిస్), నాలుక వాపు (గ్లోసైటిస్) ఈ వ్యాధి లక్షణాలు.

**లభ్యత:** పాలు, పాల ఉత్పత్తుల్లో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి దీన్ని లాక్టోఫ్లెవిన్ అని, గుడ్ల పచ్చసొనలోనూ అధికంగా లభించడం వల్ల ఓవోఫ్లెవిన్ అని అంటారు. కాలేయంలోనూ ఉంటుంది కాబట్టి హెపటోఫ్లెవిన్ అని కూడా అంటారు. ఎండు ఫలాలు, కూరగాయలు, మాంసంలో లభిస్తుంది.

### విటమిన్ - బి3

దీని రసాయన నామం నియాసిన్. నికోటినిక్ యాసిడ్ లేదా నికోటినమైడ్‌గానూ పిలుస్తారు. ఇది పెల్లగ్రా నిరోధక విటమిన్. ఆరోగ్యకరమైన నాడీవ్యవస్థ, చర్మం, జీర్ణక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే పెల్లగ్రా వ్యాధి సంభవిస్తుంది. చర్మం ఎర్రగా కందడం(డెర్మటైటిస్), నీళ్ల విరేచనాలు(డయేరియా), మతిమరుపు (డెమెన్షియా) ఈ వ్యాధి లక్షణాలు. తీవ్రలోపం తలెత్తితే మరణించే ప్రమాదం ఉంది. అందుకే దీన్ని 4డి/3డి సిండ్రోమ్ అంటారు.

**లభ్యత:** మాంసం, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాల్లో ఎక్కువగా లభిస్తుంది.

### విటమిన్ - బి5

దీన్నే పాంటోథెనిక్ యాసిడ్ అని పిలుస్తారు. కో ఎంజైమ్-ఎ గానూ వ్యవహరిస్తారు. కొలెస్ట్రాల్, న్యూరోట్రాన్స్‌మీటర్ల ఉత్పాదన, శక్తి విడుదలకు విటమిన్-బి5 అవసరం. దీనిలోపం వల్ల అరికాళ్లలో మంటలు కలిగే బర్నింగ్ ఫీట్ సిండ్రోమ్ వస్తుంది.

**లభ్యత:** మాంసం, గుడ్లు, బ్రెడ్‌లో లభిస్తుంది.

### విటమిన్ - బి6

దీన్నే పైరిడాక్సిన్ లేదా పైరిడాక్సల్ ఫాస్ఫేట్ అంటారు. ప్రొటీన్ల జీవక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే చర్మం పొడిబారుతుంది. విపరీతమైన బలహీనత వస్తుంది. మార్నింగ్ డిసీజ్ అనే వ్యాధి సంభవిస్తుంది.

**లభ్యత:** మాంసం, గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశనగ, బాదంలో ఎక్కువ మోతాదులో లభిస్తుంది.

### విటమిన్ - బి7

దీన్నే విటమిన్ -హెచ్, బయోటిన్ అని కూడా పిలుస్తారు. శక్తి విడుదల, అమైనో ఆమ్లాలు, గ్లైకోజన్ ఉత్పత్తికి అవసరం. పేగులోని సూక్ష్మజీవులు దీన్ని అందిస్తాయి. ఈ విటమిన్ చాలా అరుదుగా లోపిస్తుంది. ఉడికించని గుడ్డు తెల్లసొనలో ఎవిడిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది బయోటిన్ వినియోగాన్ని అడ్డుకుంటుంది.

### విటమిన్ - బి9

దీన్నే ఫోలిక్ యాసిడ్ అంటారు. ఎర్రరక్తకణాల పరిపక్వత, హీమోగ్లోబిన్ తయారీకి ఇది అవసరం. పిండం అభివృద్ధి, మానసిక వికాసానికి తోడ్పడుతుంది. ఈ విటమిన్ లోపిస్తే మెగాలోబ్లాస్టిక్ లేదా మ్యాక్రోసైటిక్ అనీమియా వ్యాధి వస్తుంది. గర్భిణుల్లో ఇది తీవ్రంగా లోపిస్తే పుట్టబోయే పిల్లల్లో స్పైనా బిఫిడా అనే మానసిక వైకల్యం సంభవిస్తుంది

**లభ్యత:** స్ట్రాబెర్రీ, టమాట, కాలిఫ్లవర్, అరటి, క్యాబేజి, పాలకూర, నారింజల్లో లభిస్తుంది.

### విటమిన్ - బి12

దీన్నే సైనోకోబాలమిన్ అంటారు. ఎర్రరక్తకణాల పరిపక్వత, హీమోగ్లోబిన్ తయారీకి అవసరం. ఈ విటమిన్ లోపిస్తే పెర్నిసియస్ అనీమియా సంభవిస్తుంది.

**లభ్యత:** మాంసాహారం, గుడ్లు, పాల లాంటి జంతు ఉత్పత్తుల్లో మాత్రమే లభిస్తుంది. మొక్కల్లో లభించదు.

### విటమిన్ - బి17

దీన్నే యాంటి కేన్సర్ విటమిన్ అని అంటారు. వాస్తవానికి ఇది విటమిన్ కాదు. మొక్కల్లో కేన్సర్ నిరోధక లక్షణాలున్న రసాయనాలన్నింటినీ కలిపి బి17 అంటారు.

### మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో బి15 అని పిలిచే విటమిన్?
ఎ) పాంటోథెనిక్ ఆమ్లం
బి) పంగామిక్ ఆమ్లం
సి) నియాసిన్ డి) ఫోలిక్ ఆమ్లం

2. ఒక గ్రాము కొవ్వు నుంచి ఎన్ని కేలరీల శక్తి విడుదలవుతుంది?
ఎ) 4.1 బి) 4.3 సి) 9.3 డి) 8.0

3. కింది వాటిలో ఆవశ్యక అమైనోఆమ్లం?
ఎ) అలనిన్ బి) ప్రోలిన్
సి) సిస్టీన్ డి) ఆర్జినిన్

4. చర్మం, రోమాలు, గోళ్లు తదితరాల్లో ఉండే ప్రత్యేకమైన ప్రొటీను?
ఎ) కెరోటిన్ బి) కెరాటిన్
సి) అల్బుమిన్ డి) కాండ్రిన్

5. తల్లిపాలలో ఉండే ప్రొటీన్ల శాతం?
ఎ) 2.4 బి) 3.1
సి) 6.2 డి) 0.3

6. మేక పాలలో ఉండే లాక్టోజ్ శాతం?
ఎ) 3.6 బి) 4.6
సి) 4.2 డి) 0.7

7. అధిక నీటి శాతం ఉన్న పాలు?
ఎ) ఆవు పాలు బి) గేదె పాలు
సి) మేక పాలు డి) గాడిద పాలు

8. విటమిన్ బి12 లోపం ద్వారా వచ్చే రక్తహీనతను ఏమంటారు?
ఎ) పెర్నిసియస్ రక్తహీనత
బి) న్యూట్రిషినల్ రక్తహీనత
సి) మెగలోబ్లాస్టిక్ రక్తహీనత
డి) మ్యాక్రోస్టిక్ రక్తహీనత

9. మానవుడి సాధారణ జీవక్రియ రేటు(బీఎంఆర్)కు ఎన్ని కేలరీ శక్తి అవసరం?
ఎ) 1200-1500 బి) 1500-1700
సి) 500-700 డి) 2000-3000

10. విటమిన్-ఎ లోపం ద్వారా కంటి కార్నియా పొడిబారడాన్ని ఏమంటారు?
ఎ) నిక్టలోపియా బి) జీరాఫ్తాల్మియా
సి) కెరటోమలేసియా డి) ఏదీకాదు

11. పెద్దల్లో విటమిన్ డి లోపం ద్వారా ఎముకలు క్షీణించి బలహీన పడటాన్ని ఏమంటారు?
ఎ) ఆస్టియో పోరోసిస్
బి) ఆస్టియో మలేషియా
సి) ఆస్టియో ఆర్థైటిస్
డి) ఆస్టిటిస్ ఫైబ్రోజా

12.సాధారణ గుండె లయను నియంత్రించే విటమిన్?
ఎ) ఆస్కార్బిక్ ఆమ్లం బి) థయమిన్
సి) నియాసిన్ డి) పెరిడాక్సిన్

13.ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?
ఎ) బి2 బి) బి5 సి) బి6 డి) బి7

14. కండరాల్లో అధిక మోతాదులో ఉండే ప్రొటీన్?
ఎ) గ్లుటెన్ బి) కొల్లాజెన్
సి) కెసిన్ డి) మయోసిన్

15.కిందివాటిలో ఏ విటమిన్ లోపం వల్ల ఖీలోసిస్ సంభవిస్తుంది?
ఎ) పాంటోథెనిక్ ఆమ్లం
బి) నియాసిన్
సి) పెరిడాక్సిన్
డి) రిబోఫ్లేవిన్

16.పాల చక్కెర(లాక్టోజ్)లో ఉండే మోనోశాకరైడ్లు?
ఎ) గ్లూకోజ్, ఫ్రక్టోజ్
బి) గ్లూకోజ్, గాలక్టోజ్
సి) గ్లూకోజ్, గ్లూకోజ్
డి) ఏవీ కాదు

17.సగటున మనిషికి రోజుకు ఎంత మోతాదులో విటమిన్‌సి అవసరం?
ఎ) 2 మి.గ్రా. బి) 50 మి.గ్రా.
సి) 75 మి.గ్రా. డి) 30 మి.గ్రా.

18. కింద ఇచ్చిన ఏ అమైనో ఆమ్లంలో సల్ఫర్ ఉంటుంది?
ఎ) మిథియోనిన్ బి) హిస్టిడీన్
సి) గ్లైసిన్ డి) ప్రోలిన్

### సమాధానాలు

1) బి, 2) సి, 3) డి, 4) బి, 5) ఎ, 6) సి, 7) ఎ, 8) ఎ, 9) బి, 10) బి, 11) బి, 12) ఎ, 13) ఎ, 14) డి, 15) డి, 16) బి, 17) బి, 18) ఎ.

# సిమెంట్ తయారీలో వినియోగించే ఉష్ణోగ్రత?




### సిమెంట్

భవనాలు, వంతెనలు, ఆనకట్టలు తదితర నిర్మాణాల్లో ఉపయోగించే అతి ముఖ్యమైన పదార్థం సిమెంట్. దీన్ని 1824లో జె.ఆస్పిడిన్ అనే తాపీమేస్త్రి కనుగొన్నాడు. సున్నపురాయి, బంకమట్టి మిశ్రమాన్ని అధిక ఉష్ణోగ్రతకు వేడిచేస్తే అది ఒక పొడిని ఏర్పరుస్తుందని, దీనికి తగినంత నీటిని కలిపితే కొన్ని గంటల్లో అది రాయిలా గట్టి పడుతుందని ఆస్పిడిన్ కనుగొన్నాడు. ఈ పదార్థం 'పోర్ట్‌లాండ్' అనే ప్రదేశంలో దొరికే రాయి లాంటి బలమైనది కావడం వల్ల దీన్ని 'పోర్ట్‌లాండ్ సిమెంట్'గా వ్యవహరించారు.

- సిమెంట్ అనేది ప్రధానంగా కాల్షియం సిలికేట్‌లు, కాల్షియం అల్యూమినేట్ల మిశ్రమం. ఇందులో కొద్ది మొత్తంలో ఐరన్, సోడియం, పొటాషియం, మెగ్నీషియం లోహాల ఆక్సైడ్‌లు, కరిగిన సల్ఫర్ ట్రై ఆక్సైడ్‌లు ఉంటాయి.
- సిమెంటుకు ప్రధాన ముడి పదార్థాలు సున్నపురాయి, బంకమన్ను.
- సిమెంట్‌ను తడి పద్ధతి, పొడి పద్ధతి అనే రెండు విధానాల్లో తయారుచేస్తారు.
- ముడి స్లరీ (చూర్ణం)ను 'ప్రగలన పదార్థం' అంటారు. దీన్ని తిరుగుడు కొలిమిలో 'గ్యాస్' లేదా 'బొగ్గు'ను మండించి వేడి చేస్తారు. ఈ విధానంలో ఏర్పడే పదార్థం 'బూడిద రంగు'ఉన్న గట్టి బంతుల రూపంలో ఉంటుంది. వీటిని 'సిమెంట్ క్లింకర్'లు అంటారు.
- సిమెంట్ క్లింకర్లను చూర్ణం చేసి 2 నుంచి 3 శాతం 'జిప్సం'ను కలిపితే వచ్చేదే వ్యాపారాత్మక సిమెంట్.
- జిప్సం అనేది ఆర్ద్ర కాల్షియం సల్ఫేట్. సిమెంట్ సెట్టింగ్‌ను కంట్రోల్ చేయడానికి జిప్సం కలుపుతారు. ఒకవేళ జిప్సంను కలుపకపోతే సిమెంట్‌కు నీరు కలిపిన వెంటనే గట్టి పడుతుంది.
- సిమెంట్ గట్టిపడే ప్రక్రియలో కాల్షియం అల్యూమినేట్లు వేగంగా ఆర్ద్రీకరణం చెంది 'కాల్షియం అల్యూమినియం హైడ్రేట్ (CAH)లుగా మారతాయి. ఇది ఉష్ణం వెలువడే చర్య (ఉష్ణమోచక చర్య).
- సిమెంట్ పరిశ్రమల్లో ఇటీవల 'ఫ్లై యాష్'ను ఉపయోగిస్తున్నారు. థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో 'నేలబొగ్గు' లేదా 'కోక్'ను మండించడం వల్ల చివరగా మిగిలే బూడిదనే ఫ్లై యాష్ అంటారు.
- ఫ్లై యాష్‌లో ప్రధానంగా సిలికాన్ డై ఆక్సైడ్ ($SiO_2$), అల్యూమినియం ఆక్సైడ్ ($Al2O_3$), కాల్షియం ఆక్సైడ్‌లు ఉంటాయి. అత్యల్ప ప్రమాణాల్లో ఆర్సెనిక్, బెరీలియం, బోరాన్, కాడ్మియం, క్రోమియం, కోబాల్ట్, లెడ్, మాంగనీస్, పాదరసం (మెర్క్యురీ), మాలిబ్డినం, సెలీనియం లాంటి మూలకాలు కూడా ఉంటాయి.
- ఫ్లై యాష్‌ను సిమెంట్‌లో ఉపయోగించడం వల్ల వాతావరణంలోకి విడుదలయ్యే 'హరిత గృహ' వాయువైన కార్బన్ డై ఆక్సైడ్ ($CO_2$) తగ్గుతుంది.

### గాజు

గృహాలంకరణ వస్తువుల్లో గాజుకే ప్రాధాన్యం ఉంది. గ్లాస్ బ్లోయింగ్‌లో రోమన్‌లదే పైచేయి. ఘన రూపంలో ఉన్నప్పటికీ గాజు నిజమైన స్ఫటిక పదార్థం కాదు. ఇది అస్ఫటిక పదార్థం. గాజు ద్రవాన్ని త్వరగా చల్లబరచడం వల్ల దాని స్నిగ్ధత అధికమై ఘనరూపాన్ని సంతరించుకుంటుంది. అందువల్ల గాజును 'అతి శీతలీకరణం చెందిన ద్రవం' అంటారు.

- గాజు ప్రధానంగా సోడియం సిలికేట్, కాల్షియం సిలికేట్, సిలికాల మిశ్రమం.
- గాజుకు కావాల్సిన ముడి పదార్థాలు సోడా యాష్ ($Na2CO_3$), సున్నపురాయి ($CaCO_3$), ఇసుక ($SiO_2$).
- ముడి పదార్థాల మిశ్రమ పొడిని 'బాచ్' అంటారు.
- బాచ్ ద్రవీభవన స్థానం (కరిగే ఉష్ణోగ్రత)ను తగ్గించడానికి కొన్ని పగిలిన గాజు ముక్కలను కలుపుతారు. వీటిని 'కల్లెట్' అంటారు.
- మొత్తం మిశ్రమాన్ని కొలిమిలో 1000°C వద్ద వేడి చేస్తే ద్రవగాజు ఏర్పడుతుంది. దీనిపై తేలియాడే మలినాలను 'గాజుగాల్' అంటారు.
- ద్రవ గాజును త్వరగా చల్లబరిస్తే పెళుసుగా మారే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రత్యేక పద్ధతిలో నెమ్మదిగా చల్లబరుస్తారు. మంద శీతలీకరణం వల్ల గాజుకు అధిక బలం చేకూరుతుంది.
- గాజును వివిధ రంగుల్లో పొందడానికి ద్రవగాజుకు కొన్ని లోహ ఆక్సైడ్‌లను లేదా లోహ లవణాలను కలుపుతారు. క్రోమియం ఆక్సైడ్‌తో ఆకుపచ్చ, మాంగనీస్ ఆక్సైడ్‌తో ఊదా, కాపర్ సల్ఫేట్‌తో నీలం, బంగారం క్లోరైడ్‌తో కెంపు, క్యూప్రస్ ఆక్సైడ్‌తో ఎరుపు రంగులు లభిస్తాయి.
- గాజును 'ఆక్సిజన్-ఎసిటలీన్' మంటతో వేడిచేసి మెత్తబరుస్తారు. అందులోకి గాలిని పంపి కోరిన ఆకృతిలో గాజు వస్తువులను తయారు చేస్తారు. ఈ నైపుణ్యాన్నే 'గ్లాస్ బ్లోయింగ్' అంటారు.
- పైరెక్స్ గాజు, బోరోసిలికేట్ గాజు గ్లాస్ బ్లోయింగ్ ప్రక్రియలకు అనువైనవి.

### మాదిరి ప్రశ్నలు

1. ప్రాచీన కట్టడాలకు వినియోగించిన 'దంగు సున్నం' తయారీకి అవసరం లేని ముడిపదార్థం ఏది?
ఎ) సున్నం బి) ఇసుక
సి) నీరు డి) బొగ్గు

2. సిమెంట్ అనేది వేటి మిశ్రమం?
ఎ) కాల్షియం సల్ఫేట్, కాల్షియం క్లోరైడ్
బి) కాల్షియం ఫాస్ఫేట్, కాల్షియం అల్యూమినేట్
సి) కాల్షియం సిలికేట్లు, కాల్షియం అల్యూమినేట్
డి) సోడియం క్లోరైడ్, కాల్షియం క్లోరైడ్

3. సిమెంట్ తయారీలో వినియోగించే ఉష్ణోగ్రత?
ఎ) 100-200°C బి) 1700-1900°C
సి) 2000-2500°C డి) 170-190°C

4.సిమెంట్ పరిశ్రమను ఎలాంటి ప్రాంతాల్లో నెలకొల్పుతారు?
ఎ) ఇసుక దొరికే ప్రాంతం
బి) సున్నపురాయి దొరికే ప్రాంతం
సి) నదీ తీర ప్రాంతం
డి) సముద్ర తీర ప్రాంతం

5.సిమెంట్ తయారీకి కావలసిన ముడిపదార్థాలు?
ఎ) సున్నపురాయి బి) బంకమన్ను
సి) బొగ్గు డి) పైవన్నీ

6.బూడిద వర్ణం ఉన్న సిమెంట్ బంతులను ఏమంటారు?
ఎ) సిమెంట్ బాల్స్ బి) బక్కీ బాల్స్
సి) సిమెంట్ క్లింకర్స్ డి) కల్లెట్స్

7. సిమెంట్‌కు జిప్సం కలపడానికి కారణం?
ఎ) రంగు కోసం
బి) గట్టిదనం కోసం
సి) నునుపుదనం కోసం
డి) సెట్టింగ్ నెమ్మదిగా జరగడం కోసం

8. కిందివాటిలో మోటారు వాహనాల నుంచి వెలువడని కాలుష్యకారిణి ఏది?
ఎ) కార్బన్ డై ఆక్సైడ్ బి) ఫ్లై యాష్
సి) నైట్రోజన్ ఆక్సైడ్‌లు డి) నీటి ఆవిరి

9. ఫ్లై యాష్‌ను ఎక్కువగా వేటికి ఉపయోగిస్తారు?
ఎ) ఇటుకల తయారీ
బి) సిమెంట్ తయారీ
సి) ఎ, బి డి) ఏదీకాదు

10. ఫ్లై యాష్ గురించి సరికాని వాక్యం ఏది?
ఎ)థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఉప ఉత్పన్నం ఫ్లై యాష్
బి) ఫ్లై యాష్‌కు క్షార ధర్మం ఉంటుంది
సి) నీటిని పీల్చుకునే ధర్మం ఉంటుంది
డి) విషపూరిత మూలకాలు ఉండవు

11.ఫ్లై యాష్‌లో ఉండే హానికారక లోహాలు ఏవి?
ఎ) ఆర్సెనిక్ బి) మెర్క్యూరీ
సి) లెడ్ డి) పైవన్నీ

12.ఫ్లై యాష్‌లో ప్రధానంగా ఉండేవి?
ఎ) సిలికాన్ డై ఆక్సైడ్
బి) అల్యూమినియం ఆక్సైడ్
సి) కాల్షియం ఆక్సైడ్ డి) పైవన్నీ

13.సిమెంట్‌లో సాధారణంగా కలిపే జిప్సం శాతం?
ఎ) 10-20 శాతం బి) 5-10 శాతం
సి) 50 శాతం డి) 2-3 శాతం

14. గాజు అనేది ఒక..?
ఎ) స్ఫటిక ఘనపదార్థం
బి) అస్ఫటిక ఘన పదార్థం
సి) అతి శీతలీకరణం చెందిన ద్రవం
డి) జెల్లీ

15.గాజు రసాయనికంగా వేటి మిశ్రమం?
1. సోడియం సిలికేట్
2. కాల్షియం సిలికేట్ 3. సిలికా
ఎ) 1, 2 మాత్రమే బి) 2, 3 మాత్రమే
సి) 1, 3 మాత్రమే డి) పైవన్నీ

16. ప్రయోగశాలలోని గాజు పరికరాల తయారీకి వాడే గాజు?
ఎ) సోడా గాజు బి) క్వార్ట్జ్ గాజు
సి) పైరెక్స్ గాజు డి) ఏదీకాదు

17. విద్యుత్ బల్బులు, దృశ్య పరికరాల తయారీకి వాడే గాజు?
ఎ) సోడా గాజు బి) క్వార్ట్జ్ గాజు
సి) ఫ్లింట్ గాజు డి) బోరోసిలికేట్ గాజు

18.గాజును కోయడానికి ఉపయోగించే పదార్థం?
ఎ) గాజు బి) వజ్రం
సి) స్టీల్ డి) టంగ్‌స్టన్

19. పోర్ట్‌లాండ్ సిమెంట్‌లోని ప్రధాన అనుఘటకాలు?
ఎ) సున్నం, సిలికా, ఐరన్ సల్ఫైడ్
బి) సున్నం, సిలికా, సోడా
సి) సున్నం, సిలికా, అల్యూమినా
డి) సిలికా, సున్నం, ఐరన్ ఆక్సైడ్

20. గాజు అనేది ఒక..?
ఎ) విద్యుత్ వాహకం
బి) ఉష్ణ వాహకం
సి) ఉష్ణబంధకం (ఇన్సులేటర్)
డి) అర్ధ వాహకం

21.బంకమట్టి నుంచి సిమెంట్‌లోకి ప్రధానంగా చేరేది?
ఎ) కాల్షియం సిలికేట్
బి) అల్యూమినియం సిలికేట్
సి) సోడియం సిలికేట్
డి) సోడియం కార్బొనేట్

22. కిటికీ అద్దాలు, గాజుసీసాల తయారీకి ఉపయోగించే గాజు?
ఎ) ఫ్లింట్ గాజు
బి) సోడా గాజు (మెత్తని గాజు)
సి) గట్టిగాజు
డి) పైరెక్స్ గాజు

23.గ్లాస్ బ్లోయింగ్ ప్రక్రియలో వాడే వాయువు?
ఎ) ఆక్సిజన్ బి) ఎసిటలీన్
సి) ఆక్సీ-ఎసిటలీన్ డి) హైడ్రోజన్

24. సాధారణ గాజుకు కలిపే వివిధ పదార్థాలు, అవి ఇచ్చే రంగులను జతపరచండి.
ఎ) మాంగనీస్ డై ఆక్సైడ్ 1) ఊదా
బి) కోబాల్ట్ ఆక్సైడ్ 2) నీలం
సి) క్రోమియం ఆక్సైడ్ 3) ఆకుపచ్చ
డి) క్యూప్రస్ ఆక్సైడ్ 4) ఎరుపు

| | ఎ | బి | సి | డి |
|---|---|---|---|---|
| ఎ) | 1 | 2 | 3 | 4 |
| బి) | 4 | 3 | 2 | 1 |
| సి) | 2 | 4 | 1 | 3 |
| డి) | 3 | 1 | 4 | 2 |

25. గాజుపై గాట్లు పెడుతూ ఎచ్చింగ్ చేయడానికి వాడే ఆమ్లం ఏది?
ఎ) హైడ్రోక్లోరికామ్లం (HCl)
బి) హైడ్రోఫ్లోరికామ్లం (HF)
సి) నైట్రికామ్లం ($HNO_3$)
డి) సల్ఫ్యూరికామ్లం ($H2SO_4$)

### సమాధానాలు

1) డి; 2) సి; 3) బి; 4) బి; 5) డి; 6) సి; 7) డి; 8) బి; 9) సి; 10) డి; 11) డి; 12) డి; 13) డి; 14) సి; 15) డి; 16) సి; 17) బి; 18) బి; 19) సి; 20) సి; 21) బి; 22) బి; 23) సి; 24) ఎ; 25) బి

### అప్రెంటిస్

#### ఆర్ఆర్‌సీ-నార్త్ రైల్వేలో 4,096 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)-నార్త్ రైల్వే పరిధిలోని డివిజన్/వర్క్‌షాప్/యూనిట్లలో యాక్ట్ అప్రెంటిస్‌ల శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 4,096.
- **ఆర్ఆర్‌సీ వర్క్‌షాప్‌లు:** క్లస్టర్ లక్నో, క్లస్టర్ అంబాలా, క్లస్టర్ మొరాదాబాద్, క్లస్టర్ ఢిల్లీ, క్లస్టర్ ఫిరోజ్‌పూర్.
- **ట్రేడులు:** మెకానికల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కార్పెంటర్, ఎంఎంవీ, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, ట్రిమ్మర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హామర్ మ్యాన్, టర్నర్, క్రేన్ ఆపరేటర్, స్టెనోగ్రాఫర్ తదితరాలు.
- **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్య సమాచారం:**
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
**దరఖాస్తులకు చివరితేది:** 16.09.2024.
**మెరిట్ జాబితా వెల్లడి:** నవంబర్ 2024.
**వెబ్‌సైట్:** http://www.rrcnr.org

#### ఆర్ఆర్‌సీ-వెస్ట్ సెంట్రల్ రైల్వేలో 3,317 యాక్ట్ అప్రెంటిస్‌లు

జబల్‌పూర్ (మధ్యప్రదేశ్)లోని రైల్వే రిక్రూట్ మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)-వెస్ట్ సెంట్రల్ రైల్వే డబ్ల్యూసీఆర్ పరిధిలోని డివిజన్/యూనిట్‌లలో యాక్ట్ అప్రెంటిస్‌ల శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

**ఆర్ఆర్‌సీ డివిజన్/యూనిట్‌లు:** జేబీపీ డివిజన్, బీపీఎల్ డివిజన్, కోటా డివిజన్, సీఆర్‌డబ్ల్యూఎస్ బీపీఎల్, డబ్ల్యూఆర్ఎస్ కోటా, హెచ్‌క్యూ/జేబీపీ.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 3,317.
- **ట్రేడ్‌లు:** ఏసీ మెకానిక్, బుక్ బైండర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, ఎలక్ట్రీషియన్

**అర్హత:** పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.

- **ఎంపిక విధానం:** పదో తరగతి, 12వ తరగతి, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్య సమాచారం:**
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.09.2024.
**వెబ్‌సైట్:** https://wcr.indianrailways.gov.in/